వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ బంభరనాదం

సాహిత్యప్రయాణాలూ సాహిత్యసంతోషమూ

వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ బంభరనాదం

సాహిత్యప్రయాణాలూ సాహిత్యసంతోషమూ

AA BAMBHARA NADAM

Occassional Writings on Telugu Literature

Chinaveerabhadrudu Vadrevu

August, 2025

Cover page image

Vadrevu Ch Veerabhadrudu

Back cover photo:

Amrutha Purna Vadrevu

Cover design, Composing and Lay out

Chinaveerabhadrudu Vadrevu

e book released by

Vadrevu Ch Veerabhadrudu

First Floor, House No.56,

Navodaya Colony, Mehidipatnam

Hyderabad 500 028

Telangana State, India

Mobile: +91 94909 57129

chinaveera@gmail.com

www.chinaveerabhadrudu.in

మా సోదరి శ్రీలక్ష్మికీ

ఎర్రాప్రగడ రామకృష్ణకీ

వరసగా

సాహిత్యానుభూతి

గోదావరి గలగలలు	7
వనవాసిని	12
కొన్ని శేఫాలికలు	23
సాత్త్వికీకరణ వాచకం	25
వసంతాన్ని నిజంగా చూసిన కవి	33
మహాప్రస్థానం @ 75	37
శివప్రసాదం	43

సాహిత్య ప్రయాణం

సాహిత్య పాదయాత్ర	45
ఒక సంధ్య నడిచిన దారి	49
నర్మద దర్శనం	53
అసాధారణ పథికుడు	57

సాహిత్య సంతోషం

ఒక జీవుడి ఇష్టం	67
మరోసారి బుచ్చిబాబు గురించి	71
నూరు పువ్వులు వికసించనీ	75
హిడెగ్గరుకి సమకాలికుడు	78

సమన్వయ శీలి 80

ఆ బంభర నాదం 83

ఆయన వెంట నడుస్తూనే ఉన్నాను 85

An aesthetic healer 89

గోదావరి మా ఇంటికొచ్చింది 93

సాహిత్య సంకీర్తకుడు 99

ఫాల్గుణమాసపు మామిడి పిందె 106

చలంగారూ, జగ్గారావూ 110

సాహిత్యోత్సవం

రమణా సుమనశ్రీ అవార్డు 114

సాహిత్యసమాలోచన 117

విష్ణుపురం సాహిత్యోత్సవం 121

గోండీ సాహిత్యం కోసం 127

అనువాదం ఒక కెరీర్ కూడా 131

బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవం 136

భూమన్‌తో ఒక సాయంకాలం 143

సాహిత్యబాంధవ్యం

రెండు మూడు మాటలు 147

పూర్ణజీవి 150

అత్తలూరి నరసింహారావు 155

ఒక జీవనది 159

ఋషీశ్వరుడు 162

ఏ దివిలో విరిసిన పారిజాతమో 167

మనసు చాలా బ్లాంక్‌గా ఉంది 169

వికసిత వ్యక్తిత్వం 173

గోదావరి గలగలలు

మేఘసందేశ కావ్యంలో యక్షుడు మేఘానికి ప్రయాణమార్గాన్ని వివరిస్తూ, మేఘం అవంతీదేశంలో ప్రవేశించగానే ఉదయన కథాకోవిదులైన గ్రామవృద్ధులు కనిపిస్తారని చెప్తాడు. ఆ ఉదయనపండితుల గురించి మా మాష్టారు తరచు ప్రస్తావిస్తూ ఉండేవారు.

ఉదయినుడు అవంతీదేశపు రాజు. ఉజ్జయిని ఆయన రాజధాని. ఆయన చరిత్ర, ఆయన ప్రేమకథలు, రసజ్ఞత ప్రజల స్మృతిలో నిలిచిపోయాయి. తర్వాతి రోజుల్లో సంస్కృత, ప్రాకృత సాహిత్యాల్లో ఎన్నో కావ్యాలూ, నాటకాలూ ఆయన కథల చుట్టూ అల్లుకున్నాయి. ఆ కథలు అక్కడి గాలిలో, ఆ గ్రామాల్లో ఇంకా వినిపిస్తూనే ఉంటాయనే అర్థంలో కాళిదాసు మేఘసందేశ కావ్యంలో ఆ ఉదయన కథాకోవిదుల గురించి ప్రస్తావించాడు. ప్రతి కొత్త తరానికీ ఆ ఉదయనచరిత్రను పరిచయం చెయ్యడం వాళ్ళ పని. గ్రామమధ్యంలో, రథ్యల దగ్గర, రావిచెట్టునీడన, రచ్చబండమీద కూచుని, అనేక సాయంకాలాలు, మరే వ్యాపకం లేకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా ఉదయనుడి గురించీ, ఉల్లాసభరితాలూ, ఉత్తేజకారకాలూ అయిన అతడి కథలు చెప్పడమే వాళ్ళ పని. అలా ఆ కథలు చెప్తున్నప్పుడు వాళ్ళు ఆ పౌరులముందు ఒక ఆదర్శాన్ని, ఇప్పటి భాషలో చెప్పాలంటే, ఒక రోలుమోడలుని ప్రతిష్ఠించేవారు. ఆ కథలు ఆ పౌరస్మృతిలో భాగమైపోయేవి. కాలం గడిచేకొద్దీ ఆ కథల వన్నె పెరిగేదే గాని తగ్గేదికాదు.

నన్నడిగితే ప్రతి భాషకీ, ప్రాంతానికీ, దేశానికీ అటువంటి ఉదయన పండితులు అవసరం. వాళ్ళు అటువంటి కథలు చెప్పడం ద్వారా, ఆ గాథలు తవ్వి తలపోయడం ద్వారా తమ జాతికొక అభిరుచిని నిర్మిస్తారు. ఆ అభిరుచి కాలక్రమంలో ఒక సంస్కృతిగా రూపొందుతుంది. ఒకప్పుడు సామల సదాశివగారి గురించి మాట్లాడుతూ ఆయన్ని అటువంటి సంస్కృతీ నిర్మాతగా అభివర్ణించాను. ఆయన ముందు చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి,

దిగవల్లి వేంకట శివరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి వంటి వారు తమ కథలు, గాథల ద్వారా చేసింది ఆ పనే.

ఇదిగో, ఇప్పుడు ఆ పూర్వమహనీయుల కోవలో, మన కాలంలో ఎర్రాప్రగడ రామకృష్ణ అటువంటి ఉదయన పండితుడిగా, ఒక సాహిత్యాభిరుచి ప్రచారకుడిగా మనముందు నిలబడుతున్నాడు. నాకు సంతోషమేమిటంటే కాలం అతణ్ణి ఈ పనికి ఎంచుకుంది. ఎందుకంటే గడిచిపోయిన కాలానికీ, రానున్న లోకానికీ మధ్య పరుచుకున్న రసార్ణవం మీద సేతువు కట్టడానికి, నాకు తెలిసి, ఇంతకన్నా సమర్థుడు మరొకడు లేడు.

2

రామకృష్ణ నాకు పరిచయమయ్యి నలభై ఏళ్ళు. నా తొలియవ్వనకాలంలో రాజమండ్రిలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఉంటున్న రోజుల్లో, ఆర్.ఎస్.సుదర్శనంగారు నాకు సాహితీ-వేదిక బృందాన్ని పరిచయం చేసారు. ఆ మిత్రులవల్ల రాజమండ్రి నా విశ్వవిద్యాలయంగా మారిపోయింది. గౌతమీ గ్రంథాలయం, సమాచారం పత్రికా కార్యాలయం, గోదావరి గట్టు వంటివి మా అధ్యయన కేంద్రాలు. ఆ స్నేహాలవల్ల రాజమండ్రిని నేను నా ఉజ్జయినిగా లెక్కపెట్టుకుంటాను.

ఇప్పటికీ ఆ ఊరు తలపుకి రాగానే 'మా గోదావరియే, తదీయ తటియే, ఆమ్నాయాంత సంవేద్యుడౌ, మా గౌరీశుడె, మా వేణుగోపాలుడే 'అంటూ మా మాష్టారు రాసుకున్న పద్యం నా మదిలో నర్తిస్తుంది. ఒక్కణ్ణే ఒక రూములో ఉంటూ, బయట హొటల్లో భోజనం చేస్తూ, చాలీచాలని జీతంతో గడిపిన అటువంటి కాలంలో రామకృష్ణ నాకు అన్నగా నిలబడ్డాడు. ఎన్నిరాత్రులు అతడి ఇంట్లో సోదరి పెట్టిన అన్నం తిన్నానో లెక్కపెట్టలేను. నేను రాజమండ్రి వదిలిపెట్టి వెళ్ళిపోతున్నప్పుడు ఒక కవిత రాసాను. అందులో 'సెలవు నువ్వు కలిపి పెట్టిన అన్నం ముద్దలకు, సెలవు నీవు రుచి చూపిన ఆకలి రాత్రులకు' అని ఒక వాక్యం రాసాను. రాజమండ్రి నాకు కలిపి పెట్టిన అన్నం ముద్దల్లో అధికాంశం అతడి భార్య, అంటే మా సోదరి కలిపి పెట్టిన అన్నం ముద్దలే.

ఆ రోజుల్లో మాకు మరొక జీవితాశయం లేదు. కవి తప్ప మరొకరెవరూ మాకు ఆరాధనీయులుగా కనబడేవారు కారు. సాహిత్యం గురించి మాట్లాడుకోవడమొక్కటే ముఖ్యమైన పనిగానూ, తీరికసమయపు వ్యాపకంగానూ ఉండేది. అట్లాంటి కాలంలో అయిదేళ్ళు అక్కడ గడిపాను. కాని రామకృష్ణ ఇంతకాలం అక్కడే గడిపాడు, గడుపుతూనే

ఉన్నాడు. వేదంలా ఘోషించే గోదావర్ని వదిలిపెట్టలేక ఉద్యోగంలో ప్రమోషన్లు వదులు–కున్నాడు. ఒక ఋషి దగ్గర ఆయన సేవ చేసుకుంటూ ఉండిపోవడమే తమ జీవిత కర్తవ్యంగా భావించే వాళ్ళుంటారే, అదిగో, రామకృష్ణ అట్లాంటి కోవకి చెందినవాడు. రాజమండ్రి వీథుల్లో తిరుగుతూ, పూర్వ, అధునాతన కావ్యాల గురించీ, సాహిత్యకారుల గురించీ మాట్లాడుకుంటూ గడపడం కోసం అతడు తక్కిన జీవితానందాలన్నీ పక్కన పెట్టెయ్యగలిగాడు, సునాయాసంగా.

ఇప్పుడు ఈ పుస్తకంలో వ్యాసాలు తిరగేస్తుంటే అన్నిటికన్నా ముందు నా మీద ఆ గోదావరి గాలులు పుష్కలంగా వీచిన అనుభూతి కలిగింది. ఎన్నో సాయంకాలాలు గోదావరి గట్టు మీద కూచుని సాహిత్యచర్చలు చేసుకుంటూ గడిపిన రోజులు గుర్తొచ్చాయి. మల్లంపల్లి శరభయ్యగారూ, సుదర్శనంగారూ, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారూ, మా మహేశూ, సావిత్రిగారూ, సుబ్రహ్మణ్యం, గోపీచందులు గుర్తొచ్చారు.

నా రాజమండ్రి జ్ఞాపకాలు అంతవరకే. కాని రామకృష్ణ ఆ ఏథెన్సు వీథుల్లో సోక్రటీసు తర్వాత కాలపు తాత్త్వికుల్ని కూడా చూసాడు. పద్యకవితాయుగం నుంచి యెండ్లూరి సుధాకర్ దాకా తెలుగుకవిత్వాన్ని సుసంపన్నం చేసిన ఎందరో కవుల్ని, ఎన్నో సాహిత్యాల్ని చూసాడు. చూడటమే కాదు, తెలుగు నేల నలుమూలలా తన అనుభవాల్నీ, జ్ఞాపకాల్నీ ఎలుగెత్తి చాటాడు. మేము చెయ్యలేని ఈ పని చేసినందుకు, మేము రామకృష్ణకి సదా ఋణపడి ఉండక తప్పదు.

3

సాహిత్యం చదువుకోవడం దానికదే గొప్ప పురస్కారం. జీవితం నీకివ్వగల గొప్ప బహుమతి. ఇక చదువుకున్న సాహిత్యాన్ని పదే పదే మననం చేసుకోవడం, చదువుకున్న కవుల్ని ఒకరొకర్ని పోల్చి చూసుకోవడం, వారి సారాంశాన్ని తేనెలాగా పోగుచేసి నలుగురి దోసిళ్ళలోనూ ధారపొయ్యడం మామూలు సుకృతం వల్ల లభించే భాగ్యం కాదు.

ఈ పుస్తకం అటువంటి సుకృతసంపద. ఈ గోదావరి గలగలలు అతడు ఏదో ఒక రోజులోనో, ఒక వేళప్పుడో విన్నవి కాదు. ఇందులో సుప్రభాత సుగంధాలు ఉన్నాయి. మాధ్యందిన అధ్యయనాలు ఉన్నాయి, సాయంకాల సంధ్యావందనాలు ఉన్నాయి. పూర్వాహ్ణ, మధ్యాహ్న, అపరాహ్ణాలు ఏ ఒక్క రోజువో కావు, అవి అతడి జీవితకాలం మొత్తానికి చెందినవనే సూక్ష్మాన్ని మళ్ళా నేను వాచ్యం చెయ్యనక్కరలేదు.

హిందుస్తానీ సంగీతం వినేవాళ్ళకి ఆ సంగీతసౌరభంతో పాటు మరో సంతోషం కూడా అనుభవంలోకి వస్తూ ఉంటుంది. అదేమంటే, ఆ రాగాలకి వేళలూ, ఋతువులూ కూడా ఉంటాయనేది. ఆ రాగాల్లో కొన్ని ప్రాతఃకాలీన రాగాలు, కొన్ని పూర్వాహ్ణ రాగాలు, కొన్ని సాయంకాల రాగాలు, కొన్ని అర్థరాత్రి రాగాలు. అంతేనా, కొన్ని రాగాలు, జాము నుంచి జాముకి కాలం మారేటప్పుడు, ఆ పరివర్తనలోని భావోద్వేగాన్ని ప్రకటించే సంధి–ప్రకాశ రాగాలు కూడా.

రామకృష్ణ తాను చదువుకున్న సాహిత్యాల్ని, తనను ప్రభావితం చేసిన భావోద్వేగాల్ని వింగడించుకుంటున్నప్పుడు ఏవి ప్రాతఃకాల రాగాలో, ఏవి సాయంకాల రాగాలో గుర్తుపట్టాడు. అది మరొక సుకృతం. మనుషులు తమ ఆస్తిపాస్తుల్లో ఏవి ఎవరికి చెందాలో లెక్కవేసినట్టు, అతడు తన జీవితకాలంలోని సూనృతఘడియలకి ఎవరికి ఎంత ఋణపడ్డాడో ఈ పుస్తకంతో లెక్కలు తేల్చేసాడు.

తాను పుట్టిన దేశం, సంస్కృతి, ఆదికవి, కావ్యవాక్కు, రామశబ్దం, తెలుగుతల్లి, తెలుగునేల, తన గోదావరిజిల్లా ఇవన్నీ ప్రాతఃస్మరణీయాలు. తెల్లవారి లేచేటప్పుడు అరచేతులు జోడించుకుని, వారికి నమస్కరించుకుని, అప్పుడు నేలమీద కాళ్ళు పెడితే ఆ నడక నడతగా మారుతుందని రామకృష్ణ గుర్తుపట్టాడు.

ఇక రోజువారీ జీవితం మొదలయ్యాక, దైనందిన జీవితపు ఆటుపోట్ల నుంచి చేతులడ్డి కాపు కాచే కవిత్వాలు, ప్రభావాలు మధ్యాహ్న మార్తాండుడి వేడినుంచి సేదతీర్చే చెలమలు, చెలిమిలు. శ్రీనాథుడి నుండి జాషువా దాకా, దేవీ భాగవతం నుండి యోగానంద దాకా, ఖజురహో నుండి కల్పవృక్షందాకా ఎందరు కవులు, ఎన్ని కావ్యాలు, ఎన్ని మననీయ కవిత్వచరణాలు!

సాయంకాలానికి వచ్చేటప్పటికి కవిత్వంతో పాటు సంగీతమూ, విమర్శతో పాటు తత్త్వశాస్త్రమూ కూడా తన తలపుల్ని రసభరితం చేస్తున్నాయని మనకి అర్థమవుతుంది. వాల్మీకితో మొదలైన రోజు దినాంతవేళ గురజాడ స్మరణకు చేరుకోవడంలో ఒక 'గురుజాడ' ఉంది.

ఈ పుస్తకంలోంచి ఎన్నో వాక్యాలకు వాక్యాలు ఇక్కడ ఎత్తి రాయాలని ఉంది. కానీ ఆ ప్రలోభాన్ని కష్టం మీద అణచుకుంటూ, ఒక్క వాక్యం మాత్రం ఇక్కడ ఉల్లేఖించకుండా ఉండలేకపోతున్నాను:

> నవీన నాగరికత అన్ని రంగాల విలువలను సమూలంగా నాశనం చేస్తూ పోతూ ఉంటే, మరోవైపు నుంచి సంజీవినీ పుల్లను ధరించిన సాధువుల హితవచనాలు వాటిని బతికించుకుంటూ వస్తున్నాయి.

ఈ మాటలు రామకృష్ణ రాసిన ఈ వ్యాసాలకు కూడా అన్వయించవచ్చు. కాబట్టి ఇవి కొన్ని పరమసాధు హితవచనాల గురించిన కొన్ని సాధుహితవచనాలు అని చెప్పగలను.

29-3-2022

వనవాసిని

విభూతిభూషణ బందోపాధ్యాయ రాసిన 'వనవాసి' నవల చదవని వారు మీలో ఎవరూ ఉండరనుకుంటాను. ఆయన బెంగాలీలో 'ఆరణ్యక' పేరు మీద రాసిన ఆ నవలను సూరంపూడి సీతారాం వనవాసి పేరిట తెలుగు చేసారు.

అందులో సత్యశరణ్ అనే ఒక బెంగాలి యువకుడు ఉపాధి వెతుక్కుంటూ బీహారు లోని పూర్ణియా, ముంగేరు ప్రాంతంలో ఒక ఎస్టేటు మేనేజరుగా పనిచేస్తాడు. ఎస్టేటు పనుల్లో భాగంగా అడవిని నరికించి వ్యవసాయ భూమిగా మార్చడం అతడి పని. ఎప్పుడూ కలకత్తా వదిలి వెళ్ళని అతడి జీవితంలో అడవిలో అడుగుపెట్టిన మొదటిరోజు అతడికి చాలా నిరుత్సాహంగా, బెంగగా అనిపిస్తుంది. కాని అక్కడి పనివాడు అతడితో 'అడవి తొందరలోనే మిమ్మల్ని ఆవహిస్తుంది' అని చెప్తాడు. ఇక ఆ తరువాత కథ అంతా అడవి అతణ్ణి ఎలా సమ్మోహపరిచిందో, సమ్ముగ్ధం చేసిందో, ఆ కథనం.

అలౌకిక, రసాత్మక భాషలో విభూతి భూషణుడు అడవి సౌందర్యాన్ని మన ముందు ఆవిష్కరిస్తాడు. ఆ నవల చదివినవాళ్ళు ఒక్కసారిగా చదివెయ్యాలనుకోరు. మిఠాయి దాచుకున్నట్టుగా, రోజూ కొద్దికొద్దిగా ఎక్కడ అయిపోతుందోనన్న బెంగతో నెమ్మదిగా చదువుకుంటారు, చదివిన పేజీలే మళ్ళా వెనక్కి తిప్పి మరోసారి చదువుకుంటారు. ఒక పేరా చదవగానే పుస్తకం అట్లానే చేతుల్లో పెట్టుకుని ఏవో ఊహల్లోకి తేలిపోతారు.

నలభై ఏళ్ళ కిందట, రాజమండ్రిలో సరస్వతి పవరు ప్రెస్సులో ఆ నవలనీ, 'అమృతసంతానా'న్నీ కనుగొన్న ఆ రోజుల సంతోషాన్ని నేనెప్పటికీ మరవలేను. ఆ రెండు పుస్తకాలూ నాకు గొప్ప మహారణ్యాల్ని పరిచయం చేసాయి. మా ఊరికి నన్ను మరింత సన్నిహితుణ్ణి చేసాయి. మా అడవిని మరింత కొత్త సౌందర్యంతో పరిచయం చేసాయి.

నమ్ముతారా! నలభై ఏళ్ళ తర్వాత నేను అటువంటి ఒక పుస్తకాన్ని తెలుగులో కనుగొన్నాను. అటువంటి ఒక రచయిత్రి తెలుగులోనే ఉన్నారనీ, మన మధ్యనే మసలుతున్నారనీ తెలిసినప్పుడు, ఆశ్చర్యం అలా ఉంచి, ముందు నాకు నమ్మశక్యం కాలేదు.

జయతి రాసిన పుస్తకాలు మినహాయిస్తే, దేవనపల్లి వీణావాణి ఇటీవల వెలువరించిన 'ధరణీరుహ' (2022) వ్యాససంపుటి లాంటి రచన నేను ఈ మధ్యకాలంలో తెలుగులో చదవలేదు. ఇంగ్లిషులో కూడా ఆ స్థాయి రచనలు నేను ఎన్ని చదివానో వేళ్ళ మీద లెక్క పెట్టవలసి ఉంటుందేమో!

నిన్నా, మొన్నా ఆ పుస్తకాన్ని నేను అపురూపంగా చదివాను, ఆ పుటల్లో ఆవిష్కారమవుతున్న ఆ అపురూపమైన హృదయం ముందు పదే పదే మోకరిల్లుతూ చదివాను. పట్టుమని రెండు వందల పేజీలు కూడా లేని ఆ రచన ఎక్కడ అయిపోతుందో– నన్న బెంగతో చదివాను. చదివాక మీకు పరిచయం చేయాలని కూచున్నప్పుడు, ఆ పుస్తకంలో ఏ వాక్యం వదిలిపెట్టేస్తానో అన్న ఆందోళనలో కూరుకుపోతున్నాను.

దేవనపల్లి వీణావాణి వృత్తిరీత్యా డివిజనలు ఫారెస్టు అధికారి. ఆమె వరంగల్లు జిల్లాలో పనిచేసినప్పుడు ఆ అడవుల్లో తనకు ఎదురయిన అనుభవాల్ని, ఆ అడవితో తన అనుబంధాన్ని 15 వ్యాసాలుగా రాసి 'ధరణీరుహ' గా వెలువరించారు. ఈ వ్యాసాలు ఇంతకుముందు 'విహంగ' పత్రికలో ధారావాహికంగా ప్రచురితమయ్యాయి. ఇప్పుడు పుస్తకరూపంలో మనముందుకు వచ్చాయి.

ఇవన్నీ అడవి గురించిన తలపోతలు. ఈ పుస్తకం అంకితమిచ్చింది కూడా అడవికే. కాని ఇందులో చిత్రితమయ్యింది అడవి ఒక్కటే కాదు. వృక్షజాలంతో పాటు జంతుజాలం, పుష్పజాతులు, గడ్డిమొక్కలు, పుట్టగొడుగులు లాంటి వాటి గురించి రాస్తున్న నెపం మీద కవిత్వం, చరిత్ర, జీవపరిణామం, తత్త్వశాస్త్రం– ఎమర్సను నుంచి థోరో దాకా, బెర్గ్‌సను నుంచి రామాయణం దాకా, సంజీవని నుంచి సలీం ఆలీ దాకా– ఇది అడవిపుస్తకం మాత్రమే కాదు, సంస్కృతిపుస్తకం కూడా.

వనవాసి, అమృత సంతానం పుస్తకాలు దొరికినప్పుడే నాకు కాకాసాహెబ్ కాలేల్కరు రాసిన 'జీవనలీల' కూడా దొరికింది. పురాణం సుబ్రహ్మణ్య శర్మ అనువాదం. కాలేల్కరు గుజరాతీ రచయిత, గాంధేయవాది, రాజనీతిజ్ఞుడు. ఆయన భారతదేశంలోని వివిధ జలవనరులు– నదులు, జలపాతాలు, తటాకాలు, సముద్రాలు– సందర్శించినప్పుడు,

వాటి మీద రాసుకున్న తలపోతలు. అచ్చంగా ఈ పుస్తకం కూడా అలాంటి పుస్తకమే అనిపించింది.

ఇందులో విజ్ఞానం, పరిజ్ఞానం నిజంగా విశేషమైనవి. చాలా సంగతులు నేను మొదటిసారి వింటున్నవి. ఇందులో రచయిత్రి వాడిన భాష లోని అక్షరరమ్యత అపురూపమైనది. కాని వీటన్నిటివెనకా రచయిత్రి హృదయవైశిష్ట్యం మరింత గొప్పది. ఆ అనుభూతి సాంద్రత, ఆ ఆవేదన తీవ్రత–అవే నన్ను అంతగా ముగ్ధుణ్ణి చేసినవి.

పుస్తకం మొత్తం ఎలానూ ఎత్తి రాయలేను. కాని ఇంతగా పలవరిస్తున్నాక, అందులో ఏముందో తెలుసుకోవాలని మీకు అనిపించడం సహజం. చూడండి:

> ఈ రోజు ఇక్కడ మొలిచినట్టే ఈ వర్ష ఋతువులో అంతటా ఈ చిన్ని చిన్ని పూలవనాలు నిద్రలేచి ఉంటాయి. మళ్ళీ ఏడాదిదాకా ఆ మట్టిలోనే తమ చిన్న విత్తనాలను దాచిపెట్టి మళ్ళీ ఏడాది కోసం ఎదురుచూస్తాయి. వాటి భాగ్యం కొద్దీ ఆ మట్టి, నిర్లక్ష్యంగా విసిరి వేసిన అగ్గికి అర్పితం కాకపోతేనో, సాగు చేయబడకపోతేనో, చేసినా గట్టుమీద, మొలకల శిరసు మీద కలుపు మందు చల్లకపోతేనో, మొగ్గ పట్టకముందే గడ్డికోసం కోత కోయకపోతేనో, తప్ప మళ్ళీ ఈ రోజు నా ముందు కనిపించినట్టుగా నవ్వలేవు. వాటి సంతతిని కొనసాగించలేవు, మళ్ళీ కనిపించలేవు. (ప్రతి చోటూ పూలవనమే, పే.22)

> జీవం ఒక అవిచ్ఛిన్న ధార. దానిని అంటిపెట్టుకునే విశ్వాసాలతో దానికి పనిలేదు. అది తన దిశలో తాను ప్రయాణం చేస్తూనే ఉంటుంది. కాని మానవులకు ఈ గమనం ఒక సంక్లిష్ట దృగ్విషయం. వారికి నమ్మదగిన విధంగా విశ్వాసం అవసరమవుతుంది. ఆ విశ్వాసాల్ని పెనవేసుకునే మనుగడ సాగిస్తారు. అందుకు తగిన తాత్త్వికతను ఏర్పరచుకుంటారు. దానికి తగిన జీవనవిధానం, నైతిక అనువర్తనం ఏర్పరచుకుంటారు. అలా ఒక సమాజం, ఒక సమూహం, ఒక కుటుంబం మనుగడ కొనసాగిస్తుంది. వీటన్నిటికీ భూమిక అక్కడి ప్రకృతి. ఒక్కోచోట ఒక్కో జీవనవిధానం, ఒక్కో విశ్వాసం, ఒక్కో మనుగడ. మనుషులు పరిణామక్రమంలో ఇటువంటి స్థాయికి చేరడం ఒక అద్వితీయమైన విషయం. మరే జీవులూ ఇటువంటి స్థాయి పొందక పోవడం వెనుక ప్రకృతి యొక్క ఉత్కృష్ట మార్మిక శక్తి ఉందని నేను భావిస్తాను. (పురస్థాపనం, పే.33)

> అయితే ఆ తర్వాత తెలుసుకున్నది ఏమిటంటే, గత నలభై ఏళ్ళలో దేశంలోని అనేక కప్ప జాతులు అంతరించే దశకు చేరుకున్నాయని! ఎంత విషాదం. మన కళ్ళముందే ఒక విశాలమయిన తెరమీద ఒక్కొక్కరే అదృశ్యమై పోతున్నట్టు, ఒక బృహన్నాటకంలో విరమించుకుంటున్న పాత్రలు చివరి అంకం మొదటిభాగం మొదలుపెట్టినట్టుగా తోస్తుంది నాకు. (మండూక శోకం, పే.39)

అసలు ఈ మండూక శోకం అనే ఈ అధ్యాయం మొత్తం ఒక ఎలిజి. ఈ చివరి వాక్యాలు చూడండి:

> అడవిలో పులులలాగా, పంచెవన్నె సీతాకోకచిలుకల లాగానో మండూకాలు ఆకర్షణీయమైనవి కాకపోవచ్చు. మనకు దూరదూరంగా జరుగుతూ ఎక్కడో ఏ బురదలోనో తలదాచుకోవచ్చు. వాటి బెకబెకల శబ్దం కర్ణకఠోరంగా వినిపించవచ్చు. నేను వాటి అందాన్ని ఆరాధించమని చెప్పనుగానీ, వాటిని జీవించనీయండి అని మాత్రం వేడుకోగలను. (పే.44)

> ఇలా పుట్టగొడుగుల ప్రత్యక్ష-అదృశ్యాలను గమనించే ప్రసిద్ధ అమెరికన్ కవయిత్రి ఎమిలీ డికిన్సన్ వీటిమీద కవిత రాస్తూ పుట్టగొడుగులను మొక్కల యొక్క మోహినిగా, elf of plants, అభివర్ణించింది. ప్రకృతి పుట్టగొడుగులపట్ల విధేయంగా ఉన్నదా లేక ధిక్కరిస్తున్నదా అంటూ ఆశ్చర్యపోతుంది. ఈ కవిత్వం చదివినప్పుడు నా చుట్టూ ఉన్న లోకాన్నే మరో దివ్యచక్షువుతో అనుభూతి చెందుతున్నట్టు అనిపించింది నాకు. అంతకు ముందెప్పుడూ ఇంత లోతుగా వీటి గురించి ఆలోచించలేదు కానీ నిజంగానే ఈ కాలం అంతా ఎంతో ప్రత్యేకమైంది. ప్రకృతి కూడా ఒక ఇంద్రజాలానికి సిద్ధపడినట్లు రెండు ఋతువుల సరిహద్దుని గీయడానికి ఇటువంటి అవతారాలను సృష్టించినట్టు తోస్తుంది. (పుట్టగొడుగులు, పే.47)

> కలప డిపోలో ఇంకా ఏమైనా దొరుకుతాయేమోనని నడుస్తున్నాను. నా పాదానికి దగ్గరగా ఒక చిన్న మొగ్గ లాంటి తెల్లని తల. నేను కూర్చుండి పోయాను. అది పుట్టగొడుగా, కుక్కగొడుగా అని దగ్గరగా చూస్తున్నాను. ఆ తెల్లని మొగ్గ నా చెవిలో ఇలా- 'నువ్వు నా చిన్నప్రపంచంలోకి ఎలా ప్రయాణం చేస్తావోగాని ఇక్కడ నిజానికి ప్రపంచానికి చెందనిది ఏదీలేదని చెప్పాలనే

మొలుస్తుంటాను. మీ కళ్ళముందుకు రాని జీవితాలని చూడమని తల ఎత్తి పిలుస్తుంటాను.. ఈ విశాల మృణ్మయదేహం మీద నా పాదముద్రలు చిత్రించి గతించిపోతాను. ఇప్పుడు నువ్వు రాసే పేజీలో నా గమనం గురించి ఏం రాయబోతున్నావు?' అన్నట్టు అనిపించింది. (పే. 56)

అడవి గురించి రాయడమంటే సముద్రాన్ని తవ్వడమే. (వృక్షసాక్ష్యం, పే. 57)

ఇలా చదువుకోవటానికి పుస్తకం వెంట తెచ్చుకోవడం ఒక తరాన్ని మోసుకు తెచ్చుకుంటున్నట్టుగా తోస్తుంటుంది. (అక్కర్లేని మొక్కలు, పే. 68)

మానవాళికి ఏమీ తెలియదన్న ఒక్క విషయమే ఆయన (మసనోబు ఫుకువొక) నిరూపించదలచుకున్న పరమసత్యం. (పే. 69)

ఇలా మందులు వాడి పెరుగుదలను నియంత్రించడం వలన అవి వాటి జీవితచక్రాన్ని పూర్తి చేసుకోలేవు. వాటి జీవితచక్రాలు మధ్యలో ఆగిపోయి అనుసంధానమైన జీవులు మనలేవు. ఇక పూలులేని కొమ్మలు, తుమ్మెదలు లేని పూలు, చిలకలు కొట్టలేని కాయలు, మట్టికి చేరని విత్తులు, మెత్తబడని నేల, ఒకదానికొకటి పెనవేసుకున్న బతుకులు తెగిన పూసలదండలాగా విడిపోతాయి. (పే. 75)

పక్షి గుడ్లను, గూళ్ళను ఫొటోలు తీయకూడదు. గుడ్లకు ఏ చిన్నపాటి కాంతికిరణం తగిలినా వాటి పెరుగుదలలో తేడావస్తుందట. పక్షి గుడ్లు అంత సున్నితమైనవన్నమాట. అందుకే నేను పక్షి గుడ్లను ఫొటోలు తీయను. (గడ్డిపరకలు, పే. 84)

ఇంకా మరికొన్ని వాక్యాలు రాసి చూపించాలి మీకు. కానీ ఈ లోపు రెండు మాటలు చెప్పవలసి ఉంది. వనవాసిలో కథానాయకుడు అడవిని ప్రేమిస్తాడుగాని, ఉద్యోగ రీత్యా అడవిని తొలగించే బాధ్యత నెత్తికెత్తుకున్నవాడు. కాని ధరణీరుహ రచయిత్రి అడవిని కాపాడే ప్రభుత్వశాఖలో ఉన్నతాధికారి. అడవిని ప్రేమించడమే కాదు, ప్రేమించుకున్నదాన్ని మనసారా కాపుకాచుకునే అవకాశం ఒక బాధ్యతగా ఆమెకి లభించింది. ఈ పుటల్లో ఆమె ఉద్యోగజీవితం, హృదయస్పందనం రెండూ విడదీయలేనంతగా అల్లుకుపోయాయి. ఇది ఆమెకి మాత్రమే దక్కిన అపురూపమైన భాగ్యం.

మా చిన్నప్పుడు మా ఊళ్ళో చింతంనీడి రాజారామ్మోహన రావు అనే ఒక ఫారెస్టరు ఉండేవారు. ఆయన మెహర్‌బాబా భక్తుడు. చిత్రకారుడు, గాయకుడు. తన ఇంటిని ఒక పొదరిల్లులాగా అల్లుకుని దానికి 'మెహెర్ కుటీర్' అని పేరుపెట్టుకున్నాడు. మెహర్‌బాబా మీద ఒక బుర్ర కథ రాసి దాన్ని తన ముగ్గురు పిల్లల్తో అభినయింపచేసేవాడు. ఫారెస్టరు అటవీశాఖలో గ్రామస్థాయి ఉద్యోగి. కాని ఆయన జీవితంలో మేము చూసిన అభిరుచి, ఆ ఈస్తెటిక్సు నేను మళ్ళా అటవీశాఖలో మరే ఉన్నతాధికారిలోనూ కూడా చూడలేక–పోయాను. అది నాకు తలచుకున్నప్పుడల్లా ఆశ్చర్యం కలిగేది కూడా.

కాని ఇన్నాళ్ళకు అటవీశాఖలో అత్యున్నత స్థాయి అభిరుచి, స్పందనశీల హృదయం, పాండిత్యం, రసజ్ఞత, అకుంఠితమైన బాధ్యత ఇవన్నీ కలగలిసిన ఒక అధికారిని చూడగలిగాను. ఈమెను 'వనవాసిని' అని నోరారా పిలవకుండా ఉండలేకపోతున్నాను.

2

ధరణీరుహ అంటే చెట్టు. ధరణి అంటే నేల. రుహ అనే పదం 'రుహ్' అనే ధాతువు నుంచి వచ్చింది. దాని అర్థం పెరగడం, పైకి ఎక్కడం, ఎగబాకడం. ఆరోహణ అనే పదం రుహ్ ధాతువునుంచి వచ్చిందే. ధరణినుంచి పైకి పెరిగేది కాబట్టి మొక్క లేదా చెట్టు. కాని ఆ పదంలో ఒక ఆరోహణా స్ఫూర్తి ఉంది. అది ఔన్నత్యం వైపు చేతులు చాచే జీవలక్షణాన్ని సూచిస్తోంది. ఈ పుస్తకానికి ధరణీరుహ అని పేరుపెట్టడం ఎంతో సముచితమనిపించింది.

అలాగని ఇది అంతరించిపోతున్న అడవుల గురించిన విలాపం ఒక్కటే కాదు. అన్నిటికన్నా ముందు మనిషిలో రసహృదయం, సౌందర్యభావుకత, సహానుభూతి మృగ్యం కాకూడదనే ఆవేదన ఈ పుస్తకానికి అంతర్వాహిని. నేనింతకుముందు ఒకాకురో కకుజో రాసిన తేనీటి పుస్తకాన్ని తెలుగులోకి అనువదించడానికి ఇదే కారణం. ఆ పుస్తకం తేనీటి నెపం మీద ఒక ఈస్తెటిక్సుని వివరించే ప్రయత్నం అనిపించింది. అలాగే ఈ పుస్తకం కూడా అడవులూ, చెట్లూ ఆలంబనగా మనిషి ప్రకృతిని ప్రేమిస్తూ గడపడంలోని సౌందర్యాన్నీ, సమతౌల్యాన్నీ వివరించే ప్రయత్నం.

మనిషి ప్రకృతిని ప్రేమించడం వల్ల అతడి హృదయం మెత్తబడుతుందనీ, జీవితం నవనవోన్మేషమవుతుందనీ ఇటువంటి ప్రకృతిప్రేమికుల రచనలు చదివితే మనకు తెలుస్తుంది. ఈ వాక్యాలు చూడండి:

అటూఇటూగా గత నెలనుంచీ విపరీతమైన క్షేత్ర సందర్శనలూ, సమావేశాలు.. ఒత్తిడి అని అనలేనుగానీ, మడతలు విప్పుకున్న ఋతువొకటి నా కళ్ళముందు నుంచే హడావిడిగా వెళ్ళిపోయినట్టూ, ఆరుబయట నిలబడి అపురూపమైన వర్ణచిత్రాన్ని చిత్రించదలిచిన చిత్రకారుడు జోరువానలో తడిచి లక్ష్యం వంక జాలిగా చూసినట్టూ, వానాకాలం చుట్టూరా అల్లుకున్న నా ఆలోచనలన్నీ తడిలేని నేలలా బిగుసుకుపోయాయి. (గొల్లవంపులు, పే. 89)

ఏమీలేని చోట పిల్లదారికి పక్కపక్కలుగా వాననీటి ప్రవాహానికి అనుగుణంగా ధారలు కట్టిన ఈ రాతిగుళికలు నా కాన్వాసుమీద ఈస్టమన్ రంగు దారి తామే అయ్యి మిలమిల మెరవడం, మట్టిపరుపులో ఒక విన్యాసం. నా కాళ్ళకి ఉన్న షూస్ తీసి ఆ గుళికల మీద ఉంచాను. అది గోరువెచ్చని స్పర్శ. పసిబిడ్డకు స్నానం చేయిస్తున్న అమ్మ వేడినీళ్ళు, చల్లనీళ్ళు కలిపి పోసే వేడినీళ్ళ చర్య. చల్లగా వీస్తున్న అడవి గాలి మధ్య పాదాన్ని వెచ్చబరుస్తున్న స్పర్శ. (పే. 93)

వెన్నెల మరింతగా వెలుగుతుండగా గోరుకొయ్యలు పొడిచే వేళ దగ్గర పడుతున్నది. సప్తర్షి మండలం, జరుగుతున్న సమయానికి అనుగుణంగా కదిలినట్టు భావన. చలి ఉందిగానీ మరీ ముదురుచలి కాదు. ఇది కూడా ఒక అనుభూతే కదా. వెన్నెల ఆకాశంలో చుక్కలు చూడగలగడం. కాలగమనంలో ఒక పొద్దుపొడిచే సమయానికి సాక్ష్యంగా తూరుపుకు ఎదురుగా నిలబడడం. సన్నని వెలుగురేఖలు నీలాకాశపు సముద్రం మీద ఎర్రెర్రగా విచ్చుకోవడం బాగుంటుంది. ఒక అడవిదారి మీద నేను చూసిన పొద్దుపొడుపుని ఇలా కాగితం మీదకు అనువదిస్తున్నాను. నా ఈ అనువాదం భావస్ఫోరకమో కాదో గానీ ఎప్పుడైనా నిశ్శబ్దంగా ఉన్న అడవిలో ఒక శరత్ కాలపు వెన్నెలను మాత్రం చూడకుండా జీవితాన్ని ముగించడం ఒక విలుప్త నదీ ప్రవాహమే అవుతుందని చెప్పగలను. (వృథశాల, పే. 104)

నిలబడి కురుస్తున్నట్లుగా వర్షంలో కూడా ఒక హుందాతనం. సంధ్య చీకటి తెలియడం లేదు. అంతా వాన. ..ఒకలాంటి వెండి తెలుపు. ఆ తెలుపులోనూ ఎర్రని లేత కొమ్మలతో పూసుగు చెట్టు దూరం నుంచి కూడా స్పష్టంగానూ, ప్రత్యేకంగానూ కనిపిస్తుంది. బాగా పండిన గోరింటాకు చూపెడుతున్న

అమ్మాయి చేతులలాగా పూసుగుకొమ్మల లాలిత్యం వర్షంలో మరింత సుందరంగా కనిపిస్తున్నది. (పే.120)

ఇంతలో జీపు వచ్చేసింది. తిరిగి బయలుదేరాం. దారిలో ఇంటికి చేరుకుంటున్న పశువులు. కురుస్తున్న వర్షానికి తీరిగ్గా తోకలు వూపుకుంటూ మెల్లగా కదులుతూ ఉంటే నల్లని వాటి శరీరాలు వాననీటితో శుభ్రపడు-తున్నాయి. పైన నల్లని మేఘాలు, కింద నడుస్తున్న మేఘాలతో ఒక వారధిగా నేలతో పాటు మా మనసునూ తడుపుతూ ఆకాశపాయ ప్రవహిస్తున్నది (ఆకాశపాయ, పే.120)

చెరువు పరిసరాలు ఒకసారి చూసుకుని తిరిగి గుండం చెరువు వైపుగా వెళ్ళాం. మునిమాపువేళ రెండు చెరువుల సాన్నిధ్యంలో సూర్యుడు కిందకు దిగుతున్నాడు. కెంజాయ రంగు నీలి ఆకాశంలో ప్రతిఫలిస్తున్నది. చిన్న చిన్న నీటితెరలు ఒడ్డుకు కొట్టుకుంటూ గాలి కదలికలకు అనుగుణంగా నర్తిస్తున్నాయి. గాలి మంద్రంగా వీస్తున్నది. ఇటువంటి ఆహ్లాదకరమైన వాతావరణం కోసమే వెతుక్కుంటాను..ఈ సాయంకాలం నేను ఈ శిథిల మందిర ప్రభను కొంతైనా స్వీకరించాలని అనుకుంటున్నాను. (జలపాత్రలు, పే.128)

చెట్టు శాఖల మీద కుచ్చెలుగా అమరుకున్న ఆకులమధ్యనుంచి చిల్లులు చిల్లులుగా ఎండపొడ కురుస్తున్నది. ఎండపొడకు గాలిలో ధూళి రేణువులు కదులుతూ రాలిపడుతున్నాయి. గాలికి శాఖలు ఊగినప్పుడల్లా ఆకులమధ్య నుంచి చిల్లులు చిల్లులుగా ఎండపొడ కురుస్తున్నది. ఎండపొడకు గాలిలో ధూళి రేణువులుసందుల్లోంచి జారుతున్న ఎండబొట్లు అటూ ఇటూ కదులు తున్నాయి. మనం పట్టించుకోంగానీ ఒక్క క్షణం ఆగి చూస్తేగానీ ప్రతి కదలిక లోనూ ఒక అదృశ్యహస్తం ఉన్నదనీ, అది నిశ్శబ్దంగా తన పని తాను చేసుకు పోతుందనీ తెలుసుకుంటాం. ఆ అదృశ్యహస్త విన్యాసాన్ని గమనించడానికి ఉవ్విళ్ళూరుతుంటాను. నాకు నేను ఆశ్చర్యపోతూంటాను. ఎన్ని నిమిషాలో గంటలో అటువంటి ఆశ్చర్యసముద్రంలో మునకలేస్తూ గడిపేస్తుంటాను. ఆ భావనలో నాకు ఒంటరితనం తెలియదు. ఆ స్పృహలో నాకు భయమూ తెలియలేదు. (అ‘మృత’ వృక్షం, పే.154-55)

> నేనిప్పుడు నా ముందు ఎగురుతున్న సీతాకోకచిలుకలను చూస్తున్నాను. ఎంత సౌందర్యం అది, ఎంతటి సౌకుమార్యం! మరి ఎంత అల్పమైన జీవితమైతే అంత సులభంగా జన్మల పరంపర దాటావచ్చునా, అంతటి అల్పమైన జీవితంతో ఎంతటి ప్రాకృతిక పరోపకారం! అలా నేనెప్పటికీ జన్మనెత్తలేనా లేక ఇదివరకే ఎత్తి ఉన్నానా..?? ప్రతీ జన్మ వారి కర్మలతో లభిస్తుంది అనుకున్నట్లయితే యే కర్మ చేస్తే నేనీ జన్మనెత్తగలను? నాకు ఈ క్షణం నీడనిస్తున్న చెట్టు ఒకప్పుడు.. అంటే ఒకానొక జన్మలో నా తల్లే అయి ఉంటుందా లేదా ఒకవేళ నాకు తన దీర్ఘశాఖలను చామరం చేసిన చెట్టుది కర్మేనా..నేను పొందుతున్న హాయికి తగిన కర్మను నేను ఇదివరకే చేసి ఉన్నానా లేదా కొత్త కర్మకు ఇది ప్రారంభమా..నాకు చెప్పండి ఏ కర్మ చేయడం వల్ల నేను మళ్ళీ చెట్టునవుతాను, నా ముందు ఎగురుతున్న సీతాకోకచిలుకనవుతాను..? బాలకృష్ణుడు రోలుతో పడగొట్టిన రెండు మద్ది చెట్లు ఇద్దరు యక్షులుగా బయటపడ్డట్టూ నా పక్కనే ఉన్న ఈ మద్దిచెట్టూ ఎవరో ఒకరా..?!ప్రేమగా సాకుకుంటున్న నా కుండీలోని మొక్కలన్నీ నా పిల్లలేనా..అవి నాకు మళ్ళీ జన్మలో తల్లి అవుతాయా.. అలా అయితే నేనెప్పటికీ ఈ జన్మల పరివృతాలయం నుంచి విడిపోలేనా.. నేను మనిషిగానే ఎందుకు పుట్టాలి..? ఇది చెట్టుగానే ఎందుకు పుట్టాలి..? (సరిహద్దు రేఖ, పే.166)

ఈ వర్ణనల్ని, ఈ భావనల్ని ఇంతగా ఉల్లేఖించడానికి కారణం ఈమె తాదాత్మ్యాన్ని పరిచయం చేయడానికే. తెలుగులో ఎందరో కథకులు, కవులు, నవలాకారులు ఉండవచ్చు, సమాజాన్నీ, తమని చిత్రించడంలో వారు సిద్ధహస్తులై ఉండవచ్చు. కాని తమ జీవితానుభవాల్ని మనతో పంచుకోవడంలో ఒక జయతి, ఒక వీణావాణి చూపిస్తున్న authenticity అద్వితీయమనిపిస్తుంది. ఎందుకంటే వారు సిద్ధాంతాలమీదగానో, లేదా సాంఘిక విమర్శదారిలోనో కాక, చిన్న చిన్న నిశ్శబ్దాలమీంచీ, పచ్చని చెట్లదారుల్లోంచీ జీవితసాఫల్యాన్ని వెతుక్కుంటున్నారనిపిస్తుంది. ఈ వాక్యాలు చూడండి:

> వెన్నెల కాస్తుంది. వెన్నెల వెలుగులు చెరువు మీదనుంచి ఒక స్పష్టమైన వెండి మెరుపు.. మందిరం నీడ నా నడకను బట్టి ఒక్కోసారి ఒక్కోవైపు కనిపిస్తున్నది. ఈ క్షణం నాకేమనిపించిందంటే కొన్నిసార్లు నీదైనలోకంలో బతకాల్సిన అవసరం ఉంటుంది లేదా అటువంటి పరిస్థితి వస్తుంది. అందులో మన ప్రమేయం ఉందా లేదా అన్నది పక్కనబెడితే అటువంటి స్థితి అసాధారణ

మైంది, ఉత్కృష్టమైనది. ఎందుకంటే అది నిన్ను నిన్నుగా నిలబెడుతుంది. నీవేమిటో నీకు చెబుతుంది..నాలో ఏదో అర్థం కాని ప్రకృతి జ్ఞానం ప్రవహిస్తున్నట్టుంది. నిరంతరం అడవుల్లో తిరిగే ఇటువంటి దృశ్యపరిచయం వంటివి కూడా మమ్మల్ని ఇటువంటి సందర్భాలకు సన్నద్ధం చేస్తుంటాయేమో. ఇటువంటి మనోస్థిరతకోసమే ఋషులు వనవాసం చేసి ఉంటారు. అఖండ ఏకాంతంలో వారు దర్శించిన విషయాలు వాఙ్మయం అయ్యాయా.. అంతే అయ్యుంటుంది. ఇటువంటి శక్తిని ప్రత్యక్షంగా పొందడం కోసమే హెన్రీ డేవిడ్ థోరో వాల్డన్ సరస్సు పక్కన రెండేళ్ళు నివసించి ప్రాకృతిక దివ్యత్వాన్ని అనుభూతి చెందాడనుకుంటాను.. (జలపాత్రలు, పే.131)

ప్రపంచమంతటా గొప్ప తత్త్వవేత్తలు, గొప్ప ఆలోచనాపరులు ఇలానే ప్రభవిస్తారు. తమ దైనందిన జీవితంలో, మనం అనుభవిస్తూ కూడా దాటిపోయే క్షణాల దగ్గర వారు ఆగి, మనం చూడలేని ఏ ఉదాత్తతనో, గాంభీర్యాన్నో దర్శించి మనతో పంచుకుంటారు. అది చిత్రకారులైతే బొమ్మలు గీస్తారు. గేయకారులైతే పాటలు కడతారు. సంజీవదేవ్ లాగా చిత్రకారులూ, ఆలోచనాపరులూ కూడా అయితే వ్యాసాలు రాస్తారు. లేదా తమ అనుభవాల్ని కథలుగా, కవితలుగా మలుస్తారు.

కాని తెలుగులో సృజనాత్మక రచయితల్లో అధ్యయనం, నిశితపరిశీలన చాలా తక్కువగా కనిపిస్తాయి. చిరుగాలికి కూడా కంపించిపోగల సున్నితత్త్వం కృష్ణశాస్త్రి, చలం, తిలక్, రేవతీదేవిల తర్వాత మన కవుల్లో అంతగా కనిపించదు. తమ వృత్తినీ, ప్రవృత్తినీ ఒకటిగా చేసుకోగల, జాగ్రత్తగా చూసుకోగల జీవననైపుణ్యం మన రచయితల్లో దాదాపుగా అరుదు. ఏకకాలంలో అనేక కాలాల్లో జీవించగల అనుభవం గురించి శ్రీశ్రీ ఎంతగానో చెప్పాడుగానీ, ఆ విద్య మన రచయితలకు అంతగా పట్టుబడ్డట్టు కనిపించదు.

సరిగ్గా ఈ కారణాల వల్లనే ఈ ధరణీరుహ నాకు చెప్పలేనంత సంతోషాన్ని కలిగించింది. తెలుగు భావనాశీలత పట్ల కొత్త ఆశలు రేకెత్తించింది. వీణావాణి ఇటువంటి మూజింగ్స్ మరిన్ని వెలువరించాలని కోరుకుంటున్నాను. వెలువరించిన ఈ పుస్తకం అవశ్యం ఇంగ్లిషులోకి రావాలని కూడా కోరుకుంటున్నాను.

పుస్తకం ముఖచిత్రం గురించి కూడా ప్రస్తావించాలి. ఇది వీణావాణి గారి అమ్మాయి, ఏడో తరగతి చదువుకుంటున్న బాలిక చిత్రించిన బొమ్మ. కాని నేను చూడగానే వర్లి, గోండు చిత్రకారులో, సంతాలు పటచిత్రకారులో చిత్రించి ఉంటారనుకున్నాను. ఆ బొమ్మలో

కొమ్మలు ఉద్గమస్థానంలో సన్నగానూ, పైకి పోయేకొద్దీ లావుగానూ కనిపిస్తున్నాయి చూడండి. ఇది ప్రకృతి విరుద్ధం కాదు, ప్రకృతి సహజం. మామూలు కొమ్మలు పైకిపోయే కొద్దీ సన్నబడతాయి. కానీ ఆశారేఖలు ఎంత దూరం సాగితే అంతకంతగా బలపడతాయి.

ఇటువంటి పుస్తకాలు పక్షుల మీద రావాలి, కొండల మీద రావాలి, గనుల చుట్టూ రావాలి, సముద్రతీరాల మీద రావాలి, ఆదివాసి సమాజాల మీద రావాలి, మత్స్యకార గ్రామాల మీద రావాలి. అలాగని వట్టి ప్రకృతి చిత్రణనో, సాంఘిక కథనాలో కాదు, అక్కడి జీవితాల్తో మమేకంగా పెనవైచుకుపోయే హృదయాల ఆత్మనివేదనలు కావాలి. ఈ పుస్తకం అటువంటి రచనలకు నాందీవచనం కాగలదని భావిస్తున్నాను.

30-11-2022

కొన్ని శేఫాలికలు

అల్లసాని పెద్దన చంద్రుణ్ణి అన్ని ఋతువుల్లోనూ పూచే పువ్వు అని అభివర్ణించాడు. ఈ శేఫాలికలు కేవలం ధనుర్మాసంలో మాత్రమే పూసే పూలు కావు. ఇవి అన్ని ఋతువుల్లోనూ పూసిన పూలు. ఇంకా చెప్పాలంటే, జీవితకాలం పాటు పువ్వు పువ్వునుంచీ ఏరుకుని నింపుకున్న మధుకోశాన్ని మళ్ళా నలుగురికీ పంచడంకోసం మళ్ళీ పూసిన పూలు.

ఈ రచనలన్నీ దాదాపుగా సారంగ పత్రికలో వస్తున్నప్పుడే చదివాను. కాని ఇప్పుడిలా పుస్తకరూపంలో తీసుకువస్తున్నాను చూడమని అక్క అడిగినప్పుడు మొదటి వ్యాసం చదివినప్పటికే నా గుండె గద్గదమైపోయింది. మరో రెండు వ్యాసాలు చదివేటప్పటికి నా కళ్ళల్లో నీళ్ళు ఊరుతున్నాయని గ్రహించుకున్నాను.

ఎందుకని? ఎందుకని ఈ వాక్యాలు, ఈ వ్యాసాలు నాకు కన్నీళ్ళు తెప్పించాయి? వీటిలో ఉన్నదేమిటి? సాహిత్యం, సంగీతం, సినిమాలు, మిత్రులు, మానవసంబంధాలు– వీటిగురించే అయితే సంతోషం కలిగి ఉండాలిగాని హృదయం అశ్రుపూరమెందుకవ్వాలి?

ఆలోచించాను. బహుశా, మా చిన్నప్పుడు, ఆ కొండకింద పల్లెలో, ఆ తాటాకు ఇంట్లో, నిండుగా రాధామనోహరాలు పూచిన ఆ పూలపందిరి కింద మేము పెరిగి పెద్దవాళ్ళమవుతున్నప్పుడు, ఇంత సుదీర్ఘమైన జీవితం జీవిస్తామనిగానీ, ఇంత సుదూరమైన ప్రయాణం చేస్తామనిగానీ, లేదా ఇంత సుసంపన్నమైన అనుభూతి ఐశ్వర్యానికి వారసులు కాగలమని గానీ ఊహించలేదు. అసలు అప్పుడు మాకెవ్వరికీ మా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు. అప్పటి మా జీవితాల్లో మేము చూసిన లేమి, కష్టం, అశాంతి– వీటిఫలితంగా మేమెలా మారి ఉండాలి! ఆ చిన్ననాటి చేదుఫలాన్ని మరింత కటువుగా నలుగురికీ పంచే విషవృక్షాలుగా ఎదిగి ఉండాలి కదా! అందులోనూ మా అక్క పడ్డ

కష్టాలు మామూలు కష్టాలు కావు. కాని ఆ చేదుజీవితం ఇలాంటి మధురపుష్పాలు పూసిందేమిటి? ఇలాంటి అమృతఫలాలు కాసిందేమిటి?

నువ్వు ఏది నాటితే దాన్నే కోసుకుంటావు అనేది నానుడి. కాని మా అక్క జీవితంలోంచి ఇంత సుమానుషం గంపలకెత్తింది అంటే ఆమె అనుభవించిన సుఖదుఃఖాల కన్నా మించిన ఓషధులేవో ఎవరో ఆమె హృదయంలో నాటి ఉండాలి కదా! అవేమిటి? జీవితం నీతో విషం తాగిస్తే, నువ్వు తియ్యని పాట పాడుతున్నావంటే, ఆ తీపిదనం నీలో పుట్టుకనుంచే ఉందా? లేక నువ్వేది ఆరగించినా దాన్ని క్షీరంగా మార్చుకునే రహస్యవిద్య ఏదైనా నీకు కరతలామలకమయ్యిందా?

ఈ రోజు చిన్న చిన్న కష్టాలకే లోకం మీద ఆగ్రహం ప్రకటిస్తున్న రచనలు చూస్తున్నాను. ప్రపంచం మీద తాము తీర్చుకోవలసిన ప్రతీకారం ఇంకా మిగిలే ఉందని ప్రసంగిస్తున్న వాళ్లని చూస్తున్నాను. ఏ కష్టమూ లేకపోయినా, జీవితం అన్ని విధాలా సౌకర్యవంతంగా అమిరి ఉన్నా కూడా, మనుషుల మీద విరుచుకు పడటం ఒక యుగధర్మంగా భావించి తాము కూడా నాలుగు మాటలు అనడానికి ఉత్సాహపడుతున్న వాళ్ళనీ వింటున్నాను. ఇటువంటి కాలంలో, ఇటువంటి సమాజంలో ఈ పుస్తకం చదవగానే నాకు పట్టలేనంతగా కన్నీళ్ళు పొంగిపొర్లాయంటే ఆశ్చర్యమేముంది?

సాహిత్యం ఎరుకని కలిగించాలన్నమాట నిజమే గాని, ఆ ఎరుక దయగా మారడం మరింత అవసరం. లేకపోతే అది విరక్తిగా మారి నిన్ను ఈ లోకం నుంచి దూరంగా తీసుకువెళ్ళిపోతుంది. కానీ అక్కకి సాహిత్యమూ, కళలూ, జీవితానుభవాలూ ఎరుక-నివ్వడంతో పాటు ఆమెని దయామూర్తిగా కూడా మార్చేయి. అదే! అదెలా సాధ్యమయ్యింది?

ఎలా సాధ్యమయ్యిందో తెలియాలంటే ఈ పుస్తకం మళ్ళీ మళ్ళీ చదువుకోవాలి, కళ్ళకి నీళ్ళు అడ్డుపడుతున్నా సరే.

21-7-2023

సాత్వికీకరణ వాచకం

ధూళిపాళ అన్నపూర్ణగారు ఇవాళ డెబ్భైవ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఆమె గొప్ప విదుషీ-మణి. ఆమె భర్త ధూళిపాళ మహదేవమణిగారు కూడా గొప్ప సంస్కృత విద్వాంసులు, ప్రవచన కారులు. ఆ దంపతులు రాజమండ్రిలో ఉంటారు. అన్నపూర్ణగారిది కోనసీమలోని పొడగట్లపల్లి అగ్రహారం. వారి తాతగారు దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు ప్రసిద్ధ వ్యాకరణవేత్త. కాకినాడలో పైండా సత్యనారాయణమూర్తి ఓరియెంటలు కళాశాలలో ఆమే, మా అక్కా చాలాకాలంపాటు కలిసి పనిచేసారు. ఈ రోజు అన్నపూర్ణగారి పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబసభ్యులు వారి సాహిత్య వ్యాసాల్నీ, కథల్నీ 'అంతర్వీక్ష' పేరుమీద ఒక పుస్తకంగా ప్రచురించి ఆమెకు కానుక చేస్తున్నారు. ఆ పుస్తకానికి నన్ను కూడా ఒక ముందుమాట రాయమని వారి అమ్మాయి నన్ను అడగడం నా భాగ్యం. అన్నపూర్ణగారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ నా వ్యాసాన్నిక్కడ మీతో పంచుకుంటున్నాను.

గురజాడ అప్పారావుగారు తన డైరీల్లో విజయనగరం మహారాజా ఆనందగజపతి గురించిన విశేషాలు తలచుకుంటూ ఒకసంగతి రాసేరు. అదేమంటే రాజావారికి ఒకసారి ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఒక సందేహం కలిగిందట. దాన్ని తన మిత్రుడైన ఒక బిషప్పుగారితో ప్రస్తావిస్తే ఆ బిషప్పు 'బట్లరు దొర దీనిని ఫలానా పుస్తకంలో ఫలానా ఫలానాచోట వివరణ రాసినట్టుంది' అని అన్నాడట. అప్పుడు రాజావారు 'బాగానే ఉంది కథ. అదేమిటో తెలియచెప్పక, రాసినట్టుందంటాడేమిటి? తను ఇంగ్లిషువాడై వుండి కూడా బట్లరు గురించి ఇతమిత్థమని తెలియదే!' అని తలపోసి బిషప్పు వెళ్ళిపోగానే, బుక్‌సెల్లరు వద్ద బట్లరు గ్రంథం కొని పరిశీలనగా చూసేరట. బిషప్పు పేర్కొన్న చోట, ఆ వివరణ విపులంగా ఉందట. అప్పుడు రాజావారిలాగ అనుకున్నారట: 'ఈ ఇంగ్లిషు విద్వాంసులకు యెంత నిశ్చయజ్ఞానముంది. దానిని చెప్పేటప్పుడు ఎంత నాగరికంగా, నమ్రతగా చెప్పుతారు!' అని.

అన్నపూర్ణగారిని చూసినప్పుడల్లా, ఆమెతో మాట్లాడినప్పుడల్లా నాకీ మాటలు గుర్తొస్తూ ఉంటాయి. ఒక మనిషి పాండిత్యమూ, సాహిత్యమూ కూడా సమకూరేక ఆమె వ్యక్తిత్వంలో జీవితం పట్ల నిశ్చయజ్ఞానంతో పాటు, మనుషుల పట్ల సానుకంపతో కూడిన నమ్రత కనిపించడమే ఆమె సంస్కారానికి గుర్తు. ఆటువంటి సంస్కారి తాను సాత్త్వికురాలు కావడమే కాక, తను చుట్టూ ఉన్న మనుషుల్నీ, పరిసరాల్నీ కూడా సాత్త్వికీకరిస్తారు. నిజానికి కావ్యానందం, భక్త్యావేశాల పరమార్థం ఇదేననే మన పూర్వీకులు చెప్తూ వచ్చారు.

అటువంటి సంస్కారం సాహిత్యం వల్ల అలవడుతుందని నేను చాలాకాలంగా నమ్ముతూ వచ్చేను. కాని అన్నపూర్ణగారిలాంటి వాళ్ళని చూసినతర్వాత, సాహిత్యం కొత్తగా ఏ సంస్కారాన్నీ అలవర్చదనీ, మనలో ఉన్న సంస్కారాన్ని మరింత తేటపరచడమే సాహిత్య ప్రయోజనమనీ గ్రహించాను. ఉదాహరణకి గంధపు చెక్కని చూడండి. దానిలో సుగంధం బయటనుంచి వచ్చింది కాదు, కాని అది సానకి రాపాడినప్పుడు చందనసుగంధం చిమ్ముతుంది. అన్నపూర్ణగారి లాంటి వాళ్లతోమాట్లాడుతున్నప్పుడు వారికీ, మనకీమధ్య ఒక చందనసుగంధం అల్లుకోడానికి కారణమిదే అనుకుంటాను. ఆమెలో ఉన్న సంస్కారానికి ఆమె పాండిత్యం, ఆమె అధ్యయనం మరింత మెరుగుపెట్టాయి. ఆమె ముందే సాత్త్వికురాలు, సాహిత్యం ఆమెని మరింత సాత్త్వికీకరించింది. ఇక ఆమె ఎవరితో మాట్లాడినా, ఏమి మాట్లాడినా ఆ సాత్త్వికసుగంధం పొంగిపొర్లకుండా ఎలా ఉంటుంది?

అప్పారావుగారు ప్రస్తావించిన సంఘటనలో రెండు సుగుణాల మేలిమి కలయిక కనిపిస్తున్నది. ఒకటి నిశ్చయజ్ఞానం, రెండోది ఆ జ్ఞానాన్ని పంచుకునేటప్పుడు ఉండవలసిన వినయం. అటువంటి నమ్రతని ఆయన నాగరికత అన్నాడు. పూర్వకాలపు భాషలో దాన్ని సభ్యత అనేవారు. సభ్యత అంటే సభలో వ్యవహరించవలసిన తీరు అని కాదు. ఇద్దరు మనుషులు కలుసుకున్నప్పుడు ఒకరిపట్ల ఒకరు అటువంటి నమ్రతతో ప్రవర్తించినప్పుడు మాత్రమే ఆ కలయిక ఒక సభగా మారుతుంది. సంస్కృతిగా వికసిస్తుంది.

2

అన్నపూర్ణ గారి ఈ 'అంతర్వీక్ష' వ్యాసాలు చదువుతున్నంతసేపూ నాకిలాంటి అనుభూతినే కలిగింది. మీరు చదవడం మొదలుపెట్టాక మీక్కూడా కలుగుతుంది. తాను చదివిన సాహిత్యం గురించి ఆమె మనతో చెప్తున్నప్పుడు తన సంస్కారాన్ని మనతో పంచుకోవడమే కాదు, మనలోపలి సంస్కారాన్ని కూడా వెలికి తీస్తున్నారని గ్రహిస్తాం. పుస్తకం చదవడం

ముగించేక మనకొక అరుదైన నాగరికురాలు పరిచయమైనారనీ, ఆమె మనకొక సభ్యతను అలవరుస్తున్నారనీ బోధపడుతుంది.

చూడండి, ఇందులో రెండు భాగాలున్నాయి. 'అంతర్వీక్ష', 'బహిర్వీక్ష'. అంతర్వీక్ష ఆమె చదువుకున్న సాహిత్యం గురించిన తలపోత. బహిర్వీక్ష ఆమె రాసిన కథలు. మొదటి భాగంలో ఆమె మనతో పంచుకున్న సాహిత్యంభారతీయ సంస్కృతికి మూలకందాలైన రామాయణ మహాభారతాలూ, కావ్యాలూ, నదులూ, దేవతలూను. రెండో భాగంలో ఆమె తాను జీవిస్తున్న వర్తమాన సమాజంలో తాను చూసిన, విన్న, తాను వివేచించిన జీవితానుభవాల్లోంచి తాను గ్రహించిన సత్యాల్ని మనతో పంచుకోడానికి చెప్పిన కథలూను.

అసలు ఈ నిర్మాణమే చాలా ప్రశస్తంగా ఉంది. ఎందుకంటే, సాహిత్యకారుల సంగతి అలా ఉంచి, ముందు ప్రతి మనిషీ తనను తాను తీర్చిదిద్దుకోవలసిన జీవన శిల్పం ఇది. కావ్యపఠనం, పూర్వమహాకవుల, ఇతిహాసకారుల రచనలూ, సంస్కృతీ, సంప్రదాయాలూ మనిషిలోపల జీవితాన్ని సంపద్వంతం చెయ్యవలసినవి. వాటిల్లో మనం వెతకవలసింది బయటి జీవితం గురించి కాదు. బయటి జీవితంలోలాగా ఆ పుస్తకాల్లో లేదే అని వాటిని విమర్శించడం కాదు.

జీవితమంటే పైకి కనిపించే వేషభాషలూ, వస్తు సామగ్రీ కాదు. ఒక కాలంలో మనుషులు తాములోనైన జీవితానుభవాలనుంచి తమకి సంప్రాప్తమైన సుఖదుఃఖాల్ని మథించి కొన్ని సత్యాల్ని మన రక్తంలో ప్రవేశపెట్టి వెళ్ళిపోతారు. మనం ప్రస్తుత జీవితం కొత్తగా జీవిస్తున్నాం అనుకుంటాంగానీ, నిజానికి, జీవితానుభవాల పట్ల మన ప్రతిస్పందన ఎంత కొత్తగా కనిపిస్తుందో అంత పురాతనం. మన పూర్వీకులు కూడా జీవితం యెదట ఇంత బేలగానూ, ఇంత ధీరులుగానూ ప్రవర్తించేరనీ, ఆయా అనుభవాలు తమకి ఎదురైనప్పుడు ఆ తత్తరపాటులో వాటిని ఎలా నిభాయించుకోవాలో తెలియక మంచో, చెడో వాటినుంచి ఎదురయ్యేక, అప్పుడు నెమ్మదిగా, వాటినుంచి తమ తర్వాతి తరాలు గ్రహించవలసిన సూత్రాలు ఏముంటాయో వాటిని పాఠాలుగా చెప్పడానికే సాహిత్యసృజన చేసారనీ మనం తెలుసుకోవాలి.

జీవితం ఎదట మనం ప్రధానంగా రెండు రకాల అనుభూతులకు లోనవుతామని చెప్తూ అరిస్టాటిలు వాటిని pity and fear అని అన్నాడు. జీవితం మనకి కష్టం కలిగించినప్పుడు మనం భయానికి లోనవుతాం. అప్పుడు మనం జీవితం నుంచి దూరంగా జరగాలనుకుంటాం. అదే, ఎదటివాళ్ళు కష్టానికి లోనైనప్పుడు వాళ్ళ పట్ల మనకు

తెలీకుండానే మనలో కరుణ మేల్కొంటుంది. వాళ్లని ఓదార్చేక్రమంలో జీవితానికి దగ్గరగా జరుగుతాం. ఒకసారి ఈ సత్యం బోధపడ్డాక, ఆ అంతర్దృష్టితో, మన చుట్టూ ఉన్న జీవితాన్ని మనం పరికించినప్పుడు, మనకి తత్తరపాటు కలగదు. మనం మరింత ధీరులుగా జీవితాన్ని సమీపించగలుగుతాం. మరింత మానవీయంగా మనతోటి మనుషుల సుఖ-దుఃఖాల్లో పాలుపంచుకోగలుగుతాం. ఈ పుస్తకంలోని 'బహిర్వీక్ష' భాగంలోని కథల్లో మనకు కనిపించేది ఇదే.

అంతర్వీక్ష అంటే చూపు లోపలకి తిప్పుకోవడం, బహిర్వీక్ష అంటే బయటి ప్రపంచాన్ని చూడటం అనేది మామూలు అర్థం. ఈ పుస్తకంలో ఆ అర్థాల్ని దాటిన పరమార్థం మనకు స్ఫురించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే, అన్నపూర్ణగారు ప్రాచీనసాహిత్యం గురించి మాట్లాడుతున్నప్పుడు ఆ చూపులో తాను జీవిస్తున్న కాలానికీ, దేశానికీ సంగతమైన కొత్త మెలకువలు కూడా మనకి కనిపిస్తాయి. అలాగే తన చుట్టూ ఉన్న జీవితాన్ని కథలుగా చెప్తున్నప్పుడు అందులో పూర్వమహాకవులు తనలో జాగృతం చేసిన మెలకువలు కూడా అంతర్వాహినిగా ప్రవహిస్తూనే ఉంటాయి.

ఉదాహరణకి దేవయాని, శర్మిష్ఠల కథనే చూడండి. సుప్రసిద్ధమైన కథ. ఆ కథని ఒక పురాణకథగా చదవవచ్చు లేదా మహాభారతానికి ప్రాతిపదికగా చెప్పదగ్గ కథల్లో ఒకటని కూడా చెప్పుకోవచ్చు. కాని దేవయాని పైన తన వ్యాసం మొదలుపెడుతూ, అన్నపూర్ణగారు 'పురాణేతిహాసాల్లోని స్త్రీలను పరిశీలిస్తే-మనకు అత్యున్నతమైన వ్యక్తిత్వం కలవాళ్ళు అనేకమంది గోచరిస్తారు ' అని మొదలుపెడుతూ ఆ తర్వాత ఏమంటున్నారో చూడండి:

> చాలాకాలం నుండి స్త్రీలను పరిశీలించడంలో రెండు ధోరణులు కనపడు-తున్నాయి. మొదటిది స్త్రీలలోని పాతివ్రత్యరూపమైన గుణాన్ని కీర్తించి వారిని ఉన్నతుల్ని చేయడం-రెండోది నేటి ఆధునికపద్ధతిలో వారి పాతివ్రత్య-మాత్రాన్ని గ్రహించి వారిని వ్యక్తిత్వము, జ్ఞానము లేని తోలుబొమ్మలుగా ఎంచి, ఈ ఆధునిక సమాజంలో వారి చరిత్ర పనికిరానిదిగా తొలగించడం. ఈ రెండు ధోరణులలోని పరిశీలన వలన స్త్రీలకు పూర్తి న్యాయము చేకూరినట్లు తోచదు.

ఆమె వీక్షణలో అంతర్బహిర్ ప్రపంచాలు ఎలా సమన్వయం కాగలిగాయో చెప్పడానికి ఈ వాక్యం ఒక చక్కని ఉదాహరణ. ఇటువంటి చూపు అలవడటమే కష్టం. ఒకసారి

అలవడ్డాక, ఆ పరిశీలన ఎలా ఉంటుందో, ఇదుగో, దేవయాని వ్యాసాన్ని ముగిస్తూ రాసిన ఈ మాటలు చూడండి:

> దేవయాని అని పేరుపెట్టినందుకు ఈమె జీవితం మొత్తం దేవతల చేత నడపబడింది. ప్రధానమైన రెండు సందర్భాల్లోను ప్రయత్నపూర్వకంగా దేవతలు ఈమెను ప్రేరేపించారు. కచుడు ఈమెను ప్రసన్నురాలను చేసుకోవడంలో వారి పాత్ర ఎంత ఉన్నదో మనకు తెలుసు. అతనికి 'దమేన' అన్నమాట చెప్పి ఇంద్రియనిగ్రహశక్తి కలిగి ఉండమని హెచ్చరించారు. ఆవిణ్ణి ప్రసన్నురాలిని చేసుకొమ్మన్నారు తప్ప ఆమె మోహంలో అతడిని పడవద్దని చెప్పి ఆమె జీవనయానంలోని ప్రథమవైఫల్యానికి కారణమయ్యారు. ఇక రెండో సందర్భంలో కూడా...ఇలా ఆ జగన్నాటక సూత్రధారుని చేతిలోని సూత్రానుసారం నడిచే జీవితాలే అయినా, మనం పరిశీలించి చూసుకుంటే, మనం అలవర్చుకోవలసిన కొన్ని ప్రత్యేకతలు–మనం విడిచిపెట్టవలసిన బలహీనతలూ గోచరమవుతూ ఉంటాయి. అందుకే ఈ పరిశీలన.

ఒక పురాణకథని పరిశీలించడంలో ఈ మెలకువ సగభాగమే. శర్మిష్ఠ గురించి రాసిన వ్యాసంలో ఆ మెలకువలోని రెండవ అర్థభాగం కూడా జతకూడి ఆమె దృష్టి మరింత సమగ్రమై, సమీచీనమై పరిపూర్ణత పొందింది. దేవయాని, శర్మిష్ఠల మధ్య కలహం గురించి చెప్తూ ఏమంటున్నారో, చూడండి :

> ఇక్కడ ఈ ఇద్దరు స్త్రీలు తమ తండ్రుల అర్హతలను తమవిగా ఎంచి అహంకరించడం మనం గమనిస్తే–స్త్రీలకు తమకు సంబంధించిన అర్హతల పట్ల చైతన్యం లేకపోవడమే వివాదానికి కారణమనిపిస్తుంది.

అసలు శర్మిష్ట పైనవ్యాసం మొదలుపెడుతూనే 'సదసద్గుణముల సమతూకముతో ఈమె జీవితం నడిచినట్లు కనిపిస్తుంది' అని అంటారు.

ఇలా ఇద్దరు స్త్రీల మధ్య నడిచిన కలహం వల్ల వాళ్ల జీవితంలో ప్రవేశించి, చివరికి వాళ్ళ మధ్య స్పర్థని మరింత రగిలించి, తన సంతానాన్ని కూడా శాపగ్రస్తుల్ని చేసిన యయాతి గురించి వివరిస్తున్నప్పుడు అన్నపూర్ణగారి కావ్యానుశీలన నన్ను ఆశ్చర్యపరవశుణ్ణి చేసింది. విశ్వనాథవారి 'అమృత శర్మిష్ఠం' నాటకం పైన ఆమె పరిశీలనని నేను చదివిన అత్యున్నత సాహిత్యపరిశీలనల కోవలో చేర్చుకోగలను. ఎందుకంటే,

స్త్రీపురుషుల మధ్య సాధారణంగా సంభవించే అనుభవాల్ని మళ్ళీ మళ్ళీ వర్ణించిచెప్పడంలో భారతీయ కవికి ఆసక్తి లేదు. వర్ణన మామూలు కవి చేసే పని. కాని ఋషిగా మారిన కవి దృష్టి ఆ అనుభవాల్ని మథించి అందులోంచి ఒక అమృతసత్యాన్ని మన చేతుల్లో పెట్టడం మీద ఉంటుంది. చూడండి, విశ్వనాథ నాటకం గురించి రాస్తూ అన్నపూర్ణగారు ఇలా అంటున్నారు:

> కాని కొన్ని సందర్భాల్లో స్త్రీపురుషులు రసప్లావిత హృదయులై తపోదీక్ష వంటి సమాధిమచ్చిత్తంతో రసానందానుభూతిని అనుభవించేవారిని ఈ నాటకం ద్వారా కవి చెప్పారని తెలుస్తుంది. ఈ విషయాన్ని చెప్పడంలో మానవునికి సంబంధించి ఒక కొత్త వ్యాఖ్య కవి చేస్తారు. శరీరనిష్టుడైన జీవుడూ, తాను అనుకునే ఉపా ధీ అని రెండు అంశాలు ఉన్నట్టు మనకు శాస్త్రాలు చెప్తున్నాయి. కానీ ఈ రెండింటికంటే భిన్నంగా భావుకుడనే మరొక అంశ కూడా మానవునిలో ఉంటుందని, అది మేల్కొనడానికి తగిన సామగ్రి లభించినప్పుడే ఆ ఎరుక మానవునికి కలుగుతుందని శర్మిష్ఠా యయాతుల శృంగారానుభవం ద్వారా కవి ప్రతిపాదించారు.

యయాతిలోని దేహం, దేహం కన్నా భిన్నమైన నామరూప అంశలతో పాటు 'యయాతి అనే జీవుణ్ణి అతిక్రమించిన మరొక అంశ తనలో ఉందని యయాతి గుర్తు పట్టాడనీ', అదే 'భావుకాంశ' అని చెప్తూ 'భావుకుడైన వ్యక్తి ఏ నియమాల్నైనా ఉల్లంఘించి ఆ రసానందాన్ని పొందడానికి సిద్ధపడతాడనీ, దానివల్ల వచ్చే కష్టనష్టాల్ని అనుభవిస్తాడనీ' అంటున్నారామె. అదంతా విశ్వనాథ తన నాటకంలో ఏ విధంగా చిత్రించారో చెప్తూ, యయాతి చివరికి 'ఒక ప్రేమగల తండ్రిగా, దయగల మనిషిగా రూపుదాల్చాడనీ' చెప్తూ ఇలా అంటున్నారు:

> దీనికి కారణం అతనిలో శర్మిష్టతోడి ప్రేమానుభవం వల్ల అతిసుకుమార హృదయాన్నిచ్చే భావుకుడు మేల్కొని స్త్రీసమాగమాన్ని ఒక రససమాధి తపస్సుగా భావించడమే కారణంగా అనుకోవాలి. మనిషి విషయలోలుడై–పోవడానికి కారణమైన స్త్రీసమాగమమే విశ్వనాథ మలిచిన ఆధ్యాత్మికానుభవ వాంఛకు కారణమయ్యింది యయాతిలో కనుక 'వాగర్థమనో హృత్సృక్ వివర్ధతామ్ రసమయం మహః' అన్న ఈ వాక్యమే ఈ నాటకానికి భరత వాక్యం!!'

ఈ వ్యాసంలో చాలా విశేషాలున్నాయి. కాని అన్నిటికన్నా ముఖ్యంగా గమనించ-వలసింది ఒకటుంది. అదేమంటే యయాతి, దేవయాని, శర్మిష్ఠల కథ మహాభారతకథ. ఎన్నో యుగాలనాటి కథ. దాన్ని ఒక ఋషీశ్వరుడు తన ఇతిహాసంలో మొదటిసారి చెప్పాడు. ఇరవయ్యవశతాబ్దంలో విశ్వనాథ అనే ఒక మహాకవి తిరిగి దాన్ని ఒక సంస్కృత-నాటకంగా మలిచాడు. అలా మలిచినప్పుడు ఆ పూర్వకథకి ఇన్నేళ్ళ మానవానుభవం సాధించిన కొత్త మెలకువను జోడించి మరీ చెప్పాడు. అంటే ఆ పూర్వకథకి లభించిన ద్వితీయకథనానికి ఆధునిక యుగం మనిషిలో తెచ్చిన కొత్తమెలకువ కూడా తోడయ్యింది.

ఇప్పుడు ఈ భావుకురాలు ఆ నాటకాన్ని పరిశీలిస్తున్న క్రమంలో తిరిగి ఆ ప్రథమ కథనాన్నీ, ద్వితీయకథనాన్నీ తన మెలకువతో మరొకసారి చెప్పడంతో ఈ వ్యాసం తృతీయకథనంగా మారింది. ఈ తృతీయకథనంలో ఆధునికయుగపు మెలకువతో పాటు ఆధునికమహిళ తాలూకు చైతన్యం కూడా తోడయ్యింది. కేవలం ప్రాచీనసాహిత్యం చదువు-కున్నవాళ్ళు ఇలా చెప్పలేరు. తాను స్వయంగా ఒక రసహృదయి కానిదే ఒక భావుకురాలు ఆ కథని ఇలా మళ్ళా మనముందు వ్యాఖ్యానించలేరు. ఆధునికమహిళ చరిత్రని తిరగరాస్తుందని గురజాడ అన్న మాటల్లో నిజముందిగాని, ఆ మాటలు సగమే సత్యం. ఆ ఆధునిక మహిళ రసహృదయి అయితేనే ఆ చరిత్ర చరితార్థమవుతుందని మనకి అన్నపూర్ణగారిని చదివితే తెలుస్తున్నది.

3

అలా చరితప్రధానమైన చరిత్ర ఎలా ఉంటుందో బహిర్వృక్షలో కథలు మనకి ఉదాహరణలుగా నిలబడుతున్నాయి. ఆ కథలు మీరెలానూ చదవబోతున్నారు, కాని అవి చదివేటప్పుడు, మరొకసారి ఆగి చదవవలసిన వాక్యాలు చాలా ఉన్నాయి. ఇదుగో, ఇలాంటివి:

> వేరు వేరు శరీరాలతో ఇద్దరిగా ఉన్న వ్యక్తుల జీవితంలో ఎవరి సమయం వారిదే. ఎవరి జీవితం వారిదే! ఇది తెలుసుకోలేకపోవడం వల్ల ఒకరి జీవితమే మిగులుతుంది. రెండోవారికి జీవితమే లేకుండా పోతుంది.

> స్త్రీ తన ఉనికిని నిలుపుకోవడమన్నది ఎంత కష్టసాధ్యమో ప్రేమించే హృదయమున్నవాళ్ళకు మాత్రమే తెలుస్తుంది. ప్రేమించడమంటే వ్యక్తిత్వాన్ని వదులుకోవడమనే అనుకుంటుంది స్త్రీ ఎప్పుడూ. అతనితోడి ఐక్యం కోసం

ఛాయగా మారిపోవాలి అని అనుకుంటోంది. దానితోనే ఆమె కాంతివిహీన అయిపోతోంది.

'మొగపిల్లలకి అన్ని బలాలకంటె అధికమైన సంఘబలం వాళ్లవెంట వుంటుంది మన సమాజంలో. ఆడపిల్లలకి దాన్ని ఎదుర్కొందుకు మనం విద్యాబలాన్ని, ఆర్థికబలాన్ని ఇవ్వాలి. వీటిద్వారా వాళ్ళ ఆత్మబలాన్ని పెంచాలి.

ఈ విషయంలో నా హృదయం సంతృప్తమయి ఉంది. శరీరం హృదయాధీనం కాదంటావా? అనుభవానికి అంతేముంది? అనుభవానికైన ఈ తహతహ ఎక్కడో ఒకచోట ఆగాలనిపిస్తుంది నాకు. ఇంకా దాహం పెరిగే కొద్దీ– ఎడారులు పెరుగుతాయి.

ఈ కథల్లో ఒక చోట, కథకురాలు, తాను ఎక్కడకు వెళ్ళినా రెండు పుస్తకాలు తన కూడా తీసుకువెళ్తొంటుందని రాస్తారు. భవభూతి 'ఉత్తరరామచరిత్ర', టాల్‌స్టాయి 'ఫామిలీ హాపీనెస్' ఒకటి ప్రాచీన కావ్యం, మరొకటి అధునిక కావ్యం. ఒకటి ప్రాచ్యకుసుమం, మరొకటి పాశ్చాత్యరత్నం. ఈ పుస్తకంలో కూడా అలానే రెండు భాగాలు. మొదటి భాగంలో వ్యాసాలు సాహిత్యానికీ, జీవితానికీ కూడా లక్షణ పరిశీలనలు అనుకుంటే, రెండో భాగంలో కథలు ఆ లక్షణ వివేచనకి లక్ష్యరచనలుగా నిలబడుతున్నాయని చెప్పవచ్చు. కాబట్టి ఈ పుస్తకం ఆత్మబల సముపార్జనకి తోడ్పడే లక్ష్యలక్షణగ్రంథం.

ఆత్మబలాన్ని మన పూర్వులు సత్త్వబలం అని కూడా అన్నారని గుర్తుతెచ్చుకుంటే, ఈ పుస్తకాన్ని ఒక సాత్త్వికీకరణ వాచకంగా అభివర్ణించడానికి నాకెటువంటి సంకోచం లేదు.

2-7-2024

వసంతాన్ని నిజంగా చూసిన కవి

గూండ్ల వెంకటనారాయణ కథకుడని తెలుసుగానీ ఈ కవితలతో నన్ను ఆశ్చర్యపరిచే కవిగా ప్రత్యక్షమయ్యాడు. మన కాలపు యువకుడి నుంచి ఇటువంటి వసంతకాలపు కవితలు రాగలవని నేనూహించలేదు. ఎందుకంటే ఈ కవితల్లో కవి, ఎంతో ప్రాచీనులైన తెలుగుకవులకీ, మరీ ముఖ్యంగా ప్రాచీనా చీనా, జపానుకవులకి చాలా దగ్గరగా కనిపిస్తున్నాడు.

ముందు ఆ అంకితవాక్యం చూడండి: తన కవితల్ని 'చెట్ల పూతల అడవికి, అడవి పూతల కొండలకి, కొండపూతల వంకవాగులకి, వాగుపూతల గరికపచ్చనేలకు, నేలపూతల ఊర్లకి' అంకితమిస్తున్నాడు. ఈ ముక్తపదగ్రస్త వాక్యం చూడగానే ఎప్పుడో దాదాపు వెయ్యేళ్ళ కింద నన్నెచోడుడు రాసిన ఈ పద్యం గుర్తురాకుండా ఎలా ఉంటుంది!

పొన్నలు పూచెఁ, బొన్నలొగి పూవకముందరఁబూచె గోఁగు,లా
పొన్నలుఁ గొండగోఁగులును బూవకముందరఁ బూచెబూరువుల్
పొన్నలు గొండగోఁగులును బూరువులున్నొగిఁ బూవకుండఁగా
మున్న వనంబునంగలయ మోఁదుగులొప్పుగఁబూచె నామనిన్

(పొన్నలు పూసాయి. పొన్నలు పూయకముందు కొండగోగులు పూసాయి. పొన్నలూ, కొండగోగులూ పూయకముందు బూరుగలు పూసాయి. పొన్నలూ, కొండగోగులూ, బూరుగలూ చక్కగా పూయకముందే వసంతకాలంలో అడవినిండా మోదుగలు పూసాయి.)

నన్నెచోడుడనే ఇటువంటి ఒక పద్యం రాసాడని వెంకటనారాయణకి తెలియకపోయి ఉండవచ్చు. కాని వసంతం ఒక చోటనుంచి మరొకచోటకి ఎల్లా అల్లుకుంటూపోగలదో, అది చెట్లతో మొదలై ఊళ్ళదాకా ఎలా వ్యాపించగలదో అతడు చూడడంలో ఇప్పటి తన

కాలపు యువతీయువకుల కన్నా పూర్వమహాకవులకి ఎంత దగ్గరగా ఉన్నాడో చూసి నాకు ఆశ్చర్యమనిపించింది.

'పక్షులు దూరడానికి సందులేకుండా పూసిన పూలు', 'ఇంటిముందు దడిమీద కొంగలు వాలినట్టు పూతపట్టిన చెట్లు', 'పొలం గెనం తొర్రలోంచి బయటికొచ్చి వానగాలి పీలుస్తూ ఉండే పాములు', 'చెరువునీళ్ళల్లో చిటుకూ చిటుకూ దూకుతున్న చినుకుల మోత', 'పండిన జామకాయను కొరుకుతున్న చిలుకలు', 'మబ్బుల చీకటిలో కాస్తున్న పువ్వుల వెలుగు', 'చెట్టు మొదలంతా రాలిన తేనె', 'పూల మీద తుమ్మెదలా మెరుస్తున్న సూర్యుడు', 'సింగారంగా వాలుతున్న ఎండ', 'తీపి తాగి పడమట్లో తూలుతున్న కొంగలు', 'చెట్టంతా పురివిప్పిన నెమలికన్నుల గాలి'– ఈ కవితలన్నిటిలోనూ ఏవో ప్రాచీనకాలపు అడవులు, గ్రామాలు, పశుపక్ష్యాదులన్నిటితోనూ కూడిన సమస్త సృష్టి సరికొత్తగా కనిపిస్తూ ఉన్నాయి.

వసంతం అనగానే సాధారణంగా మన కవిత్వం మామిడిచిగుళ్ళనీ, కోకిలనీ దాటి చూడలేదు. కాని వసంతకాలపు ఆకాశాలూ, అడవులూ, కొండలూ, చెట్లూ, పూలూ ఎంత కోలాహలాన్ని, ఎన్ని వెలుగుల్ని, ఎన్ని నీడల్ని చూపించగలవో వాటన్నిటినీ కవి చూసాడు. మనకి చూపిస్తున్నాడు. పట్టుమని ముప్ఫై పేజీలు కూడా లేని ఈ చిన్ని పుస్తకంలో ఇతడు చూపించిన విశాల వాసంతసౌందర్యం నన్నింకా ఆశ్చర్యపరుస్తూనే ఉంది.

ఈ కవితల్లో కనిపించే ప్రపంచంలో ఎంత కదలిక ఉందో అంత తీరిక ఉంది. ఎంత సంతోషం ఉందో అంత బెంగ ఉంది. ఎంత ఉన్మత్తత ఉందో అంతగా తనకి తాను సర్దిచెప్పుకోవడమూ ఉంది.

పుస్తకం తెరిచినప్పటినుంచి మూసేదాకా మన చుట్టూ రాలుతున్న పూలవాన. మామూలు కవులు వసంతకాలమనగానే పూసిన పూలని మాత్రమే చూస్తారు. కాని ప్రాచీన జపాను కవితాసంకలనాలు మన్యోషూ, కొకింషుల్లో చూడండి–ఎడతెరిపిలేకుండా రాలే పూలవాన కనిపిస్తుంది. ప్రాచీన చీనాలో తాంగ్ యుగపు మహాకవి దు–ఫు కవిత్వం చూడండి: రాలుతున్న పూల ఎదట అతడు నిశ్చేష్టుడిగా నిలబడిపోడం కనిపిస్తుంది. పూలు పూసాయనీ, తుమ్మెదలు వాలాయనీ, తేనెలు తాగాయనీ చెప్పడం కేవలం వార్త మాత్రమే. కాని వసంతాన్ని నిజంగా చూసిన కవి మాత్రమే ఇదుగో ఇలాంటి వాక్యాలు రాయగలుగుతాడు:

పక్షులు దూరడానికి సందులేకుండా
పూసిన పూలను చూసి కోప్పడతాను.

రాలినపూలన్నీ మట్టిలో
మునిగిపోవడం చూసి దుఃఖపడతాను
ఏ కోకిలైన తన గానంతో
కనుమరుగైన పూలను మళ్ళీ నేలనుంచి
చెట్టుకు చేరుస్తుందా అని ఆశపడతాను. ..

పూలమీద మరికొంత వెలుగు చేరుకుంటున్నది. ..

రాలిపోయిన పువ్వులలోంచి
కొత్త తేనెటీగలు ఎగురుతున్నాయి. ..

వసంతం అనగానే ఒక తేనె మన చుట్టూ వ్యాపించడం మనకి అనుభవంలోకి వచ్చిన విషయమే. కాని ఆ తేనెచుట్టూ కవి ఎన్ని మానసిక అవస్థల్ని ఈ కవితల్లో మూటగట్టాడో చూడండి:

నీకోసం రావి ఆకులతో తీపిని పట్టి ఉంచాను
నేలంతా చీమలతో తుమ్మెదలతో నిండిపోయింది. ..

చెట్టుమొదలంతా తీపి కవురు వాసన
నా దోసిళ్ళలో ఆకుల చలువలో ఇంకా తేనె మిగిలే ఉంది. ..

తేనెరంగు సూర్యుడు పూలమీద తుమ్మెదలా మెరుస్తున్నాడు. ..

దోసిళ్ళలో పూలు తేనై వేళ్ళ చివర జారిపోయాయి. ..

తేనెటీగలు మబ్బుల్లా
నింగినంతా ముసురుకుని
చిందాడుతున్నాయి. ..

నువ్వు తిరిగిన నేలంతా పూలతో తేనెతో నిండిపోయింది.
రాలిపోయిన పువ్వులలోంచి
కొత్త తేనెటీగలు ఎగురుతున్నాయి

నేను ఆ గుంపులో కలిసిపోయాను. ..

ఈ రోజు ఒక్క తేనెబిందువు అయినా నీకు అందించాలని
రాగాలను ఇచ్చి తేనెటీగలను వేడుకున్నాను. ..

పొద్దు అంచున ఆఖరి తేనెబొట్టు జారిపోతోంది. ..

మొత్తం పదమూడు కవితలు. కాని ప్రపంచం పట్టనంత వైశాల్యం ఉంది ఈ వాక్యాల్లో. జ్యేష్టమాసం ముగిసిపోతూ ఆషాఢం గుమ్మం దగ్గర నుంచున్న ఈ తెల్లవారు జామున ఈ కవితల్ని చదువుతుంటే వసంతఋతువు ఎక్కడికీపోలేదనీ, నా చుట్టూ తేనెటీగలు ఝుమ్మంటూనే ఉన్నాయనీ అనిపిస్తోంది. ఈ కవి వసంతాన్ని పట్టుకుని ఆపేసాడు. మీరు చదివినప్పుడు మీకూ అలానే అనిపిస్తుంది.

25-6-2025

మహాప్రస్థానం @ 75

మహాప్రస్థాన గీతాలు పుస్తక రూపంగా వచ్చి డెబ్బై అయిదేళ్ళు గడిచేయి. 1940 లో ఆ గీతాల్ని 'అనుభవించి పలవరిస్తో' 'చెలంగారు 'పదేళ్ళు ఆగండి, ఈ లోపల ఆస్తి సంపాయించడం, పిల్లల్ని కనడం, ధరలు హెచ్చడంకాక, జీవితంలో ఇంకా ఏవన్నా మిమ్మల్ని అమితంగా ఇన్‌ఫ్లుయన్స్ చేసినవి జరిగి వుంటే మళ్ళీ కొత్తకాపీ కొని శ్రీశ్రీ పద్యాల్ని చదవండి' అన్నాడు. ఆయన ఆ మాటలు రాసి ఎనభై అయిదేళ్ళు గడిచాయి. ఇప్పుడు ఆ గీతాల్ని మళ్ళీ చదువుతోంటే అవి ఇంకా కొత్తగా కొత్త అర్థాల్నీ, కొత్త సంవేదనల్నీ రేకెత్తిస్తున్నాయి.

మహాప్రస్థాన గీతాల్లో ప్రయోగం వుంది, సాఫల్యం వుంది. దీన్ని 'కవిత్వంలో నా ప్రయోగాలు'లో శ్రీశ్రీ ఇలా వివరించేడు.

> ఒక గ్రాఫ్‌కి ఎక్స్-యాక్సిస్, వై-యాక్సిస్ అని రెండు గీతలుంటాయి. ఒక గీతపొడుగు, ఇంకొకటి వెడల్పు. పొడుగు గీత కవి యొక్క దైనందిన జీవితానుభవాలు, వ్యాపకాలు, ఆలోచనలు, ఇతర కవులతో పరిచయాలు, కవితారచనలను చదవడాలు, అధ్యయనం చెయ్యడాలు. ఇవన్నీ ఆ గీత పొడుగునా సాగిపోతాయి. రెండోది అతని సాంకేతిక ప్రయోగాల సాధన. ఇదికూడా అనుదినం సాగిపోవలసిందే. అప్పుడే ఆ కవి నిజంగా తానేది చెప్పదలచుకున్నాడో అది చెప్పవలసిన సమయం వచ్చినపుడు, దాన్ని చెప్పవలసిన సంవిధాన సంపత్తి కూడా సంసిద్ధంగా ఉంటుంది. అదే ఒక మహాకావ్యం ఆవిర్భవించే సుముహూర్తం. రెండు గీతలూ ఒక ఉన్నత శిఖరం వద్ద కలుసుకుంటాయి. దాని ఫలితమే ఒక మాస్టర్‌పీస్.

1934 నుండి 40దాకా శ్రీశ్రీ ఇటువంటి పరిణామం గ్రాఫ్‌లో వై-యాక్సిస్ పైన సమాంతరంగా రెండుదారుల్లో సాగింది. ఒకటి, వ్యక్తిగా కవి తన అస్పష్ట వైయక్తిక వేదనలో గడిపిన బాధానుభవం. 'నాకు నిశ్వాస తాళవృంతాలు గలవు' అన్న భావకవికి కొనసాగింపు ఇది. 'ఒక రాత్రి' 'ఆకాశదీపం' 'అవతలిగట్టు' 'సాహసి' 'పరాజితులు' 'ఆః' 'చేదుపాట' 'దేనికొరకు' 'కేక' 'నీడలు' ఆ ధోరణి కవితలు. ఈ కవితలవెనుక హంగ్రీ థర్టీసు, బోదిలేరు, ఫ్రెంచి సింబలిస్టులు, ఎడ్గార్‌పో, ఎమిలీ వెర్‌హీరను వున్నారు. ఈ కవితలే లేకపోయుంటే మహాప్రస్థానం ఒక ప్రబోధ గీతాల సంకలనంగానే వుండిపోయేది. ఈ కవితల్లో లోకంపట్ల భయం, లోక యధార్థం నుంచి ఒకడుగు వెనక్కి వెయ్యడం, అస్పష్టవ్యాకులత ఉన్నాయి. వీటిని భీతావహ గీతాలు అనవచ్చు.

మరొక దారిలో వీటినుంచి తేరుకుని కవి ప్రపంచంవైపు ఒకడుగు ముందుకేసి జీవితయధార్థాన్ని ఎదుర్కొన్న కవితలున్నాయి . 'బాటసారి', 'శైశవగీతి', 'భిక్షువర్షీయసి' 'ఉన్మాది', 'సంధ్యాసమస్యలు', 'వాడు' అటువంటివి. ఒక బిచ్చగత్తె, పిచ్చివాడు, దారితప్పిన మనిషి-వీరి దగ్గర జీవితం వైఫల్యం చెందిన మాట నిజమే అయినప్పటికీ కవి తన కారుణ్యప్రకటన వల్ల జీవితాన్ని అక్కడ ఆశావహంగా నిలబెడుతున్నాడు. ఇదే లేకపోయుంటే మహాప్రస్థానంలో జీవస్పర్శ, మానవదేహాల వెచ్చదనం ఉండేవి కావు. వీటి వెనుక గురజాడ అప్పారావు, కవికొండల, బసవరాజు, చింతా దీక్షితులు ఉన్నారు.

ఈ రెండు ధోరణులూ కవి సాంకేతిక ప్రయోగాలతో మేళవించబడి ఉన్నత శిఖరాలకు చేరుకున్నప్పుడు 'మహాప్రస్థానం', 'అవతారం', 'ప్రతిజ్ఞ', 'కవితా ఓ కవితా', 'నవకవిత', 'దేశచరిత్రలు', 'జ్వాలాతోరణం', 'మానవుడా', 'గర్జించు రష్యా', 'జగన్నాథుని రథచక్రాలు' వంటి కవితలు ప్రభవించాయి.

ఈ ప్రస్థానమంతటికీ మకుటాయమానంగా 'నిజంగానే' కవితను చూడాలి. ఇందులో కవి ప్రకటిస్తున్నది సంశయం కాదు, తన స్వప్నం ఫలిస్తుందని నిశ్చయంగా బోధపడ్డప్పుడు కలిగే నమ్మలేని ఆశ్చర్యమే. ఇందులో కవి ప్రశ్నార్థకపు గుర్తుల్నే పెట్టినా నిజానికి వాటిని మనం ఆశ్చర్యార్థకపు గుర్తులుగానే భావించాలి.

ఛందస్సు పరంగా శ్రీ శ్రీ ప్రభవ సంపుటి తర్వాత పద్యాలనుంచి గేయాలవైపు పయనించడానికి గురజాడ అప్పారావు కారణమని చెప్పుకున్నాడు. ప్రతి భాషకీ తనదైన ఒక మౌలిక ఛందస్సు ఉంటుంది. తెలుగు పదజాలం ప్రధానంగా 3, 4, 5 మాత్రలకు మించనిది కాబట్టి, దేశిఛందస్సులో తెలుగువాడి గుండెచప్పుడు బాగా వినబడుతుంది.

అయితే ద్విపద, తేటగీతిలాంటి దేశిఛందస్సుల్లో లేని ఒక గతిశక్తి రగడల్లో కనిపిస్తుంది. కాబట్టే యక్షగాన కర్తలు దరువుల్నీ, రగడల్నీ వాడుకున్నారు. రెండు పంక్తుల్లో ప్రతి ఒక్క పంక్తిలోనూ 3+4, 3+4, 3+4, 3+4 మాత్రల అమరికతో, ఆద్యంతప్రాసలు పాటించే వృషభగతి రగడలో రెండవ పంక్తిలో ద్వితీయార్ధభాగాన్ని విరవడం ద్వారా గురజాడ రగడని ముత్యాలసరంగా మార్చాడు. (గురజాడ సమకాలీకులైన ఆధునిక ఫ్రెంచి కవులు, ఇంగ్లీషు కవులు, రష్యను కవులు అప్పట్లో వారి వారి ఛందస్సుల్లో చేస్తున్నది ఇలాంటి ప్రయోగాలే.)

ఉదాహరణకి వసుచరిత్రలో సుప్రసిద్ధమైన రగడ

> బా<u>**ల**</u> బాలరసాలమిది పిక పాలిపాలిట యమరసాల<u>**ము**</u>
> (3+4, 3+4, 3+4, 3+4)
> గే<u>**లి**</u>గేలిడి గ్రుచ్చ గడురాగిల్లు గిల్లుము తత్ప్రవాళ<u>**ము**</u>
> (3+4, 3+4, 3+4, 3+4)

గురజాడ చేతుల్లో ఇలా మారింది.

> మతములన్నియు మాసిపోవును
> (3+4, 3+4)
> జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
> (3+4, 3+4)
> అంతస్వర్గ సుఖంబులన్నవి
> (3+4, 3+4)
> యవని విలసిల్లున్
> (3+6)

పారశీక గజలు బహర్–ఎ–రమాల్ ముసమ్మన్ మహ్జూఫ్ లో కూడా ఇటువంటి చలనశీలత ఉందని గురజాడ గమనించి ఉండవచ్చు. అలాగే 'గుమ్మడేడే గోపిదేవీ, గుమ్మడేడే ముద్దుగుమ్మా, గుమ్మడేడే కన్నతల్లీ, గుమ్మడేడమ్మా' అన్న స్త్రీల పాటలో కూడా ఒక దారి కనిపించి ఉండవచ్చు. కాని గజల్ బహరులో గాని, స్త్రీలపాటలోగాని నాలుగవ పంక్తిలో విరుపు ఉన్నప్పటికీ, దాని నిడివి మార్చడానికి వీల్లేనిది. కాని గురజాడ నాలుగవ పాదంలో అన్నిసార్లూ ఒకే నిడివిని పాటించలేదు. కొన్నిసార్లు 'కన్యక' లోలాగా అది తోకముత్యాలసరంగా కూడా (ఉదా: కన్నె పరతెంచెన్ రాజవీథిని) పరిణమించింది.

తద్వారా సాంప్రదాయిక తెలుగు దేశిఛందస్సుల్లోలేని ఒక అపూర్వమైన గతిశీలతని గురజాడ సాధించాడు. ఒకసారి ఆ మెలకువని అర్థం చేసుకున్నాక శ్రీశ్రీ ముత్యాలసరంతో మరిన్ని ప్రయోగాలు చేసి మరింత గతిశీలతను సాధించాడు. రగడ, ముత్యాల సరం పోకడలో 3+4, 3+4 మాత్రల్తో త్రిశ్రగతిలో'కూటికోసం, కూలి కోసం', 'నేను సైతం ప్రపంచాగ్నికి', 'యముని మహిషపు లోహఘంటలు', 'అలకలన్నీ అట్టగట్టిన' , 'విషంకక్కే భుజంగాలో', 'కుక్కపిల్లా, అగ్గిపుల్లా', 'నిజంగానే నిఖిలలోకం', – లాంటి గేయాలు, కొన్నిసార్లు 3+3 గతిలో 'దారి పక్క చెట్టు కింద', 'వేళకాని వేళలలో', 'ఔను నిజం, ఔను నిజం'– లాంటి గేయాలూ, కొన్నిసార్లు 4+4, 4+4 మాత్రల్లో చతురశ్ర గతిలో, 'మరో ప్రపంచం మరో ప్రపంచం', 'పాపం పుణ్యం ప్రపంచమార్గం', 'పొలాలనన్నీ హలాల దున్నీ', 'నిద్రకు వెలియై, నేనొంటరినై', 'స్వర్గనరకముల ఛాయాదేహళి'–లాంటి గీతాలూ రాశాడు. ఎరికొన్నిసార్లు మాత్రాగతిలో ఊహాతీతమైన ప్రయోగాలు, 3+5 ('పట్టణాలలో, పల్లెటూళ్ళలో'), 5+5 ('స్వర్గాలు కరిగించి, స్వప్నాలు పగిలించి'), 5+4+5 ('ఏ దేశ చరిత్ర చూచినా') 5+5+5 ('భూతాన్ని, యజ్ఞోప వీతాన్ని'), 6+4+4 ('అంతేలే పేదల గుండెలు') 6+8 ('సిందూరం రక్తచందనం', 'ఆనందం అర్ణవమైతే') లాంటి విలక్షణ ఖండగతి గేయాలు రాసాడు. కొన్నిసార్లు ఒకే గేయంలో రెండుమూడు నడకల్ని కలిపాడు. ఉదాహరణకి 'నిద్రకు వెలియై నేనొంటరినై' అన్నంతవరకూ 4+4 లో నడిపి మూడవపంక్తికి వచ్చేటప్పటికి 'నా గదిలోపల చీకటిలో' అని 4+4+6 గా మారుస్తాడు. ఇటువంటి ప్రయోగాలన్నింటిలోనూ ఆయన ఉద్దేశించిన ప్రయోజనం తన గేయానికి ఒక వినూత్నగతిని తీసుకురావడమే. ఇలా గేయపాదాల్ని విరిచో, పొడిగించో దాన్ని mo-notony కి దూరం చెయ్యడంవల్ల ప్రతి ఒక్క గేయమూ కూడా అనూహ్యగతిశీలతను సంతరించుకుంది. ఇందుకు శ్రీశ్రీ గురజాడకు పూర్తిగా ఋణపడి ఉంటాడు. శ్రీశ్రీ సమకాలికులూ, ఆయన తరువాత వచ్చిన గేయరచయితలెవ్వరూ ఇన్ని ప్రయోగాలు చేసినట్టు మనకి కనిపించదు.

అయితే గేయరీతుల్లో ఇటువంటి ప్రయోగాలు చేస్తూనే ఒక ద్రష్టగా తాను చూస్తున్నదాన్ని చూస్తున్నట్టుగా మనకి అందించడంలో ఆయన 'కవితా ఓ కవితా', 'వాడు', 'సంధ్యాసమస్యలు' లాంటి కవితల్లో ఛందస్సుకి అతీతంగా పయనించేడు. తదనంతర తెలుగు కవిత్వం అత్యధికం వచనకవితంగా మారడానికి ఇక్కణ్ణుంచే దారిపడింది.

ఇక దర్శనం దృష్ట్యా చూసినట్లయితే, మన సాహిత్యవిమర్శకులు, భావకవుల్ని ఇంగ్లిషు రొమాంటిసిస్టులతోనూ, అభ్యుదయకవుల్ని యూరోపులోని సోషలిస్టు కవులతోనూ పోలుస్తుంటారు. ఇది సమగ్ర పరిశీలన కాదు. భావకవులు, ముఖ్యంగా కృష్ణశాస్త్రి షెల్లీ,

కీట్సులకన్నా బైరనుకు ఎక్కువ ఋణపడి ఉంటాడు. కాన్ని ఆయన కవిత్వం రాసేనాటికి పాశ్చాత్య కవిత్వంలో ఎడ్గార్ అలన్ పో డార్క్ రొమాంటిసిజం, ఫ్రెంచి, రష్యను కవుల సింబలిజం, ఇంగ్లిషుకవుల్లో మాడర్నిజంగా మారుతున్న డికడెన్సు ప్రచలితంగా ఉన్నాయి. కృష్ణశాస్త్రికి తెలియకుండానే ఆయన మీద ఈ నీడలన్నీ పడుతూ ఉన్నాయి. 'ఏను మరణించుచున్నాను, ఇటు నశించు నాకొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు', 'ఇది నిశాంత తమఃక్రాంత మిది దరిద్రమీ నిశాంతము శూన్యము...' లాంటి పద్యాలు రొమాంటిసిజం వల్ల కాక డార్క్ రొమాంటిసిజం ప్రభావం వల్ల ప్రభవించినవి. శ్రీ శ్రీ 'ప్రభవ' పద్యాలు అక్కణ్ణుంచి మొదలయ్యాయి. వాటి నీడలోనే మహాప్రస్థానంలోని భీతావహగీతాలు ఒక పాయగా కనిపిస్తాయి.

మరొకవైపు ఇటలీలో మొదటి ప్రపంచయుద్ధ కాలంలో మారినెట్టి ప్రవచించిన ఫ్యూచరిజం ప్రభావం మొత్తం యూరోపు మీద, ముఖ్యంగా మయకోవస్కీ మీద పడింది. ఫ్యూచరిజం అంటే ఉన్న వ్యవస్థ మొత్తం ధ్వంసమై కొత్త వ్యవస్థ ప్రభవించాలనడం. ప్రగతివాదం, అంటే ప్రొగ్రెసివిజం, ఉన్నవ్యవస్థ రూపురేఖల్ని విప్లవంద్వారా మార్చాలను-కోవడం. ప్రగతివాదం పూర్తివిధ్వంసాన్ని కోరుకోదు. తిరోగమనశక్తులమీద పురోగమన శక్తుల విజయాన్ని మాత్రమే కోరుకుంటుంది. అలా చూసినప్పుడు 'అభ్యుదయం', 'జగన్నాథుని రథ చక్రాలు', 'జ్వాలాతోరణం' వంటి కవితలు ప్రొగ్రెసివిస్టు కవితలకన్నా ఫ్యూచరిస్టు కవితలుగానే ఎక్కువ కనిపిస్తాయి.

అయితే, ఈ రెండు అతిధోరణుల మధ్యా, అంటే ఒకవైపు ఆత్మహనన పూర్వకమైన వ్యక్తివేదన (డార్క్ రొమాంటిసిజం), మరొకవైపు సమస్తవ్యవస్థాహననశీలమైన విధ్వంసకాంక్ష (ఫ్యూచరిజం) ల మధ్య శ్రీ శ్రీ ఎంతో ప్రయత్నపూర్వకంగా ఒక సమతూకాన్ని సాధించు-కున్నాడు. ఆ సమతౌల్యం, ఆ ఆరోగ్యప్రదమైన ఆకాంక్ష 'మహాప్రస్థానం', 'జయభేరి', 'కవితా, ఓ కవితా',' ప్రతిజ్ఞ', 'దేశచరిత్రలు' వంటి కవితల్లో అనితరపూర్వమైన స్పష్టతను సాధించుకుంది. నాకు తెలిసి శ్రీశ్రీ సమకాలికులైన ప్రపంచమహాకవులెవరిలోనూ ఇటువంటి సమతూకం కనిపించదు.(బహుశా ఈ విషయంలో పందొమ్మిదోశతాబ్ది వాల్ట్ విట్మను మాత్రమే శ్రీశ్రీ కన్నా ఒక అడుగు ముందున్నాడనుకుంటాను.)

ఎడ్గార్ అలన్ పో డార్క్ రొమాంటిసిజం నుంచి, మయకోవస్కీ ఫ్యూచరిజం మీదుగా శ్రీశ్రీ సోషలిస్టు కవిత్వానికి ప్రయాణించినప్పటికీ అందులో భాషలోనూ, శిల్పంలోనూ, సంవిధానంలోనూ ప్రాచీన సంస్కృత, తెలుగు పూర్వమహాకవుల ప్రభావాల్ని కూడా స్వీకరించడంతో అద్వితీయమైన సమన్వయాన్ని సాధించుకోగలిగాడు. ముఖ్యంగా భాషలో.

ఆయన వెయ్యేళ్ళ తెలుగు కవిత్వానికి కొత్త భాషనిచ్చాడు. పదసంయోజనంలో ఆయనది అద్వితీయ మార్గం. బహుశా వేములవాడ భీమన, శ్రీనాథుడు వంటి ఎవరో ఒకరిద్దరు పూర్వతెలుగు కవులు మాత్రమే భాషలో ఇటువంటి 'ఉద్దండలీల' ను చూపించగలిగారు (తిక్కన, వేమన, గురజాడ లాగా తాను కూడా తేటతెలుగు మాటల్లో కవిత రాయాలని అనుకున్నా, అది ఆయన జీవితపు చివరిరోజుల్లో, 'మరోప్రస్థానం' కవితలనాటికి గానీ ఆయనకు సాధ్యం కాలేదు.) మనిషి మనసులోని వ్యక్త, అవ్యక్త ప్రపంచాలను వీలైనన్ని ప్రకంపనలతో పట్టుకోగలగడం మహాప్రస్థాన భాషలో కనిపిస్తుంది. కాబట్టే చెలంగారిలా రాసారు:

> హృదయం ఎల్లా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చేతనవును. పద్యాలు చదువుతోంటే, ఇవి మాటలు కావు, అక్షరాలు కావు– ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు అతని హృదయంలోంచి మన హృదయంలోకి direct గా పంపిన ఉత్సాహాలు, నెత్తురు కాలవ అనిపిస్తుంది.

కాని ఈ క్రమ పరిణామం ఒక సరళరేఖీయ మార్గంలో కాకుండా పునరావృత్తిలో సంభవించడాన్ని కూడా మనం గమనించాలి. 'మా దృష్టిది వర్తుల మార్గం, ఆద్యంత రహితం' అని కవి అననే అన్నాడు. కవి లోకంవైపుగా ఒకడుగు, లోకం నుంచి వెనక్కి మరొక అడుగు వేస్తూ సాగే ఈ బీభత్సరసప్రధాన కవిత్వంలో ప్రతి అడుగు తర్వాత అంతకు పూర్వపు మనఃస్థితి కన్నా ఉన్నత మనఃస్థితికి చేరడం వల్లనే శ్రీశ్రీని మానవవిజయ ప్రవక్త అంటూంటాను.

ఏకకాలంలో బాహ్యాంతః సంగ్రామాలు రెండింటినీ చిత్రించడం మహాకావ్యాల లక్షణం. ఇటువంటి మానవత్వం ఎవరి కంఠంలో సమగ్రచిత్రణకి నోచుకుంటుందో అతడే ఆ యుగానికి ప్రతినిధికవి అవుతాడు. మనిషి బాహ్యజీవిత అసంబద్ధతపైన సాధించిన విజయాన్ని గురజాడ చిత్రించగా, మనిషి తన ఆంతరంగిక సంక్షోభంలో తలపడటాన్ని బైరాగి వివరించేడు. ఒక్క మహాప్రస్థానగీతాల్లోనే, మనిషి తనతో తాను, మరొకవైపు జీవితపు చేదునిజాల్తోను తలపడటం సమానంగా చిత్రణకు వచ్చినందువల్లే దీన్ని 'కవిచేసే అంతర్ బహిర్ యుద్ధారావం' అన్నాడు చెలం. మహాప్రస్థానం తర్వాత మరొక మహాకావ్యం తెలుగులో ఇంతదాకా రాకపోవడానికి ఇదే కారణమనుకుంటాను.

30-6-2025

శివప్రసాదం

శిష్ట్లా వేంకట దుర్గా సుబ్రహ్మణ్య శర్మగారు నాకు ఫేస్‌బుక్కు మాధ్యం ద్వారా పరిచయం. పదేళ్ళపైబడి స్నేహితులుగా ఉన్నాం. నిత్యం అరుణాచలేశ్వరుణ్ణి తలుచుకుంటూ ఆయన పెట్టే పోస్టులు, అరుణాచలం ఫొటోలు రోజూ చూస్తూనే ఉంటాను. శివునిపట్ల భక్తి కుదరడం శివానుగ్రహం. అలా కుదిరిన భక్తి నిలవడం మరింత శివానుగ్రహం.

ఇప్పుడు ఆయన అరవై ముగ్గురు శివభక్తుల చరిత్రను ఇలా 'శ్రీ నాయనార్ల చరిత్ర' గా వెలువరించడం ఆయన భాగ్యం. ఇలా ఈ కథలు తెలుగులో చదవడం నాబోటి పాఠకుల భాగ్యం.

నా పసితనంలో మా ఇంట్లో 'శ్రీమహాభక్త విజయం' ఉండేది. ఆ పుస్తకం ఆ చిన్నప్పుడు ఎన్నిసార్లు చదివేనో చెప్పలేను. అందులో మొదటిసారి నాయనార్ల జీవితకథలు చదివేను. ఆ పుస్తకం రాసింది శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారని ఎప్పుడో నాకు యాభై ఏళ్ళ వయసు గడిచేక తెలిసింది. అంత పసితనంలోనే భగవద్భక్తుల జీవితకథలు చదవడానికి నోచుకోవడం ఒక అదృష్టం కాగా, అది శ్రీపాద వారి రచన కావడం మరొక అదృష్టం.

ఇరవయ్యేళ్ళ కిందట మొదటిసారిగా 'పెరియపురాణం' ఇంగ్లిషు అనువాదం చదివేను. అందులో అప్పరు, సంబంధరు, సుందరమూర్తి నాయనార్ల జీవితాలు నన్ను అపారంగా ఆకట్టుకున్నాయి. శ్రీ మహాభక్తవిజయంలో స్థూలంగా పరిచయమైన ఆ శివభక్తుల జీవిత–విశేషాల్ని పెరియపురాణం ద్వారా మరింత విపులంగా తెలుసుకున్నప్పుడు నాకు కలిగిన దివ్యానుభూతిని మాటల్లో పెట్టలేను. ఆ పుస్తకం చదువుతున్నంతసేపూ, చదివిన చాలాకాలందాకా కూడా, నాకు ఆ భగవద్భక్తులు నడయాడిన ప్రదేశాలకు వెళ్ళాలనీ,

వారు ఏయే శివాలయాల్ని సందర్శించి తేవారగీతాలు పాడేరో, ఆ దివ్యస్థలాల్ని చూడాలనీ బలంగా అనిపించేది. కాని అది ఎప్పటికి సాధ్యపడుతుందో, అసలు సాధ్యమవుతుందో లేదో కూడా నేను ఆలోచించలేదు.

ఆరేళ్ళ కిందట ఎన్నికల పరిశీలకుడిగా తమిళనాడు వెళ్ళే అవకాశం లభించింది. పెరియపురాణంలో పేర్కొన్న ముఖ్యమైన స్థలాల్ని శివానుగ్రహం వల్ల అప్పుడు చూడగలిగేను. తిరునావలూరు, తిరువాదిగై, శీర్కాళి, చిదంబరం, తిరువయ్యారు, కారైక్కలు, తిరువాలం-గాడు మొదలైన శివక్షేత్రాల్ని, నాయనార్ల జీవితాలతో ముడిపడ్డ దివ్యస్థలాల్ని చూడగలిగాను. ఆ అనుభవాల్ని 'పాటలు పుట్టిన తావులు' (2020) పేరిట ఒక పుస్తకంగా వెలువరించాను కూడా.

ఇప్పుడు ఈ నాయనార్ల చరిత్ర చదువుతుంటే నాకు నా జీవితంలో నాలుగవసారి నాయనార్ల అనుగ్రహం లభించినట్టుగా అర్థమవుతున్నది. ఇందులో నాయనార్ల చరిత్రలు క్లుప్తంగా రాసేనని రచయిత చెప్పుకున్నాడుగాని, గంగాజలం పుడిసెడు సేవించినా మొత్తం గంగ మనలో ప్రవహించినట్టే కదా. ఇందరి జీవితాల్ని ఒక్కసారిగా, ఒక్క గుక్కలో ఇలా చదవడం స్వయంగా శివాభిషేకం చేసినంత తృప్తిగా అనిపిస్తున్నది.

ఇవి మామూలు జీవితాలు కావు. ఒక నేలని, ఒక జాతిని ధన్యం చేసిన జీవితాలు. తర్వాతి కాలంలో ఆళ్వారులు, వీరశైవులు, మహారాష్ట్ర సంత్ కవులు, హిందీ భక్తి కవులు, తెలుగు శైవ, వైష్ణవ కవులు ప్రభవించి భగవద్దివ్య గుణానుసంకీర్తన చేయడానికి స్ఫూర్తినిచ్చిన జీవితాలు. ఈ కథల్లో కనిపించేది అచంచలం, ఏకాగ్రం అయిన భగవద్విశ్వాసం. శివుడిపట్ల గానీ, మరి దేని పట్లగానీ, జీవితంలో అటువంటి విశ్వాసమంటూ సాధ్యపడితే, స్థిరపడితే, ఈ జీవితానికి అంతకన్నా కోరుకోవలసింది మరేమీ ఉండదు.

శర్మగారి శైలి చాలా సూటిగా, తేటగా ఉంది. ఎక్కడా పునరుక్తిలేదు. ఎక్కడా అతిశయోక్తి లేదు. చెప్పదలచుకున్న జీవితాల్ని భక్త్యావేశంతో కప్పిపుచ్చడం లేదు. ఆ శివదీక్షాపరులకీ, మనకీ మధ్య తానెక్కడా అడ్డునిలబడ్డది లేదు.

తమిళనాడులో ఏ శివాలయానికి వెళ్ళినా శివుడూ, శివకుటుంబంతో పాటు అరవై ముగ్గురు నాయనార్లు కూడా కనిపిస్తారు. వారికి నిత్యపూజలు జరుగుతూ ఉంటాయి. ఈ చిన్నిపుస్తకంలో కూడా అరవైముగ్గురు నాయనార్ల ప్రతిమారూపాలు చోటు చేసు-కోవడంతో ఈ పుస్తకం కూడా శివాలయ ప్రాంగణసమానమైంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ పుస్తకం నిజంగా శివప్రసాదం.

5-7-2025

సాహిత్య పాదయాత్ర

ఈ రోజు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అపురూపమైన ప్రయోగం ఒకటి మొదలుకాబోతోంది. వెయ్యేళ్ళ కిందట గోదావరి ఒడ్డున నన్నయ మహాభారతాన్ని కావ్యశైలిలో తెలుగులో అనుసృజనకు పూనుకోవడం, ఆధునిక యుగారంభంలో కందుకూరి సమాజాన్ని మేల్కొల్పడానికి సాహిత్యాన్ని ఒక ఆయుధంగా వాడుకోవడం మనకు తెలుసు. మరొకసారి గోదావరి తీరం తెలుగు సాహిత్యంలో మరొక కొత్త యుగాన్ని మేల్కొల్పుతున్నది ఇవాళ.

సాహిత్యం ప్రజలకోసమనీ, ప్రజల భాషలోనే సాగాలనీ, తమది ప్రజల ఉద్యమం అనీ గురజాడ, గిడుగు తెలుగు సాహిత్యానికి ఒక దిశానిర్దేశం చేసారు. ఇరవయ్యవ శతాబ్దంలో సాహిత్యాన్ని ప్రజాయత్తం చేయడానికి గొప్ప ప్రయత్నాలెన్నో జరిగాయి. అభ్యుదయసాహిత్యం, విప్లవసాహిత్యం, దళిత, ప్రాంతీయ, మైనారిటీ సామూహిక స్పృహలతో తలెత్తిన ఐడెంటిటీ ఉద్యమాలు సాహిత్యానికొక సామాజిక బాధ్యత ఉందని గుర్తు చేస్తూ, రచయితకీ, ప్రజలకీ మధ్య ఉన్న అంతరాన్ని దాటి వారిద్దరి మధ్యా ఒక సేతువు కట్టడానికే ప్రయత్నం చేసాయి.

ఈ రోజు మొదలవుతున్న ప్రయోగం ఆ మహత్తరమైన సాహిత్య ప్రయత్నాల స్ఫూర్తితో మొదలవుతున్నదేగాని, వాటన్నిటికన్నా భిన్నమైంది కూడా.

సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకుపోవాలని ప్రయత్నించిన పూర్వసాహిత్యకారులు, సాహిత్య ఉద్యమాలు ప్రజల గురించి రాయడానికి ఉత్సాహం చూపించినట్టుగా, ప్రజలతో కలిసి మెలిసి రాయడానికి ప్రయత్నించినట్టు కనబడదు. గరిమెళ్ళనుంచి గద్దరు దాకా, పాట ఒక వాహికగా ప్రభంజనంలాగా పోటెత్తిన ఉద్యమాలున్నాయి. కానీ అక్కడ రాజకీయ చైతన్యం కలిగించడం ప్రధాన లక్ష్యం. ఒకప్పుడు జాతీయోద్యమ కాలంలోనూ, కమ్యూనిస్టు

ఉద్యమం తొలినాళ్ళలోనూ గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం, రాత్రిపూట గ్రామాల్లో గాంధీనో, గోర్కీనో రహస్యంగా చదువుకోవడం, చర్చించుకోవడం జరిగేవి.

కాని, ఆ మహోజ్జ్వల ప్రయత్నాలన్నీ ఇప్పుడు చరిత్రగా మటుకే మిగిలిపోయేయి. ఇప్పుడు గ్రామాల్లో, ముఖ్యంగా తీరాంధ్రదేశంలో గ్రామాలంటే సినిమా, టెలివిజను, మొబైలూ మాత్రమే. మన గ్రామాల్లోని వేలాది పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకీ, ఆ గ్రామసీమల్లో నవజీవనంలోకి అడుగుపెడుతున్న లక్షలాది యువతీయువకులకీ, సాహిత్యమంటే సినిమా పాట మాత్రమే. భాష అంటే పార్టీ రాజకీయాల పరస్పర దూషణలు మాత్రమే. పడిపోతున్న పాతకాలపు భవనాల్లో, అరకొర సౌకర్యాలతో, కొన ఊపిరితో నడుస్తున్న గ్రామీణ గ్రంథాలయాల్లో పుస్తకాలంటే పోటీపరీక్షల గైడ్లు మాత్రమే. కానీ, ఆ ప్రజలకీ, ఆ బాలబాలికలకీ, ఆ యువతీ యువకులకీ కూడా సాహిత్యం కావాలి. కావాలి అని వాళ్ళకి తెలీదు. కాని వాళ్ళకెవరేనా సాహిత్యం గురించి, గొప్ప రచయితల గురించి, మానవజాతిని మహోన్నతపథంలోకి తీసుకువెళ్ళే మంచిపుస్తకాల గురించి చెప్పినప్పుడు వాళ్ళ కళ్ళు విప్పారతాయి. అలా విప్పారకుండా ఉండలేవు ఎందుకంటే, అన్నిటికన్నా ముందు సాహిత్యం వాళ్ళ మానసిక-సామాజిక అవసరం కాబట్టి.

నిజమే. కాని, ఆ సంగతి వాళ్ళకి చెప్పేదెవరు? తల్లిదండ్రులు చెప్పాలి. కాని, తల్లిదండ్రుల్లో మంచి సాహిత్యం చదివేవాళ్ళూ, చదివినదాన్ని పిల్లలతో మాట్లాడేవాళ్ళూ ఎంతమంది ఉంటారు? అదీ ముఖ్యంగా గ్రామాల్లో? ఇంతదాకా అక్షరాస్యతకి దూరంగా, ఆర్థికంగా, సామాజికంగా అణగారుతూ వస్తున్న వర్గాల్లో? బహుశా ఉపాధ్యాయులు చెప్పాలి అనుకుంటాం. సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం మొదలయ్యాక, పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి పిల్లలతో చదివించే, రాయించే ప్రయత్నాలు మొదలయిన మాట నిజమే. కాని ఆ ప్రయత్నాలు ఉద్యమస్థాయికి చేరుకోనేలేదు. ఇక పత్రికలు. ఇప్పుడు గ్రామాల్లో తెలుగుభాష మాట్లాడే అతి పెద్ద మాధ్యమం పత్రికలు మాత్రమే. కాని, ఒక్క పత్రికాయాజమాన్యానికి కూడా ఆ సంగతి తెలిసినట్టులేదు. తెలిసి ఉంటే వాళ్ళు తమ పత్రికల్లో ప్రకటనల బదులు సాహిత్యమే నింపి ఉండేవారు.

మరి ఇంకెవ్వరు? ప్రజల దగ్గరికి సాహిత్యాన్ని తీసుకుపోగలినవారు? రచయితలూ, కవులూ అనుకుంటాం. కాని తెలుగు రచయిత ఇప్పుడు పట్టణ రచయిత, 'నాగరిక' రచయిత. అతడికి గ్రామం ఒక జ్ఞాపకం మాత్రమే. నాకు తెలిసి గత ఇరవయ్యేళ్ళల్లో తమ కవిత్వమో, కథలో ప్రజల దగ్గరకు తీసుకువెళ్ళి, వాళ్ళ మధ్య కూచుని, వాళ్ళకి వినిపించిన రచయితనెవ్వరినీ నేను చూడలేదు.

ప్రజలంటే, దుక్కి దున్నేవాళ్ళు, నాట్లు వేసేవాళ్ళు, కలుపు తీసేవాళ్ళు, కోతకోసే వాళ్ళు. రోడ్లు వేసేవాళ్ళు. బావులు తవ్వేవాళ్ళు. చెప్పులు కుట్టేవాళ్ళు, చేపలు పట్టే వాళ్ళు. అడవిలో కొండకొమ్ముకి ఎగబాకి తేనెతీసేవాళ్ళు, బంక తెచ్చేవాళ్ళు, పశువులు కాచుకునేవాళ్ళు, పాలు పిండేవాళ్ళు. భవనాలు కట్టేవాళ్ళు, బట్టీలు కాల్చేవాళ్ళు. కల్లు గీసేవాళ్ళు, సున్నం నూరేవాళ్ళు. ప్రజలంటే జీవనోపాధులు వెతుక్కునేవాళ్ళు, జీవనోపాధులు పోగొట్టుకుంటున్నవాళ్ళు, బతుకుతెరువు వెతుక్కుంటూ వలసపోయేవాళ్ళు, పీడన మరీ భరించలేని స్థితికి చేరుకున్నప్పుడు తిరగబడేవాళ్ళు. అటువంటి ప్రజలతో సమావేశమై వాళ్ళ కథలు తాము విని, తమ కథలు వాళ్ళకి వినిపించి వాళ్ళ గళాలు ప్రపంచానికి వినిపిస్తున్న రచయితలెవరేనా ఉన్నారా? అటువంటి సమావేశాలు జరుగుతూ ఉండవచ్చు, నాకు తెలియకపోయి ఉండవచ్చు. కాని, అవి ఒక ఉద్యమంలాగా, పండగలాగా, ఊరేగింపులాగా జరిగిన, జరుగుతున్న ఉదాహరణలేమైనా ఉన్నాయా?

సామాజిక న్యాయంకోసం, రాజకీయ చైతన్యం కోసం సాహిత్యాన్ని వాడుకోవడం గుర్రం ముందు బండిపెట్టడం లాంటిది. ముందు వాళ్ళకి చదువు నేర్పండి, సాహిత్యం మీద ఇష్టం పుట్టించండి. వాళ్ళతో మాట్లాడండి, వాళ్ళని శ్రోతలుగా, ఉపకరణాలుగా, కార్యకర్తలుగా భావించకుండా, స్నేహితులుగా, సమభావుకులుగా, సుమనస్కులుగా భావించండి, అప్పుడు ఆ సమాజమెలా మారాలో ఆ సాహిత్యమే నిర్ణయిస్తుంది.

కవులారా, రచయితలరా, విద్యావేత్తలారా! మనం చేపట్టవలసిన కర్తవ్యం ఇదే. మనం గ్రామాలకి తరలాలి. ప్రజలతో మాట్లాడాలి. మన సాహిత్యం వాళ్ళకి వినిపించాలి. వాళ్ళ సాహిత్యం మనం వినాలి. పాఠశాలల్లో ఉన్న చిన్నారి బాలబాలికలకి గొప్ప కవిత్వాలు వినిపించాలి. పాటలు పాడించాలి. రోడ్డుమీద, రచ్చబండదగ్గర, టీదుకాణాల దగ్గర, పొలాల్లో, పొగాకుబట్టీలదగ్గర యువతీయువకుల్ని కలవాలి. కొత్త జీవితంకోసం, సాధికారతతో కూడుకున్న జీవనంకోసం వాళ్ళల్లో వాళ్ళకే అస్పష్టంగా ఉన్న కలల్ని మేల్కొల్పాలి. వాళ్ళు తమంత తాము తమ దారి వెతుక్కునేలా, ఎంతచిన్నదైనా సరే, ఒక సాహిత్యదీపం వాళ్ళ చేతుల్లో పెట్టాలి.

ఇదుగో, ఈ రోజు తూర్పు గోదావరి జిల్లాలో కొందరు సాహిత్యప్రేమికులు, సంస్కృతీ ప్రేమికులు, విద్యావంతులు అటువంటి ఒక ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తెలుగు కథని పెంచిపెద్దచేసిన 'పొలమూరు' నుంచి ఆధునిక తెలుగు స్వేచ్ఛాగాయకుడు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు పుట్టిపెరిగిన 'చంద్రంపాలెం' గ్రామం దాకా సుమారు యాభై కిలోమీటర్లు సాహిత్య పాదయాత్ర చేపడుతున్నారు.

'పదయాత్ర' గా పిలుచుకుంటున్న ఈ పాదయాత్ర తెలుగు సాహిత్యానికి అక్షర–పదార్చన కాబోతున్నది. ఆ నవదూతలు తాము నడుస్తున్న దారిపొడుగునా గ్రామీణులతో, యువతీయువకులతో, పిల్లలతో సాహిత్యాన్ని, సంగీతాన్ని పంచుకోబోతున్నారు. దారి పొడుగునా ప్రతి ఊరినీ తట్టిలేపబోతున్నారు, ప్రతి హృదయాన్నీ ప్రేమారా పలకరించ–బోతున్నారు.

నాకు తెలిసి సమకాలిక భారతదేశంలోగాని, ప్రపంచంలో గాని ఇటువంటి ప్రయోగం ఇటీవలి కాలంలో ఎక్కడా జరిగినట్టు లేదు. రచయితలు, కవులు, సాహిత్యప్రేమికులు, విద్యావంతులు ఏదో ఒక రాజకీయ పక్షానికో, ఏదో ఒక సామాజిక వర్గానికో కాకుండా, సమస్త సాహిత్యప్రతినిధులుగా గ్రామాలకు తరలివెళ్ళే ఈ శుభగడియ ఒక నవశకానికి నాకొక వేకువపిలుపులాగా వినిపిస్తున్నది.

నడవండి మిత్రులారా, సాహిత్యవార్తాహరులుగా, మానవప్రేమికులుగా, ముందు యుగం దూతలుగా నడవండి. మీ హృదయస్పందనంతో మీరు నడుస్తున్న దారిపొడుగునా సంగీతం వినిపించండి. పూలు పరిచినట్టుగా మీ మాటలతో ఆ నేలంతా విరాజిల్లాలి. మహనీయ పూర్వకవులంతా ఆకాశంలో నిలబడి మీరు నడిచేదారిపొడుగునా ఆశీసులు కురిపించాలి. నడవండి, నడవండి.

కదం తొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి ముందుకు!

బాటలు నడచీ,
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి!

మరో ప్రపంచం
మహా ప్రపంచం
ధరిత్రినిండా నిండింది!

7-12-2018

ఒక సంధ్య నడిచిన దారి

నా మిత్రుల్లో కవులున్నారు, రచయితలున్నారు, సామాజిక కార్యకర్తలున్నారు, కళాకారులున్నారు, క్రీడాకారులున్నారు, ఉపాధ్యాయులున్నారు, శాస్త్రవేత్తలున్నారు, ఆస్తికులున్నారు, నాస్తికులున్నారు. కాని ఆధ్యాత్మిక సాధకులు, ముముక్షువులు మాత్రం చాలా తక్కువమంది, అది కూడా వేళ్ళమీద లెక్కపెట్టేటంత మంది మాత్రమే ఉన్నారు. అటువంటి వారిలో యెల్లాప్రగడ సంధ్యగారు ఒకరు.

ఆమె అట్లాంటాలో ఉంటున్నప్పటికీ, ఈ దేశపు నదులూ, ఆశ్రమాలూ, హిమాలయాలూ ఆమెని అక్కడ ఉండనివ్వవు. ఒక గురువుని వెతుక్కుంటూ ఆమె చేసిన అన్వేషణ మామూలు అన్వేషణ కాదు. తన అన్వేషణానుభవాల్ని 'సత్యాన్వేషణ' పేరిట పుస్తకంగా రాసి నన్ను ముందుమాట రాయమని అడిగినప్పుడు, నాకు ఆ అర్హత ఉందా అని సంశయించాను. కాని ఆమె అభ్యర్థన మూగవాడికి గొంతునిచ్చినట్టు నాకు మాటలనిచ్చింది. రెండు వాక్యాల ముందుమాట రాయగలిగాను.

ఆ పుస్తకం ఒక ప్రతి నా చేతుల్లో పెట్టడం కోసం ఆమె నిన్న మా ఇంటికి వచ్చారు. ఈ సారి భారతదేశానికి మిమ్మల్ని రప్పించిందెవరు అని అడిగితే 'ఇప్పుడే నర్మద పరిక్రమ పూర్తి చేసుకుని వస్తున్నాను' అన్నారు. నర్మద ప్రదక్షిణం చేసేవారు నర్మదా స్వరూపులే అంటారు కాబట్టి కృష్ణ ఒడ్డున ఉన్న మా ఇంటికి నిన్న నర్మద వచ్చినట్లే అనుకున్నాను.

ఆమె పుస్తకానికి నేను రాసిన ముందుమాట మీ కోసం:

యెల్లాప్రగడ సంధ్య గారు ఫేస్‌బుక్కుద్వారా నాకు మిత్రురాలు. మూడేళ్ళ కితం హైదరాబాదులో మా ఇంటికి వచ్చారు. ఆమె మాటల్లోనూ, మా ఇంట్లో ఉన్న కొద్దిసేపూ ఆమె మసలిన తీరులోనూ ఎంతో క్రమశిక్షణ, సంస్కారం గోచరించాయి. ఆమెకి ఒక జ్ఞానతృష్ణ ఉన్నదని కొంతవరకూ గుర్తించానుగానీ, ఆమె ఆత్మ ఎంత పరిశుద్ధమైనదో,

తనకి తాను చేరువుగా ఉండటానికి ఆమె ఎంత గాఢంగా తీవ్రంగా తపిస్తూ ఉన్నదో, ఏడేళ్ళ పాటు ఆమె చేసిన తపస్సు ఎంత కఠోరమో ఈ సత్యాన్వేషణ చదివినదాకా నాకు తెలియలేదు.

సత్యాన్ని తెలుసుకోడానికీ, ఆ సత్యసాన్నిధ్యం నుంచి ఒక్క క్షణం కూడా ఏమరు-పాటుకు లోను కాకుండా ఉండటానికీ, తనని తాను కాపాడుకుంటూ, తనని నిజంగా తనుగా ఉంచే ఒక గురుకటాక్షం కోసం ఆమె ఎంతటి ఆర్తికి లోనయ్యారో ఈ పుస్తకంలో ప్రతి ఒక్క పుట సాక్ష్యమిస్తుంది.

అరుణాచలం నుంచి హిమాలయాలదాకా, గోదావరీతీరం నుంచి గంగా తీరందాకా ఆమె చేసిన ప్రయాణాలు, ఆ వెతుకులాట మనల్ని నివ్వెరపరుస్తాయి. ఇదంతా మరీ ఇటీవలి కాలంలోనే, అంటే, మనమంతా మన రోజువారీ జీవితాల్లో కూరుకుపోయి ఉండగానే ఆమె తన వెచ్చని ఇంటినీ, కుటుంబ భద్రతనీ, సౌకర్యవంతమైన దైనందిన జీవితాన్నీ వదులుకుని ఈ అన్వేషణ సాగిస్తూ ఉన్నారంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంది.

తన యాత్ర చివరి పేజీలకు వచ్చేటప్పటికి ఆమె ఇలా రాస్తున్నారు:

> ఈ అన్వేషణలో అన్నీ వదిలేసాను. డబ్బు, మంచి చీరలు, నగలు, సమాజము, అందులో ఒక పేరు, రాజకీయాలు, సంఘాలు, వాటిలో పొజిషన్లు, బిరుదులు, ఒకటేమిటి, ఒక్కొక్కటే పొరలు పొరలుగా ఉండిన ఉల్లి పొరలులా విచ్చుకు వూడిపోయాయి. నాకు నేను తెలుసుకునే నెపంతో దేన్నీ పట్టించుకోలేదు. మంది బట్ట, కడుపునిండా తిండి కూడా సహించని స్థితికి వచ్చాను. చాలా చాలా సున్నితమైన స్థితిలోకి వచ్చి దిక్కుతోచక కొట్టుకుపోతున్నా. పై పై మెరుగులుగా ప్రపంచము తోచింది. ఇక గురువుల కృప రాకపోతే మాకేమి చెయ్యాలో కూడా తెలియదు. ఎంత కాలము వేచి చూడాలో. ఆ రాత్రి కంటికి నిదురలేదు. 'రేపటి ఉదయమన్నా నాకు అరుణోదయమవుతుందా?

ఆ మర్నాడు ఆమెకి గురువు అనుగ్రహం లభించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఒకసారి పరమహంసను ఎవరో భగవత్సాక్షాత్కారం ఎప్పుడవుతుంది అని అడిగితే, ఆయన నిన్నెవరన్నా నీళ్ళల్లో నీ ముఖాన్ని ముంచి, అట్లానే కొన్ని క్షణాలు అదిమిపెడితే, గాలికోసం, ఊపిరికోసం కొట్టుకుపోతావు చూడు, అట్లా భగవంతుడి కోసం ఎప్పుడు కొట్టుమిట్టాడతావో అప్పుడు సంభవిస్తుంది అన్నారట.

ఈ పుస్తకమంతా అట్లా కొట్టుమిట్టాడిన అనుభవం. ఆమెకి ఒక గురువు జీవితంలో లభించిన తరువాత అనుభవాలేమీ ఆమె ఈ పుస్తకంలో రాయలేదు. రాయవలసిన అవసరం లేదు కూడా. ఎందుకంటే, ఎవరి ఆధ్యాత్మిక సాక్షాత్కారం వారిదే. ఒకరికి కనిపించిన భగవంతుడు మరొకరికి అదే రూపంలో కనిపించవలసిన అవసరం లేదు. కాని అటువంటి సాక్షాత్కారంకోసం పడిన తపనలో మాత్రం సాధకులందరి అనుభవం ఒక్కలాంటిదే. అక్కడ ఏ ఒక్క సాధకుడి అనుభవమైనా తక్కిన సాధకులందరికీ ఎంతో కొంత ఊరటనిచ్చేదే, ధైర్యం చెప్పేదే, దారిచూపించేదే.

ఈ అన్వేషణలో మరో గొప్ప అంశం ఇది భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో దీపస్తంభాల్లాంటి మహనీయుల గురించిన తలపోత కూడా.

ఒక సంధ్య నడిచిన దారి ప్రతి ముముక్షువూ నడవాలని కోరుకునేదే.

పుస్తకం మొత్తం ఏకబిగిన పూర్తిచేసేసాను. పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభుణ్ణి దర్శించుకుని మా ఊరు వెళ్ళే దారిలో మొత్తం పుస్తకం చదవడం పూర్తయిపోయింది. పుస్తకం మొదటి పుటల్లో ఒకటి రెండుచోట్ల నా కళ్ళల్లో సన్నని నీటిపొర. గొప్ప యోగుల జీవితాల్లో కనవచ్చేటట్టే ఆమె కూడా మృత్యుముఖంలోనే సత్యాన్ని పసిగట్టారు. కొన్ని వాక్యాలు నిజంగా తీవ్ర ఆధ్యాత్మిక సాధకులకి మాత్రమే స్ఫురించే సత్యాలు.

పుస్తకం చివరి పుటలకు వచ్చేటప్పటికి మా ఊరు వెళ్ళే అడవి దారి పొడవునా ఆకాశాన కమ్ముకున్న మబ్బులు, పుస్తకం చివరి పుటలు మూసేటప్పటికి మహావర్షం. ఒక సాధకురాలి చరిత్ర నేను చదివినందుకు నింగీనేలా కూడా కలిసి పండగ చేసుకున్నాయి.

ఆద్యంతం గొప్ప వేదమంత్రాలు, ఉపనిషద్వాక్యాలు, స్తోత్రాల్లోని మననీయ శ్లోకాలతో ఈ పుస్తకం చదవడమే ఒక తీర్థయాత్రలాగా అనిపిస్తుంది.

చివరికి వచ్చేటప్పటికి ఆమె ఐతరేయ బ్రాహ్మణం నుంచి పేర్కొన్న ఈ మంత్రం నన్ను నిశ్చేష్టుణ్ణి చేసింది:

చరించినందువల్లనే తేనెటీగలకు మధువు దొరుకుతోంది.
చరించినందువల్లనే పక్షులకు స్వాదువైన ఫలాలు లభిస్తున్నాయి.
చరిస్తున్నందుకు సూర్యుడు గౌరవించబడుతున్నాడు.
నడవాలి, నడవండి, నడుస్తుంటే చేరేది గమ్యమే.

ఒక అవిశ్రాంత పథికురాలి ప్రయాణం ఇది. విరామంలేకుండా ఆమె నడిచారు కాబట్టే మనకి ఈ పుస్తకంద్వారా తేనె, తియ్యటి ఫలాలూ, సూర్యకాంతీ ప్రాప్తిస్తున్నాయి.

సన్మార్గగాములైనవారందరి తరఫునా, సత్యశోధకులందరి తరఫునా ఆమెకి నా ధన్యవాదాలు.

30-1-2022

నర్మద దర్శనం

కొన్నాళ్ళ కిందట నేనొక మానేజిమెంటు కోర్సులో శిక్షణకి వెళ్ళినప్పుడు ఒక ఫాకల్టీ తన క్లాసులో 'రెసిడ్యూ' అనే పదాన్ని పదే పదే వాడాడు. ఆయన చెప్పిందేమంటే నువ్వు నీ కుటుంబ జీవితంలో, సామాజిక జీవితంలో మనుషుల్ని కలుసుకున్నప్పుడు, వారితో మాట్లాడినప్పుడు, అంగీకరించినప్పుడు, విభేదించినప్పుడు, కలిసి పనిచేసినప్పుడు, కలిసి పనిచేయడం సాధ్యం కాదని గ్రహించినప్పుడు, ఇలా అన్ని సమయాల్లోనూ, నువ్వు ఆ సన్నివేశం నుంచి పక్కకు తొలిగాక, అక్కడ నీ ప్రవర్తనకు సంబంధించిన ఒక ఇంప్రెషనును వదిలిపెట్టి వస్తావు. నువ్వు నీ గురించి ఎంత చెప్పుకున్నా తెలియచెప్పలేనిది ఆ చిన్న ఇంప్రెషను చాలా గట్టిగా తెలియచెప్తుంది. చాలాసార్లు అది మనం మాటల్లో చెప్పేదానికన్నా బలంగా, గాఢంగా మాట్లాడుతుంది. కాని అది నిశ్శబ్దంగానే మాట్లాడుతుంది.

నువ్వు ఎటువంటి రెసిడ్యూ వదిలిపెట్టగలవనేది నువ్వు conscious గా చెయ్యగలిగే పనికాదు. అది నీకు తెలియకుండానే నీ అవ్యక్త అంతరంగం, నీ లోపలి సహజాతాలు, నీలోపల చెలరేగే ఆరాటాలు నీ మాటల్తో నిమిత్తం లేకుండానే కమ్యూనికేటు చేసే ఒక సందేశం. అందుకనే గొప్ప యోగుల్నీ, సాధువుల్నీ కలుసుకున్నప్పుడు వారితో మనమేమీ మాట్లాడకపోయినా, వారి సన్నిధిలో కూచుని వస్తేచాలు, చాలాకాలం పాటు ఆ రెసిడ్యూ మనతో ఉండిపోతుంది. కొందర్ని కలిస్తే కస్తూరి పరిమళం గుప్పుమంటుందని రూమీ అటువంటి వాళ్ళ గురించే అన్నాడు.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే, మొన్న సంధ్య ఎల్లాప్రగడ మా ఇంటికి వచ్చారు. కొంతసేపు కూచున్నారు. ఆమె ఆధ్యాత్మిక సాధనగురించీ, ఆమె చేస్తున్న తీర్థయాత్రల గురించీ నేనే ఆమెతో ఏదో మాట్లాడిస్తో ఉన్నాను. కొంతసేపు కూచున్నాక, ఆమె సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. కాని ఒక కస్తూరి పరిమళం వదిలిపెట్టి వెళ్ళిపోయారు.

ఒక కథలో చెహోవ్ పాత్ర అనుకుంటాడు: ఈ నగరంలో నలభై వేలమంది ఉన్నారు, కాని వీళ్ళల్లో తాము మరింత వివేకవంతులు కావాలనికోరుకుంటున్నవాళ్ళు ఒక్కరు కూడా కనిపించడం లేదు అని. నాకు తెలిసిన ప్రపంచంలో సంధ్యా ఎల్లాప్రగడ ఒక ఆశ్చర్యం. తనని తాను మరింత పరిశుభ్రపరుచుకుంటూ, తనకి తాను మరింత సన్నిహితంగా జరగాలనే సాధనచేస్తున్నవాళ్ళు నాకు ఆట్టే తెలియదు. కవులు తెలుసు, మేధావులు తెలుసు, తమ ఉనికిని చాటుకోవడానికి తక్కినవాళ్ళ ఉనికిని ప్రశ్నిస్తూ పోయేవాళ్ళు తెలుసు. కాని ఒక పువ్వులాగా నిశ్శబ్దంగా విప్పారేవాళ్ళు అరుదు. అటువంటి మనుషులు ఎక్కడ ఉన్నా కూడా ఆ పరిమళం మనని తాకక మానదు.

ఒక గురువుని అన్వేషించుకుంటూ ఆమె చేసిన ప్రయాణాన్ని 'సత్యాన్వేషణ' పేరిట పుస్తకంగా తీసుకువచ్చినప్పుడు నేను దానికి ముందుమాట రాసాను. ఆ తర్వాత ఆమె నర్మదా పరిక్రమ చేసాననీ, దాన్ని కూడా ఒక పుస్తకంగా వెలువరిస్తున్నాననీ చెప్పినప్పుడు నాకు ఆశ్చర్యంవేసింది. ఎక్కడి అమెరికా! ఎక్కడి నర్మద! ఎన్నాళ్ళుగా అనుకుంటున్నాను ఉజ్జయిని వెళ్ళాలని. కాని ఒక్క అడుగుకూడా ముందుకు వేసింది లేదు. అటువంటిది ఈమె రెండువారాల్లో నర్మద మొత్తం ప్రదక్షిణచేసారంటే ఆశ్చర్యం, గౌరవం రెండూ కలిగాయి.

ఆమెకి పుస్తకాలు రాసుకోవడం, వేసుకోవడం, ఆవిష్కరణలు ఏవీ తెలియవు, అన్నీ కొత్త. కాని ఆమె గురువుగారు నర్మద పరిక్రమ గురించి నలుగురికీ తెలియాలని చెప్పారట. అందుకని ఆ పుస్తకావిష్కరణ సభ పెట్టుకుని నన్ను కూడా మాట్లాడమని అడిగారు. అది నా భాగ్యమని భావించాను. 'నువ్వు నీళ్ళకోసం దప్పిక పడ్డప్పుడు గుర్తు పెట్టుకో, నీళ్ళు కూడా నీ కోసం దప్పిక పడుతున్నాయి' అన్నాడు రూమీ. నర్మదకోసం నేనెంత దప్పికపడ్డానో నాకు తెలీదుగాని, నర్మద మాత్రం నా మాటలు వినాలని కోరుకుందని అర్థమయింది.

ఆ రోజు నేను మాట్లాడినదానికన్నా ఆమె పుస్తకంలోంచి ఈ వాక్యాలు చదివి వినిపిస్తే ఆ రచనకు ఎక్కువ న్యాయం చెయ్యగలనిపించింది. నర్మద పరిక్రమ పూర్తయిన తర్వాత, 'నర్మద దర్శనం' అని రాసిన అధ్యాయంలో ఈ వాక్యాలు చూడండి:

> మరి మాకు నర్మదామాయి ఎక్కడన్నా కలిసిందా?
>
> అమ్మ హృదయానికి పదేపదే తడుతూనే ఉంది. ఆమె ఏ రూపంలో అనుగ్రహించిందో ఎవరికి తెలుసు??

ఓంకారేశ్వర్‌లో పూజారిగారు మాతో 'మేము అందరితో మర్యాదగా ఉంటాము. ఎక్కువ ఏమి ఆశించం. మాయి ఏ రూపంలో మమ్మల్ని పరి–రక్షించటానికి వస్తుందో, మాయి మీరేనేమో అమ్మా !' అన్నాడు.

నర్మదా తీరంలో ఓంకారేశ్వర్‌లో మా సంచులు పెట్టి నీటిలోకి వెళ్ళటానికి మా వారు సందేహిస్తుంటే 'పర్వాలేదు, వెళ్ళండి' అని ధైర్యం చెప్పిన సామాను అమ్ముతున్న ముసలి అవ్వకాదా నర్మదామాయి??

నర్మదలో రెండో రోజు పడిపోతే సాయం చేసిన పరిక్రమవాసి కాదా నర్మదా మాయి?

అంకలేశ్వర్‌లో మా వారు తన మిత్రులను కలవటానికి ముందు వెళ్ళి–పోయారు. నేను తరువాత గదిబయటకు వచ్చాను.

బయట ఒక అమ్మాయి ఆ హాల్ తుడుస్తోంది. నేను బయటకొచ్చేసరికే ఆమె ఒకవైపు ఆ తుడిచేవి పెట్టి నాతో పాటు లిఫ్ట్ లోకి వచ్చింది. చూడచక్కగా ఉందామె.

నేను మాస్కు పెట్టుకున్నా దగ్గు రావటం ఆగదుకదా.

దగ్గు వస్తుంటే ఆమెతో 'జస్ట్ త్రోట్ ఇన్ఫెక్షన్ ..' అన్నా.

ఆమె చిన్నగా నవ్వి 'ఐ నో' అంది.

ఆమెకెలా తెలుసు? అది ఉట్టి దగ్గుమాత్రమే అని, కరోనా కాదని.

ఆమెనా నర్మదామాయి?

నాకింత జబ్బుగా ఉంటే, నా ఆరోగ్యం, నా గురించి నేనే పట్టించు కోను.. అలాంటిది కామేశ్వరిగారు నా కోసం ఎన్ని మందులు తెచ్చారు, ఎంత ప్రేమ చూపారావిడ, ఆమె నర్మదామాయి కాదా?

బరూచ్‌లో నర్మద దగ్గర నేను బట్టలు మార్చుకోవటానికి సాయంగా నా చుట్టూరా తన చీరలు అడ్డం నిలబెట్టిన స్త్రీలు కారా నర్మదామాయి?

అమర్ కంటక్‌లో నా దగ్గర తన పిల్లలకు నోట్స్ కావాలని వచ్చి మరీ నోటు బుక్స్ తీసుకువెళ్ళిన స్త్రీమూర్తి నర్మదామాయి కాదా?

సీతెల్ ఘాట్ లో చెట్టుకింద ఉన్న వృద్ధురాలేమో?

చదవండి, 'నమామి దేవి నర్మదే' మనకు తెలియని కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. ఆమె చూసిన, మనకు చూపిస్తున్న ఆ భారతదేశమే నిజమైన భారతదేశమని మనం నమ్ముతాం. ఇంకా ఆ దేశం అక్కడ నిర్మలంగా, సజీవంగా ఉన్నందువల్లనే, మనం, మన పిల్లల్తో, ఈ దేశంలో ఇంకా భద్రంగా జీవించగలుగుతున్నాం అని తెలుసు-కుంటాం.

2-9-2022

అసాధారణ పథికుడు

కొంతమంది కుర్రవాళ్ళు పావననవజీవన నిర్మాతలు అని మహాకవి అంటున్నప్పుడు ఆయన మనసులో ఎవరున్నారా అని అనుకుంటూ ఉంటాను. బహుశా తన కాలం నాటి తక్కిన యువకుల్లాగా జీవితంతో రాజీపడకుండా వ్యవస్థ మీద తిరుగుబాటు బావుటా ఎగరేస్తారనే ఆశ కల్పిస్తున్న యువకుల్ని చూసి ఆయన ఆ మాట అని ఉండవచ్చు. కాని ఇప్పుడు లంకమల వివేక్‌ని చూడగానే ఆ మాటలు గుర్తొస్తున్నాయి నాకు.

నిజానికి వివేక్ చాలా సాధారణమైన నేపథ్యం నుంచి వచ్చిన చాలా సాధారణమైన యువకుడు. సాధారణమైన ఉద్యోగి. కాని మన కళ్ళముందే అతడు మన కాలపు అత్యధిక సంఖ్యాకులైన యువకులకన్నా ప్రత్యేకంగా, అసాధారణంగా తనని తాను ఆవిష్కరించు–కుంటూ వస్తున్నాడు. ఆ ఆవిష్కరణ ఒక్కసారిగా హటాత్తుగా మనల్ని నివ్వెరపరిచేదిగా కాకుండా, నెమ్మదిగా, ఫాల్గుణమాసంలో చెట్టు చిగిరించడం మొదలుపెట్టినంత సహజంగా జరుగుతుండటం నేను గత కొంతకాలంగా చూస్తూ ఉన్నాను.

ఇప్పుడు ఈ 'లంకమల దారుల్లో' యాత్రానుభవాలు చదవగానే అతడిలో నేనింతదాకా అస్పష్టంగా చూస్తూ వచ్చిన ధీరత్వం, సాహసం, సహృదయం స్పష్టంగా దర్శనమిచ్చాయి. .. for the hero is commonly the simplest and obscurest of men, నిజమైన ధీరుడు చాలా మామూలు మనుషుల్లో, చాలా చాలా మామూలుగా చాలా అనామకంగా ఉంటాడు అని థోరో రాసుకున్న మాటలు వివేక్‌లాంటి వాళ్ళకి బాగా సరిపోతాయి.

ఒక యువకుడి మీద ఇటువంటి ప్రశంసల వర్షం కురిపించడం సముచితమేనా అనిపించవచ్చు మీకు. కాని మనం నిజంగా ప్రశంసించవలసిందీ, ప్రోత్సహించవలసిందీ, నాలుగడుగులు కలిసి నడవవలసిందీ ఇటువంటి యువకుల్తోనే. ఎందుకంటే ఇటువంటి యువతీయువకుల నిర్మల అంతరంగంలోంచే పావననవజీవనం ప్రభవిస్తుంది. ఏదో

ఒక మతానికో, రాజకీయపార్టీకో, లేదా ఏదో ఒక భావజాలానికో, సిద్ధాంతానికో, ముఠాకో అనుచరుడిగా, ట్రోలరుగా, ఒక వోటుగా మారకుండా తన అంతరంగం ఎటు నడిపిస్తే అటు ఎప్పటికప్పుడు కొత్తదారుల్లో, అనిశ్చితినీ, అగమ్యాన్నీ స్వాగతిస్తో కొత్తదారులు వేసుకుంటూ పోగల ఇటువంటి సాహసికులే కొత్త యుగాలకు తలుపులు తెరవగలుగుతారు.

పందొమ్మిదో శతాబ్ది అమెరికాలో థోరో చేసింది ఇదే. ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుక్కుంటూ నడిచాడు. అతడు చేసిన అది పెద్ద పని నడవడం. నడక. కొలంబసు అమెరికా ఖండాన్ని కనుగొని ఉండవచ్చుగాక. కాని అమెరికా ఆత్మని దర్శించింది మాత్రం థోరోనే. అది అతడికి పూర్తి స్వేచ్ఛలో, తన అంతరంగం చెప్పినట్టుగా, నడుచుకుంటూ పోవడం ద్వారానే సాధ్యపడిందని చెప్పవచ్చు. ఇక్కడ నడక ఒక రూపకాలంకారం మాత్రమే కాదు, నిజంగా నడవడం కూడా. తన సుప్రసిద్ధమైన వ్యాసం Walking (1862) లో అతడు స్పష్టంగా రాసుకున్నాడు: It requires a direct dispensation from Heaven to become a walker అని. తన పూర్వకాలపు కవులు, ప్రవక్తలు, పరిశోధకులు నడిచినట్టుగా తాను కూడా ప్రకృతిమధ్యకి నడుచుకుంటూ పోతున్నానని చెప్పుకున్నాడు.

2

ఇప్పుడు ఈ వ్యాసాల్లో, ఈ కథనాల్లో వివేక్ చేసింది ఇదే. థోరో అమెరికాని కనుగొన్నట్టు వివేక్ నల్లమల, ఎర్రమల, లంకమల కొండల్నీ, అడవుల్నీ కనుగొంటున్నాడు. అలాగని కేవలం ప్రకృతిని కాదు. ప్రకృతికీ మనిషికీ మధ్య ఉన్న దృశ్యాదృశ్య అనుబంధాన్ని కనుగొంటున్నాడు. ప్రకృతిలో మనిషి ఒకప్పుడు జీవించి వెళ్ళిన ఆనవాళ్ళు కనుగొంటు–న్నాడు. ఆ ఆనవాళ్ళను చెరుపుకుంటూ పోతున్న మనిషి విధ్వంసాన్ని కనుగొంటున్నాడు. కొందరు మనుషులు తమ ప్రయోజనాల కోసం మరికొందరు మనుషుల్ని నిరాశ్రయుల్ని చేయడాన్ని కనుగొంటున్నాడు. మనుషులంతా కలిసి ప్రకృతి పట్ల చేస్తున్న అపచారానికి ప్రకృతికి ఒక్కసారి కోపం వస్తే అది ఎంత విలయం సృష్టించగలదో అది కూడా కనుగొంటున్నాడు.

అన్నిటికన్నా మించి ఒక చెట్టు, ఒక కొండ, ఒక లోయ, ఒక పిట్ట, ఒక తీగ, ఒక పువ్వు వీటికి దగ్గరగా జరగాలని, ఏ మాత్రం తీరిక చిక్కినా వాటిదగ్గరకు పోయి గడపాలని తహతహలాడుతున్నాడు. ఇది, ఇలా కొండకోనల్తో ప్రేమలో పడటమే ఈ యువకుణ్ణి నా కళ్ళల్లో గొప్పగా చూపిస్తున్నది. మన కాలం నాటి యువకులు ఎన్నో విషయాలపట్ల, ఎన్నో అందాలపట్ల, అధికారం పట్ల, ఆస్తిపాస్తులు సమకూర్చుకోడం పట్ల కూరుకుపోతూ

ఉండగా, ఈ పిల్లవాడు మాత్రం మరికొన్ని మట్టిదారుల వెంటనడవాలనీ, మరికొన్ని పాతకోనల్ని తనకై తాను కళ్లారా చూడాలనీ ఉవ్విళ్ళూరుతున్నాడు. ఇటువంటి యువకుడు ఒక్కడున్నా కూడా భగవంతుడు ఆ ప్రాంతాన్ని, ఆ దేశాన్ని, ఆ సమాజాన్ని ఎన్ని తప్పులకైనా క్షమించగలడనిపిస్తుంది.

ఈ పుస్తకంలో 21 వ్యాసాలున్నాయి. వ్యాసం అనేది సరైన మాట కాదు నిజానికి. వీటిని యాత్రాకథనాలు అనాలి. అనుభవకథనాలు అనాలి. మ్యూజింగ్సు అని కూడా అనొచ్చు. తనతో తాను చేసుకున్న సంభాషణలు అని కూడా అనుకోవచ్చు. లేదా ప్రకృతికి రాసుకున్న ప్రేమలేఖలు అని అనడం కూడా బావుంటుంది.

మనం ఈ రచనలోకి ప్రవేశించగానే ముందు మన చుట్టూ ఉన్న నగరసంరంభం పక్కకు తప్పుకుపోతుంది. మనం మనకు తెలియని తెలుగుసీమలో అడుగుపెడతాం. జనాభాలెక్కలు రాసుకునేవాళ్ళో, ఓటర్ల జాబితాలు తయారు చేసేవాళ్ళో లేదా రేషను కార్డులో, ప్రభుత్వపథకాలో పట్టుకు తిరిగేవాళ్ళో తప్ప మరెవరూ అడుగుపెట్టని ఊళ్ళమీంచి ప్రయాణించడం మొదలుపెడతాం. అసలు అటువంటి ఊళ్ళున్నాయనీ, వాటిని చూడటమే ఒక భాగ్యమనీ మనకు ఇప్పటిదాకా తెలియదు. పర్యాటకమంటే మాల్దీవులూ, లక్షదీవుల చుట్టూ తిరిగే రాజకీయం కాదనీ, అది అన్నిటికన్నా ముందు నీ స్వదేశంలో, నీ స్వజనం మధ్య, నీ మూలాల్ని, నీ బంధాల్ని, నీ బొడ్డుతాటిని వెతుక్కుంటూ చేసే ప్రయాణమని అర్థమవుతుంది మనకి ఈ పుస్తకం పూర్తి చేసాక. రచయిత అనుకున్నట్టే మనమూ అనుకుంటాం:

> అప్పుడప్పుడు ప్రయాణాలు చేస్తుండాలి. మనల్ని మనం కొత్తగా పరిచయం
> చేసుకోడానికైనా.

ఎన్ని పల్లెలు, ఎన్ని కొండలు, ఎన్ని వాగులు, ఎన్ని గుట్టలు! ఎక్కడో బద్వేలు దగ్గర నందిపల్లెకు చెందిన వివేక్ లంకమల, గురట్లబాయి దగ్గర మొదలయ్యే లంకమల కొండల వరసలు పిలవడం మొదలుపెట్టాక, ఎన్ని పల్లెల వెంబడి ఎన్ని ప్రయాణాలు మొదలు పెట్టాడు!

ఒంటిమిట్ట మండలంలోని బెస్తపల్లె, మల్లేష్ కొండ, ఇసుకదిన్నె, కోటపాడు పరిసరాల్లోని మునకజలాల్లో పడవ ప్రయాణాలు, నందలూరు వైపునుంచి చేసిన పొత్తపి యాత్రలో పరిచయమైన గుండ్లమాడ, లంకమలేశ్వర గుడినుంచి సదురుబండకీ, సిద్ధవటం కోటనుంచి బంగళాబోడు, సవళ్ళబాయికీ వెళ్ళే దారిలో రాజులచెరువు దగ్గర గుర్రపుబాటలు,

కాలిబాటలు, చెయ్యేరు వరదలో నిలబడ్డ ఏకిరిపల్లె, ఒక మనిషిని ఆత్మార్పణకు ప్రేరేపించేటంత మార్మికత నింపుకున్న మొండిభైరవుని కోన, పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, గుండ్లకమ్మ నది, పాలకొండలు, పొద్దుటూరు, రామేశ్వరం, జమ్మలమడుగు, కమలాపురం, తాడిపత్రి, అనంతపురం నుంచి బళ్ళారి వెళ్తూ ఒకసారి, పేరూరు, సోమశిల, ఆత్మకూరు, కోవూరు దగ్గర పెన్నాను దాటిన స్థలాలు, పుష్పగిరి దగ్గర కాళ్ళు కూరుకుపోతున్న ఇసుకలో వేసిన అడుగులు కనిపిస్తాయి ఇందులో.

గొడ్డుమర్రి దగ్గర చిత్రావతి గలగలలు, గండివద్ద పాపాఘ్ని ఇసుకతిన్నెలు, అలాదుపల్లె పక్కన కుందూ ఉధృతి, వట్టిపోయిన సగిలేటి ఒడ్డున ఆడుకున్న ఆటలు, నందలూరు పల్లెల్లో చెయ్యేటి వరదబీభత్సం, బొగ్గేరు చెలిమెలో నీటి ఊటలు వీటన్నిటి వెంబడి అతడితో కలిసి, అతడి మిత్రుల్తో కలిసి మనం కూడా ప్రయాణాలు కొనసాగిస్తాం. గోపవరం మండలంలోని గట్టుపల్లె, రాజుపాళెం, ఓబులం పాయకట్టులో మత్స్యకారులు వండిపెట్టిన చేపలకూరని అతడు ఆరగిస్తుంటే చూసి మన కడుపు నిండిపోతుంది.

ఇంతకన్నా సుసంపన్నమైన జీవితం, ఇంతకన్నా సాదరంగా ఆహ్వానించే స్వజనం వేరే ఎక్కడుంటారు? నిజమైన యాత్ర అంటే ఇది. అందుకనే ఒకచోట ఇలా అనుకుంటు–న్నాడు:

> కదిలే ఆకు, కదలని శిల, కాలిన మోడు, నిర్మలమైన ఆకాశం, చిగురించే వసంతం, ముసురుపట్టిన మేఘం, బెదురుచూపుల కొండగొర్రెలు, సుగంధాలు వెదజల్లే జానపూత, ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనల్లో ఆనందాన్ని వెతుక్కోవడం మొదలుపెట్టాక తృప్తికోసం దిగంతాల్లోనే వెతకనక్కరలేదు.
>
> ఎవరైనా అడగవచ్చు.
>
> అదే పెన్నా, అదే సగిలేరు, అదే సోమశిల, అదే మునక, అవే నీళ్ళు, అవే చేపలు, అవే పడవలు, ఏముందక్కడ అంతకుమించి?

అందుకని ఈ ప్రశ్న తనకు తనే వేసుకుని తనే ఇలా జవాబు చెప్పుకుంటాడు:

> వెళ్ళిన చోటుకే వెళ్ళింది లేదు. చూసిందే మళ్ళీ చూసింది లేదు. ఏ ఒక్కరోజూ అసంతృప్తిగా వచ్చిందీ లేదు. ఇన్నాళ్ళుగా నేను విస్మరించిన నా నేలను పలకరిస్తూ నేను పీల్చే గాలికి జీవితపు శ్రమల ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు అద్దిన పరిసరాలను తడిమి చూసుకుంటూ చేసిన ప్రతి ప్రయాణం, ఎదురయ్యే

మనిషి, గొర్రె, బర్రె, ఆవు, మేక, కుక్క, చేప, నక్కి కదిలిపోయే దృశ్యాలు, ఆకులు రాల్చిన మోడు, చిగురించే చెట్టు ఏవో గుర్తు చేస్తూ నాలో నాకు తెలియని ఆలోచనల సుడిగుండాలు రేపుతుంటే ఏముందక్కడ అన్నిసార్లు చూడ్డానికి అన్న తలంపే లేదు.

అగాధమైన సాగరాల మీద తెప్పలు వేసుకుని భూమిని చుట్టిరావడానికి బయల్దేరిన మహాసాహసికనావికుల్ని ఏది ప్రేరేపిస్తున్నదో ఇతణ్ణీ అదే ప్రేరేపిస్తున్నది. అందుకనే ఇలా చెప్పుకుంటున్నాడు:

స్వేచ్ఛ కావాలి, ఊహల్లో స్వేచ్ఛ, ఆలోచనల్లో స్వేచ్ఛ, భౌతిక స్వేచ్ఛ, ఆ స్వేచ్ఛ నన్నూ అడవికి తరిమింది.

3

నడక గురించి రాస్తూ థోరో వర్డ్సువర్తుకి సంబంధించిన ఒక సంఘటన చెప్పాడు. ఒకసారి ఎవరో వర్డ్సువర్తుని చూడటానికి వాళ్ళింటికి వెళ్ళారట. అప్పుడు ఆ మహాకవి ఇంట్లో లేడు. ఎప్పట్లానే సరస్తీరాలంబడి పచార్లు చేయడానికి వెళ్ళిపోయాడు. ఆ సందర్శకుడు వర్డ్సువర్తు సహాయకుల్ని 'మీ కవిగారి అధ్యయన మందిరం చూపించండి' అని అడిగాడట. దానికి ఆ ఇంట్లోవాళ్ళు అన్నారట కదా 'ఆయన గ్రంథాలయమైతే ఇదిగో, ఈ గదిలో ఉంది, ఇక ఆయన అధ్యయనమందిరం అంటారా? అది ఆరుబయటనే ఆయన తిరిగే ప్రతి చోటా ఉంది' అని.

ఈ పుస్తకంలోని నడకల్ని చూసినప్పుడు నాకు ఆ విషయమే స్ఫురించింది. ఇందులో ప్రతి ప్రయాణం ఒక అధ్యయనం. ప్రకృతి గురించి, మనిషి గురించి, మానవసమూహాల గురించి, మానవ సమాజం గురించి, పర్యావరణం గురించి. ఏదో ఒక చోటు చూడ్డానికి వెళ్ళిన ప్రతిసారీ వివేక్ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉన్నాడు. మనకీ నేర్పుతూనే ఉన్నాడు. ప్రతి నడకా అతడి పరిధిని ఎప్పటికప్పుడు విస్తరింపచేస్తోనే ఉంది.

నవజీవనం ఇలానే సిద్ధిస్తుంది. అది ఉన్నట్టుండి మంత్రించినట్టుగా ఒక్కరోజులో సాధ్యపడదు. ప్రతి సారీ ప్రతి ప్రయత్నం తర్వాత, ప్రతి వైఫల్యమ్మీంచీ, పడిలేచిన ప్రతిసారీ కొత్త చిగుళ్ళు వేస్తోనే ఉంటుంది. ఏదో ఒకటి చూడాలి, ఏదో ఒకటి తెలుసుకోవాలి, ఎవరో ఒకరిని కలుసుకోవాలి– ఏమి తెలుసుకుంటామని కాదు, ఏదో ఒకటి తెలుసుకు

తీరతామనే భరోసా. గొడ్డేటి కొండపైన బుస్సానాయుడి కోట చూడాలని ఉందని రాస్తూ ఇలా అనుకుంటాడు.

> కోటలేదు కదా, ఇప్పుడంత దూరం వెళ్ళాలా అన్న ఆలోచన లేదు. వెళ్ళాలి. చిన్న రాయి ఉన్నా కూడా వెళ్ళాలి. ప్రత్యక్షంగా చూడాలి. ఊహల్లోని దృశ్యానికి వాస్తవాన్ని రూపమివ్వాలి.

దేని గురించి విన్నా దాన్ని చూడాలనీ, ఏది కనిపించినా దాన్ని మరింత దగ్గరగా చూడాలనీ అతడు మొదలుపెట్టిన ప్రయాణాలూ అడవి గర్భానికి, చెరిగిపోని రాయలసీమ గతానికి దగ్గరగా తీసుకుపోవడం మాత్రమే కాదు, సోమశిల ముంపు గ్రామాలకీ, చెయ్యేటి వరద బీభత్సానికీ కూడా దగ్గరగా తీసుకువెళ్ళాయి. ఆ తపన వల్లనే అతడు లంకమల బీడుభూముల్లో విత్తనాల మట్టి ఉండలు విరజిమ్ముతున్నాడు. ఆ ఆరాటం వల్లనే No Plastic Lankamala కాంపైను మొదలుపెట్టాడు. తన పర్యటనల్లో కనిపిస్తున్న యానాదులు తన హృదయాన్ని తట్టిలేపుతున్నందువల్లనే ఎస్.ఆర్.శంకరన్ పేరుమీద యానాదుల కోసం అభివృద్ధి ప్రయత్నాలు మొదలు పెడుతున్నాడు.

యూనివెర్సిటీల్లో సిద్ధాంతగ్రంథాలు చదివి తోటిమనిషికి చేరువకావడానికి ప్రయత్నించడం ఒకదారి. ఎటువంటి ముందస్తు ఉద్దేశ్యాలూ, పరిజ్ఞానమూ, పరికల్పనలూ లేకుండా ప్రకృతిమధ్యకు పోయి వచ్చినప్పుడల్లా తనలో కొత్తమనిషి మేల్కొంటూ, మనలోని కొత్తమనిషిని మేల్కొల్పడం మరొక దారి. వివేక్‌ది రెండో దారి. సహజమైన దారి.

4

తన యాత్రాకథనాల్లో వివేక్ ఒక అన్వేషిగా మాత్రమే కాదు, ఒక కవిగా, భావుకుడిగా కూడా కనిపిస్తున్నాడు. అతడు తాను నడుస్తున్న దారుల్లో పూర్వకవుల్ని తలుచుకోవడమే కాదు, తానే కవిగా మారుతున్నాడు. ఎందుకంటే, అడివి మాటవినబడగానే అతడి అంతరంగం రెక్కలు విప్పుకుంటుంది. ఎవరో ఏదో ఒక సామెత చెప్పగానే వెంటనే 'చుట్టూ ఎత్తైన కొండలు, మధ్యలో లోయ, లోయలో నీళ్ళు, ఆ నీళ్ళను ఆశ్రయించి బతికే అడవిజంతువులతో బాగా దట్టమైన ప్రదేశం ఊహల్లో మెదుల్తాయి' అని రాసుకున్నాడు ఒకచోట.

అడవీ, కొండలూ అతడి చూపులకి రంగులు అద్దుతాయి, రాగాలు దిద్దుతాయి. తళతళమెరిసే నెమలీకల్లాంటి ఎన్నో పోలికలు ఈ పుస్తకంలో మనకి ప్రతిపుటలోనూ కనిపిస్తాయి. మచ్చుకి కొన్ని చూడండి:

కొండగట్టుమీద నిలబడి చూస్తే అంతా సదరంగానే కనిపిస్తుంది. దిగి చూస్తేనే గుంతమిట్టలు, ఎగుడుదిగుళ్ళు అనుభవమయ్యేది.

లోయలు నల్లని కాటుక అద్దుకుంటున్న వేళ కాంతిపరిక్షేపణ ప్రభావం వల్ల కొండవాలుల్లో మంచుతెరల వంటి పొర ఒకటి ప్రత్యక్షమవుతుంది.

పైటేలకు ఎండకు పెనం మీద రొట్టెలా కొండ పలపల్లాడిపోతోంది.

పుల్లదుమ్మును ఒంటికి పూసుకున్నట్టు పండుటాకుల్తో శిశిరానికి సన్నద్ధ-మవుతున్న మాఘమాసపు అడవి.

కొండశిఖరం పైనుంచి చూస్తుంటే వెండిగిన్నెలా మెరిసే అడవి.

చెవులకు లోలాకుల్లా పండుమాగిన మిరపకాయ తోటలు.

పాముపాకిన మట్టిజాడల్లా మెలికలు తిరిగే అడవిబాటలు.

జీవనదిలాంటి ఏరు ఆ మూలనుంచి ఈ మూలకు ఎవరో గొంతునొక్కినట్టు ఎప్పుడూ వట్టిపోయి ఉంటుంది.

శ్రీశ్రీ పూనినట్టు ఎరుపెక్కింది పడమటి ఆకాశం.

తన భావుకత వల్ల అతడు కొండలు మాట్లాడుకునే మాటలు కూడా వినగలడు. ఈ వాక్యాలు చూడండి. అవి:

సంబరంతో ఉరకలెత్తిన పెన్నా గురించి,అడుగంటిన సోమశిల జలాలు, మిరపతోటల ఘాటువాసన, పాలకంకుల జొన్న సరసాలు, వెన్నెలరాత్రుల్లో చెనిక్కాయ చేలో కూర్చుని దిగంతాలకు చూసే యువరైతు, పట్టణాలకు తరలిపోతున్న కుటుంబాలు, ఫ్లాట్లుగా మారుతున్న పొలాలు, పల్లె సంగతుల గురించి స్థలకాలాతీతమైన కబుర్లెన్నో చెప్పుకుంటూ ఉంటాయి.

అడవి అతణ్ణి రాగద్వేషాలకూ అతీతంగా జరిపి మనుషుల్ని ప్రేమించగల విద్యనేర్పుతున్నదని మనం గ్రహిస్తాం. ఒకప్పుడు రాజద్రోహిగా ముద్రపడ్డ సంబెట వీరనరసింహరాజు తవ్వించిన చెరువు దగ్గర కూచుని వందల ఏళ్ళుగా వేల జంతువులు,

ఎన్ని లక్షల సార్లు తమ దప్పికను తీర్చుకుని ఉంటాయి అనుకుని అతనిపట్ల గొప్ప గౌరవభావం కనబరుస్తాడు.

'అడవి నిగూఢమైంది' అంటాడు ఒకచోట. 'అడవిలో ఒంటరినడక మంచి అనుభవం' అని రాసుకుంటాడు. 'అడవి మార్మికతకు అలవాటుపడ్డ మనిషి జనజీవనంలో ఎక్కువసేపు నిలవలేడేమో అనిపించింది' అని కూడా అనుకుంటాడు. అడవిముందు నిలబడగానే 'లోపలి అలజడులు, భయాలు, పైపైన అపోహలు, నువ్వు నీ చుట్టూ అల్లుకునే బింకపు పొరలు అన్నీ కలసి నిన్ను నీ కళ్ళముందు నిలబెడతాయి' అని అంటూ 'అవసరం అప్పుడప్పుడూ' అని కూడా అంటాడు.

ఇవన్నీ ఏవో పుస్తకాలు చదివితే వచ్చిన భావనలు కావు. ఒక మనిషి తనంతతానుగా అడవినీ, కొండల్నీ, ఊళ్ళనీ ప్రేమిస్తే కలిగే భావనలు. ఇవి అతడిలోని మనిషికి అతణ్ణి సన్నిహితుణ్ణి చేస్తున్నాయి. కాబట్టే, సోమశిల ముంపు గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు, ఇదుగో, ఇటువంటి వాక్యాలు రాయగలిగాడు:

> డ్యాములో మునిగిన గ్రామాల తాలూకు జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యాలన్నట్టుగా అక్కడక్కడా కొన్ని తాటిచెట్లు వరసగా కనబడుతున్నాయి. యుద్ధంలో మరణించిన వాళ్ళకు గుర్తుగా వీరగల్లు వేసినట్టు వేరే ప్రాంతాలకోసం తమ భూములను, అనుబంధాలను, చివరికి ఊర్లనే త్యాగం చేసినవారి కోసం మునకగల్లు లాంటిదేదైనా వేపిస్తే బాగుండు అనిపించింది.

5

ఈ మధ్యకాలంలో యాత్రాకథనాలకు ప్రాచుర్యం లభిస్తోంది. కాని, ఆ యాత్రాకథనాలు రాసేవాళ్ళు, అయితే ప్రపంచపర్యాటకులు లేదా సుప్రసిద్ధ దర్శనీయస్థలాలకు పోయి వచ్చేవాళ్ళు. దాదాపుగా ఆ కథనాలన్నీ అప్పటికే సుస్థిరమైన దారుల్లో మళ్ళా మరొకరు కొత్తగా చేసే ప్రయాణాల కథనాలు. కానీ ఈ సంపుటిలోని యాత్రలు రహదారులమీద చేసినవి కావు. ఇవి కాలిబాటలవెంబడి, మట్టిబాటల వెంబడి, చెరిగిపోతున్న ఆనవాళ్ల వెంబడి చేసిన ప్రయాణాలు. ఒకప్పుడు మనుషులు నడిచిన దారుల్ని కాలం పూర్తిగా మరుగుపర్చకముందే మళ్ళా మరొకసారి ఆ దారుల్నీ, ఆ గాథల్నీ వెలికితీసే ప్రయాణాలు.

ఇంగ్లిషులో road అనీ, path అనీ రెండు మాటలున్నాయి. సాధారణంగా మనం చదివే యాత్రాకథనాలు రోడ్లకి సంబంధించినవి. కానీ ఈ కథనాలు paths కి

సంబంధించినవి. సుప్రసిద్ధ నార్వేజియన్ పర్యాటకుడు Torbjorn Ekelund రాసిన In Praise of Paths (2020) చదివాక గానీ, నాకు road కీ path కీ మధ్య ఉన్న తేడా తెలియలేదు. రోడ్డు మన వయోజన జీవితానికి సంబంధించిన అనుభవం. దాని మీద మనం నడవం. కారులోనో, బస్సులోనో లేదా రైల్లోనో ప్రయాణిస్తాం. కాని path మన బాల్యానికి సంబంధించిన అనుభవం. దాని ద్వారానే మనకి మన నేల, మన ఊరు, మన ప్రపంచం అనుభవంలోకి వస్తాయి. అది మన జీవితానుభవంలో, మన జ్ఞాపకాల్లో ఇంకిపోతుంది. మనం చిన్నప్పుడు ఒక దారిన నడిచి ఉంటాం. అది మన కొండగుర్తు. మనం తిరిగి ఏ దారిలో నడిచినా ఆ దారినే మళ్లా వెతుక్కుంటూ ఉంటాం.

వివేక్ సరిగ్గా ఈ మాటలే రాస్తున్నాడు. చూడండి:

> తర్వాత కాలంలో కొండలు, కోనలు, కనుమలు, జిల్లాలు, రాష్ట్రాలు దాటి ఎన్నెన్నో ప్రయాణాలు చేసానుగానీ నన్ను అడవికి దగ్గర చేసిన ఈ లంకమల దారుల్లో ఇప్పటికీ ప్రత్యేకం. నాటి అనుభవాలు, జ్ఞాపకాలు మదిమూలల్లో ఇప్పటికీ పదిలంగా నిక్షిప్తమై ఉన్నాయి.

Paths once blended into the landscape; they did not destroy it. But roads did అంటాడు Ekelund. కాలిబాటలు, మట్టిదారులు, కొండదారులు, లోయదారులు లాంటి ప్రాకృతికపథాల్లో ప్రయాణించినప్పుడు ఆ దారుల్లో కథలూ, గాథలూ, పురాణాలూ, పూర్వమానవులూ మనకి మళ్ళా కనిపిస్తారు. కాబట్టే వివేక్‌తో పాటు మనం కూడా ఈ దారుల్లో నడుస్తున్నప్పుడు సంబెట వీరనరసింహరాజునో, బుస్సానాయుడినో, రైతుగా పుట్టి రైతుగా పెరిగి రైతు తత్త్వాన్ని పదిమందికి పంచుతూ అవధూతగా మారిన కాశినాయననో చూడగలుగుతాం. దొంగలసాని కొండ దగ్గర నిలబడ్డప్పుడు నెల్లూరు సిద్ధిరాజుతో పొత్తపి రాజులు మల్లదేవ, సోమదేవులకు జరిగిన యుద్ధం మనకి కూడా కనిపిస్తుంది. గుండ్లమాడ శివాలయం దగ్గర గంగరసదేవ మహారాజుల్ని మనం కూడా పలకరిస్తాం. ఘటికసిద్దేశ్వరం దగ్గర అగస్త్యాది సిద్ధ, సాధుపరంపర వెనక మనమూ అడుగులేస్తాం. పెద్దపెద్ద వానలు పడితే తురకల ఝరిలో కత్తులు బయటపడటం మనమూ కళ్ళారా చూస్తాం.

ఏ విధంగా చూసినా ఈ కథనాలు చదవడం గొప్ప అనుభవం. వనవాసి నవలలో కనిపించే మహాలిఖారూప పర్వతశ్రేణి లాంటిదే మన మధ్య మన ప్రాంతంలో మనకూ ఉందనీ, అటువంటి లంకమల శ్రేణులు తమ వనవాసిని వివేక్‌లో వెతుక్కున్నాయనీ

మనకి స్ఫురిస్తుంది. పుస్తకం ముగించేటప్పటికి, వివేక్‌లానే మనం కూడా ఇలా అనుకుంటాం:

> అడుగుబయటపెడితే గమ్యమే చేరాలని లేదు. ఆ ప్రయాణంలో ఎక్కడో ఒకచోట నువ్వు నీకు ఎదురవ్వకపోవు.

15-2-2024

ఒక జీవుడి ఇష్టం

ఈ విద్య దేనికి పనికివచ్చును? ఒక్క తుపాకిముందు నిది యెందుకును పనికిరాదు. ఒకవేళ పనికివచ్చినను చేసెడిదేమి? దేశమున కింకనే విద్యయు అక్కరలేదు.

ప్రతి విద్యకును నాల్గు దశలు! అధీతి, బోధ, ఆచరణ, ప్రచారణము లని. అవి నాల్గు కలిసినచోటే విద్యకు సంపూర్ణమైన స్థితికలదు. నేనొకటి చదువుకుని అది ఇతరులకు చెప్పి దాని నాచరించి యితరుల చేత దాని నాచరింపచేయుట అనునవి నాల్గుదశలు. తనకర్థము కాని దాని నాచరించుటయు, అర్థమైనదాని నాచరించకుండుటయు మన శాస్త్రాలలోనే లేదు.

విద్య యనగానేమి? అక్షరములు నేర్పుటయు, వంకర దస్తూరి వ్రాయించుట-యునా? ప్రతివానికిని సంగీతజ్ఞానము, లయజ్ఞానము కూడ సునిశితమై యుండుట విద్యావిధానములో ప్రధానమైన విషయము. మన పూర్వులు చదువనగా హృదయపరిపాకము కలిగించునది యని యనుకొనిరిగాని కేవలం చదువుట, వ్రాయుట మాత్రమే చదువనుకొనలేదు. పూర్వము విద్యయే యుండినది, లేనిదిప్పుడు..

వెన్ను మీద ఛళ్ళున చరిచినట్టున్న ఈ వాక్యాలు విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు' నవలలోవి.

నిన్న విశ్వనాథ సాహిత్యపీఠం వారు ఆవిష్కరించిన పుస్తకాల్లో 'విశ్వనాథ వేయి పడగలలోని ముఖ్యాంశాలు' అన్నది కూడా ఒకటి. డా.వెల్చాల కొండలరావుగారు సంకలనం చేసిన ఈ పుస్తకాన్ని పరిచయం చేసే బాధ్యత నాకప్పగించారు.

వేయిపడగలు నవలలో వివిధ అంశాల మీద విశ్వనాథ సత్యనారాయణ ప్రకటించిన ఎన్నో అభిప్రాయాల్ని ఆ పుస్తకంలో సంకలనం చేసారు. తన గురించి, విద్య గురించి, భాష, సాహిత్యం, వాఙ్మయం, కావ్యం, రసం, నృత్యం, సంగీతం, శిల్పం, నాటకం, మతం, సాంప్రదాయం, ప్రేమ, వివాహవ్యవస్థ లాంటి విషయాలమీద ఆ నవల్లో ప్రాసంగికంగా వెలిబుచ్చిన అభిప్రాయాలతో పాటు, కొన్ని ఋతువర్ణనలు, కథలు కూడా సంకలనం చేసారు.

విజ్ఞానసర్వస్వాల్లాంటి నవలలు ప్రపంచంలో చాలానే ఉన్నప్పటికీ, ఒక నవలనుంచి ఇటువంటి ఎంపికతో వచ్చిన పుస్తకాన్ని నేనింతదాకా చూడలేదు. 'డేవిడ్ కాపర్ ఫీల్డ్', 'వార్ అండ్ పీస్', 'బ్రదర్స్ కరమజోవ్', 'డాక్టర్ ఫాస్టస్' వంటి నవలలకి లభించని ఈ అపురూప గౌరవం వేయిపడగలకి దొరికింది. ఆ మాటే చెప్పాను సభలో.

ఆ సభలో వేయిపడగలకి ఇంగ్లీషు అనువాదం కూడా ఆవిష్కరణ జరిగింది. అయిదుగురు అనువాదకులు కలిసి చేపట్టిన బృహత్ప్రయత్నం. అందుకుగాను ఆచార్య సి.సుబ్బారావు, వైదేహీ శశిధర్, ఆత్రేయ శర్మ, అరుణా వ్యాస్, నారాయణస్వామిలకు తెలుగుజాతి ఎంతో ఋణపడి ఉంటుంది.

అయితే నేనింతకుముందు 'సంస్కార' నవల విషయంలో చెప్పినట్టుగా, ఇంగ్లిషులో అనువాదం రావడం ఒక ఎత్తు, దాని చుట్టూ ఒక డిస్కోర్సు లేవనెత్తడం మరొక ఎత్తు. విశ్వనాథను సంప్రదాయవాదిగా, అభివృద్ధి వ్యతిరేకిగా, ఫ్యూడలిస్టుగా తెలుగు ప్రపంచం భావించడానికి చాలావరకు వేయిపడగలు నవలనే కారణం. కాని ఆ భావాల్లో చాలావరకు ఈనాడు కొత్తగానూ, కొత్త ప్రాసంగికతతోనూ కనబడటం విశేషం. ముఖ్యంగా విద్య గురించి వేయిపడగలు వ్యక్తం చేసిన భావాలతో ఈ సంకలనం మొదలుపెట్టడం ఎంతో ఆలోచనాత్మకంగా ఉంది.

ఆధునిక తెలుగుసాహిత్యంలో వైతాళిక పాత్ర పోషించిన రచనలు– 'కన్యాశుల్కం', 'గణపతి', 'కోనంగి', 'వేయిపడగలు' వంటివి తెలుగు జాతి ప్రాచీన ఆధునిక విద్యలపట్ల గొప్ప సంఘర్షణకు లోనైన కాలంలో వచ్చిన రచనలు.

భారతదేశం ఆధునీకరణ చెందుతున్న యుగసంధిలో తలెత్తిన ఆ ప్రశ్నలకీ, ఒక శతాబ్ద కాలం తర్వాత మనమంతా ఎదుర్కొంటున్న ప్రశ్నలకీ మధ్య ఎంతో సారూప్యం ఉంది.

ఒక తుపాకి ముందు ఈ విద్య పనిచెయ్యదని విశ్వనాథ ఏ విద్య గురించి మాట్లాడేడో, ఆ విద్య ఇప్పటికీ అలానే ఉంది. విద్య అంటే బలవంతుడి భాష బలవంతంగా నేర్చుకో–వడమని (education is learning the language of the dominant) ఇప్పటి విద్యావేత్తలు వాపోతున్నారు. ఆధునిక విద్య తలెత్తుతున్న తొలినాళ్ళల్లో ఆ విద్యను విమర్శించడాన్ని అభివృద్ధి వ్యతిరేకంగా విమర్శకులు భావించారు. కాని ఇప్పటికి ఆ విద్య స్వరూప స్వభావాలు మనకి బోధపడ్డాయి కాబట్టి, విశ్వనాథ ఆవేదన సహేతుకమేనని మనకి ఒప్పుకోక తప్పట్లేదు.

మరో మాట కూడా చెప్పాను నా ప్రసంగంలో. విశ్వనాథను సంప్రదాయవాదిగా చూడటం ఆయన భావాలకు సమగ్ర రూపాన్నివ్వడం కాదని. ఆయన్ని వివరించడానికి సరైన పదం ఆయన్నొక anti-colonial రచయితగా గుర్తించడం. 'జీవుడి ఇష్టము' (1942) లాంటి కథ రాసేటప్పటికి ఆఫ్రికాలో, లాటిను అమెరికాలో చెప్పుకోదగ్గ యాంటీ కలోనియలు రచన ఏదీ తలెత్తనే లేదు. (ఫ్రాంజ్ ఫానాన్ The Wretched of The Earth రావడానికి ప్రపంచం 1961 దాకా ఆగవలసి వచ్చింది.)

సహృదయంతోనూ కొంత నిశితంగానూ విశ్వనాథను చదివినప్పుడు మనకి తెలిసేదేమంటే ఆయన తన చైతన్యం colonize కాకుండా కాపాడుకోవడానికి ప్రయత్నించాడని. ఆధునిక రచయితలు మానవీయసమాజాన్ని కలగన్న మాట నిజమే గాని అందుకు వాళ్ళు ఎంచుకున్న నమూనాలు కలోనియలు నమూనాలే. Pre-modern సమాజం మాడర్నైజు అయితే మరింత మానవీయంగా మారుతుందనే వాళ్ళు నమ్మారు గాని, ఆ నమ్మకంలో ఎంత అమాయికత్వం ఉందో postmodern thought బయట పెట్టినదాకా మనకు బోధపడలేదు.

గురజాడ, గాంధీ, విశ్వనాథ వంటివారి భావాల్లో సారూప్యత లేకపోయినప్పటికీ, వాళ్ళందరిలోనూ ఉమ్మడిగా కనవచ్చే అంశం, మాడర్నిటీని ధిక్కరించడమే. మాడర్నైజేషనుని ఒక కలోనియలు ప్రక్రియగా నిదానించడంలో వారి జాగరూకత సరైనదేనని ఇప్పుడు మనకి తెలిసి వస్తున్నది.

అలాగని విశ్వనాథ భావాలన్నీ ఆరోగ్యకరమైనవీ, ఆమోదయోగ్యమైనవీ అని కాదు. ఆయన వేయిపడగలు నవలలో తాత్త్వికంగా ఎంత అస్పష్టతకు గురయ్యాడో ఆర్.ఎస్.సుదర్శనంగారు యాభై ఏళ్ళ కిందటనే ఎంతో యుక్తియుక్తంగా విమర్శించారు. కాని ఇప్పుడు మనం చూడవలసింది, చర్చించవలసింది ఆ భావాల కన్నా కూడా ఆ

భావాల వెనక ఉన్న స్వతంత్రతాప్రవృత్తి గురించీ, తాను మానసికంగా colonize కావడానికి ఇష్టపడని ఒక జీవుడి ఇష్టం గురించీను.

18-10-2015

మరోసారి బుచ్చిబాబు గురించి

నిన్న సాయంకాలం బుచ్చిబాబు గారి శతజయంతి వేడుక చాల ఘనంగా జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం సమావేశమందిరంలో జరిగిన సభకు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు ఊహించినంత పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దాదాపు పదిమందికి పైగా వక్తలు. బుచ్చిబాబుగారి ముఖ్యమైన రచనలన్నిటిపైనా ఒక గోష్ఠిలాగా ప్రసంగాలు సాగాయి. ఆ గోష్టిలో పాల్గొనే అవకాశం నాక్కూడా కలిగింది గానీ, చివరి వక్తను కావడంతో రెండుమూడు నిమిషాల కన్నా మాట్లాడటానికి సమయం దొరకలేదు.

కాని ఆ వేడుకలో పాల్గోడమే గొప్ప అదృష్టమనిపించింది. అందుకు శివరాజు సుబ్బలక్ష్మిగారికి ఋణపడి ఉంటాను. ఆ తల్లికి నా పట్ల ఎందుకు వాత్సల్యం కలిగిందో గాని, ఇంతకు ముందు ఒకసారి బుచ్చిబాబు రాసిన 'షేక్స్పియర్ సాహితీ పరామర్శ' మీద నాతో మాట్లాడించేరు. బుచ్చిబాబుగారి నీటిరంగుల చిత్రాల ఆల్బము నాతో ఆవిష్కరింపచేసారు. ఈ సమావేశంలో కూడా నేను కూడా పాల్గోవాలనీ, ఏదైనా ఒక పుస్తకం మీద మాట్లాడాలనీ అన్నారు. అందుకని బుచ్చిబాబు 'నా అంతరంగ కథనం' మీద మాట్లాడాను.

ఇరవయ్యవ శతాబ్ది తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు (శివరాజు వెంకట సుబ్బారావు, 1916-1967) సుమారు ఇరవయ్యేళ్ళ రచనావ్యాసంగంతో కలకాలం నిలిచిపోయే ప్రభావాన్ని వదిలిపెట్టివెళ్ళాడు. ముఖ్యంగా 80 ల్లో తలెత్తిన మా తరాన్ని ఆయన రచనలు చాలా గాఢంగా ప్రభావితం చేసాయి. ఒక్క 'చివరికి మిగిలేది' మాత్రమే కాదు, ఆయన కథలు, నాటకాలు, వ్యాసాలు, ఆయన రాసింది ప్రతి ఒక్కటీ కూడా.

ఆ ప్రభావం చాలా లోతైనదీ, అట్లాంటిది మనమీద ఉందని మనం ఊహించలేనిదీ కూడా. ఉదాహరణకి, నేను తొలిరోజుల్లో (1983) రాసిన ఒక కవితలో –

ఎవడన్నాడోగాని
అవును, మనిషి దారితప్పిన మృగమే
లక్ష్యానికి మార్గమే ఆటంకమా?

రహస్యం చెప్తున్నాను
ఆటంకాన్వేషణే మన అసలైన లక్ష్యం

అని రాసిన వాక్యాల్ని ఎత్తి చూపుతూ సుదర్శనంగారు 'చివరకు మిగిలేది' ని ఉదాహరించారు. అందులో దయానిధి పెళ్ళికాగానే ఆ పెళ్ళి పట్ల ఇష్టంలేదు కాబట్టి, భార్యను ఎట్లా సమీపించాలో తెలియక, ఆ సాయంకాలమే సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్ళిపోయిన సంఘటనను ప్రస్తావిస్తూ ఆటంకాన్వేషణే ఆధునిక యుగలక్షణంగా వివరించి–నప్పుడు మేమంతా ఆశ్చర్యపోయాం.

తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు విశిష్టత ఇక్కడే ఉంది. ఆయనకు ముందు రచయితలు, కవులు జీవితాన్ని నలుపు–తెలుపు రంగుల్లో మాత్రమే చిత్రిస్తూ వచ్చారు. భావకవులూ, అభ్యుదయ కవులూ కూడా జీవితాన్ని రెండు విస్పష్ట శిబిరాలుగా చూడటానికీ, చూపడానికీ ప్రయత్నించేరు. కాని ప్రపంచం మనమనుకున్నంత సరళంగా లేదనీ, జీవితవాస్తవాన్ని చిత్రించడమేమంత సులభంకాదనీ తెలుగులో మనకు చెప్తూ వచ్చిన వాళ్ళు గురజాడ, శ్రీశ్రీ, బైరాగి మాత్రమే. ఆ కర్తవ్యాన్ని వచనరచయితల్లో సమర్థవంతంగా చేపట్టింది పాలగుమ్మి పద్మరాజూ, బుచ్చిబాబూను. అందులో బుచ్చిబాబు మరింత ఉత్సాహంతోనూ, మనకు మరింత దగ్గరగానూ మనతో చాలా విషయాలు పంచుకోవడానికి ఉత్సాహపడ్డాడు.

మనం పాశ్చాత్య సాహిత్యం, తత్త్వచింతన ప్రభావంతో పెరిగాం. కాని యూరోపులో దాదాపు మూడువందల ఏళ్ళకు పైగా పట్టిన పరిణామం తెలుగులో 1850-1950 మధ్యలో వందేళ్ళ కాలంలోనే truncate కావలసి వచ్చినందువల్ల, మనం చాలా సంక్షోభంలోనే మనల్నీ,మన చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ కూడా అర్థం చేసుకోవలసి వచ్చింది. ప్రొ. రఘురామరాజు తరచూ అనేట్టుగా, ఆ అవగాహనా క్రమంలో చాలా గాప్సు వున్నాయి. ఆ ఖాళీలు మనం పూరించుకోవడానికి బుచ్చిబాబు చాలా సహకరించాడు. ఎందుకంటే, ఆయన కూడా అట్లాంటి నలుగులాటనే అనుభవించాడు కాబట్టి.

ఉదాహరణకి, ఆధునిక (modern) ఆధునికత (modernism) అనే రెండు పదాలు తీసుకోండి. మనం చాలాకాలం పాటు ఈ రెండు పదాలూ సమానార్థకాలే అనుకున్నాం.

కాని రెండింటి మధ్యా చాలా తేడా ఉంది. ఆధునిక అంటే యూరోపులో రినైజాన్సుతో మొదలై, age of enlightenment లో ఉచ్చస్థితికి చేరుకున్న ఒక జీవిత దృక్పథం. అది మానవుడే అన్నిటికీ కొలబద్ద అని నమ్ముతూ, ఆలోచనమీదా, హేతుబద్ధతమీదా ఆధారపడ్డ లౌకిక జీవితాదర్శాలని సాధించుకునే ఒక జీవితాభిలాష. దాన్నుంచే సైన్సూ, ఆధునిక విద్య, పారిశ్రామికీకరణ, అధికవస్తూత్పత్తి, ప్రజాస్వామ్యం వికసించేయి.

కాని ఆధునికతావాదం వేరే. అది పందొమ్మిదో శతాబ్దిలో కీర్కుగార్డు, డాస్టవిస్కీ వంటి రచయితల్లో తలెత్తి, ఇరవయ్యవశతాబ్ది ప్రారంభంలో నీషే, హిడెగ్గరు వంటి తత్త్వవేత్తల రచనల్లోనూ, ఇలియటు, పౌండు వంటి కవుల్లోనూ, జాయిసు, కాఫ్కా వంటి రచయిత ల్లోనూ, పికాసో, మాటిస్సే వంటి చిత్రకారుల్లోనూ ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ధోరణి. అది ప్రధానంగా critique of the modern. ఆధునిక జీవితాదర్శాలు కూడా సాంప్రదాయిక జీవితాదర్శాల కన్నా ఏమంత ఘనమైనవీ, విశ్వసించదగ్గవీ కావనే ఒక మెలకువ.

ఈ మెలకువ వెనక బ్రిటిషు అనలిటికలు తత్త్వవేత్తలూ, ఫ్రాయిడు, యూంగు, ఆడ్లరు వంటి మనస్తత్వ శాస్త్రవేత్తలతో పాటు ఐన్‌స్టీను కూడా ఉన్నాడు. ఇంగ్లీషు రొమాంటిక్ కవుల్నీ, మార్క్సు, ఎంగెల్సులను మాత్రమే చదువుకున్న తెలుగుసాహిత్యానికి ఈ ప్రభావాల గురించి శ్రీశ్రీ, బైరాగి, పద్మరాజు, బుచ్చిబాబులు చెప్పకపోయిఉంటే, ఆ ఖాళీలట్లానే ఉండిపోయి ఉండేవి, మనం స్పష్టతకోసం మరొక అర్థశతాబ్దం పాటు వేచి ఉండవలసి వచ్చేది.

తన మీద పడ్డ ఈ ప్రభావాల్నీ, తను తానుగా ఎట్లా రూపొందేడో ఆ వైనాన్నీ అర్థం చేసుకోవడానికి బుచ్చిబాబు రాసుకున్న రచన 'నా అంతరంగ కథనం'. చలంగారి గురించి రాసిన ఒక వ్యాసంలో (సాహిత్యవ్యాసాలు, 2016, పే.69) ఆయన ప్రతి రచయితకీ మూడు బాధ్యతలుంటాయని చెప్తాడు. ఒకటి, తన సమకాలికుల పట్ల. అందుకోసమే, ఉపన్యాసాలివ్వడం, వ్యాసాలు రాయడమంటాడు. రెండవది, భవిష్యత్తు పట్ల బాధ్యత. సృజనాత్మక సాహిత్యం, కథలూ, కవిత్వం రాసేది భవిష్యతరాలకోసమంటాడు. ఇక మూడవది, తన పట్ల తనకుండే బాధ్యత. దానికోసమే ఆత్మకథలూ, అంతరంగకథనాలూ రాసుకోవడమంటాడు. చలంగారి మూజింగ్సుని ఆయన అట్లాంటి అంతరంగకథనంగా భావించేడు.

తాను కూడా అట్లాంటి బాధ్యతతోనే తనని తాను నిశితంగా శోధించుకుంటూ 'నా అంతరంగ కథనం' రాసుకున్నాడు. తెలుగులో అట్లాంటి రచన మరొకటి లేదు. ఒక రకంగా దాన్ని ఒక కేసుస్టడీగా, ఒక మనోవైజ్ఞానిక రచనగా కూడా చెప్పవచ్చు.

ఇంతా చెప్పుకున్నాక, మరొక ప్రశ్న కూడా ఉండిపోతుంది. ముప్పై ఏళ్ళ కిందట వినబడ్డ ప్రశ్న. పాపులరు రచయితలకీ, బుచ్చిబాబుకీ ఉన్న తేడా ఏమిటని? పాపులరు రచయితల రచనలు చదివిస్తాయి, బుచ్చిబాబు కథలు అస్పష్టంగా ఉంటాయనేది. కాని ఇది అపోహ. పాపులరు రచయితల రచనలు నాకెప్పటికీ రీడబులుగా అనిపించలేదు. ఆ రచయితల్లో నాలాంటివాడికి దొరకనిదీ, బుచ్చిబాబులాంటి రచయితలదగ్గర మాత్రమే దొరికేదీ, ఒక దృక్పథం. పాపులరు రచయితలు జీవితసందర్భాన్ని simplify చెయ్యాలని ప్రయత్నిస్తారు. వాళ్ళు సమస్యల్ని చూసేతీరూ, వాటికి పరిష్కారాలు వెతికే తీరూ formulaic గా ఉంటుంది. కాని, బుచ్చిబాబు లాంటి రచయితలు తాము చూస్తున్న వైరుధ్యాల్ని ముందు తమకై తాము సమన్వయించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో వారి నిజాయితీ వల్ల వారి అన్వేషణ మనకి కూడా ఎంతో కొంత దారిచూపించేదిగా ఉంటుంది.

అందుకనే బాపిరాజు గారి గురించి రాసిన వ్యాసంలో (సాహిత్యవ్యాసాలు, పే.76) 'శిక్షణకు గురైన ఉద్రేకం ఒక దర్శనానికి (vision) ఆహుతి అయితే తప్ప గొప్ప చిత్రం రాదు' అని రాస్తాడు. ఈ మాట సాహిత్యసృజనకీ, బుచ్చిబాబు సాహిత్యానికీ కూడా వర్తించే మాటనే.

17-6-2016

నూరు పువ్వులు వికసించనీ

కవిత్వం ఇలానే రాయాలని ఎప్పటికీ ఎవరికీ చెప్పలేం. కవిత్వం లీగలు డాక్యుమెంటు కాదు, రాజకీయ పార్టీలు సమావేశాలు అయిపోయిన తర్వాత బయట మీడియా పాయింటు దగ్గర ప్రెస్సుకి వివరించడంకోసం రాసిపెట్టుకునే ప్రెస్సునోటు కాదు. కవిత్వంలో ఆచి తూచి పదాలు వాడతాము కానీ, అది వేరే తరహా 'మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్'. కవిత్వం ఒక మనిషి తన వ్యక్తావ్యక్తాల్ని రెండు చేతుల్తోనూ బాలన్సు చేసుకునే ప్రక్రియ. అందులో అజ్ఞాతమానసంలో 'శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూచే చప్పుడు' తో పాటు జాగ్రదావస్థకు చెందిన సామాజిక, సామూహిక ఆదర్శాలదాకా అన్నీ ఉంటాయి. ఒక కవి కవిత రాయడానికి పూనుకున్నప్పుడు, 'నువ్వీ పదం రాయకూడదు', 'ఈ సంకేతం వినిపించకూడదు' అని అడ్డుచెప్పడం నిషిద్ధాక్షరిలో మాత్రమే శోభించే చర్య. ఒక కవితని పదే పదే పఠనీయం చేసేది ఆ 'జననాంతర సౌహృదాల' సున్నితమైన సంవేదనలే. కవి తానెంచుకునే శబ్దాల్లో ఆ సూక్ష్మలోక ఛాయలే లేకపోతే, తన ప్రతి పదాన్నీ డెట్టాలులో ముంచి తేల్చడం మొదలుపెడితే, కవిత్వం ఔషధలక్షణాన్ని పోగొట్టుకుని మందుల చీటీగా మిగిలిపోతుంది.

కవిత్వశైలి ఇలానే ఉండాలన్న నియమం కూడా ఏదీ లేదు. ఎవరి కవిత్వధోరణి వారి సంతకం లాంటిది. మనం ఎవరినీ వాళ్ళ సంతకం ఇలానే ఉండాలని ఎలా నిర్బంధించలేమో, వాళ్ళ కవితాధార కూడా ఇలానే ఉండాలని చెప్పలేం. ఒక కవి, తిక్కనలాగా, అల్పాక్షరాల్లోనే అనల్పార్థ రచన చెయ్యగలుగుతాడు. మరొక కవి, శ్రీనాథుడి లాగా, ధారాధునిగా కవిత్వం చెప్తాడు. కవిత్వం రాస్తే ఇస్మాయిలులాగా రాయాలనే నేను చాలాకాలం పాటు భావించాను. కాని ఆ అభిప్రాయం తప్పని నెమ్మదిమీద అర్థమయింది. ఒక కవి కవిత సుదీర్ఘంగానూ, వక్తృత్వసదృశంగానూ ఉండవచ్చు, అయితే ఏమి? అది

అతడి హృదయంలోంచి సూటిగా నిజాయితీగా బయటకి వస్తున్నంతకాలం, నజీం హిక్మత్ లాగా, పాబ్లో నెరుదాలాగా, అది ప్రజాహృదయాల్ని స్పందింపచేస్తూనే ఉంటుంది.

పదిమంది ఆదరించారు కాబట్టి ఒక కవితని గొప్ప కవిత అనలేం. బ్రిటిష్ సామ్రాజ్యం మీద సూర్యుడు అస్తమించని రోజుల్లో టెన్నిసను కవిత్వానికి తిరుగులేదు. కాని ఈ రోజు అతణ్ణి జనాదరణకు నోచుకున్న కవిగా మాత్రమే పరిగణిస్తున్నారు. విలియం బ్లేక్‌ని అతడి జీవితకాలంలో మహాకవిగా ఎవరూ పరిగణించలేదు. కాని ఈ రోజు అతణ్ణి ఒక విజనరీగా, పాత నిబంధన ప్రవక్తలతో సమానమైన ఋషిగా పరిగణిస్తున్నారు. పదిమంది పట్టించుకోలేదు కాబట్టి ఒక కవి కవిగా విఫలమయ్యాడని అనలేం. ప్రాచీన చైనా మహాకవి దు-ఫు గురించి ఈ మధ్య ఎక్కడో చదివాను, అతడి జీవితకాలంలో అతడి కవిత్వం ఒకటి రెండు సంకలనాలకన్నా మించి ఎక్కలేదట. కాని, ఈ రోజు చైనా సాహిత్యచరిత్రలోనే అతడు హిమాలయశిఖరంగా పరిగణించబడుతున్నాడు.

ఒక కవిత వినగానే మనకు అది కవిత్వం అవునో కాదో తెలిసిపోతుందని కూడా చెప్పలేం. మార్క్సిస్టులు చెప్పేట్టుగా ప్రతి కవికీ ఒక వర్గం ఉంటుంది, కాదనలేం. అయితే ఆ కవికి వర్గస్పృహ ఉన్నా, లేకపోయినా, ఆ కవిత్వంలో ఆ వర్గలక్షణాన్ని మనం పట్టుకోవడం ఏమంత కష్టం కాకపోవచ్చు. ప్రతి కవీ తనకు తెలియకుండానే తన కవితలో తన కాలాన్ని లిఖిస్తూనే ఉంటాడు. కాని, ఒక కవిత మహాకావ్యం కావాలంటే మటుకు, ఆ కవి తన వర్గ స్పృహను దాటి కవిత్వం చెప్పవలసి ఉంటుంది. ఒకప్పుడు తాంగ్ వంశ కాలంలో భూస్వామ్య, పాలకవర్గానికి చెందిన కవి అయినప్పటికీ బై-జుయి సామాన్య ప్రజల స్థితిగతులమీద కవిత్వం చెప్పగలిగినందువల్లనే ఆయన్ను నేడు మహాకవిగా పరిగణిస్తున్నాం. ఒక రాజు రాసిన కవిత అయినప్పటికీ, వానాకాలపు పల్లెటూళ్ళు ఎలా ఉంటాయో వర్ణించగలిగింది కాబట్టే, ఆముక్తమాల్యద పునఃపునః పఠనాలకు నోచు-కుంటున్నది.

కవికి ఉన్నట్టే పాఠకుడికి కూడా తీవ్ర పరిమితులుంటాయి. మనకి కొన్ని కవితలు నచ్చుతాయి, కొన్ని నచ్చవు. కొన్నిట్ని బిగ్గరగా పదిమందీ వినేట్టు చదువుతుంటాం, కొన్ని లోపల్లోపలనే తలుచుకుంటూ ఉంటాం. కాని మనకు నచ్చేది మాత్రమే కవిత్వం, తక్కింది కాదనుకోవడం, మనకు నచ్చే వంట మాత్రమే నిజమైన ఆహారం అనుకోడం లాంటిదే. చిన్నప్పుడు మనం మన ఇంట్లో పెరుగుతున్నప్పుడు మన ఇంట్లో మనకి తెలిసే జీవనవిధానం ఒకటే ఉంటుంది. మనం బడికి వెళ్ళాక, మనకన్నా భిన్నమైన వేషభాషలు, ఆహారపు అలవాట్లు, పద్ధతులు ఉన్న పిల్లలు కనిపించగానే ఒక కుదుపుకి లోనవుతాం.

ఆ తర్వాత మన ఊళ్ళో ఉన్న చిన్న బడి దాటి హైస్కూలు వెళ్ళినప్పుడు మరింత పెద్ద కుదుపుకి లోనవుతాం. ఇక పై చదువులకోసం దేశాంతరాలకీ, ఖండాంతరాలకీ వెళ్ళే కొద్దీ ఈ culture shock మరింత తీవ్ర తరంగా ఉంటుంది. కాని విద్య పరమప్రయోజనం ఇక్కడే ఉంది. అది ఈ ప్రపంచం అంటే నువ్వు మాత్రమే కాదనీ, నీకన్నా వేరేలా ఉండే ఇతరులు కూడా ఇక్కడుంటారనీ, వాళ్ళని అంగీకరించడం నేర్పడమే. నీ self ని దాటి నువ్వు other ని అంగీకరించగగలగడమే విద్య. ఆ అవగాహన రానంతకాలం ఆ చదువు చదువుకానే కాదు.

ఒకప్పుడు ప్రతి మతంలోనూ ఎంతో అత్యున్నత ఆదర్శాలు వికసించాయి. కాని, తమ మతానికి చెందని వాళ్ళు కనిపించగానే వాళ్ళ మతాదర్శాలన్నీ గాలికెగిరిపోయాయి. తమలాగా జీవించనివాళ్ళని హిందువులు 'మ్లేచ్ఛులు' అని పిలిచారు. తమ లాగా ప్రార్థించనివాళ్ళని ముస్లిములు 'కాఫిర్లు' అన్నారు. తమలాగా కనిపించనివాళ్ళని యూదులు, క్రైస్తవులు 'జెంటైళ్ళు' అన్నారు. (విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'పురాణవైర గ్రంథమాల' చదివి, ఆ మత్తులో, నేను మ్లేచ్ఛులనే పదం వాడినప్పుడు, మా హీరాలాల్ మాష్టారు నన్ను మందలించడం నేనెప్పటికీ మర్చిపోలేను). తమలాగా జీవించని ప్రతి ఒక్కరినీ భౌతికంగానో, మానసికంగానో నిర్మూలించడానికి ప్రయత్నించే ఈ ఛాందసత్వం నుంచి మతాలైనా ఏదో ఒక మేరకు బయటపడ్డాయిగానీ, సిద్ధాంతాలింకా బయటపడటం లేదు. నీలాగా ఆలోచించని ప్రతి ఒక్కడూ నీ దృష్టిలో ఒక ద్రోహి, ఒక శత్రువు. నీలాగా ఆలోచించని వాడు రాసేది కవిత కాదని భావిస్తుంటే నీకూ మధ్యయుగాల మతోన్మాదికీ మధ్య తేడా ఏమున్నది మిత్రమా!

నీలాగా జీవించనివాణ్ణి నువ్వు మనిషి కాదనుకుంటున్నావంటే నువ్వింకా విద్యా-వంతుడివి కాలేదనే అర్థం. ఇంకా నువ్వు ఇంటిభాషకీ, బడిభాషకీ మధ్య నలుగుతున్నావనే అర్థం. దాన్నుంచి బయటపడితేనే నీ చదువు ముందుకు సాగుతుంది.

'నూరు పువ్వులు వికసించనీ, నూరు ఆలోచనలు సంఘర్షించనీ '.

అందరూ ఒక్కలానే అనుభూతి చెందితే, ఒక్కలానే ఆలోచిస్తే ఈ ప్రపంచానికీ, యంత్రానికీ తేడా ఏముంటుంది? అందుకనే మహాత్ముడు అన్నాడు: 'యంత్రంతో నిర్మించిన వృక్షం ఎలా ఉంటుందో నేనూహించగలను, దాని ఆకులన్నీ ఒక్కలానే ఉంటాయి' అని.

30-3-2018

హిడెగ్గరుకి సమకాలికుడు

నిన్న బస్సులో వస్తూ, A Little Tour Through European Poetry (2015) అనే పుస్తకం తెరిచాను. ఆ పుస్తక రచయిత, జాన్ టేలర్ తన ముందుమాటలో, యూరపియను కవులకీ, తక్కిన కవులకీ (ముఖ్యంగా అమెరికన్ కవులకీ) తేడా ఏమిటి అని ప్రశ్నిస్తూ, పావ్లె గొరనోవిచ్ అనే కవి మాటల్ని తలుచుకున్నాడు. ఆ కవి ఒక కవితలో అన్నాడట కదా: 'యూరపియన్లు హిడెగ్గరుకి సమకాలికులు, అమెరికన్ల గురించి ఆ మాట చెప్పలేం' అని.

నెల రోజుల కిందట, 'అమృతానుభవం' పుస్తకం ప్రతి అందుకోడానికి సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారిని కలిసినప్పుడు, మాటల మధ్య, మీరిప్పుడేం చదువుతున్నారని అడిగితే 'హిడెగ్గరుని' అని జవాబిచ్చారాయన!

ఇప్పుడు అర్థమయింది, ఇక్కడ ఈ ఎనిమిదికోట్ల మంది తెలుగుప్రజల్లో కూడా హిడెగ్గరుకి సమకాలికులు ఒకరున్నారని. (మార్టిను హిడెగ్గరు (1889-1976) జర్మను తత్త్వవేత్త. ఆయనకి రాధాకృష్ణమూర్తిగారు, ఆలోచనలోనే కాదు, chronological గా కూడా సమకాలికులే)

మా మాష్టార్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు, ఒక్కొక్కప్పుడు, ఆయనకి రాజమండ్రి పట్ల ఏ కారణం చేతనో మరీ కోపంగా ఉన్నప్పుడు, 'నేనిప్పుడు ఎవరినీ కలవడం లేదయ్యా, ఒక్క masters ని తప్ప' అనేవారు. మాస్టర్సు అంటే వాల్మీకి, కాళిదాసు, బసవేశ్వరుడు వంటివారన్నమాట. కాని సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారు తానిప్పుడు హిడెగ్గరుని చదువుతున్నానని చెప్పినప్పుడు, ఆయన మాస్టర్సుతో తప్ప, మరెవరి సాంగత్యంలోనూ గడపడం లేదని అర్థమయింది.

'ఏదన్నా రాయకూడదా హిడెగ్గరు మీద' అని నోటిదాకా వచ్చిన అభ్యర్థనని నోట్లోనే కుక్కుకుని, 'మీరు కాఫ్కా మీద రెండువందల పేజీలదాకా రాసి చింపేసారని విన్నాను. ఆ విషయాలు మీ ధారణలో ఉండే ఉంటాయి, వాటిని కాగితం మీద (ఐ–పాడు మీద) పెట్టకూడదా' అన్నాను. 'షేక్ స్పియరు, ఇలియటు, టాల్‌స్టాయి,కీర్కుగార్డు, నీషేల మీద రాసారు కాబట్టి, కాఫ్కా, కామూల మీద కూడా రాస్తే western canon పూర్తిగా పరిచయం చేసినట్టవుతుంది కదా' అన్నాను. 'బోదిలేరు మీద కూడా' అన్నాడు ఆదిత్య పక్కనుంచి. అవును, రాధాకృష్ణమూర్తిగారు బోదిలేరుని ఫ్రెంచిలో చదవడమే కాదు, ఇరవయి కవితలదాకా తెలుగు చేసారని కూడా విన్నాను.

కాని ఇంత తొందరగా, ఈ వ్యాసపరంపర మొదలవుతుందని నేనూహించలేదు. చూడండి, ఇది ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడో, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతకారుడో రాస్తున్న వ్యాసాలు కావు. మన సమకాలికుడైన ఒక తెలుగుభావుకుడు, తెలుగులో, అవును, తెలుగుభాషలో, తెలుగులిపిలో రాస్తున్న వ్యాసాలు.

నేను బిఏలో చేరిన రోజుల్లో, కాలేజీకి వెళ్ళకుండా, కవులచుట్టూ తిరుగుతున్న కాలంలో, జార్జి కాట్లిన్ అనే ఆయన రాసిన 'గాంధీజీ అడుగు జాడల్లో' అనే పుస్తకం నా చేతుల్లోకి వచ్చింది. అందులో ఆయన ప్రాచ్య, పాశ్చాత్య దర్శనాలను పోలుస్తూ, ప్రసంగ–వశాత్తూ మాట్లాడిన మాటలు నాలో గొప్ప తృష్ణని రగిలించాయి. ముఖ్యంగా ఒక వాక్యం 'కీర్కుగార్డు అవునంటే సార్త్ర కాదంటాడు. ..' అనే వాక్యం. కొందరి జీవితాల్ని పుస్తకాలు మలుపు తిప్పుతాయి. నా జీవితాన్ని ఈ వాక్యం మలుపు తిప్పింది. కీర్కుగార్డు (ఏమి విచిత్రమైన పేరు!) ఎవరు? ఆయన అవునని ఎందుకన్నాడు? సార్త్ర ఎవరు? ఆయన కాదని ఎందుకంటాడు? ఈ ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడం కోసం నేను ఫిలాసఫీలో ఎమ్మే చేసాను. ఇప్పుడు ఎందుకు చెప్తున్నానంటే, ఆ రోజు నాకీ వ్యాసం దొరికి ఉంటే నా అన్వేషణ ఎంత సులభతరమై ఉండేది!

ఈ వ్యాసాలు ఒక్కసారిగా, ఒక్క గుక్కలో అర్థమయిపోయేవి కావు. అలాగని, సాఫ్టుకాపీ దాచుకుని, మళ్ళీ ఎప్పుడేనా చదువుదాం లే అని పక్కన పెట్టేవీ కావు. ఒకటికి రెండు సార్లు చదివితే, ఎక్కడో, ఏదో ఒక వాక్యంలోంచి, ఆ అస్తిత్వ విచికిత్సలోకి మనకి దారి తెరుచుకుంటుంది. మరో వ్యాసం కోసం ఎదురుచూడాలన్న తపన మొదలవుతుంది.

29-4-2019

సమన్వయ శీలి

మనకి ఇష్టం ఉన్నా లేకపోయినా గడచిన రెండువందల ఏళ్ళుగా మనం ఆధునీకరణ చెందుతూ ఉన్నాం. ఆధునీకరణ అనే మాటలో, ఆ ప్రక్రియలో ఒక ఉన్నతి, ఉద్ధరణ కూడా ఉన్నాయని నమ్ముతూ వస్తున్నాం. కాని, ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణ అనీ, దానిలో అంతర్గతంగా ఒక వైరుధ్యం ఉందనీ అందరి కన్నా ముందు ఆధునిక యూరపునే తనని తాను అనుమానిస్తూ, ప్రశ్నిస్తూ, ధిక్కరిస్తూ వచ్చింది.

మనం ఇక్కడ ఆధునీకరణ చెందుతున్నప్పుడు మన ఆధునికానుభవంలో ఇంతదాకా ఎదుర్కోని కొత్త సమస్యల్నీ, కొత్త ప్రశ్నల్నీ ఎదుర్కుంటున్నప్పుడు, వాటికి సమాధానాలు అన్వేషించడానికి మన సాహిత్యం, మన సామూహిక సాంప్రదాయిక వివేకం సరిపోవడం లేదు. ఎందుకంటే మనం ఎదుర్కుంటున్న ప్రశ్నలు మనది కాని ఒక జీవనశైలిని మన జీవనవిధానంగా ఎంచుకోవడం వల్ల తలెత్తినవి కావడం. అంతేకాదు, అలా మనమొక నూతన జీవనశైలిని ఎంచుకుంటున్నప్పుడు, ఆ జీవనవిధానాన్ని మనం విముక్తిదాయకంగా భావిస్తూ ఉండటం అంతకన్నా ముఖ్యమైన కారణం. అలాగని ఆ నవీన జీవనవిధానాన్ని ఎంచుకోకుండా ఉండే అవకాశం కూడా లేదు మనకి. మనం ఆధునీకరణ చెందకతప్పదు. అందుకని మనం చెయ్యగలిగిందల్లా ఒకింత మెలకువతో ఆధునీకరణకు లోనుకావడమే.

ఆ మెలకువ ఎట్లా వస్తుంది?

పందొమ్మిదో శతాబ్ది భారతదేశం ఆధునీకరణ ప్రక్రియకు లోనయినప్పుడు రెండు శిబిరాలుగా చీలిపోయింది. ఒకరు మన ప్రాచీన విద్యలే నిజమైన విద్యలని వాదించారు. వాళ్ళని ఓరియెంటలిస్టులన్నారు. మరొక వర్గం మనం పాశ్చాత్య విద్య, గణితం, సైన్సు, ఇంగ్లిషు చదువుకుని తీరాలన్నారు, వాళ్ళని ఆంగ్లిసిస్టులన్నారు. తెలుగు సాహిత్యానికి

సంబంధించినంతవరకూ గురజాడ ఈ రెండు మార్గాల్నీ సమన్వయించుకునే ఒక మధ్యే మార్గాన్ని అన్వేషించుకున్నాడు. కాని, తిరిగి మళ్ళా గురజాడ తర్వాత విశ్వనాథ వంటి 'ఓరియెంటలిస్టూ', శ్రీ శ్రీ వంటి 'ఆంగ్లిసిస్టూ' తెలుగు సాహిత్యాన్ని రెండు శిబిరాలుగా మార్చేసారు. ఆ రెండు శిబిరాల్లోనూ తచ్చాడి, తచ్చాడి, ఏ ఒక్కరూ పరిపూర్ణంగా నన్ను కన్విన్సు చెయ్యలేకపోతున్నారని గ్రహించిన నాకు, మళ్ళా గురజాడ లాగా, రెండు ప్రపంచాల్నీ తనలో పొదువుకుని బైరాగి కనిపించాడు. మానవుడి అస్తిత్వ వేదనను, అర్జునుడు, హామ్లెట్, రాస్కల్నికావ్‌ల వేదనగా వివరిస్తున్నప్పుడు, బైరాగి మరొక అడుగు ముందుకేసాడు. అర్జునుడు భారతీయసాహిత్య ప్రతీక, హామ్లెట్ పాశ్చాత్యసాహిత్య ప్రతీక. కాని రష్యా రెండు ఖండాలకూ చెందిన సంస్కృతి. రాస్కల్నికావ్ అటు యూరోపుకీ, ఇటు ఆసియాకీ కూడా సమానంగా చెందిన ప్రతీక.

బైరాగిని చదివాకనే నాకు ఆధునికతకీ, ఆధునికతావాదానికీ మధ్య తేడా బోధపడింది. మనం ఆధునీకరణ చెందుతున్న క్రమంలో ఎదుర్కొంటున్న సమస్యల్ని, మన ముందు తలెత్తుతున్న ప్రశ్నల్ని అర్థం చేసుకోవాలంటే, కేవలం భారతీయసాహిత్యం చదివితే చాలదనీ, పాశ్చాత్యచింతనకి చెందిన మౌలిక సాహిత్యాన్ని కూడా చదవక తప్పదనీ గ్రహించాను. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే, Western Canon ని అధ్యయనం చెయ్యక తప్పదని అర్థం చేసుకున్నాను.

Western Canon చాలా పెద్దది. ఒక జీవితకాలం సరిపోదు. కానీ, కనీసం పూర్తిచేయవలసిన ప్రస్థానత్రయాలు కొన్నింటిని లెక్కపెట్టవచ్చు. ప్రాచీన గ్రీకు సాహిత్యంలో హోమరు, సొఫోక్లిసు, ప్లేటో; లాటిను సాహిత్యంలో వర్జిలు, హొరేసు, లుక్రీషియసు; మధ్యయుగాల్లో అగస్టైను, ఆక్వినాసు, ఎక్కార్టు; రినైజాన్సులో డాంటే, షేక్‌స్పియరు, సెర్వాంటిసు; ఎన్ లైటెన్‌మెంటు కాలంలో రూసో, వోల్టేరు, గొథే; పందొమ్మిదో శతాబ్దిలో కీర్కుగార్డు, డాస్టవిస్కీ, బోదిలేరు; పందొమ్మిది–ఇరవయ్యవ శతాబ్ది మధ్యకాలంలో టాల్‌స్టాయి, నీషే, హిడెగ్గరు; ఇరవయ్యవశతాబ్దిలో ఇలియటు, కాఫ్కా, బోర్హెసులు.

వీళ్ళని చదివితే, పాశ్చాత్యప్రపంచపు జీవనాడి దొరుకుతుంది మనకి. ఎట్లానో కష్టపడి, ఇంగ్లీషు కూడబలుక్కుంటూ, ఈ రచయితల్లో ప్రతి ఒక్కరివీ కనీసం ఒక్క పుస్తకమేనా చదివాను. కాని, పూర్తి అధ్యయనం చేసానని చెప్పలేను. చదవడం ఎలా ఉండాలి అంటే బైరాగి షేక్‌స్పియర్ని చదివినట్టుండాలి. అలా చదవగలిగిన మనిషి, తాను చదువుకుని, చదివినదాన్ని మనకి విడమరిచి చెప్పే గురువు ఎక్కడ దొరుకుతారు?

అట్లాంటి అట్లా వెతుక్కుంటూ ఉండగా సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారు కనబడ్డారు నాకు. అరుదైన వ్యక్తి, అపురూపమైన పాఠకుడు, చదువుల్లో 'మర్మమెల్ల' చదివినవాడు. ఉపనిషత్తులు, గీత చదివినవాడు. కానీ 'ఓరియెంటలిస్టు' కాదు. ఇంగ్లిషు ఉపన్యాసకుడే కానీ 'ఆంగ్లిసిస్టు' కాదు. ఆశ్చర్యం! బైరాగిలాగా ఈయన కూడా భగవద్గీతనీ, షేక్ స్పియరునీ, డాస్టవిస్కీనీ క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు. ఆ అధ్యయన సారాంశాన్ని బైరాగి కవిత్వంగా అందిస్తే, ఈయన వ్యాఖ్యానాలుగా అందిస్తున్నారంతే.

గురజాడలాగా, బైరాగిలాగా, సూరపరాజు రాధాకృష్ణమూర్తి కూడా మధ్యేవాది, సమన్వయశీలి.

ఆ సమన్వయ ఫలితంగా నేడు ఆయన మనకి అందిస్తున్న రెండు పుస్తకాలు, 'షేక్స్పియర్ సాహిత్యలోకం', 'ద వేస్ట్ లాండ్: మరో నాలుగు కవితలు' నా వరకూ నాకు చాలా విలువైనవి. మీకు కూడా విలువైనవనిపిస్తే, ఈ సాయంకాలం, పుస్తక ఆవిష్కరణ సభకు తప్పకుండా రండి.

14-9-2019

ఆ బంభర నాదం

మాష్టారి అబ్బాయి మార్కండేయులు మాష్టారి పద్యాలు పంపించాడు విను అని అక్క నిన్న నాకు వాట్సపులో పంపించింది. ఎప్పటి పద్యాలవి! ఆ పద్యాలు చదువుతుండగా వినిపించిన కరతాళధ్వనుల్ని బట్టి, అవి 1983 లో నన్నయ సహస్రాబ్ది ఉత్సవాల్లో, ఆనం– శ్రీవెంకటేశ్వర కళాకేంద్రంలో మాష్టారు చదివిన పద్యాలని గుర్తుపట్టగలిగాను.

ఆ రోజు నాకిప్పటికీ గుర్తే. పొద్దుణ్ణుంచీ నన్నయ మీద ఎందరో వక్తలు ఏకధాటిగా ప్రసంగిస్తూనే ఉన్నారు. అసలు నన్నయ అనగానే అందరికన్నా ముందు మాష్టారు కదా మాట్లాడాలి. కాని రాజమండ్రి ఆయనకి ఆ గౌరవం ఇవ్వలేకపోయింది, అలాగని పక్కన పెట్టలేకపోయింది కూడా. ఆ రోజు ఆయన్ని అందరికన్నా చివరి వక్తగా, ఇక భోజన విరామానికి ముందు వక్తగా పిలిచారు. అప్పటికే హాల్లో శ్రోతలు పలచబడటం మొదలు పెట్టారు. వేదిక మీద వక్తలు కూడా ఒకరూ ఒకరూ జారుకుంటున్నారు. అప్పుడు, అలాంటి, ఉదాసీన క్షణాల్లో, మాష్టారు నన్నయ గురించి మాట్లాడాలి!

కాని ఆ రోజు ఆయన ప్రసంగించలేదు. తనలో ఉబికి వస్తున్న ఆవేశాన్నీ, అసహనాన్నీ దాచుకునే ప్రయత్నమేమీ చెయ్యలేదు సరికదా, 'ఇది శాస్త్ర వేదిక కాదు, సాహిత్య వేదిక. మనం ఇక్కడికి వచ్చింది మనకేం తెలుసో చాటుకోడానికి కాదు, నన్నయ కవిత్వమెటు–వంటిదో పంచుకోడానికి. ఏదీ? ఇంతదాకా ఎవరూ ఆ పని చెయ్యరేం? ఇందాకణ్ణుంచీ చూస్తున్నాను, ఇక్కడ సరస్వతీదేవి కనిపిస్తుందేమోనని. ఏదీ ఆమె? ఎక్కడుంది? ఇంతసేపూ మాట్లాడిన వక్తల వాగ్ధాటికి నొచ్చుకుని ఈ ప్రాంగణంలో అడుగుపెట్టడానికే సంకోచిస్తూ ఉండిపోయినట్టుంది. ఇదిగో, ఇప్పుడు నేను ఆమెని ఆహ్వానిస్తాను, గొంతెత్తి రమ్మని పిలుస్తాను, వినండి, మీకు ఆమె నూపురధ్వని వినిపించిందో లేదో చెప్పండి' అంటూ ఎలుగెత్తి నన్నయ పద్యాలు ఒకటొకటే ధారాపాతంగా, ధారణలోంచి వినిపించడం

మొదలుపెట్టారు. ఆ పద్యాల్లో, వసంత ఋతువుని నన్నయగారు వర్ణించిన రెండు పద్యాలూ (ఆదిపర్వము, 5: 138–139) కూడా చదివారు. ఆ పద్యాలే, ఇదిగో, ఇక్కడ వినండి. ఆ కంఠం, ఆ బంభరనాదం, ఒక సరస్వతీ ఉపాసకుడు పంచాక్షరి జపించినట్టుగా పద్యపదాల్ని ఎలా జపిస్తున్నాడో వినండి.

కమ్మని లతాంతముల కుమ్మొనసి వచ్చు మధు
పమ్ముల సుగీత నినదమ్ములెసగెం చూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధిముకు
ళమ్ములను నానుచును ముదమ్మొనరవాచా
లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము మధు
రమ్మగుచు విన్చెననిశమ్ము సుమనోభా
రమ్ముల నశోక నికరమ్ములను చంపక చ
యమ్ములును కింశుక వనమ్ములును నొప్పెన్

చందన తమాల తరులందు నగురు
ద్రుమములందు కదళీవనములందు లవలీమా
కందతరుషండముల యందు అనిమీలదర
విందసరసీవనములందు వనరాజీ
కందళిత పుష్పమకరంద రసముందగులు
చుందనుపు సౌరభమునొంది జనచిత్తా
నందముగ బ్రోషితుల డెందములలందురగ
మంద మలయానిల మమందగతివీచెన్

కాని ఇన్నేళ్ళ తరువాత, ఆ పద్యాలు వినగానే నాకు చెప్పలేనంత దిగులు కమ్మేసింది. ఆ రసజ్ఞుడు ఇప్పుడు మనమధ్య లేడని మాత్రమే కాదు, అసలు, ఆంధ్రదేశంలో ఏ పట్టణంలోనైనా, ఏ కవి గురించైనా అలా ఎలుగెత్తి పద్యాలో, గేయాలో చదివే వక్తలెవరేనా ఉన్నారా ఇప్పుడు? అలా ఒక రసజ్ఞుడు ఎలుగెత్తి, మేఘగంభీరస్వరంతో పద్యాలు చదువుతోంటే, భయంతో, భక్తితో, వినమ్రతతో అట్లా ఆ రోజు రాజమండ్రి ఆ ఉద్గాత ముందు చెవి ఒగ్గినిలబడిపోయినట్టుగా ఇప్పుడు ఏ పట్టణమేనా చెవి ఒగ్గడానికి సిద్ధంగా ఉందా? ఏమై పోయింది ఆ కాలం? ఆ రసజ్ఞులు? తే వందినః? తాః కథాః?

19-4-2021

ఆయన వెంట నడుస్తూనే ఉన్నాను

ఈ రోజు చలంగారి పుట్టినరోజు. ఆయన గురించి తెలుచుకోడానికి విస్తృతమైన ఆయన సాహిత్యం ఉంది. ఆ పుస్తకాల్లో ఏ పుట తెరిచిచూసినా మనల్ని నిలననివ్వనంత గాఢ భావోద్వేగంతో ఆయన అనుభవాలూ, భావాలూ మనల్ని చలింపచేయడానికి సిద్ధంగా ఉంటాయి.

చలంగారిని తలుచుకుంటూ ఈ పొద్దున్నే ఆయన పుస్తకాలు తెరిస్తే, నేను కూడా ఒక జీవితకాలం పాటు ఆయన వెంట నడుస్తూనే ఉన్నానని అర్థమయింది. ఒకప్పుడు యవ్వనంలోకి అడుగుపెడుతున్న రోజుల్లో, ఈ ప్రపంచం ఇలా ఎందుకు ఉందో అర్థం కాక, ఆ అగమ్య మనఃస్థితి కోపంగానో, ద్వేషంగానో, లేదా ఇప్పటి భాషలో చెప్పాలంటే ట్రోలింగుగానో మారనున్న కాలంలో చదివాను 'శశాంక' నాటకం. పదిహేడేళ్ళ వయసులో.

ఆ నాటకం, ఆ కథ, ఆయన శైలి అలా ఉంచి, ఈ సంభాషణ నా యవ్వనకాలపు అజ్ఞానం మీద ఒక ఉరుములాగా విరుచుకుపడింది. ఆ సంభాషణలో బృహస్పతి మాట్లాడిన ప్రతి ఒక్కమాటా నా రక్తంలోకి చొచ్చుకుపోయింది. నలభయ్యేళ్ళకు పైగా గడిచిపోయిన తర్వాత, మళ్ళా ఇన్నాళ్ళకు ఆ నాటకం తెరిచి, ఈ పొద్దున్నే ఆ సంభాషణ మరోసారి చదువుతుంటే, ఏ ఒక్క వాక్యం కూడా నేను మర్చిపోలేదనీ, ఆ వాక్యాలే ఇన్నేళ్ళుగా నా తత్త్వశాస్త్రంగా నన్ను నడిపిస్తూ ఉన్నాయనీ అర్థమయింది.

ఆ సంభాషణ చూడండి. తార తప్పుచేసిందనీ, కాబట్టి ఆమెని ఉపేక్షించకూడదనీ తక్కిన ఋషులూ, మునులూ దేవేంద్రుడూ చెప్తూన్నప్పుడు బృహస్పతి చెప్తున్న మాటలు:

గౌతముడు: ఇంక నీతీ, దుర్నీతి విచక్షణ లేదూ?

బృహస్పతి: ఇతరుల జీవితంలో నీతి, దుర్నీతుల్ని నిర్ణయించే న్యాయాధికార పీఠానికి నిన్ను అభిషిక్తుణ్ణి చేసిందెవరు? ఆ విచక్షణ నీ జీవితాన్ని దిద్దు-కునేందుకు వుపయోగపడాలి. లోకాన్ని దిద్దేందుకు కాదు.

.....

గౌతముడు: ఆత్మాభివృద్ధికోసం, ధర్మబోధనకై-

బృహస్పతి: (చాలా emotion తో) గౌతమా, అజ్ఞానంతో, దుర్బలత్వంతో, మూర్ఖంతో సమస్త రోగ యీతిబాధలూ లోనై కర్మవశాన జరామరణాదులనించి విముక్తిగానక, అంధకారంలో మూల్గే ఈ ప్రాణికోటికంతా ధర్మబోధన చేస్తావా? గౌతమా, వారి ఆత్మాభివృద్ధి చెయ్యాలనే సంకల్పం వాస్తవంగా నీకుందా? వుంటే ప్రేమించు. సమస్తజీవుల్నీ ప్రేమించి, నీ కన్న, నీ తపస్సు కన్న, నీ భార్యకన్న, నీ యీశ్వరుడి కన్న, అధికంగా దుర్గతిలో పెనుగులాడే యీ లోకాన్నంతా ప్రేమించు. కల్మషమంతటితోనూ, యీ ప్రపంచాన్ని నీ హృదయానికద్దుకో. పాపంలో మునిగినకొద్దీ, అంధకారంలో జారినకొద్దీ, నీ చేతుల్ని యింకా కిందికి చాచి, హృదయానికింకా దగ్గరగా హత్తుకో, ఖండించకు, శిక్షించకు-

గౌతముడు: వారి కర్మానుసరణంగా జీవులు అనుభవిస్తారు. మనమేం చెయ్యగలం?

బృహస్పతి: నిజం, యేమీ చెయ్యలేము. ఈశ్వరుడికే లేదు ఆ శక్తి. నిస్సహాయులము. ప్రేమించగలము. అంతే!

గౌతముడు: ప్రేమించి-ఏమిటి లాభం?

బృహస్పతి: వారి పారిశుద్ధ్యం కోసం కాదు- నీ ఆత్మపారిశుద్ధ్యం కోసమోయీ!

1937 లో రాసాడు ఆయన ఈ నాటకం. విజయవాడ వదిలిపెట్టి పూర్తిగా అరుణాచలం వెళ్ళిపోడానికి కనీసం ఇరవయ్యేళ్ళ ముందు. ఈ సంభాషణలోని గౌతముడూ, బృహస్పతీ ఇద్దరూ చలంగారే. ఈ లోకాన్ని సంస్కరించాలనే ఒక ఉద్యమకారుడు, సంఘ-మాలిన్యాన్ని ఎత్తి చూపడం, విమర్శించడం, ఆగ్రహించడం కాదు, వీలైతే కల్మష-మంతటితోనూ, ఈ ప్రపంచాన్ని హృదయానికి హత్తుకోమనే నిష్కారణ ప్రేమికుడూ ఇద్దరూ చలంగారే. ఈ ద్వైదీభావం, ఈ రెండు ప్రవృత్తులమధ్యా ఒక సంఘర్షణ ఆయనలో

చివరిదాకా కనిపిస్తుంది. కాని రానురాను ఆ విమర్శకుడు బలహీనపడిపోతూ, ఆ ప్రేమికుడు బలపడుతూ రావడం మనకి కనిపిస్తుంది. విమర్శ సరే, దాన్ని వదిలిపెట్టగలిగాడు,

కాని బాధ్యత? ఈ లోకం మంచి చెడులు నేను పట్టించుకోకపోతే మరెవరు పట్టించుకుంటారనే ఒక ఆవేదన, బాధ్యత రూపంలో ఆయన్ని వదల్లేదు. కాని ఆ బాధ్యత కూడా సూక్ష్మస్థాయిలో తన అహంకారం కల్పిస్తున్న భ్రమనే అని గుర్తుపట్టాకనే ఆయన 'మార్తా' నవల రాసాడు.

ఓరీ మూర్ఖా, నిన్ను నువ్వు
నీ భుజాల పైన మొయ్యాలనుకుంటున్నావా?
ఓరీ భిక్షుకా, నీ వాకిట్లో నువ్వే బిచ్చమెత్తుతావా?
భారాలన్నీ మోయ సమర్థుడైన ప్రభువు హస్తాల్లో
సమస్తమూ వొదులు
పశ్చాత్తాపంతో వెనక్కి చూడకు.
తన శ్వాసతో తాకిన దివ్వెనుంచి
వెలుగుని ఆర్పేస్తుంది నీ కాంక్ష.
అపవిత్రమైన దాని హస్తాలతో
ఏ కాన్కనీ అంగీకరించకు.
నిర్మలమైన ప్రేమ నీకు ఏది ఉపాదానమిస్తే
దానినే స్వీకరించు.

గీతాంజలి లోని ఈ కవితని టాగోరు రాయకపోయి ఉంటే, 1950ల్లో చలంగారే రాసి ఉండేవాడు.

ఈ రోజు అధికసంఖ్యాకులైన హిందువులు ఈ దేశంలో అల్పసంఖ్యాకులు ఏమి తినాలో, ఏది ధరించాలో, ఏమి మాట్లాడాలో చెప్తూండటానికీ , గత నలభయి, యాభై ఏళ్ళుగా అన్ని రకాల ప్రగతిశీలవాదులూ, అభ్యుదయవాదులూ ప్రజలేమి ఆలోచించాలో, ఏది రాయాలో, దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో శాసిస్తున్నట్టుగా చెప్తూండటానికీ మధ్య తేడా ఏముంది?

ఇప్పటికీ ఈ జాడ్యం మన సాహిత్యంలోనూ, మన ప్రగతిశీల ప్రసంగాల్లోనూ కొట్టొచ్చి కనబడటం లేదా? చుట్టూ ఉన్న సమాజం అజ్ఞానంలో కూరుకుపోయి ఉందనీ, దాన్ని ఎలాగేనా ఉద్ధరించే బాధ్యత తమ మీదనే ఉందనుకునే ఈ brown man's

burden ని ఈ సమాజమింకా ఎంత కాలం మొయ్యాలి? మతమౌఢ్యం మధ్యయుగాల జాడ్యమైతే సిద్ధాంతమౌఢ్యం ఆధునిక యుగజాడ్యం.

ప్రేమించడానికీ, ద్వేషించడానికీ మధ్య తేడా, మనం అంటే అక్షరాస్యులం, ఇంకా తెలుసుకోలేకపోతున్నాం. మనకన్నా భిన్నమైన ఆలోచనా సరళి ఉన్నవాణ్ణి ఎంత ద్వేషిస్తే, మనం ప్రేమిస్తున్నామనుకునేవాళ్ళకు అంతదగ్గరగా జరుగుతున్నాం అనుకుంటున్నాం. నిజానికి, ముందు మనం నేర్వవలసింది, భిన్నాభిప్రాయాలుంటాయని ఒప్పుకోవడం. భిన్నాభిప్రాయాలుంటాయని ఒప్పుకోవడం భిన్నాభిప్రాయాల్ని ఒప్పుకోవడం కాదు. ముందు నువ్వు నమ్మేదానికన్నా భిన్నంగా మరొకడు నమ్ముతున్నాడనీ, అలా నమ్మే హక్కు అతడికుందని నువ్వు అంగీకరించగలిగితే, ఆ తర్వాత చరిత్ర గతి ఎలా నడవాలో, మీ ఇద్దరి అభిప్రాయాలూ తేల్చుకుంటాయి.

దురదృష్టవశాత్తూ మనం సాధన చేస్తున్నది రాజీపడకుండా మన అభిప్రాయాల్ని నిలబెట్టుకోవడమెలా అన్నది. కాని నిజంగా కావలసింది, రాజీ పడినా సరే, ప్రేమించడ–మెట్లా అన్నది. చలంగారు జీవితకాలం చేసింది అదే. అందుకనే, ఈ కవిత (ఉత్తరణ: 59) కూడా టాగోరు రాయకపోయి ఉంటే, ఆయనే రాసి ఉండేవాడు:

నీకు చోటు చెయ్యడానికి, ఎవరినీ పక్కకి
వొత్తిగించనక్కర్లేదు. ప్రేమ నీ కోసం ఆసనాన్ని
సిద్ధం చేసిందంటే, అందరికీ చోటు చేసిందన్నమాట.

ప్రపంచప్రభువులు వొచ్చినప్పుడు భటులు,
గుంపుని తోసేస్తారు, నా ప్రభో! నువ్వు వొచ్చినప్పుడు
ప్రపంచాన్నంతా నీ వెంట పెట్టుకొస్తావు.

19-5-2022

An aesthetic healer

డా. నారాయణరెడ్డి తెలుగువారి కీర్తిని ఇనుమడిరపచేసిన కవి, పండితుడు, విద్యావేత్త, అన్నిటికన్నా మించి మంచి మనిషి. నా చిన్నప్పుడు స్కూల్లో ఆయన పుస్తకాలు బహుమతిగా పొందిన రోజులనుంచి ఈ ఊళ్ళో ఆయనతో పాటు కలిసి సాహిత్యసమావేశాల్లో పాల్గొనే రోజులదాకా డా. నారాయణరెడ్డిగారితో నా ప్రయాణం కొనసాగింది. ఆయన నా పట్ల చూపించిన ప్రేమాదరాలు నేనెప్పటికీ మర్చిపోలేను. అటువంటి విద్వన్మణి నావంటివాణ్ణి కూడా తనతో పాటు సమానంగా ఆదరించిన ఎన్నో సమయాలు నాకు గుర్తొస్తూ ఉన్నాయి. సుశీలా నారాయణరెడ్డిగారి పేరు మీద ఏర్పాటు చేసిన ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం గతంలో మా అక్క డా.వీరలక్ష్మిదేవికి లభించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ ఉన్నాను.

ఈనాడు ఈ పురస్కారం అందుకోబోతున్న కుప్పిలి పద్మ తెలుగు సాహిత్యంలో అద్వితీయ భావుకురాలు, రచయిత్రి, కవయిత్రి. ఆమెకీ నాకూ మధ్య నలభయ్యేళ్ళ స్నేహం. మేము అప్పుడప్పుడే రచనలు మొదలుపెట్టిన తొలిరోజుల్లో రాజమండ్రిలో సాహితీవేదిక అనే సంస్థలో కలుసుకున్నాం. సాహిత్య అధ్యయనాన్నీ, సృజననీ ఎంతో ప్రజాస్వామికంగా ప్రోత్సహించిన ఆ సంస్థ రచయితలుగా మా భవిష్యత్తుని తీర్చిదిద్దింది. అందుకని పద్మకి ఈ పురస్కారం లభిస్తున్న వేళ, ఒక సహసాహిత్యవిద్యార్థిగా, గోదావరికి, సాహితీవేదికకి, మా సాహిత్యగురువులకి నమోవాకాలు సమర్పిస్తున్నాను.

తెలుగు సాహిత్యంలో పద్మ స్థానం గురించి, తెలుగు సమాజానికి ఆమె అందించిన ఉపాదానం గురించి ఆలోచిస్తూ ఉంటే, నాకు ఆమె జీవితానికి సంబంధించిన ఒక విషయం గుర్తొస్తున్నది. అది ఆమె కుటుంబానికి సంబంధించిన విషయమే అయినప్పటికీ, ఇక్కడ మీతో పంచుకోవడం సముచితమే అనుకుంటున్నాను.

పద్మ తల్లిగారి తల్లిగారు అంటే అమ్మమ్మ, ఆమెకి ఇంకా పెళ్ళికాకముందు ఒక పెళ్ళి చూడటానికి వెళ్ళారట. అక్కడ పెళ్ళికొడుకు అంధుడు. ఆయన తన ఎదట ఉన్న వధువు మెడలో తాళికట్టబోతూ తన పక్కనున్నవారితో ఆ నవవధువు కళ్ళు తడిగా ఉన్నాయేమో చూడమని అడిగాడట. ఆమె కళ్ళనిండా నీళ్ళున్నాయని చెప్పారు వాళ్ళు. అంతే, ఆయన ఆ తాళికట్టలేదట. ఒక అంధుణ్ణి పెళ్లిచేసుకుంటున్నందుకు ఆమె విలపించడం తనకి ఇష్టం లేదనీ, తాను ఆమెను జీవితాంతం బాధపెట్టలేననీ చెప్పాడుట ఆయన. పద్మ వాళ్ళ అమ్మమ్మగారు ఆ దృశ్యం చూసారు. ఇంటికొచ్చి తన తల్లిదండ్రుల్తో తనకి ఆయన్ని పెళ్ళి చేసుకోవాలని ఉందని చెప్పారు. అదేమిటి అనడిగారు తల్లిదండ్రులు. 'అవును, వాళ్ళంతా ఆయన నేత్రాలు చూసారు, నేను ఆయన హృదయం చూసాను' అని అన్నారట ఆమె.

పద్మకి ఆమె వారసత్వం లభించిందని అనుకుంటున్నాను. తన చుట్టూ ఉన్న ప్రపంచం అంధ ప్రపంచం అని తెలిసినా కూడా పద్మ ఈ ప్రపంచాన్ని ఎంతో ప్రేమతో అక్కున చేర్చుకున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఈ నిష్ఠురప్రపంచానికి సాహిత్యసేవ చేస్తూనే ఉన్నారు.

ఆమెని స్త్రీవాద రచయిత్రి అని గాని లేదా మరికొంత ముందుకు వెళ్ళి మిలిటెంటు ఫెమినిస్టు గానీ అనడం ఆమె సాహిత్యవ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా పట్టిచ్చే మాట కాదు. ఆమె అన్నిటికన్నా ముందు భావుకురాలు. కోమలహృదయ. ప్రకృతిప్రేమికురాలు. ఋతు–పరిభ్రమణం మన చుట్టూ వికసింపచేసే రంగుల్ని కళ్ళప్పగించి చూస్తూ విభ్రాంతంగా నిలబడిపోయే ఒక ముగ్ధ బాలిక. అకారణంగా మనుషుల్ని ఇష్టపడే ఒక అమాయిక. రెక్కలున్నది సంతోషంగా ఎగరడానికే అని నమ్మే ఒక సీతాకోక చిలుక.

కాని ఆమె అక్కడితోటే ఆగిపోయుంటే కవి మాత్రమే అయి ఉండేవారు. గొప్ప కవులు తమ జీవితకాలమంతా ఒక lost paradise కోసం తపిస్తూ ఉంటారని మనకు తెలుసు. పద్మ కూడా ఆ తొణికిన స్వప్నం గురించి రాస్తారు. కానీ ఆమె అక్కడే ఆగిపోలేదు. తన బయట ప్రపంచంలో ఆర్థిక–సామాజిక పరిణామాల్ని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించగల దృష్టి కూడా ఆమె సొంతం. అదే ఆమెను కథకురాల్ని చేసింది. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనీ, కుటుంబ, ఉద్యోగ సంబంధాల్లో ఆధిపత్యధోరణుల్ని ధిక్కరించాలనీ స్త్రీవాదులు చెప్తారు. పద్మ కూడా ఆ మాటలు చెప్తారు. కానీ ఆమె అవగాహన అక్కడికే పరిమితం కాదు. స్త్రీలు ప్రేమపేరిట చాలాసార్లు తమ మీద ఆధిపత్యాన్ని పురుషులచేతుల్లో తామే స్వయంగా పెడతారని కూడా ఆమె హెచ్చరిస్తారు. ఆర్థిక

స్వాతంత్ర్యానికి మానసికస్వాతంత్ర్యం జతకూడకపోతే స్త్రీలు రెట్టింపు అణచివేతకి గురవుతారని పదే పదే చెప్తారామె. స్త్రీ శరీరం మీద స్త్రీకే పూర్తిహక్కులు ఉండాలనేది స్త్రీవాదం మనకి నేర్పిన పాఠం. తన శరీరం మీద తనకు పూర్తిహక్కులు సిద్ధించాలంటే స్త్రీ ముందు తన మనసు మీద తాను పూర్తిహక్కులు నిలుపుకోవాలనేది పద్మ చెప్పే పాఠం.

2000 తర్వాత ఆమె కథల్లో గ్లోబలైజేషన్ ప్రధాన నేపథ్యంగా మారింది. సమాచార ప్రసార సాధనాల్లో సంభవించిన అపూర్వమైన వేగం, దేశాల సరిహద్దుల్ని దాటిన ఉద్యోగిత, మన సామాజిక-రాజకీయ జీవితాన్ని శాసిస్తున్న కార్పొరేటు ప్రయోజనాలు, జీవితపు అన్ని పార్శ్వాలనూ ఆవరిస్తున్న వస్తువినిమయ సంస్కృతి- వీటి మధ్య స్త్రీపురుషులు సహోద్యోగులుగా, స్నేహితులుగా, ప్రేమికులుగా మారడానికి చేసే ప్రయత్నాలు, అవి పదే పదే విఫలమవుతూ ఉండటం, అయినా మరొకసారి తమని తాము కూడదీసుకుని వారు తమని తాము మనుషులుగా తీర్చిదిద్దుకోడానికి చేసే ఉద్యమాలు-ఇవన్నీ పద్మ కథల్లో కనిపించినంత శక్తిమంతంగా నేటి తెలుగు సాహిత్యంలో మరెక్కడా కనిపించవు.

అత్యంత ప్రాచీన మానవసమాజాల్లో కవి భిషక్కు కూడా. అంటే ఒక healer కూడా. మనం అనుభవిస్తున్న రుగ్మతలకి రోగనిదానం చేయగలగడమే ఒక రచయిత నెరవేర్చగల గొప్ప బాధ్యత. పైకి చెప్పకపోయినా మనం ఇప్పటికీ మన కవిరచయితల నుండి కోరుకుంటున్నది ఇదే. మన రహస్యవేదనలనుంచి మనకు ఎంతో కొంత స్వస్థత చేకూరుస్తారని వాళ్ల వైపు చూస్తూ ఉంటాం. గ్లోబలైజేషను యుగంలో మన సంబంధాల్లో పదే పదే బయటపడుతున్న రుగ్మతలకు కారణం బయటి జీవితంలో ఎంత ఉందో, మన ఆంతరంగిక ప్రపంచంలో కూడా అంతే ఉందని చెప్పడం పద్మ మనకి చేకూరుస్తున్న స్వస్థత. కాని ఆమె తాను చేస్తున్న రోగనిర్ధారణని కేవలం clinical గా కాక, ఎంతో lyrical గా వివరిస్తారు. అపురూపమైన ఆ శైలి వల్ల, ఆ కథనం వల్ల ఆమెని ఒక aesthetic healer అనవచ్చునుకుంటాను.

ఒక స్త్రీ చదువుకుంటే ఒక కుటుంబం చదువుకుంటుందని పూర్వం అనేవారు. కాని ఆ మాట ఇప్పుడు చిన్నమాట. ఒక స్త్రీ చదువుకుంటే ఒక తరం మొత్తానికి సాధికారికత సిద్ధిస్తుంది. ఈ సత్యం డా.నారాయణరెడ్డిగారికి తెలుసుకాబట్టే ఆయన ఈ పురస్కారం నెలకొల్పారు. సాధికారులూ, విదుషీమణులూ అయిన రచయిత్రులకి ప్రతి ఏటా ఈ పురస్కారం అందించడం మొదలుపెట్టారు. ఆ కోవలో ఇప్పుడు పద్మ కూడా చేరడంతో ఈ పురస్కారం పూర్తిగా స్త్రీ సాధికారికతా ఉద్యమంగా మారిందని చెప్పవచ్చు.

ఈ వేడుకలో భాగం పంచుకోడానికి నాకు అవకాశమిచ్చిన డా.నారాయణరెడ్డిగారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు చెప్పుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

31-1-2023

గోదావరి మా ఇంటికొచ్చింది

నిన్న సన్నిధానం నరసింహశర్మగారు మా ఇంటికొచ్చారు. రేపు డిసెంబరు ఏడో తేదీతర్వాత ఆయన ఎనభై ఒకటవ ఏట ప్రవేశిస్తారు. కాని నలభయ్యేళ్ళ కిందట నేను రాజమండ్రిలో మొదటిసారి చూసినప్పుడు ఎలా కనిపించేరో ఆయన ఇప్పుడూ అలానే ఉన్నారు. అదే ఉత్సాహం. అదే ధారణ. ఏదన్నా చెప్పబోతే ఎన్నో జ్ఞాపకాలు ఆయన గళం దగ్గర గుమికూడిపోయి అన్నీ ఒక్కుమ్మడిగా బయటపడాలన్న కలకలమూ అప్పటిలానే ఉంది.

తెలుగు సాహిత్యం గురించీ, గ్రంథాలయాల గురించీ, సాహిత్య పరిశోధన గురించీ తెలిసినవాళ్ళకి సన్నిధానం నరసింహశర్మగారిని కొత్తగా పరిచయం చేయవలసిన అవసరం లేదు. రాజమండ్రితో ఏ మాత్రం పరిచయం ఉన్నవాళ్ళకేనా ఆ ఊర్ని తలుచుకోగానే గుర్తొచ్చేవాళ్లల్లో శర్మగారు కూడా తప్పనిసరిగా ఉంటారు. 'నేనెప్పుడేనా కొన్నాళ్ళు రాజమహేంద్రవరం నుంచి బయటికి వెళ్ళి మళ్ళా తిరిగి రాగానే నరసింహశర్మని చూస్తే రాజమహేంద్రవరం మొత్తం కళ్ళకి కనిపిస్తుంది' అని రాసారు మా మాష్టారు శరభయ్యగారు ఆయన గురించి.

కావటానికి వృత్తిరీత్యా ఆయన లైబ్రేరియను. దాదాపు నలభై అయిదేళ్ళకు పైగా గౌతమీ గ్రంథాలయానికి ఏదో ఒక రూపంలో సేవలు అందిస్తూ వచ్చారు. కాని ఆయన్ని కేవలం లైబ్రేరియనుగా మాత్రమే చూడలేం. ఇంతకీ లైబ్రరీ అంటే ఏమిటి? గ్రంథాలయం. అక్కడ పుస్తకాలుంటాయి. కానీ పుస్తకాలకీ, చదువరికీ మధ్య ఒక అనుసంధానకర్త ఉండాలి కదా. నువ్వు ఆ లైబ్రరీలో అడుగుపెట్టినప్పుడు ఎక్కడ ఏ పుస్తకం ఉందో, అక్కడికి గతంలో ఎవరు వచ్చారో, ఏ పుస్తకాలు తీసుకునేవారో, ఆ మేడమీద బాబాయమ్మ మెమోరియలు హాల్లో ఎటువంటి సాహిత్య సమావేశాలు జరిగేయో, ఎవరెవరు అక్కడ మాట్లాడే అవకాశం రావడం తమకి గౌరవంగా భావించేరో అవన్నీ చెప్పే ఒక మనిషి

అక్కడ ఉన్నారనుకోండి, అప్పుడు ఆ మనిషీ, ఆ గ్రంథాలయం ఒక్కలాంటివే అనిపిస్తుంది కదా. ఇంకా చెప్పాలంటే, ఆ గ్రంథాలయం కన్నా ఆ మనిషినే మనకి ఇంచుక ఎక్కువ కావలసినవాడనిపిస్తాడు కదా! శర్మగారు అటువంటి ఆత్మీయులు.

తెలుగు నేలమీద రాజమండ్రికి ప్రత్యేక స్థానం ఉంది. తూర్పు చాళుక్యులు మొదట్లో పిఠాపురం రాజధానిగా పరిపాలన చేసినతర్వాత, వేంగిని రాజధానిగా మార్చుకున్నారు. ఆ తర్వాత రాజరాజనరేంద్రుడి కాలంలో రాజధాని రాజమహేంద్రవరానికి మారింది. పల్లవ, చోళ, చాళుక్య, రాష్ట్రకూట రాజ్యాల మధ్య ఎడతెగని దండయాత్రలమధ్య నలిగిపోతున్న తూర్పు చాళుక్యులు తమ అస్తిత్వాన్ని నిర్ధారించుకుని బలపరుచుకునే క్రమంలో తెలుగు భాషని నెత్తికెత్తుకున్నారు.

తూర్పు చాళుక్యులు మొదట్లో జైనం పట్ల అభిమానం చూపించారు. ఆ తర్వాత వైదికధర్మాన్ని అనుసరించడం మొదలుపెట్టాక, జైన, సంస్కృత మార్గ సాహిత్యాలకు ప్రతిగా దేశిసాహిత్యాన్ని ప్రోత్సహించే క్రమంలో తెలుగులో శాసనాలు వేయించడం మొదలుపెట్టారు. ఆ శాసనశైలి నమూనాగా నన్నయ దానికి 'అక్షరరమ్యత'నీ, 'సూక్తినిధి'నీ, 'ప్రసన్నకథా కలితార్థయుక్తి'నీ జోడించి తెలుగుని కావ్యభాషగా మార్చేసాడు. తెలుగు భాష మేలిమి సాహిత్యభాషగా మారిన ఆ తొలిఘట్టం నుంచి ఆధునిక యుగంలో తెలుగు వచనం వికసించినప్పుడు దాన్ని సాంఘికచైతన్య సాధనంగా మార్చుకున్న వీరేశలింగం దాకా రాజమండ్రి చరిత్ర నడిచింది.

ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో కూడా తెలుగు భాషను పరిపుష్టం చేసిన కవులు, రచయితలు– చిలకమర్తి, తిరుపతివెంకటకవులు, చలం, కృష్ణశాస్త్రి, గిడుగు, శ్రీపాద, కవికొండల వంటివారెందరికో రాజమండ్రి ఒక వేదికగా ఉంటూ వచ్చింది. అటువంటి వెయ్యేళ్ళ చరిత్ర గురించి ఎవరి ముఖతానేనా వినాలనుకుంటే, ఆ ఉజ్వల ఘట్టాల్ని తనువు పులకించేలా తలుచుకోవాలనుకుంటే, మన సమకాలికుల్లో నరసింహశర్మగారిని మించినవారు మరొకరు లేరు.

రాజమండ్రి చరిత్రలో ఆయన కూడా ఒక భాగం. దాంతోపాటు పూర్వమహాకవుల, రచయితల జీవితాల గురించీ, సాహిత్య కృషి గురించీ ఎన్నో విశేషాలు ఆయన తన పూర్వతరం వాళ్ళు మాట్లాడుకోగా ఎంతో ఆసక్తిగా విన్నారు. ఇంకా చెప్పాలంటే శుశ్రూష చేసారు. ఎవరేనా ఇద్దరు పెద్దలు సాహిత్యం గురించి మాట్లాడుకుంటూ ఉంటే, అక్కడే ఒక గోడకి అతుక్కుపోయి కూచుని వినేవారు. సగం అర్థమయ్యీ, అర్థం

కాకపోయినా, ఆ విన్నదంతా తన హృదయమంజూషలో భద్రపరుచుకునేవారు. అందుకని మొన్న ఆయన కలిసినప్పుడు ఆ ముచ్చట్లే ఆయనతో చెప్పించాలనుకున్నాను. మొదటి ప్రశ్న వెయ్యడం వరకే నేను చేసింది. ఆ తర్వాత ఒకదాని వెనక ఒకటి ఆ సంగతులన్నీ గోదావరి ప్రవాహంలాగా ఆయన్నుంచి పొంగిపోతూనే ఉన్నాయి.

'ఒకసారి విశ్వనాథ సత్యనారాయణగారు శరభయ్యగారి ఇంటికి వచ్చారు. ఆయన్ని రిసీవు చేసుకుని ఆయన తిరిగివెళ్ళేదాకా ఆయన్ని కనిపెట్టుకుని ఉండే పని మాష్టారు నాకు అప్పగించారు. వారిద్దరూ శరభయ్యగారి ఇంట్లో గదిలో కూచుని కవిత్వం చదువుకోడం మొదలుపెట్టారు. కల్పవృక్షంలో సీతాదేవికి సంబంధించిన ఘట్టమేదో చదువుకుంటున్నారు. నేను పక్కనే కిందన గోడకి ఆనుకుని కూచున్నాను. కొంతసేపటికి విశ్వనాథ నా వైపు చూస్తూ 'ఈ అబ్బాయి..' అని అన్నారు మాష్టారితో. అంటే మన ఏకాంతానికి మధ్యలో ఇతడుండాలా అన్నట్టు. 'పర్వాలేదు, నరసింహశర్మ అలానే కూచుంటాడు లెండి, మీరు కానివ్వండి' అన్నారు మాష్టారు ఆయనతో. మళ్ళా కావ్యపఠనం మొదలయ్యింది. ఇద్దరి కళ్ళమ్మటా అశ్రువులు ధారలు కడుతున్నాయి. సీతాదేవి అంత శోకించిందో లేదో మనకి తెలియదుగాని, వారిద్దరూ మాత్రం విలపిస్తున్నారనే చెప్పాలి. ఇంతలో ఏదో తీసుకురాడానికి శరభయ్యగారు ఇంట్లోకి వెళ్ళారు. అప్పుడు విశ్వనాథ నా వైపు తిరిగి 'అది సరేగానీ, అబ్బాయి, నువ్వెందుకేడుస్తున్నావు?' అనడిగారు నన్ను.

'అయ్యా, మీరిద్దరూ ఎందుకేడుస్తున్నారో తెలియక ఏడుస్తున్నాను. మీరేదో గొప్ప విషయం మాట్లాడుకుంటున్నారని తెలుస్తోందిగానీ, అదేమిటో అర్థం కాక ఏడుపొస్తోంది' అని అన్నాను.

ఇంతలో మాష్టారు వచ్చారు. విశ్వనాథ ఆయనతో 'చూడు, శరభయ్యా, ఈ పిల్లవాడు మనం మాట్లాడుకునేది అర్థం కాక ఏడుస్తున్నాడు. రేపు పెద్దయ్యాక, అర్థమయ్యాక మళ్ళా ఏడుస్తాడు' అని అన్నారు.

అని చెప్తూ శర్మగారు– 'సార్, ఆ రోజు ఆయన అలా అన్నమాటలు నాకు గొప్ప ఆశీర్వచనం అనిపించాయి' అని అన్నారు. ఆ మాటలు చెప్తున్నప్పుడు మళ్ళా ఆయన గొంతు గద్గదమైంది. కళ్ళల్లో నీటిపొర కమ్మింది.

కవుల గురించీ, వారు రాసిన పద్యాల గురించీ, వాళ్లను కలుసుకున్నప్పటి ముచ్చట్ల గురించి ఇలా పరవశిస్తూ మాట్లాడతారు కాబట్టే శర్మగారిని ఒకసారి చూసినవాళ్ళు కూడా ఆయన్ని మళ్ళా మళ్ళా కలుసుకోవాలనుకుంటారు.

ఆయన రాజమండ్రి సాహిత్యవేత్తల గురించి చెప్పేటప్పుడు విషయపరిజ్ఞానం మనతో చాలానే పంచుకుంటారుగానీ మనల్ని చప్పున ఆకర్షించేది అది కాదు. ఆయన ఆ సంగతులు చెప్తున్నప్పుడు, గతించిపోయిన ఆ ఘట్టాల్ని నెమరేసుకుంటున్నప్పుడు, తిరిగి వాటిని enact చేస్తారు. అందుకని ఆయన చెప్పే ప్రతి ఒక్క ముచ్చటా ఒక రూపకంలాగా మన కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. మనం ఆ రోజుల్లోకి, ఆ వీథుల్లోకి, ఆ గాలుల్లోకి వెళ్ళిపోతాం. చరిత్రకారులంటే ఇటువంటివాళ్ళు.

ఆరోజు ఆయన నాళం కృష్ణారావుగారి గురించి చెప్పిన ముచ్చట కూడా అలానే ఉండింది. మధురకవి నాళం కృష్ణారావు అంటే చాలామందికి తెలియకపోవచ్చుగాని, నా తరంవాళ్ళకి, చిన్నప్పుడు తెలుగు పాఠ్యపుస్తకంలో చదివిన 'ఊరి వెలుపల పాడుకోనేరు చెంత పసిడిదాచెను పిసినారి ముసలి యొకడు' అనే పద్యాలు నాళం కృష్ణారావుగారివే అని గుర్తుచేయగలను. కృష్ణారావుగారు తొలిరోజుల్లో వీరేశలింగంగారికి వీరశిష్యుడు. ఆయన పేరుమీద ఒక గ్రంథాలయాన్ని ప్రారంభించాడు. అదే తర్వాత రోజుల్లో గౌతమీ గ్రంథాలయంగా మారింది. అలా మార్చింది కూడా కృష్ణారావుగారే.

వీరేశలింగంగారి జీవితం మలిదశలో ఆయన వ్యక్తిత్వం మీద ఆరోపణలు వచ్చినప్పుడు కృష్ణారావుగారు వీరేశలింగానికి వీరవిమర్శకుడిగా మారిపోయేడు. వీరేశలింగం పేరుమీద తాను ప్రారంభించిన గ్రంథాలయానికి పేరు కూడా మార్చేసాడు. మళ్ళా తరువాత రోజుల్లో వీరేశలింగంగారి పట్ల తన అపోహలనుంచి బయటపడి ఆయనకు పూర్వంలాగా సన్నిహితుడు కావాలని ఎంతో తపించేడు. కాని వీరేశలింగం అతణ్ణి తన ఇంటి గడప కూడా తొక్కనివ్వలేదు. ఆ రోజుల్లో తన బాధని వర్ణిస్తూ ఆయన 'అనుతాపం' అనే కావ్యం రాసాడని శర్మగారు చెప్తే తప్ప రాజమండ్రికి కూడా గుర్తులేదు.

'భద్రుడుగారూ, కవులు తమని పొగుడుకుంటూ కవిత్వాలు రాసుకుంటారు. కాని నేను అల్పుణ్ణి, బుద్ధిహీనుణ్ణి, వీరేశలింగం అభిమానానికి దూరమయినవాణ్ణి అని తనని తాను తిట్టుకుంటూ కవిత్వం రాసుకున్నాడు కృష్ణారావుగారు. నాకు తెలిసి సాహిత్య చరిత్రలో తనని తాను తిట్టుకుంటూ, శపించుకుంటూ వేదనవెళ్ళగక్కిన కవి ఆయన ఒక్కరే అనుకుంటాను' అని కూడా అన్నారు.

'ఆ కావ్యం కోసం చాలా కాలం వెతికాను. రాజమండ్రిలో ఎక్కడా దొరకలేదు. చివరికి ఎప్పుడో అది వకుళాభరణం రామకృష్ణగారి దగ్గర దొరికింది. దాన్ని మళ్ళా పునర్ముద్రించే అవకాశం కలిగింది' అని అన్నారు శర్మగారు.

నరసింహశర్మగారు స్వయంగా కవి, రచయిత, పరిశోధకుడు. ఆయన రాసిన 'ప్రాణహిత',' ప్రమేయ ఝరి' , 'బ్రౌను ఉదాహరణకావ్యం' బాగా ప్రసిద్ధి పొందాయిగాని, మొత్తం 84 పుస్తకాలు రాసేరాయన.

'కానీ మా పిల్లల్తో చెప్తుంటాను. మీ నాన్న అది రాసాడు ఇది రాసాడు అని కాదు, నిజంగా మీ నాన్న ఘనత చెప్పవలసి వస్తే, తెలుగులో అచ్చయిన మొదటి గ్రంథాన్ని వెతికి పట్టుకుని పునర్ముద్రించినవాడు అని నలుగురికీ చెప్పండి అని చెప్తుంటాను మా పిల్లల్తో' అని అన్నారాయన.

ఇప్పుడు ఎంతమందికి తెలుసో తెలియదో గాని, తెలుగులో అచ్చయిన మొదటిపుస్తకం బైబిలు. (తెలుగులో అచ్చయిన మొదటి పుస్తకం ఏమిటని అడిగితే, ఇంటర్నెట్టు, రాజశేఖర చరిత్ర అని జవాబిస్తోంది!) 1747 లో షుల్జు అనే ఒక జర్మను బైబిలును తెలుగులో అనువదించి అచ్చువేయించాడని వినడమేగాని ఆ పుస్తకం నేనెప్పుడూ చూడలేదు. చివరికి గూటెనుబర్గు అచ్చువేయించిన తొలిపుస్తకాన్నైనా చూడగలిగానుగాని తొలి తెలుగు అచ్చుపుస్తకం నేను చూడలేకపోయాను. కానీ దాన్ని శర్మగారు సంపాదించి తెలుగులో అచ్చువేయించారు.

ఆయన దానికోసం చేసిన అన్వేషణ హనుమంతుడు చేసిన సీతాన్వేషణ లాంటిదే. ఎక్కడో కలకత్తా దగ్గర సిరాంపురం అనే చోట ఒకప్పుడు దేశభాషల్లో ముద్రితమైన తొలి పుస్తకాలు ఉన్నాయని తెలిసి ఆయన అక్కడికి వెళ్ళారు. తీరా అక్కడ ఆ పుస్తకం లేదన్నారు. కాని ఆయన ఎందుకేనా మంచిదని తొలి తమిళ అచ్చుపుస్తకాలు చూపించమని అడిగితే, ఆ తమిళపుస్తకాల వెనక తెలుగు పుస్తకాలు కూడా కుట్టేసి కనబడ్డాయి! తెలుగులో అచ్చువేసిన మొదటి బైబిలు పుస్తకాలు అయిదు. కాని ఆయనకి 'నూరు జ్ఞానవచనాలు' మాత్రమే దొరికింది. అది కూడా వాళ్ళ ప్రత్యేకమైన ఆస్తిలాంటిది కాబట్టి మొత్తం పుస్తకం జిరాక్సు తీసుకోడానికి అంగీకరించకపోతే ఆయన ఎలాగో ఒకలాగా వాళ్ళని ఒప్పించి ఆ పుస్తకం మొత్తం పట్టుకొచ్చారు. అందుకోసం ఒకసారి కాదు, రెండుసార్లు వెళ్లవలసి వచ్చింది. అందుకు సరిపడా ఆర్థిక వనరులున్న మనిషి కాకపోవడంతో అక్కడ ఉన్నన్నాళ్ళూ ఒక పూట మాత్రమే తిని, రెండోపూట ఇన్ని మంచినీళ్ళు తాగి గడిపేరు. ఒక భాషకి సేవ చెయ్యడమంటే ఇది.

ఆ రోజు మా గోష్ఠిలో కాలం తెలీకుండా గడిచిపోయింది. నాకు మళ్ళా ఆ గౌతమీ లైబ్రరీలో బొగడచెట్టు నీడన మాట్లాడుకున్న రోజులూ, ఆ విక్రమహాల్లో సాహిత్యసమావేశాలు

జరిగిన రోజులు, ఆ సమాచారం ఆఫీసులో రాత్రి పొద్దుపొయ్యేదాకా మాట్లాడుకుని, ఇంక వెళ్ళిపోదామని బయటకు వచ్చి, ఆ బయటనే మళ్ళా మరో రెండుమూడు గంటలు మాట్లాడుకుంటూనే ఉండిపోయిన రోజులు గుర్తొచ్చాయి. వచ్చింది ఒక్క శర్మగారే అని ఎలా అనుకోను? నా గురువులు వచ్చారు, గౌతమీ గ్రంథాలయం వచ్చింది, ఏకంగా గోదావరినే నేనున్నచోటకి ప్రవహిస్తూ వచ్చింది.

14-11-2024

సాహిత్య సంకీర్తకుడు

నిన్న సాయంకాలం బాచుపల్లి కౌసల్యాకాలనీలో సన్నిధానం నరసింహశర్మగారి ఎనభయ్యవ పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగింది. బంధుమిత్రుల మధ్య, సాహిత్యమిత్రుల మధ్య, పూర్వపు రాజమండ్రి మిత్రుల మధ్య శర్మగారి అభినందన సంచిక, ఆయన రాసిన 'బ్రౌను ఉదాహరణ కావ్యం', ఆయనకు 'ఆరుద్ర రాసిన లేఖలు' ఆవిష్కరించారు. ఆయన అభినందన సంచికని నామాడి శ్రీధర్, వొమ్మి రమేష్‌బాబుల సంపాదకులుగా వెలువరించారు. ఆ పుస్తకం ఎంతో అభిరుచితో, సాహిత్యవిలువల్తో, నాలుగుకాలాలు దాచుకోదగ్గదిగా తీసుకురావడంలో వారి కృషి ఎన్నదగ్గది. అందులో 'సాహిత్య సంకీర్తకుడు' అని నేను రాసిన వ్యాసం కూడా ఉంది. ఆ పుస్తకానికి కూడా ఆ పేరే పెట్టారు. ఈ శుభసందర్భంలో ఆ వ్యాసాన్నిక్కడ మీతో పంచు-కుంటున్నాను.

మేఘసందేశంలో యక్షుడు మేఘం ప్రయాణించవలసిన దారి వివరిస్తూ ఆ దారిలో లేకపోయినా మేఘాన్ని ఉజ్జయిని వెళ్ళమని చెప్తాడు. అక్కడ ఉదయనకథాకోవిదులైన గ్రామవృద్ధులుంటారనీ, వాళ్ళని కలుసుకొమ్మనీ చెప్తాడు. మా మాష్టారు కాళిదాసు గురించి ఏ ప్రస్తావన వచ్చినా ఈ ఉదయనకథాకోవిదుల గురించి చెప్పకుండా ఉండేవారు కాదు. ఎందుకంటే, ఇక్కడ ఆ కథాకోవిదులు చెప్తున్నది వట్టి ఉదయనుడి కథ కాదు. వాళ్ళు ఆ వంకన పూర్వతరాల రసానుభవం గురించి తర్వాత తరాలవారికి చేరవేస్తుంటారని ఆయన చెప్తుండేవారు.

సన్నిధానం నరసింహశర్మగారి గురించి చెప్పాలంటే ముందు నాకు ఈ మాటనే గుర్తొస్తుంది. ఆయన నా తరంలో నేను చూసిన ఉదయనకథాకోవిదుడు. అయితే ఆయన కీర్తిస్తూ ఉండిన ఆ ఉదయినుడు ఒక రాజు కాడు. ఆయన రాజసంకీర్తకుడు కాదు.

ఆయన ఒక నగరసంకీర్తకుడు. ఒక నదీసంకీర్తకుడు. ఒక సాహిత్యసంకీర్తకుడు, సంస్కృతీ సంకీర్తకుడు.

నేను 1982 లో రాజమండ్రి వెళ్ళిన మొదటిరోజుల్లోనే గౌతమీ గ్రంథాలయానికి వెళ్ళినప్పుడు శర్మగారిని చూసాను. ఆ తర్వాత నేనక్కడ ఉన్న అయిదేళ్ళల్లోనూ శర్మగారు నా అధ్యయనంలో ఒక భాగంగా ఉన్నారు. ఆ అధ్యయనానికి ఫలానా పద్ధతి అంటూ ఉండేది కాదు. మేము ఎక్కడ కలిస్తే అక్కడ, ఎప్పుడు కలిస్తే అప్పుడు ఆయన ఏం చెప్తే అదే నా చదువు. ఆ చదువులో నేను నేర్చుకున్నది దేని గురించి?

రాజమండ్రి గురించి, గోదావరి గురించి, తెలుగు, సంస్కృత సాహిత్యాల గురించి అని చెప్పవచ్చు. కాని అదంతా syllabi మాత్రమే. వాటిగురించి ఆయన అలవోకగా చెప్తుండే విషయాలు వింటూ నేను నేర్చుకున్న విద్య ఏమిటి?

అభిరుచి. ఉత్తమ సాహిత్యాభిరుచి.

అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి స్థితప్రజ్ఞుడెలా ఉంటాడు, అతడేం మాట్లాడతాడు? అతడి తలపులు ఎలా ఉంటాయి? అతడు దేనిమీద దృష్టిపెట్టి ఉంటాడు లాంటి ప్రశ్నలు అడిగాడు. నేను శర్మగారిని కలిసినప్పుడెల్లా రాజమండ్రిలో మా కన్నా పూర్వం జీవించి కవిత్వం చదువుకున్నవాళ్ళూ, కవిత్వం చెప్పినవాళ్ళూ ఎలా ఉండేవారు, ఎలా సంచరించేవారు, ఎలా సంతోషపడేవారు–లాంటి ప్రశ్నలే అడిగేవాణ్ణి. నిజానికి శర్మగారు ఒక్కరినే కాదు, మా మాష్టారు శరభయ్యగారిని కలిసినా ఇటువంటి ప్రశ్నలే అడిగేవాణ్ణి లేదా ఇటువంటి ప్రస్తావనలకోసమే ఎదురుచూసేవాణ్ణి. శర్మగారు కూడా శరభయ్యగారి శిష్యులే కాబట్టి, ఆయన్ని నా సహాధ్యాయి అని కూడా అనుకోవచ్చు. సీనియర్ క్లాస్‌మేటు అన్నమాట!

తెలుగునేల మీద రాజమండ్రిది ఒక ప్రత్యేక స్థానం. రాజమండ్రి మీద రాసిన ఒక కవితలో నేను ఆ నగరాన్ని వారణాసితో, ఏథెన్సుతో, డబ్లినుతో, వియన్నాతో పోల్చాను. ఆ నగరం ఒక సాంస్కృతిక కేంద్రం. పూర్తి అర్థంలో ఒక లెర్నింగు సెంటరు. అక్కడ వెయ్యేళ్ళుగా తెలుగు సాహిత్యసృజన సాగుతూనే ఉంది. అక్కడే నన్నయ శారదరాత్రుల్ని వర్ణించాడు. అక్కడే కుమారగిరిరెడ్డి కాళిదాసునాటకాల్ని చదువుకుని పరవశించాడు. శ్రీనాథుడు అక్కడ కొన్నాళ్ళు ఉన్నాడు. కానీ ఆ కొన్నాళ్ళ నివాసమూ ఆరుద్ర చెప్పినట్టుగా అదొక 'పెద్ద ముచ్చట.' ఆధునికయుగం మొదలయ్యేక, బ్రిటిషు పాలన విస్తరించాక, ఆ నగరం ఆధునికవిద్యనీ, ఆధునికజీవితాన్నీ, దాని గుణావగుణాలన్నిటితోనూ స్వీకరించింది. ఆ స్వీకారంలోంచే ఆ నగరం ఒక వీరేశలింగాన్ని రూపొందించింది. ఒక గిడుగు, ఒక

చలం, ఒక కృష్ణశాస్త్రి, ఒక గరిమెళ్ళ, ఒక గాడిచర్ల, ఒక చిలకమర్తి, ఒక దీక్షితులు, ఒక కవికొండల, ఒక దామెర్ల, ఒక నేదునూరి – రాజమండ్రి లేని ప్రాచీన సాహిత్యాన్ని ఎలా ఊహించలేమో, రాజమండ్రిలేని ఆధునిక తెలుగుసాహిత్యాన్నీ, సంస్కృతినీ కూడా అలానే ఊహించలేం.

ఒక ప్రాచీననగరం ఒక ఆధునికనగరంగా అకస్మాత్తుగా రూపొందదు. పూర్తిగా కూడా రూపొందదు. అదొక నిత్యపరిణామం. ఆ పరిణామంలో ఒక భాగంగా ఉంటూ, దాన్ని దగ్గరగా చూసేవాళ్ళుంటే వాళ్ళనుంచి మనం నేర్చుకోదగ్గది చాలానే ఉంటుంది. రాజమండ్రి పరిణామానికి నరసింహశర్మగారు అటువంటి participant-observant.

అన్నిటికన్నా ముందు ఆయన పులకించిపోతారు. రాజమండ్రికి చెందిన ఏ సాహిత్యకారుడి పేరు ఎత్తినా ముందు ఆయన నిలువెల్లా పరవశించిపోతారు. ఆ మనిషి చుట్టూ అల్లుకున్న ఎన్నో జ్ఞాపకాలు, ముచ్చట్లు, పాఠాలు, గుణపాఠాలు వెంటనే మనతో పంచుకోడానికి ఉత్సాహపడిపోతారు. అది మనకు బాగా తెలిసిన ప్రసిద్ధ సాహిత్యకారులే కానక్కరలేదు. ఒకప్పుడు రాజమండ్రి జీవితాన్ని నిరుపమానంగా ప్రభావితం చేసి, ఇప్పుడెవరికీ అంతగా గుర్తురాని మహనీయులైతే వారి గురించి మాట్లాడటానికి ఆయనకి మరింత ఉత్సుకత! ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు గారి గురించి అడగండి ఆయన్ని, లేదా మధురకవి నాళం కృష్ణారావుగారి గురించి అడగండి, ఆయనకి స్వయంగా దగ్గర బంధువైన బి.వి.ఎస్.శాస్త్రి గురించి, ఆర్.బి.పెండ్యాల గురించి అడగండి. శర్మగారితో మాట్లాడటం నిజంగానే ఒక ఎడుకేషన్. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, ఒక aesthetic education, ఒక cultural education.

నేను రాజమండ్రిలో గడిపిన రోజుల్లో ప్రధానంగా సాహితీవేదిక బృందంతో కలిసి తిరిగేవాణ్ణి. మహేశు, సమాచారం సుబ్రహ్మణ్యం, కవులూరి గోపీచందు వంటి మిత్రుల్తో ఎక్కువ కాలం గడిపేవాణ్ణి. శర్మగారూ, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణా వంటి మిత్రులు మరొక బృందంగా కలిసి తిరుగుతుండేవారు. కాని ఈ రెండు బృందాలూ, ఇలాంటివే మరికొన్ని బృందాలూ ఒక రోజులోనే కనీసం రెండుమూడు సార్లు ఒకరికొకరు తారసపడేవారు. అది గౌతమీ గ్రంథాలయం దగ్గర కావచ్చు, లేదా సమాచారం ఆఫీసు దగ్గర కావచ్చు లేదా గోదావరి గట్టుమీద కావచ్చు.

కాని ఎందరు కలుసుకున్నా, ఎప్పుడు కలుసుకున్నా, ఆ గోష్ఠిలో నరసింహ శర్మగారుంటే మాత్రం తక్కినవారంతా ఆయన మాటలు వినడానికే ఇష్టపడుతుండేవారు.

ఆయన చుట్టూ ఎప్పుడూ గీతలుండేవి కావు. గోదావరి గాలీ, నీళ్ళూ ఎలా నలుగురిమీదా సమానంగా ప్రసరించేవో, శర్మగారి పాండిత్యం, పరిజ్ఞానం, రసోద్రేకం కూడా అలానే నలుగురిమీదా సమానంగా వర్షించేవి.

నేను యూనివెర్సిటి విద్యకు నోచుకున్నవాణ్ణిగాను. కాని ఆ లోటు రాజమండ్రి తీర్చిందనీ, గోర్కీ విశ్వవిద్యాలయాల్లాగా రాజమండ్రి నా విశ్వవిద్యాలయమనీ నేను చాలా సార్లు చెప్పుకున్నాను. ఆ విశ్వవిద్యాలయంలో ఒక పెద్ద తరగతిగది గౌతమీ గ్రంథాలయ–మైతే, నరసింహశర్మగారు అక్కడ ప్రొఫెసరు అని చెప్పగలను. నేను తత్త్వశాస్త్రంలో ప్రైవేటుగా ఎమ్మేకి చదువుకుందామనుకున్నప్పుడు, ఆ సిలబసు తప్ప, పాఠ్యపుస్తకాలూ, ప్రొఫెసర్లూ, పాఠాలూ, ప్రశ్నపత్రాలూ లేకపోవడంతో ఫిలాసఫీ పుస్తకాలేమైనా మన లైబ్రరీలో ఉన్నాయా అనడిగాను ఒకరోజు శర్మగారిని.

నాకు ఆ సాయంకాలం బాగా గుర్తు. ఆయన నా రెక్కపట్టుకుని లైబ్రరీ వెనక ఉన్న పెద్ద హాల్లోకి తీసుకుపోయారు. సందర్శకులెవరూ పెద్దగా అడుగుపెట్టే చోటుకాకపోవడంతో అక్కడంతా చీకటిగానూ, పైన కొంత బూజుతోనూ నిండిఉంది. ఆయన నన్ను నేరుగా నాలుగైదు బీరువాలముందుకు తీసుకుపోయి నిలబెట్టి ఒక బీరువా తలుపు తెరిచి 'చూడండి, ఇవన్నీ ఫిలాసఫీ పుస్తకాలే' అన్నారు. అది ఒక తత్త్వశాస్త్ర ఆచార్యుడి సొంతలైబ్రరీ. గౌతమీగ్రంథాలయానికి కానుకగా ఇచ్చేసినది. ఆయన తెరిచి చూపించిన బీరువాలో పుస్తకాల్ని పోల్చుకోడానికి ప్రయత్నించాను.

మై గాడ్! అవన్నీ మూలగ్రంథాలు. ఒక జీవితకాలం సరిపోదు వాటిని చదువుకోడానికి!

నేను తత్త్వశాస్త్రంలో ఎమ్మే చేసిన ఎన్నో ఏళ్ళకి, పాశ్చాత్య తత్త్వశాస్త్రాన్ని పరిచయం చేస్తూ తెలుగులో 'సత్యాన్వేషణ' అనే పుస్తకం తీసుకొచ్చినప్పుడు, ఆ గ్రంథాన్ని గౌతమీ గ్రంథాలయానికే అంకితం చేసాను. విజయవాడలో ఆ పుస్తకం ఆవిష్కరించినప్పుడు గౌతమీ గ్రంథాలయం తరఫున నరసింహశర్మగారు వచ్చి ఆ పుస్తకం అందుకున్నారు. గౌతమీ గ్రంథాలయం తరలి వస్తే అది శర్మగారి రూపంలోనే కదా రాగలిగేది!

నేను రాజమండ్రిలో ఉన్నప్పుడే సాహితీవేదిక కాక, మరొక అధ్యయన వేదిక కూడా అవసరమనిపించింది. అంటే కేవలం సాహిత్యమొక్కటే కాదు, తత్త్వశాస్త్రం, సోషియాలజి, కళలు, మానవశాస్త్రం, ఆర్కిటెక్చరు, సైకాలజీ–ఇలా వీలైనన్ని సాంఘికశాస్త్రాలతో పరిచయం పెంపొందవలసిన అవసరం ఉందనిపించింది మాకు. అందుకని కవులూరి

గోపీచంద్, వంక బాలసుబ్రహ్మణ్యంలతో కలిసి 'ద రీడర్స్ క్లబ్' ప్రారంభించాం. ఆ క్లబ్బు తరఫున నాలుగైదు సమావేశాలు నిర్వహించాం. ఒక వేసవిలో అధ్యయనతరగతులు కూడా నడిపాం. సన్నిధానం, గౌతమీ గ్రంథాలయం లేకపోతే అవేవీ జరిగి ఉండేవి కావనీ వేరే చెప్పాలా!

మామూలుగా దూరవిద్య చదువుకునే విద్యార్థులకి యూనివెర్సిటీలు కాంటాక్టు క్లాసులు నిర్వహిస్తాయి. అక్కడ వాళ్ళు ఎవరేనా ఒక ఉపాధ్యాయుడి ముఖతా కూడా ఒకటి రెండు పాఠాలు వినే అవకాశం దొరుకుతుంది. రాజమండ్రి నా యూనివెర్సిటీ అన్నాను కదా. అక్కడ శరభయ్యగారు, సుదర్శనంగారు, మధునాపంతులవారు వంటి గురువుల సన్నిధిలో నిత్యం మాకు ఏవేవో పాఠాలు వినే అవకాశం దొరుకుతూనే ఉండేది. కాని నరసింహశర్మగారి పుణ్యాన మాకు దూరప్రాంతాలనుంచి వచ్చేవాళ్ళ కాంటాక్టు క్లాసులు వినే అవకాశం కూడా దొరికేది. ఎవరేనా చెన్నై నుంచి విశాఖపట్నమో లేదా అటునుంచి ఇటో లేదా ఆ చుట్టుపక్కల ఏదేనా ఊళ్ళకి వెళ్తున్నప్పుడో, వస్తున్నప్పుడో, వాళ్ళు శర్మగారికి ఆ సంగతి చెప్పేవారు. వెంటనే ఆయన ఒక సాయంకాలం గౌతమీ గ్రంథాలయంలో వారితో ఒక ప్రసంగమో, లేదా ఒక గోష్ఠినో ఏర్పాటుచేసేవారు. మొబైలు ఫోన్లూ, వాట్సపులూ లేని ఆ రోజుల్లో ఆ వార్త సత్వరమే రాజమండ్రి మొత్తం ఎలా వ్యాపించేదో నాకిప్పటికీ ఆశ్చర్యమే! అటువంటి ప్రతి ఒక్క ప్రసంగానికీ, గోష్ఠికీ నేను శర్మగారికి జీవితకాలం ఋణపడి ఉంటాను.

అలాగని శర్మగారు రాజమండ్రి సంస్కృతికి వారసుడని మాత్రమే చెప్పడం ఆయన ప్రతిభను తక్కువ చెయ్యడమే. ఆయన కవి, విమర్శకుడు, పరిశోధకుడు. ఎందరో మహాకవుల పద్యాలకు పల్లకిగా జీవిస్తున్న మనిషి కవిత్వం పలక్కుండా ఎలా ఉండగలడు? ఆయన పలికేది కవిత్వం కాకుండా ఎలా ఉండగలదు? కాని శర్మగారిని చూడగానే ముందు ఆయన కవిత్వం గుర్తురాకుండా, మనకి, పూర్వమహాకవులు గుర్తు రావడం ఆయనకు వరమో, శాపమో నేనిప్పటికీ తేల్చుకోలేను.

మరొక మాట కూడా చెప్పవచ్చు. విక్రమార్కసింహాసనానికి ప్రతి మెట్టు దగ్గరా ఒక సాలభంజిక ఉండేదనీ, ఆ సింహాసనం ఎక్కదలుచుకున్నవాళ్ళకి మెట్టుమెట్టునా విక్రమార్కుడి సద్గుణాల గురించి చెప్పి, నీకు అటువంటి అర్హత ఉంటేనే ఈ సింహాసనాన్ని అధిష్టించడం గురించి ఆలోచించమని చెప్పేదనీ చదివాం గుర్తుంది కదా! నరసింహశర్మ గార్ని ఒక సాహిత్యసింహాసన సాలభంజికగా కూడా చెప్పుకోవచ్చు. ఎవరేనా కవి కావాలను కుంటే, రచయితగా నలుగురూ తన రచనలు చదవాలని కోరుకుంటే ఆయన శర్మగారిని

కలవాలి. కలిసి మాట్లాడాలి. ఆయన చెప్పే పూర్వమహాకవుల గురించీ, ప్రసిద్ధ సాహితీవేత్తల గురించీ వినాలి. ఆ మాటలు వింటుంటే, ఆ సృజన, ఆ రసజ్ఞత మనకి కూడా ఉన్నాయా అన్న అలోచనలో పడిపోతాం. అలాగని ఆయన మాటలు మనల్ని నిరుత్సాహ పరచవు. మనకి తెలీకుండానే మనముందు కొన్ని కొండగుర్తుల్ని పెడతాయి. ఎలాగేనా మనం కూడా అక్కడికి చేరుకోవాలన్న తపన మనలో రగిలిస్తాయి.

మొన్న సన్నిధానం నరసింహశర్మగారు మా ఇంటికొచ్చారు. ఎనభయ్యేళ్ళ యువకుడు. నలభయ్యేళ్ళ కిందట ఆయన్ని మొదటిసారి చూసినప్పుడెలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. అగస్త్యుడు సముద్రాన్ని ఆపోశనం పట్టాడంటారు. శర్మగారు అప్పుడూ, ఇప్పుడూ కూడా ఒక నిండుగోదావరిని తనలో నింపిపెట్టుకుని ఉన్నారు.

ఆయన మా ఇంట్లో కూచుని మాటాడుతున్నంతసేపూ ఆ గోదావరి తొణుకుతూనే ఉంది. చప్పుడు చేస్తూనే ఉంది. ఆయన కూచున్నంతసేపూ నాకు గోదావరి ఒడ్డున కూచున్నట్టే ఉంది. మళ్ళా శరభయ్యగారి సన్నిధిలో కవిత్వం గురించి మాటాడుకున్నట్టే ఉంది.

ఆయనకి ఆరుద్ర రాసిన లేఖల్లో శరభయ్యగారూ, మధునాపంతులవారితో పాటు తనని కూడా ఒక గురువుగా చెప్పుకుంటారనీ ఆరుద్ర రాసాడు. నేను ఆ మాట నమ్మలేను. శరభయ్యగారు సరే, మధునాపంతులవారు సరే. కాని ఆరుద్ర నుంచి శర్మగారు నేర్చుకున్న దానికన్నా ఆరుద్రనే శర్మగారి నుంచి ఎంతో నేర్చుకుని ఉంటాడని నా నమ్మకం. ఒక్క ఆరుద్రనే కాదు, శర్మగారి సాంగత్యం లభించిన ప్రతి ఒక్క సాహిత్యవేత్తా ఆయనకి విద్యార్థిగా మారిపోకతప్పదు.

శర్మగారు తన 'ప్రాణహిత' (2017) కవితాసంపుటిలో మొదటిపేజీలో డిలాన్ థామసుది ఒక వాక్యం ఉల్లేఖించారు. The World is never the same once a good poem has been added to it అని. రాజమండ్రిని రాజమండ్రిగా రూపొందించిన వాళ్ళల్లో శర్మగారుకూడా ఒకరని నాలాంటివాడికి ఎప్పటికీ గుర్తుంటుంది. నాలాంటి వాళ్ళు నాలాంటివాళ్ళుగా మారే క్రమంలో శర్మగారి పరిచయం, సాంగత్యం, సాన్నిహిత్యం అందించిన సహాయం కూడా మాలాంటివాళ్ళమెప్పటికీ గుర్తుపెట్టుకునే ఉంటాం.

ఇంకా చాలా రాయాలని ఉంది. కానీ మా మాష్టారు ఒకసారి సన్నిధానానికి రాసిన ఉత్తరంలోని (30-8-1991) ఈ వాక్యాలకు మించి నేను అదనంగా చెప్పగలిగేదేముంటుంది అనిపిస్తున్నది:

ఇప్పటి నా నలభైయేళ్ళ నా జీవితంలోని మొదటి ఆప్తులు మహీధరా, మధునాపంతులా మొదలైనవారంతా సన్నిధానంలో సన్నిధిచేసి ఉన్నట్లే నాకనిపిస్తుంది. పరాయి ప్రాంతం నుంచి యీ ఊరు వచ్చినప్పుడల్లా గౌతమీ లైబ్రరీకి వెళ్ళి ఇతణ్ణి చూచేటంతవరకు నాకు రాజమహేంద్రవరం వచ్చినట్లే అనిపించదు. గోదావరి తగిలినప్పుడు నీటిగాలి స్పర్శ వలె ఇతని సన్నిధానం ఎప్పటికీ నాకు ఆప్యాయంగా ఉండేది. ఆ అనుభవం మాటల్లోకి ఎలా వస్తుందీ?

8-12-2024

ఫాల్గుణమాసపు మామిడి పిందె

ఎం. కేశవరావు, సర్వమంగళ ఇద్దరూ కూడా ఫేస్ బుక్కులో నా మిత్రులు. ఏడెనిమిదేళ్ల కిందట నేను బరంపురం వెళ్ళినప్పుడు వాళ్ళని కలుసుకున్నాను. అదే మొదటిసారి. వాళ్ళు కలకత్తాలో ఉంటారనీ, తెలుగు సాహిత్యమంటే చాలా మక్కువకలిగినవాళ్ళనీ వాళ్ళ గురించి విజయచంద్ర పరిచయం చేశారు. ఆ తర్వాత వారిద్దరూ ఫేస్‌బుక్కు మాధ్యమంలో నాకు మిత్రులుగా మారిన తర్వాత వాళ్ళ పోస్టులు చూస్తూఉంటే నాకు అర్థమయిందేమంటే వాళ్ళు కేవలం సాహిత్యాభిమానులు మాత్రమే కారనీ, అన్నిటికన్నా ముందు ఆదర్శవ్యక్తులుగా జీవితం జీవించడానికి తపిస్తున్నవాళ్ళనీ అర్థమయింది. ఆ భార్యాభర్తలు, వారి అమ్మాయి– వారు ఒకరి నమ్మకాలని, కృషిని మరొకరు గౌరవించే పద్ధతిని, ఒకరి కృషికి మరొకరు తోడ్పాటు నందించే పద్ధతిని చూస్తూ ఉంటే నాకు వాళ్ళ పట్ల గొప్ప గౌరవం బలపడుతూ వచ్చింది.

కేశవరావు కలకత్తా మునిసిపలు కార్పొరేషను పరిధిలో ఉండే టిటాగరులో ఒక ఆంధ్ర స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన కొన్ని పుస్తకాలు కూడా రాశారు. 'జాగృతి సమీక్ష' అనే పత్రికకి సంపాదకులుగా పనిచేస్తున్నారు. సర్వమంగళ ఆ పత్రికకి ప్రచురణకర్తగా ఉన్నారు. ఆమె కూడా 'నేమిసిస్' అనే ఒక కవితాసంపుటి వెలువరించారు.

తెలుగుకోసం, తెలుగు సాహిత్యం కోసం, తమ చుట్టుపక్కల తెలుగువాళ్ళల్లో చైతన్యాన్ని ప్రోదిచెయ్యడం కోసం వాళ్ళు చేపట్టే చిన్న చిన్న ప్రయత్నాలు, ఆ ప్రయత్నాల్లో ఒకరిపట్ల ఒకరు చూపించే పరస్పర గౌరవం, యిష్టం చూస్తూ ఉంటే నాకు ఎప్పటిదో సోవియేటు సమాజానికి చెందిన ఇద్దరు సహచరుల కథ చదువుతూ ఉన్నట్టుగా ఉంటుంది. సామాజిక శ్రేయస్సునీ, అభ్యుదయాన్నీ, ప్రగతినీ కోరుతూ, అందుకోసం

కలిసి పనిచేసే ఇటువంటి సహచరులు ఇక్కడ మన మధ్య కూడా ఉండి ఉండవచ్చుగానీ, ఇలా తమ ప్రయత్నాల్ని, చిన్నవో, పెద్దవో, ఇలా నిష్కపటంగా, నిజాయితీగా, సెలబ్రేటు చేసుకునేవారిని మాత్రం నేనెవరినీ చూడలేదు.

వారిద్దరు ఫేస్‌బుక్కులో షేరు చేసే పోస్టుల్లో నన్ను బాగా ఆకట్టుకునేది ఎటువంటి పటాటోపం లేకపోవడం. Hate speech ఎక్కడా కనిపించకపోవడం. తమ రోజులో ప్రతి ఒక్క క్షణాన్నీ తోటిమనుషులకోసం వినియోగించాలన్న ఔదార్యం మాత్రమే ఆ రాతలలో కనిపిస్తుండటం.

నేను వాళ్ళ పోస్టులమీద ఎప్పుడూ వివరంగా ఏమీ వ్యాఖ్యానించలేదు. వారితో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ కూడా నడపలేదు. కానీ ఇప్పుడిలా ఈ నిశ్శబ్దాన్ని బ్రేక్ చెయ్యవలసిన ఒక సందర్భం ఏర్పడింది కాబట్టి ఈ నాలుగు వాక్యాలూ రాయడానికి కూచున్నాను.

ఆ మధ్య తామొక తెలుగు కాలెండరు తెస్తున్నామనీ ఆ కాలెండరులో ప్రతి నెలా ఒక తెలుగు కవిత కూడా పొందుపరుస్తున్నామనీ, అలా ఒక నెలకి నా కవిత కూడా ఒకటి ప్రచురించుకోడానికి అనుమతినివ్వమంటూ వారినుంచి కొన్ని రోజుల కిందట ఒక మెసేజి వచ్చింది. ముందు నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఏటా వార్షిక సంకలనాలు తెచ్చేవాళ్ళు కొందరున్నారు. వారికి నేను తెలుసు. బాగానే తెలుసు. నేను కవిత్వం రాస్తుంటానని కూడా వారికి తెలుసు. కాని వారు గత పదేళ్ళల్లో తమ వార్షిక సంకలనాల్లో ఇప్పటిదాకా నా కవిత ఒక్కటికూడా ఎంపికచేసింది లేదు. అలాంటిది ఎక్కడో బెంగాల్లో ఉన్న తెలుగు మిత్రులు నా కవిత కావాలనీ అది కూడా తాము ప్రచురించబోయే తెలుగుకాలెండరులో వేసుకోడానికనీ అడిగినప్పుడు ఆశ్చర్య పోకుండా ఎలా ఉంటాను? 'నా కవితలన్నిటిమీదా మీకు పూర్తి హక్కులున్నాయని' జవాబిచ్చానుగాని, ఏ కవిత ఎంచుకున్నారు అని అడగలేదు.

వాళ్ళు సామాజిక పరివర్తనకోసం కృషి చేసేవాళ్ళు కాబట్టీ, సామాజిక అన్యాయానికీ, అసమానతలకీ వ్యతిరేకంగా గొంతు విప్పేవారుకాబట్టీ, నా కవిత్వంలో వారి అవసరాలకి తగ్గట్టుగా ఏ కవితని ఎంచుకుంటారా అన్న కుతూహలమైతే లేకపోలేదు. అసలు వారి కాలెండరుని స్ఫూర్తిమంతం చేయడానికి, వారి ఆశయాలకు తగ్గట్టుగా ఉండే మంచి కవిత్వం రాసిన కవులు మరెందరో ఉన్నారు కదా, వారెవరినయినా అడిగి ఉండవలసింది అని కూడా అనుకున్నాను. కానీ తొందరలోనే ఆ విషయం మర్చిపోయాను.

తీరా మొన్న కొరియర్లో ఆ కాలండరు మా ఇంటికొస్తే తెరిచి చూద్దును కదా, జనవరి నెల పక్కనే నా ఈ కవిత కనిపించింది:

అచ్చంగా నా కవితలానే

ఫాల్గుణమాసపు తొలిమామిడి పిందె
కొమ్మను వేలాడుతున్న కాలం
దానిలో భూగర్భ రహస్యాలతో పాటు
ద్యులోక సంగీతం కూడా మిళితమైంది.

ఆశ్చర్యం, మామిడిచెట్టుకి మళ్ళీ
మామిడిపిందె, అచ్చం నా కవితలానే
అదే రంగు, అదే ఒంపు, అదే వగరు
ఆ తొడిమ చుట్టూ మళ్ళీ అదే జీడి చార.

నా ఆశ్చర్యానికి అవధి లేదు. ఎప్పటి కవిత ఇది! నీటిరంగుల చిత్రం (2014) లో కవిత. అప్పుడే అనుకున్నాను, ఈ కవిత ఎవరిని చేరగలదని? ఎందుకంటే, ఒక ఎమోషనుని subtle గా కవితగా కూర్చినప్పుడు దాన్ని చేరగల పాఠకులు అరుదైపోతారు. కానీ ఈ కవిత నాకు చాలా ఇష్టం. ఎందుకంటే మహనీయులైన యూరపియను కవుల శుశ్రూషలో కాలం గడుపుతున్నప్పుడు రాసిన కవిత ఇది. మా కాలనీలో ఒక ఫాల్గుణ మాసంలో పిందె పట్టిన మామిడిచెట్టుని చూసినప్పుడు అది నాలో కలిగించిన సంవేదనని ఎలా కవితగా మార్చాలో తెలియక కొట్టుమిట్టాడేను. చివరికి ఒక రేనర్ మేరియా రిల్కె మా కాలనీలో ఆ మామిడిచెట్టుని చూసి ఉంటే ఏమని కవిత చెప్పేవాడా అని ఆలోచిస్తూ ఉండగా స్ఫురించిన వాక్యాలివి.

ఈ కవిత ఇప్పుడు కలకత్తాకి చేరిందంటే నాకు చాలా చాలా ఆశ్చర్యంగా ఉంది. ఎందుకంటే మనుషుల్ని ప్రేమించడం ఒక స్వభావంగా మారినవాళ్ళు తప్ప మరొకరెవరూ ఈ సున్నితస్పందనని గమనించలేరు, గమనించినా ఇలా ఒక పతాకలాగా పైకి ఎగరెయ్యలేరు.

ఈ పదేళ్ళల్లో నా చుట్టూ ప్రపంచం మరింత మారింది. ఇప్పుడు జీవితాన్ని ప్రేమిస్తే చాలదు, మన ప్రేమని ప్రకటించుకోడానికి మరొకరి ప్రేమనో, కృషినో, విశ్వాసాల్నో

చిన్నబుచ్చకపోతే తప్ప మన భావాలకు గుర్తింపుదొరకదనే ఒక ఆతృత సకలమాధ్యమాల్నీ చుట్టబెడుతున్న కాలంలో ఉన్నాం. మరొకరికన్నా నువ్వు గొప్పవాడివని చెప్పుకోడానికి వారిని చిన్నబుచ్చడమే సులభమార్గంగా ఎంచుకుంటున్న కాలంలో ఉన్నాం.

ఇటువంటి రోజుల్లో ఎప్పుడో నేను రాసిన (కాదు, నాకోసం నేను రాసుకున్న) ఒక కవితను తాము ఎంపికచేసుకుని తమ కాలెండరులో, అది కూడా మొదటినెలలోనే చోటిచ్చిన ఆ సంపాదకులకు ఏమని ధన్యవాదాలు చెప్పాలో అర్థం కావడం లేదు. నిజానికి ఒక కవికి ఇంతకు మించిన పురస్కారం ఉంటుందని కూడా అనుకోను.

కేశవరావుగారూ, సర్వమంగళ గారూ, మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను. ఎప్పుడేనా కలకత్తా వస్తే ఒక సాయంకాలం మీతో కలిసి గంగానది ఒడ్డున కూచోవాలని ఉంది. మీరెప్పుడేనా హైదరాబాదు వస్తే మా ఇంటికి అతిథులుగా రమ్మని కోరుకుంటున్నాను.

19-2-2025

చలంగారూ, జగ్గారావూ

చలంగారికి మండువ జగ్గారావుగారని ఒక మిత్రుడుండేవాడు. ఆయనకి ఇంగ్లిషు రాదు. అందుకని చలంగారు ఆయన కోసం ఉమర్ ఖయ్యాం రుబాయీల్ని తెలుగులోకి అనువదించారు. ఆ తర్వాత వాటిని అచ్చు వేస్తూ 'తెలుగులోకంలో ఇంకో జగ్గరావుని యోచించుకోలేను, కానీ ఉన్నారేమోనని, ఈ అచ్చు' అని రాసారు. ఆ పుస్తకం నా చేతులకి వచ్చేటప్పటికి చలంగారు ఈ లోకం విడిచిపెట్టేసారు. లేకపోతే నేనాయనకు ఉత్తరం రాసి ఉండేవాణ్ణి: 'చలంగారూ, ఆ మరో జగ్గారావును నేనే' అని.

ప్రతి కవికీ, రచయితకీ ఎవరో ఒక జగ్గారావు ఉండే ఉంటారు. చలంగారు అదృష్ట–వంతులు. ఆయనకు కనీసం ఆ జగ్గారావు మిత్రుడు కూడా. కానీ చాలాసార్లు ఎందరో రచయితలు తమ జగ్గారావు ఎవరో తెలుసుకోకుండానే, చూడకుండానే, ఆ జగ్గారావును కలుసుకోకుండానే ఈ లోకం విడిచిపెట్టి వెళ్ళిపోతుంటారు.

చలంగారు నిజంగానే అదృష్టవంతులు. ఆయనకి ఒక జగ్గారావు వ్యక్తిగతంగా తెలుసు. కాని మరో జగ్గారావు నా రూపంలో లేదా ఆ ఉమర్ ఖయ్యాం రుబాయీలు చదివి సంతోషించిన ప్రతి ఒక్క పాఠకుడిరూపంలో ఆయనకు దొరుకుతూనే ఉన్నారు. మరో జగ్గారావు ఉండవచ్చునేమో అన్న ఆయన ఆశ వమ్ము కాలేదు.

నాకు ఉమర్ ఖయ్యాం తెలియకముందే రామిరెడ్డి 'పానశాల' చేతుల్లోకి వచ్చింది. తాడికొండ రోజుల్లోనే, అంటే నా హైస్కూలు దినాల్లోనే, ఆ పద్యాలు నాకొక రసభాండాన్ని పరిచయం చేసాయి. కాని ఆ పద్యాలు చదివిన ప్రతిసారీ వాటి అర్థం వేపుకు మనసు పోనీకుండా ఏదో సన్నని సితారు సంగీతం నా చెవుల్లో గీపెడుతున్నట్టే ఉండేది. ఆ తర్వాత చాలా ఏళ్ళకు ఫిడ్జెరాల్డుని తెరిచాను. కానీ ఒక్క పద్యంలోకి కూడా ప్రవేశించ లేకపోయాను. సూటువేసుకుని టై కట్టుకున్న ఒక విక్టోరియను యుగపు బ్రిటిషు పెద్దమనిషి

తనజాతివాళ్ళు మాట్లాడుకునే భాషలో ఆ సూఫీ కవిత్వాన్ని నాకు అర్థం కాకుండా చేసేసాడనిపించింది.

కానీ చలంగారి అనువాదం చదివినప్పుడు, అప్పుడు, నిజంగా ఉమర్ ఖయ్యాం నాకు ఎంతో కొంత అర్థమయ్యాడు. ఇదుగో, ముఖ్యంగా ఇలాంటి కవితలు చదివినప్పుడు, ఆ మాట్లాడుతున్నది ఖయ్యామో, చలమో తేడా తెలిసేది కాదు. చూడండి:

ఓ సాయంత్రం వీథి వెంట పోతున్నాను.
రూపభాండాల్ని తయారుచేసే కమ్మరి
నిర్దయగా తడిమన్నుని మర్దన చేస్తున్నాడు.
అంత అణగగొట్టినా, పాపం,
ఆ మన్ను జాలిగా అంటోంది–
'అన్నా, నెమ్మది. అంత గట్టిగా కొట్టకు' అని.

ఇది నిస్సందేహంగా చలంగారి భాష. కాని ఖయ్యాము కూడా ఈ భాషలోనే రాసాడని నమ్మవచ్చు. ఇది భాష సంగతి. ఇక tone చూడండి, ఈ కవితలో:

మనం ఆకాశమంటామే– ఆ బోర్లించిన మూకుడు,
దానికింద వొంగిపోయి పాక్కుంటో బతుకుతున్నామే, చస్తున్నామే
దానికేసి సహాయం చెయ్యమని చేతులెత్తి ఏం ప్రయోజనం లేదు.
నీకు మల్లేనే, నాకు మల్లేనే
అదీ అంత నిస్సహాయంగా దొర్లుకుంటో పోతోంది.
భూమి మీది మొదటిమట్టి తయారైనప్పుడే
భూమి మీదికి వొచ్చే చివరిమనిషి ఆకారాన్ని చెయ్యడం కోసం
మట్టిని మర్దన చేసి వుంచారు.
ఈలోకంలో పండబోయే చివరిపంటకి
ఆనాడే మొదట్లోనే విత్తులు నాటేశారు.
ఈ సృష్టి ప్రారంభించిన మొదటి ఉదయానే
చివరి ఉదయపు లెఖ్ఖలన్నీ వేసేశే వున్నాయి.

ఇది చలంగారి వాక్యనిర్మాణం మాత్రమే కాదు, ఆలోచనా పద్ధతి కూడా. మనిషిలో వచ్చే పరిణామమంతా అతడి అంతరంగంలోనూ, సంస్కారంలోనూ వచ్చేదికాదనీ, అతణ్ణి

రూపొందించిన మట్టి సృష్ట్యాదినుంచి చివరిదాకా ఒక్కలానే ఉంటుందని ఇంతకన్నా బలంగా ఎవరు చెప్పగలరు?

కాని ఆ సౌందర్య సంతోషముందే, చలంగారికి తెలిసిన సంతోషం ఖయ్యాముకి కూడా తెలిసే ఉంటుందని, ఇదుగో, ఇలాంటి కవిత చదివితే మనకి బాగా తెలుస్తుంది:

వాళ్ళలో ఒకరు అన్నారు.
ప్రపంచ మధుశాలాధికారి మనుషులు ఆయన్ని సమర్థిస్తో
అంటారు– ఇదంతా ఆయన మనకి పెట్టే పరీక్షట.
ఆయన హృదయం మంచిదేట.
చివరికి అంతాసరిచేసి ఎక్కడో ఎప్పుడో సుఖపెడతాట్ట.

ఇట్లాంటి మాటలు చెప్పి
ఆయన మొహానికి నరకం పొగని నల్లగా పట్టిస్తారు.
ఓ పాత్ర దీర్ఘంగా నిట్టూర్చి అంది–
చాలాకాలం ఎవరూ చూసేవారు లేక నా మట్టి ఎండిపోయింది
ద్రాక్షరసంతో నించండి నన్ను. క్రమంగా కోలుకుంటానేమో.

ఇంతకీ ఎందుకు రాస్తున్నాను ఇప్పుడిదంతా! ఎందుకంటే నా చుట్టూ ఉన్న ప్రపంచంలో కవులకీ, కథకులకీ తమ రచనల గురించి లోకం ఏమనుకుంటోందో తెలుసుకోడం పట్ల ఎంత ఆసక్తి! ఆసక్తి చిన్నమాట. ఎంత దాహం! ఎంత ఆత్రుత!

కానీ మొన్న ఒక పుస్తకావిష్కరణ సభకి పిలిస్తే ఇదే చెప్పాను: మీరు నిజంగా మీ హృదయం ఏమి చెప్తోందో దాన్నే రాయదలుచుకుంటే, మీకు ఒక్క పబ్లిషరు కూడా దొరక్కూడదు, ఒక్క పాఠకుడు కూడా మీకు తన స్పందన చెప్పకూడదు అని. ఎందుకంటే పబ్లిషరు అంటూ ఒకడు దొరగ్గానే మీ రచన ఒక పెట్టుబడివస్తువుగా మారిపోతుంది. మీ హృదయం చెప్పేది వినడం మానేసి పబ్లిషరు చెప్పే లెక్కలు పట్టించుకోడం మొదలు పెడతారు. ఇక పాఠకుడంటారా! మీకు పాఠకులుండాలిగాని వాళ్ళెవరో మీకు తెలియకూడదు. తెలిస్తే మీరింకెంత మాత్రం మీ అంతరాత్మకు నచ్చినట్టు రాసుకోలేరు. ఏం రాస్తే, ఎలా రాస్తే మీ ప్రియపాఠకుడు please అవుతాడో తెలియక మీరెప్పుడూ ఒక గందరగోళంలోనే గడుపుతారు. ఒక్క పాఠకుడైనా ఒక మహారచయితని కూడా ఎంత కంగారు పెట్టగలడో తెలియాలంటే గురజాడ అప్పారావుగారికీ, ఒంగోలు ముని–సుబ్రహ్మణ్యంకీ మధ్య నడిచిన ఉత్తరప్రత్యుత్తరాలు చూడండి.

చలంగారు కాబట్టి ఒక జగ్గారావు దొరికినా ఆయన తన భాషని, తన tone ని, తన సౌందర్యదర్శనాన్ని భద్రంగా నిలబెట్టుకోగలిగారు. నేనైతే సాహిత్యాధిదేవతను ప్రార్థించేది ఇదే: 'అమ్మా, నా జీవితంలో నాకు ఒక్క జగ్గారావు కూడా తారసపడకూడదు' అనే.

24-4-2025

రమణా సుమనశ్రీ అవార్డు

మొన్న సాయంకాలం గోల్డెను త్రెషోల్డు ప్రాంగణంలో ప్రసిద్ధకవి, ఆత్మీయమిత్రుడు సుమనశ్రీ కె.శివారెడ్డి ఇటీవలి కవితాసంపుటి 'గాథ' కీ, నా కవితా సంపుటం 'నీటిరంగుల చిత్రం' కీ రమణా సుమనశ్రీ అవార్డులు అందించాడు.

ఆ సత్కారసమావేశానికి మరొక ప్రసిద్ధ కవి, భావుకుడు దీవి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. శివారెడ్డి కవిత్వం మీద సుధామ, నా కవిత్వం మీద కె.బి.లక్ష్మి ప్రసంగించారు.

నేను రోజంతా సెక్రటేరియటులో ఏదో సమావేశానికి నోట్సు తయారుచెయ్యడంలో కూరుకుపోయి, రాత్రి ఏడున్నరకి ఒక గంట సమయం ఎట్లానో చిక్కించుకు మరీ ఆ సమావేశానికి వెళ్ళాను. పుష్యమాసపు నెలవంక ఇంకా ఆకాశంలో మెరుస్తూనే ఉన్నాడు. భారతకోకిల నడయాడిన ఇల్లు. ఒక కవిమిత్రుడు తన తోటి కవులిద్దరిని సత్కరించడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు.

సత్కారానికి నా స్పందన చెప్పడానికి మైకు అందుకోగానే చాలా చాలా భావాలు తుమ్మెదల్లా నా మనసంతా ఝుమ్మన్నాయి.

పుస్తకం విడుదలై ఏడాది కూడా కాకుండానే ఒక కవిమిత్రుడి ఆత్మీయ సత్కారానికి నోచుకోవడమే ఎంతో సంతోషం. ఇక శివారెడ్డిగారితో సమానంగా ఆ గౌరవం అందుకోవడం మరింత ఆనందాన్నిచ్చింది.

'నీటిరంగుల చిత్రం' లో కవితలు గత అయిదేళ్ళ కాలంగా రాస్తూ వచ్చినవి. ఒక రకంగా చెప్పాలంటే అంతకు పూర్వం నేను రాసిన కవిత్వమంతా పూర్వకవుల కవిత్వ ఛాయలో రాసింది కాగా, ఈ కవిత్వంలో నన్ను నేను వెదుక్కునే ప్రయత్నం చేసాను. ఆ

ప్రయత్నంలో, ఆ ప్రయోగాల్లో ఉన్న ముఖ్యాంశాల్ని ఆ పుస్తకంలో చివర ఆదిత్య కొర్రపాటి చేసిన ఇంటర్వ్యూలో వివరంగా చెప్పాను. అయినా ఆ సాయంకాలం నా ఎదట ఉన్న శ్రోతలకోసం మళ్ళా ఆ సారాంశాన్ని మూడు మాటల్లో చెప్పడానికి ప్రయత్నించాను.

మొదటిది, కావ్యశిల్పానికి సంబంధించి. తెలుగు కవిత్వం ప్రధానంగా రీతికవిత్వం. ధారాళంగా, ధారాప్రవాహంగా, వర్ణనాత్మకంగా, సంబోధనాత్మకంగా, ప్రబోధనాత్మకంగా ఉండే కవిత్వంతో తెలుగువాళ్ళు ఎక్కువ మమేకమవుతారు. పోతన, శ్రీనాథుడు, నన్నయ, శ్రీశ్రీ, శివారెడ్డి ఆ తరహా కవులు. దానికి పూర్తిగా అవతలిదిక్కున ఉండేది ధ్వనిప్రధాన కవిత్వం. గాథాసప్తశతి, హైకూ, ఇస్మాయిల్ ఆ తరహా కవులు. నేను ఆ రెండు కవిత్వాలకు మధ్యేమార్గంగా ఉండే కవిత్వం కోసం 'నీటిరంగుల చిత్రం' లో ప్రయత్నించాను. దానికి ముఖ్యంగా మెటఫర్ మీద ఆధారపడ్డాను. అలంకారం కవిత్వానికి ప్రాణమని భామహుడి కాలంనుంచీ భావించినప్పటికీ, ప్రాచీన అలంకారాలకీ, modern metaphor కీ తేడా ఉంది. Modern metaphor రెండు సాదృశ్యాల్ని పోల్చడం కాకుండా రెండు విరుద్ధ జీవితసన్నివేశాల మధ్య సాదృశ్యాన్ని చూడటానికి ప్రయత్నిస్తుంది. ఇది ప్రాచీన కవులు కూడా చెయ్యకపోలేదు. ఉధాహరణకి వాల్మీకి లంకానగరాన్ని వర్ణిస్తూ 'యంత్రాగార స్తనీ, కోష్ఠాగార అవతంసికా' అంటాడు. తెనాలి రామకృష్ణుడు నిగమశర్మ గురించి రాస్తూ 'వేదముల్ పోసిన గాదె' అంటాడు. కాని ప్రాచీన కవిత్వప్రశంస వాటిమీద దృష్టి పెట్టలేదు. కాని ఆధునిక ప్రపంచం అట్లాంటి మెటఫర్లముందే మోకరిల్లుతుంది. అట్లాంటి మెటఫర్ల కోసం తపసు చేస్తే వచ్చిన కవితలు నీటిరంగుల చిత్రం కవితలు.

రెండో అంశం, అట్లాంటి మెటఫర్లకు కావలసిన పదచిత్రాలనూ, పదసామగ్రినీ నా చుట్టూ ఉండే దైనందిన జీవితంలోంచి, ముఖ్యంగా నగరజీవితంలోంచి పట్టుకునే ప్రయత్నం చేసాను. ఒకప్పుడు మధ్యయుగాల్లో కబీరు ఇట్లాంటి ప్రయత్నం చేసాడు.

ఇక మూడవ అంశం, ముఖ్యమైన అంశం, ఆదిత్య తన ప్రశ్నల్లో ఎత్తిచూపి బహిర్గతం చేసిన అంశం, నా కవిత్వం వెనక బలంగా పనిచేస్తున్న భారతీయ భక్తికవుల పరంపర. కవిత్వరసాస్వాదనకు సంబంధించినంతవరకూ భారతీయ భక్తికవులు పండితపామర భేదాన్ని తుడిచిపెట్టేసారు. ప్రాచీన తమిళకవిత్వమూ, సంస్కృతకవిత్వమూ కూడా సుశిక్షితుడైన శ్రోతని కోరుకున్నాయి. కాని ప్రాకృతకవిత్వం ఆ పరిమితినుంచి బయట పడింది. ఆ దారిలో మరాఠీ భక్తికవులూ, హిందీ సంత్ కవులూ, బెంగాలీ వైష్ణవ కవులూ ప్రజాహృదయాల్లోకి సూటిగా చొచ్చుకు పోగలిగారు. కాని వారి దేవుడు సాకారమూర్తి. ఆ దేవుణ్ణి ఒక విగ్రహంలో కాకుండా జీవితం వికసించిన ప్రతితావులోనూ పసిగట్టడానికి

ప్రయత్నించి టాగోరు ఆధునిక భారతదేశానికి మహోపకారం చేసాడు. కాని టాగోరు కవితలో భగవంతుడింకా నిరాకారుడిగానే అయినా ఒక ఉనికిగా కొనసాగుతూనే వచ్చాడు. నేను మరొక అడుగు ముందుకేసి నేను authentic గా 'బతికిన' ప్రతి క్షణంలోనూ భగవంతుణ్ణి సందర్శించి, ఆయన్ని ఒక సగుణ లేదా నిర్గుణ మూర్తిగా కాక ఒక స్పృహగా గుర్తుపట్టడానికి ప్రయత్నించాను. తద్వారా సనాతన భారతీయ భక్తి కవిత్వ పరంపరలో ఉపనిషత్కారులు, భాగవతం, కబీరు, టాగోరుల కోవలో 21 వ శతాబ్దపు వారసురాలిగా నా కవిత్వాన్ని నేను సంభావించుకుంటున్నాను.

ఈ జీవితమెందుకో, ఈ నామరూపప్రపంచం వెనక ఉన్న సత్యమేమిటో నేను ఎప్పటికీ అవగతం చేసుకోలేననే అనుకుంటున్నాను. ఒకప్పుడు వేదాంతులు దీన్ని మాయ అన్నారు. ఇప్పుడు పోస్టు మోడర్న్ తత్త్వవేత్తలు text కి బయట ఏమీ లేదంటున్నారు. ఇట్లాంటి అగమ్యస్థితిలో జీవితప్రయోజనాన్ని నిర్ధారించుకోవడం కష్టం. ఏది మంచో ఏది చెడో కూడా తేల్చుకోవడం కష్టం. ఇప్పుడు నేను చెయ్యగలిగేదల్లా మాయో, సత్యమో తెలీదుగానీ, జీవితం సుందరంగానూ, ఆనందప్రదంగానూ గోచరించిన కొన్ని క్షణాల్ని పట్టుకోవడం, వాటిని పదేపదే తల్చుకోవడం. అట్లాంటి సౌందర్యమయ క్షణాల సమాహారమే నా 'నీటిరంగుల చిత్రం.'

7-12-2014

సాహిత్యసమాలోచన

నిన్న సాయంకాలం విజయవాడ బుక్ ఫెస్టివలు సొసైటి భవనంలో కొత్తగా నిర్మించిన సమావేశ మందిరంలో నా సాహిత్యం మీద కొంత సమాలోచన జరిగింది. నలభయ్యేళ్ళకు పైగా రాస్తూ ఉన్నప్పటికీ, నా రచనల మీద ఇట్లాంటి ఒక సమాలోచన జరగడం ఇదే మొదటిసారి. ఆ సమావేశానికి నన్ను కూడా రమ్మని పిలిచినప్పుడు మొదట్లో కొంత ఇబ్బందిగా అనిపించింది. నా సాహిత్యం మీద మిత్రులు మాటాడుతుంటే ఎదురుగా కూచుని వినగలనా అనుకున్నాను. కాని, కొంత నిర్మమత్వంతో కూచోగలిగితే వారు చెప్పే విషయాలు నాకు ఉపకరిస్తాయి కదా, నా తప్పొప్పులు తెలుస్తాయి కదా అనుకున్నాను.

సోదరి బాలాంత్రపు ప్రసూన నిర్వహించిన ఆ సభలో నా తత్త్వశాస్త్ర అనువాదాల పైన కాకుమాని శ్రీనివాసరావు, కవిత్వం పైన సీతారాం, సాహిత్య విమర్శ పైన చినుకు రాజగోపాల్ మాట్లాడేరు. చివరలో నా ప్రతిస్పందన.

శ్రీనివాసరావు గొప్ప చదువరి, భావుకుడు, విజ్ఞుడు. ఆయన నా 'సత్యాన్వేషణ', 'ఇమాన్యువల్ కాంట్ రచనలు', కబీరు 'నాది దుఃఖం లేని దేశం' గురించి మాట్లాడేరు. ఒకప్పుడు టాల్‌స్టాయి అనాకెరినినా నవల గురించి అన్నాడట: నా తర్వాతి తరం యువతీ యువకులు ఈ పుస్తకాన్ని ఇంత ఆదరంగా చదువుతారని ఊహించి ఉంటే, ఈ పుస్తకాన్ని మరింత శ్రద్ధగా రాసి ఉండేవాణ్ణి అని. శ్రీనివాసరావుని విన్నాక నాకు ఆ మాటే అనిపించింది. నా దృష్టిలో 'సత్యాన్వేషణ' ఒక వైఫల్యం. ఆ పుస్తకం నాకెంత మాత్రం సంతృప్తి కలిగించలేదు. ఆ పుస్తకాన్ని ఎమెస్కో కాటలాగు లోంచి తీసెయ్యమంటే, విజయ–కుమారు ఒప్పుకోలేదు. 'మీ పుస్తకాల్లో పునర్ముద్రణ పొందిన పుస్తకం ఇదే' అన్నాడు. అది నన్ను మరీ బాధించే అంశం. ఆ పుస్తకాన్ని నేను మరింత తిరగరాయవలసి ఉంది. కొన్ని వ్యాసాలు మార్చవలసి ఉంది. వాక్యనిర్మాణాన్ని మరింత మెరుగుపర్చవలసి ఉంది.

2003 నాటికన్నా, వాక్య నిర్మాణంలో మెలకువలు, నాకు మరింతగా, ఇప్పుడు బోధపడ్డాయి. ఏ విధంగా చూసినా ఆ పుస్తకాన్ని ఆమూలాగ్రం మార్చవలసి ఉంది.

కాంట్ మరణించి 200 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా, ఆయన రచనల నుంచి కొన్ని అనువాదాలతో ఒక సంకలనం ఇమ్మని పీకాక్ క్లాసిక్స్ గాంధీగారు అడగడంతో 'ఇమ్మాన్యువల్ కాంట్ రచనలు' అందించాను. పట్టుమని 120 పేజీలు కూడా లేని ఆ పుస్తకం నా మూడేళ్ళ విలువైన కాలాన్ని హరించి వేసింది. ఆ రచనని దాదాపుగా stillborn from the press అని చెప్పవచ్చు. డేవిడ్ హ్యూము తన పుస్తకం గురించి ఆ మాట చెప్పుకున్నాడని రేవతీదేవి ఒకచోట రాసుకున్నారు.

కాంట్ రచనల నా సంకలనం, అనువాదం వెలువడ్డ పుష్కరకాలం తర్వాత, మొదటిసారి, ఒక సభలో ఒక పాఠకుడు ఆ పుస్తకం గురించి మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కూడా కలగచేసింది. శ్రీనివాసరావు ఆ పుస్తకం గురించి మాట్లాడటంతో ఆగలేదు, తన యవ్వనకాలంలో ఆ పుస్తకం లభించి ఉంటే, తాను చలంగారి సౌందర్యదృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి పెనగులాడుతున్నప్పుడు ఆ పుస్తకం దొరికి ఉంటే, తన అన్వేషణ, అధ్యయనం మరింత సుసంపన్నమై ఉండేవన్నాడు.

కాంట్ రచనలనుంచి ఎంపికచేసి అనువదించాక, ఆ సంకలానికొక ముందుమాట రాస్తే బాగుణ్ణనుకున్నాను. కాని Cambridge Companion to Kant సంపుటానికి పాల్ గుయెర్ అనే కాంట్ పండితుడు రాసిన ముందుమాట చదివాక దాన్ని యథాతథంగా అనువదించి నా సంకలానికి కూడా ముందుమాటగా పెట్టుకున్నాను.

అయినా ఇంకా ఏదో మరొక వ్యాసమో, వాక్యమో కావాలనిపించింది. అప్పుడు దొరికింది, సాంఖ్య సూత్రాల్లోని ఒక వాక్యం: 'తతః ప్రకృతే' (దానివల్ల మాత్రమే ప్రకృతి బోధపడుతున్నది) అనే సూత్రం. ఆ మాటలు నా సంకలనానికి ప్రవేశవాక్యంగా పెట్టుకున్నాను.

శ్రీనివాస రావు ఆ వాక్యాన్ని పట్టుకోవడం, ఆ 'తత్' అనే దాని గురించి వివరిస్తూ, కాంట్ చెప్పిన thing in itself గా దాన్ని గుర్తిస్తూ, చలంగారి సౌందర్యదృక్పథం కూడా ఆ 'తత్' చుట్టూతానే పరిభ్రమిస్తుందని చెప్పడం నన్ను నివ్వెరపరిచింది. ఇటువంటి జిజ్ఞాసువులున్నారని తెలిస్తే ఇటువంటి కృషి మరికొంత చేసి ఉండేవాణ్ణి కదా అనిపించింది.

ఇక కబీరు కవిత్వానికి నా అనువాదాన్ని ఆయన కవిత్వంలో భాగంగా కాకుండా, తత్త్వశాస్త్ర అనువాదాల్లో భాగంగా చూడటం మరొక పులకింత.

సీతారాం నా కవిత్వ సంపుటాల్లో ఇటీవలి మూడు సంపుటాలూ, 'కోకిల ప్రవేశించే కాలం', 'నీటిరంగుల చిత్రం', 'కొండమీద అతిథి' లోని కవిత్వాన్ని ఆధారం చేసుకుని ప్రసంగించాడు. ఆయన మాట్లాడుతున్నంతసేపూ నా గుండె కరిగి నీరయిపోతూనే ఉంది. కవిత్వం ఒక కరెంటు తీగ. కవి ఆ తీగకు ఒక కొసన స్విచ్చినొక్కుతాడు. మరొక కొసన పాఠకుడి సహృదయం బల్బులాగా వెలగకపోతే ఆ కరెంటు ప్రవాహం ఆగి-పోయినట్టు, ఆ వైరింగు పాడయిపోయినట్టు. అలాకాక, ఒక కవిత చదవగానే పాఠకుడి హృదయం వంద కాండిల్సు ప్రకాశంతో వెలిగినట్టయితే, ఆ విద్యుత్ ప్రవాహం తెంపు లేకుండా సంపూర్తిగా ప్రవహించినట్టు. ఆ శోభాయమాన, ఆ జాజ్జ్వల్యమాన కాంతిధారని చూడటంకన్నా మించిన ఆనందం ఏ కవికైనా మరొకటేముంటుంది కనుక!

రాజగోపాల్ నా సాహిత్యవిమర్శ సంపుటాలు, 'సహృదయునికి ప్రేమలేఖ', 'సాహిత్యమంటే ఏమిటి ', 'సాహిత్య సంస్కారం', 'దశార్ణదేశపు హంసలు' నాలుగింటిపైనా ఎంతో విపులంగానూ, ఎంతో ఉద్వేగంతోనూ మాట్లాడటానికి సంసిద్ధులై వచ్చారుగాని, నా ప్రసంగానికి టైము మిగల్చడం కోసం, చాలా వరకూ క్లుప్తంగానే, తనని తాను నియంత్రించుకుంటూ మాట్లాడేరు. తన ప్రసంగంలో ఆయన హెరాల్డ్ బ్లూమ్‌ను పదే పదే గుర్తు చేసుకుంటూ ఉన్నారు. ఇంగ్లీషు సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యుడైన బ్లూమ్‌తో నన్ను పోల్చే సాహసం కూడా చేసారు. కాని నేను నా ప్రతిస్పందనలో ఆ భావాన్ని సవరించేను, బ్లూమ్‌ని చదువుతున్నప్పుడల్లా, మా మాష్టారు శరభయ్యగారే గుర్తొస్తారనీ, బ్లూమ్ నాకు ఎన్నటికీ, ఆరాధించదగ్గ ఒక కొండగుర్తు మాత్రమేననీ, ఆ దిగంతరేఖను నేను నా జీవితకాలంలో అందుకోలేననీ కూడా విన్నవించుకున్నాను.

నా ప్రతిస్పందనలో నేను చాలా విషయాలే మాట్లాడేను. చాలా సేపే మాట్లాడేను. ముఖ్యంగా నేనింతదాకా రాసిన వాటి గురించి కాక, రాయాలనుకున్నవాటి గురించి మాట్లాడేను. మొదటిది, 'ఆత్మాన్వేషణ'. అది భారతీయ తత్త్వశాస్త్రానికి మాత్రమే పరిమితం చెయ్యొద్దనీ, చీనా, జపాను, మధ్యప్రాచ్య, ఆఫ్రికను చింతనాధోరణులకి కూడా విస్తరింప-చెయ్యమని శ్రీనివాసరావుగారూ, వెంకటనారాయణ గారూ కూడా అడిగారు.

రెండవది, నవలలు, నాటకాలూ రాయడం గురించి.

నేను నాటకం గురించి ఎక్కడా మాట్లాడకపోయినా, విస్తారంగా రాయకపోయినా, నాటకప్రక్రియ గురించిన ఆలోచనల్తో నా హృదయం సదా రగిలిపోతూనే ఉంటుందని చెప్పాను. నేను ఇంగ్లాండు వెళ్ళినప్పుడు, ఆస్కారు అవార్డు వచ్చిన సినిమాకి పట్టుమని

పదిమంది ప్రేక్షకులు కూడా లేకపోవడం, అదే మార్క్ రావెన్ హిల్ అనే ఒక ప్రయోక్త ప్రదర్శించిన ఒక పోస్టు-మాడర్న్ రూపకం చూడటానికి హాలంతా కిక్కిరిసిపోవడం గుర్తు చేసుకున్నాను. తెలుగునేల మీద నాటకప్రదర్శనలు చూడటానికి ప్రేక్షకులు కిక్కిరిసి పోతూ, సినిమాహాళ్ళల్లో మొదటి రోజు కూడా హాలు ఖాళీగా ఉండే రోజు రావడానికి నేనేం చెయ్యాలో అదంతా చెయ్యాలనే ఒక తపన నన్ను కాల్చేస్తూ ఉంటుందని కూడా చెప్పుకొచ్చాను. సినిమాతో నాకు పేచీ లేదు. సినిమా ఒక mass ritual అని ఋత్విక్ ఘటక్ అన్నాడని నాకు గుర్తే. కాని అది mass ritual మాత్రమే. నాటకం ఒక civic ritual. నాటక రచన, ప్రదర్శన, వీక్షణం మూడూ అత్యున్నతస్థాయి రసజ్ఞతా చిహ్నాలు. ప్రాచీన గ్రీకు-రోమను నగరాల్లో నాటకాలు ప్రదర్శించినంతకాలం అక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లిందనీ, ఆ స్థానంలో నాటకాలకి బదులు ఒకరినొకరు నరుక్కునే గ్లాడియేటర్లను చూడటానికి రోమను ప్రజలు గుమికూడగానే ప్రజాస్వామ్యం అంతరించి నియంతృత్వం నెలకొనిందనీ ఎడిత్ హామిల్టను రాసిందని కలాం తన ఆత్మకథలో రాసుకున్నాడు. నాటకం ఒక సభ్యత, ఒక సంస్కృతి, ఒక పౌర సంస్కారం, ఒక సామూహిక క్రతువు, ఒక సౌందర్యసృజన.

సమావేశం ముగిసి ఇంటికి వచ్చాక నా మనసులో సంతృప్తికి బదులు చెప్పలేనంత ఆరాటమే రాత్రంతా.

చెయ్యవలసింది చాలా ఉంది. చేసింది చాలా స్వల్పం.

7-7-2019

విష్ణుపురం సాహిత్యోత్సవం

జయమోహన్ ప్రసిద్ధ తమిళరచయిత, సాహిత్యవేత్త. నవల, కథ, సాహిత్యవిమర్శ, తాత్త్వికసమాలోచన, జీవితచరిత్ర వంటి వివిధ ప్రక్రియల్లో ఎన్నో రచనలు చేసిన వ్యక్తి. గత పదేళ్ళుగా ఆయన మహాభారతాన్ని 'వెన్ మురసు' పేరిట ఒక నవలగా రాయడం మొదలుపెట్టి ఇటీవలే ముగించారు. 26,000 పేజీల ఆ నవల 26 సంపుటాలుగా వెలువడింది. ప్రపంచ సాహిత్యంలోనే అంత సుదీర్ఘమైన నవల మరొకటిలేదు.

ఆయన 1997 లో 'విష్ణుపురం' అనే ఒక నవల రాసారు. చారిత్రిక నేపథ్యంతో రాసిన ఒక కాల్పనిక రచన అది. దాన్ని పాఠకలోకం విశేషంగా ఆదరించింది. ఆ పాఠకుల్లో కొందరు 'విష్ణుపురం ఇలక్కియ వట్టం' పేరిట ఒక సాహిత్యబృందంగా ఏర్పడ్డారు. దాదాపుగా ప్రపంచవ్యాప్తంగా పాఠకులు అందులో సభ్యులుగా చేరారు.

2011 నుండీ ఆ బృందం ఒక ప్రతి ఏటా ఒక తమిళ రచయితను ఎంపికచేసి అతడికి సాహిత్య పురస్కారం, సన్మానం చేస్తూ ఉన్నారు. సాహిత్య అకాదెమీ గాని, ఇతర సాహిత్య సంస్థలు గాని ఇంతదాకా గుర్తించని ప్రతిభావంతుడైన రచయితను ఎంపికచేసి అతడి సాహిత్యం మీద విస్తృతంగా చర్చించడం, ఏటా డిసెంబరు చివరివారంలో కోయంబత్తూరులో రెండు రోజులు సాహిత్యగోష్ఠి నిర్వహించడం ఆ బృందం చేస్తున్న పని.

దాంతో పాటు వారు తమ గోష్ఠికి ప్రతి ఏటా భారతీయభాషలనుంచి ఒక రచయితనో, కవినో ఆహ్వానించి,ఆ భాషాసాహిత్యం గురించి కూడా ఒక గంటపాటు ఆ రచయితతో ముఖాముఖి చర్చ చేపడుతూ ఉన్నారు. రెండవరోజు సాయంకాలం ప్రధాన సమావేశంలో తమ పురస్కారాన్ని పొందిన తమిళ రచయితకు ఆ సోదర భారతీయభాషా రచయితతో సన్మానం చేయిస్తూ ఉన్నారు.

ఈసారి ఆ పురస్కారానికి ప్రసిద్ధ తమిళ కవి విక్రమాదిత్యన్‌ను ఎంపిక చేసారు. ఆ గోష్ఠిలోనూ, ఆ పురస్కార ప్రదానంలోనూ పాల్గొనడానికి తెలుగు సాహిత్యం నుంచి ఒక ప్రతినిధిని ఆహ్వానించాలని నిర్ణయించుకున్నారు. వారికి ఒక మిత్రుడు నా పేరు సూచిస్తే, నన్ను సాదరంగా ఆహ్వానించేరు.

అయితే వారు ఇప్పటిదాకా నా పేరు వినలేదు. నా రచనలు చదవలేదు. కాబట్టి, నా కవితలు, రచనలు ఇంగ్లిషు అనువాదాలేమైనా ఉంటే పంపించమని అడిగారు. నా దగ్గర ఎప్పుడో సాహిత్య అకాడెమీ కోసం నేను చేసుకున్న నాలుగు కవితలు అనువాదాలు తప్ప మరేమీ లేవు. ఈలోగా నౌడూరి మూర్తిగారు ఇటీవలే వెలువరించిన Voices of the Surf పుస్తకం నా చేతికి అందింది. అందులో ఆయన నా కవితలకు చేసిన అనువాదాలు సుమారు పదిదాకా ఉన్నాయి. అది కాక ఇంతకుముందు సంపుటంలో ఆయన అనువదించిన మరొక కవిత కూడా ఉంది. మొత్తం పదిహేను కవితలు అనువాదాలు వారికి పంపించాను.

వాటితో పాటు ఆ బృందానికి నన్ను పరిచయం చేసిన మిత్రుడు రాజు నేరుగా తెలుగు నుంచి తమిళంలోకి రెండు మూడు కవితలు నావి అనువదించి పంపాడు. నన్ను పరిచయం చేస్తూ జయమోహన్‌కి ఒక ఉత్తరం కూడా రాసాడు. అందులో అతడు నన్ను తమిళంలో జ్ఞానకూత్తన్, దేవదచ్చన్, పిరమల్ వంటి కవుల కోవకు చెందిన కవిగా పరిచయం చేసాడు. వాటితో పాటు నా కవితల ఇంగ్లిషు అనువాదాల్ని శుభశ్రీ, సుచిత్ర మొదలైన కొందరు తమిళ మిత్రులు తమిళంలోకి అనువదించారు.

ఆ విధంగా ఆ మిత్రులు నా కవితలకు చేసిన పదిహేను అనువాదాల్ని జయమోహన్ తన బ్లాగులో వరసగా అయిదురోజుల పాటు తమిళ మిత్రులకి పరిచయం చేసారు. ఆ కవితలకు తమిళ మిత్రులనుండి ఊహించనంత స్పందన లభించింది. ఆ కవితలు తమకి కొత్త సౌందర్యశాస్త్రాన్ని పరిచయం చేస్తున్నాయని వారంతా కొనియాడారు. ఆ లేఖల్ని కూడా జయమోహన్ తన బ్లాగులో ప్రచురించారు.

ఆ లేఖల్లో ఆర్. మోహన కుమార్ అనే ఆయన ఇలా రాసాడు: 'మనం చదువుతూ వస్తున్న కవిత్వం కన్నా చినవీరభద్రుడు కవిత్వం ఎంతో భిన్నమైందిగా కనిపిస్తున్నది... కవిత్వంలోని సంవేదనలు సరికొత్తగా కనిపిస్తున్నాయి..నాకు ఇన్నాళ్ళూ తెలుగుకవిత్వం గురించి ఉన్న అభిప్రాయాన్ని ఈ కవితలు మార్చేసాయి. అత్యంత ఆధునికమైన కవితలు ఇవి. రాజకీయాల ద్వారానూ, సినిమా ద్వారానూ తమిళం గురించి బయటి ప్రపంచం ఏర్పరచుకునే దురభిప్రాయం లాంటిదే తెలుగు పరిస్థితి కూడా అనుకుంటున్నాను. ఇదిగో,

ఇటువంటి ఒక ఆధునిక కవి తన నవ్య కవిత్వంతో మన ముందు ప్రత్యక్షమయినప్పుడు మాత్రమే తెలుగుని ఇన్నాళ్ళూ మనమెంత అపార్థం చేసుకున్నామో తెలిసి వస్తున్నది.'

మరొక ఉత్తరంలో రవీంద్రన్ అనే ఆయన 'చినవీరభద్రుడు రాసిన ఈ కవిత నన్ను ముగ్ధుణ్ణి చేసినట్టుగా ఇటీవలి కాలంలో మరే కవితా లేదు' అని రాసాడు.

ఎస్. రామచంద్రన్ అనే ఆయన రాస్తూ 'ఈ తెలుగు కవిత్వాన్ని నేను కొంత అనాసక్తితోనే చదవడం మొదలుపెట్టానని ఒప్పుకోక తప్పదు. కాని ఈ కవిత్వం నన్ను ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోను చేసింది. ఈ కవితలది ఒక ప్రత్యేకసౌందర్యశాస్త్రం. పోయిన సారి కె.జి.శంకరపిళ్ళై, తర్వాత మళ్ళా ఈ కవిత్వం నాకొక సరికొత్త సౌందర్యాన్ని పరిచయం చేస్తున్నది' అని రాసాడు.

మరొక పాఠకుడు 'చినవీరభద్రుడి కవితలు నేను చాలా ఆసక్తితో చదువుతున్నాను. ఇస్మాయిల్ మీద రాసిన కవిత.. ఒక కవి గురించి చెప్పాలంటే ఇంతకన్నా అత్యుత్తమంగా మరోలా చెప్పలేం' అని రాసాడు.

'పరిమళం నన్ను గాయపరిచినప్పుడు' అనే కవిత గురించి రాస్తూ ఎస్. అనే పాఠకుడు రాస్తున్నాడు కదా: 'అసలు ఈ కవిత శీర్షికనే ఎంతో అందంగా ఉంది. ప్రేమ గురించి రాసిన అద్భుతమైన కవిత. కొన్ని పరిమళాలు మనల్ని రంపాల్లాగా కోసేస్తాయన్నది ప్రేమికులకి అనుభవమే. ..ఆ పరిమళం ఒక నదిజాడలాగా మిగిలిపోయిందని కవి అంటున్నప్పుడు నా గుండె బద్దలైపోయిందనిపించింది' అని.

ఆ కవితల తమిళ అనువాదాల్నీ, ఆ ఉత్తరాల్నీ జయమోహన్ నాకు పంపించారు. ఆ కవితల్లో భాష, పదచిత్రాలూ చాలా కొత్తగా ఉన్నాయని ప్రశంసించారు.

కవిత్వమంటే అనువాదంలో నష్టపోయేది అని రాబర్టు ఫ్రాస్టు అన్న సంగతి అందరికీ తెలిసిందే. కాని 'కవిత్వమంటే అనువాదాన్ని దాటి కూడా బతికేది' అని, ఆక్టేవియో పాజ్ అనుకుంటాను, అన్నాడు. నా కవితలు ఇంగ్లిషునుంచి తమిళంలోకి వెళ్ళిన తరువాత కూడా ఆ రసజ్ఞుల్ని అంతగా అలరించగలగడం నాకు చెప్పలేనంత సంతోషాన్నిచ్చింది.

2

మాకు కోయంబత్తూరు ఏర్ పోర్టులో ఇద్దరు మిత్రులు స్వాగతం పలికారు. వారిద్దరూ విష్ణుపురం సాహిత్యబృందానికి చెందినవాళ్ళే. ఒకరు సెంథిల్, వ్యాపారవేత్త, మరొకరు

రామ్ కుమార్, మేఘాలయ కాడరుకి చెందిన ఐ.ఏ.ఎస్ అధికారి. మేము గెస్టుహవుసుకి వెళ్ళగానే అక్కడ మమ్మల్ని జయమోహన్ ఒక పుష్పగుచ్ఛంతో స్వాగతించారు. ఆయనతో పాటు మరొక సాహిత్యమిత్రురాలు శుభశ్రీ కూడా ఉన్నారు.

జయమోహన్ వంటి సుప్రసిద్ధ సాహిత్యవేత్త, ఫిల్ము కళాకారుడు అంత రాత్రివేళ నాకోసం వేచి ఉండి నాకు స్వాగతం పలకడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఆయన కేవలం మర్యాదపూర్వకంగా పలకరించి వెళ్ళిపోకుండా ఆ రాత్రి నాతో సాహిత్యగోష్ఠి మొదలు పెట్టారు. ఆ ఉత్సాహంలో నేనాయనకు వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యచరిత్ర మొత్తం చెప్పేసాను. నన్నయ నుండి ఇస్మాయిల్ దాకా తెలుగు కవులు తెలుగుభాషతో చేసిన ప్రయోగాల గురించి, ఆధునిక తెలుగుసాహిత్యాన్ని మలుపు తిప్పిన ఉద్యమాల గురించి, ఉద్యమాలతో నిమిత్తంలేకుండా తమదైన దారిలో గొప్ప కవిత్వాన్ని వెలువరించిన కవుల గురించి కూడా చెప్పాను. ఆయన అంతా విని, 'తెలుగు గురించి మాకేమీ తెలీదు. ఇంత కవిత్వం వచ్చిందని కూడా తెలియదు. ఒక రెండువందల కవితలతో ఒక సంకలనం కూర్చి మాకు ఇవ్వండి. నేను దాన్ని తమిళంలోకి అనువదింపచేసి ప్రచురింపచేస్తాను' అన్నారు.

జయమోహన్ అక్కడ కూర్చున్నంతసేపూ ఆయన వదనంలో ఒక నిర్మలత్వం, గొప్ప గురువుల దగ్గర మాత్రమే అనుభవానికొచ్చే ఒక తేటదనం కనిపిస్తూ ఉన్నాయి. టాల్‌స్టాయి, గాంధీల ప్రభావం ఆయన రచనలమీద ఉందని విన్నానుగానీ, అంతకు మించింది మరొకటేదో ఉందనిపించింది. ఆ తర్వాత రాజు చెప్పాడు, ఆయన శ్రీనారాయణ గురు సంప్రదాయానికి చెందినవాడనీ, ఆ పరంపరకు చెందిన నిత్యచైతన్య యతి అనే ఆయన జయమోహన్‌ను శిష్యుడిగా స్వీకరించాడనీ.

ఆ మర్నాడు క్రిస్మసు. వారి సాహిత్యగోష్ఠిలో మొదటిరోజు. రెండవరోజు పొద్దున్నే నాతో ఒక ముఖాముఖి ఏర్పాటు చేసామనీ, మొదటిరోజు ఎక్కడేనా చుట్టుపక్కల తిరగాలనుకుంటే తిరిగి రండి అని చెప్పారు. ఆ మర్నాడు అంటే 26 వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకల్లా సమావేశమందిరానికి చేరుకున్నాం. అక్కడే బ్రేక్‌ఫాస్టు కూడా ఏర్పాటు చేసారు. అల్పాహారం ముగించుకుని తొమ్మిదిన్నరకల్లా మందిరంలోకి అడుగుపెట్టేటప్పటికి భారతియారు పాట ఒకటి వినిపిస్తూ ఉంది.

విశాలమైన ఆ మందిరంలో అప్పటికే రెండుమూడువందల మంది మిత్రులు చేరి ఉన్నారు. వాళ్ళల్లో అత్యధికభాగం అంటే తొంభై శాతంకన్నా ఎక్కువమంది యువతీ యువకులే ఉన్నారు.

ఆ రోజు మొదటి సెషను నాకు కేటాయించారు. ఒక మిత్రుడు తిరుప్పావై నుండి ఒక పాశురం వినిపించిన తర్వాత సభ మొదలయ్యింది. మిత్రుడు రాజు ఆ సభని నిర్వహించాడు. ఆయన నా గురించి స్థూలంగా పరిచయం చేస్తూ మొదటి ప్రశ్నగా 'నిర్వికల్ప సంగీతం నుండి నీటిరంగుల చిత్రం కవితలకు వచ్చేటప్పటికి మీ కవిత్వ నిర్మాణంలో చాలా మార్పు వచ్చింది. ఇందుకు కారణాల్లో సంగం సాహిత్యం కూడా ఒకటని చెప్పారు. అది ఏ విధంగానో వివరిస్తారా' అనడిగాడు. ఆ తరువాత అక్కడి శ్రోతల్లోంచి మరికొంతమంది మరికొన్ని ప్రశ్నలు అడిగారు. వారు నా కవిత్వాన్ని చదవడమే కాక, ప్రతి ఒక్క కవితనీ లోతుగా మననం చేసుకుని మరీ ఆ సమావేశానికి వచ్చారని అర్థమయింది. ఒకాయన నా కవిత నుంచి అయిదారు పంక్తులు అక్కడే తెలుగులోనే అప్పగించేసాడు కూడా. కాని నా కవిత్వం మీద చర్చగా మొదలయింది కాస్తా తెలుగు సాహిత్యం మీదా, సమకాలిక తెలుగు, తమిళ సాహిత్యాల మీదా చర్చగా మారిపోయింది. కేటాయించిన గంట సమయం దాటి గంటన్నరదాకా మిత్రులు ప్రశ్నలు అడుగుతూనే ఉన్నారు. నేను ఇంగ్లిషులో ఇస్తున్న జవాబుల్లో మరీ కీలకమైన వాక్యాల్ని నా మిత్రుడు రాజు, కొన్ని సార్లు జయమోహన్ తిరిగి అక్కడి శ్రోతలకోసం తమిళంలోకి తర్జుమా చేసి చెప్తూ ఉన్నారు.

నా సెషన్ తర్వాత వసంత్ సాయి అనే ఒక ప్రసిద్ధ ఫిల్మ్ దర్శకుడితోనూ, ఆ తర్వాత విష్ణుపురం పురస్కారం అందుకోబోతున్న కవి విక్రమాదిత్యన్‌తోనూ ఇష్టాగోష్ఠి నడిచింది. ఆ తర్వాత చక్కటి తమిళ విందు.

మధ్యాహ్నం కూడా సెషన్లు నడిచాయి కాని నేను హాజరు కాలేదు. సర్ ఎడ్విన్ ఆర్నాల్డు సుప్రసిద్ధ రచన The Light of Asia మీద ఇటీవల జయరాం రమేష్ ఒక పుస్తకం వెలువరించారు. ఒక సెషను ఆయనతో ఆ పుస్తకం మీద గోష్ఠి నడిచింది.

సాయంకాలం ప్రధాన సమావేశం. పురస్కార ప్రదానం. సుమారు మూడు నాలుగు వందల మంది సాహిత్యాభిమానులు ఆ వేడుకలో పాలుపంచుకున్నారు. అతిథులందరితోటీ ఆ కవిని సత్కారం అందించారు. ప్రతి ఒక్క అతిథికీ మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఆ తమిళ అభిమానం చూసిన తర్వాత, నాకు అక్కడ తెలుగులో మాట్లాడాలనిపించింది. నా ప్రసంగాన్ని మిత్రుడు రాజు తమిళంలోకి అనువదించాడు. నేను రెండేళ్ళ కిందట, ఎన్నికల పరిశీలకుడిగా విల్లుపురం వచ్చినప్పుడు పూర్వ తమిళమహాకవులు నడయాడిన ప్రదేశాలు చాలా తిరిగి చూసాననీ, వారి కవిత్వాన్ని ఎంతో ఇష్టంగా చదువుకున్నాననీ, ఆ నా పర్యటనల్ని 'పాటలు పుట్టిన తావులు' పేరిట పుస్తకంగా వెలువరించాననీ, ఆ

కవులంతా అందుకు సంతోషించి నన్ను ఆశీర్వదిస్తూ, ఈ సమావేశానికి ఆహ్వానించినట్టుగా భావిస్తున్నానని చెప్పాను.

సమావేశం ముగిసిన తర్వాత కూడా చాలాసేపటిదాకా అక్కడి మిత్రులు ఒకరొకరే వచ్చి పలకరిస్తూ నాతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉన్నారు. ఆ రోజు పొద్దుటి గోష్ఠి గురించి ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషపూర్వకంగానూ, ప్రశంసాపూర్వకంగానూ మాట్లాడేరు. 'వాళ్ళు మొదట్లో మర్యాదకోసం అట్లా చెప్తున్నారనుకున్నాను. కాని లేదు, చాలామంది నాతో మళ్ళా మళ్ళా చెప్తూనే ఉన్నారు. పొద్దుటి మీ ప్రసంగం వల్ల వాళ్ళకి తెలుగు సాహిత్యద్వారాలు తెరుచుకున్నట్లు అనిపిస్తున్నదని చెప్తున్నారు' అన్నాడు నా మిత్రుడు. 'మిమ్మల్ని వాళ్ళు ఒక మాష్టర్ అని అంటున్నారు' అని కూడా అన్నాడు.

జయమోహన్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నప్పుడు కూడా ఆయన పొద్దుటి గోష్ఠి గురించి ఎంతో ప్రశంసతో మాట్లాడేరు. 'ఆధునిక తెలుగు కవిత్వం నుంచి రెండు వందల కవితలు, మర్చిపోకండి' అన్నారు మరోసారి.

28-12-20212

గోండీ సాహిత్యం కోసం

'**మేము** తెలుగునుంచి బాలసాహిత్యం గోండీలోకి అనువాదం చేయడానికి ఉట్నూరులో వర్కుషాపు పెడుతున్నాం. మీరు వచ్చి మా రచయితల్ని కొద్దిగా మోటివేటు చేస్తారా' అనడిగాడు పత్తిపాక మోహన్. ఈ ఏడాది సాహిత్య అకాదెమీ బాలసాహిత్యపురస్కారం పొందిన రచయిత. తెలుగు రాష్ట్రాల్లో నేషనల్ బుక్ ట్రస్టు ప్రాజెక్టు మేనేజరు.

ఉట్నూరు వెళ్ళడం నాకు ఎప్పుడూ ఇష్టమే. ముప్పై ఏళ్ళకింద, నా పెళ్ళయి వారం రోజులు కూడా తిరక్కుండానే విజ్జితో కలిసి వెతుక్కుంటూ వెళ్ళిన ఊరు. ఏణ్ణర్థం పని చేసి ఉంటాను, అక్కడ జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా. కాని నా హృదయంలో ఆ ఊరూ, ఆ మనుషులూ, వాళ్ళ హృదయాల్లో నేను బందీలమైపోయాం.

వెళ్ళాను ఈ సారి కూడా. గోదావరి దాటి, ఆ Land of Saraswati లో అడుగుపెట్టాను. నాతో పాటు ఆదిత్య, నందకిశోర్. ఒక రాత్రి ఉట్నూరులో గడిపాను. తెల్లవారి ఆ పొలాలు, ఆ చెరువు, ఆ పక్షుల కూజితాలూ విన్నాను. ఆ వర్కుషాపులో పాల్గొన్నాను. ప్రధాన ప్రసంగం చేసాను. కాని మోహన్ కోరుకున్నట్టుగా వాళ్ళని మోటివేట్ చెయ్యలేదు, provoke చేసాను.

చేసానంటే చెయ్యనా? ఆ మధ్య ఒక తెలుగుసినిమాలో గోండుల్ని అర్ధనగ్నంగా చూపించి ఆ సినిమా బృందం వాళ్ళతో 'నీ బాంచన్ నీ కాల్మొక్త 'అనిపించినప్పటినుంచీ నా ఆవేదనకి అంతం లేదు. ఎటువంటి జాతి గోండులు! ఎటువంటి చరిత్ర వారిది! ఎటువంటి భాష, సంస్కృతి, సంప్రదాయాలు! వాళ్ళ గురించి బయటి ప్రపంచానికి ఏమీ తెలియకపోగా, వాళ్ళ గురించిన విరుద్ధచిత్రణ ఈ రోజు ప్రపంచమంతా తెరమీద చూస్తున్నారే!

గోండులు ఒకప్పుడు రాజులు. 14-16 శతాబ్దాల్లో వాళ్ళు గోండుభూమిని పాలించారు. మరాఠాలతో, మొగలు సైన్యాలతో పోరాడి తమ అస్తిత్వాన్ని కాపాడుకున్నారు. ఆ కోవలో చివరివాడు కుమ్రం భీమ్. ఆయన నిజాంపాలనతో పోరాడేడు. ఆ రాజ వంశీకుల్లో చివరి రెండు శాఖల్లో ఒకరు ఉట్నూరులోనూ, మరొకరు కంచన్‌పల్లిలోనూ స్థిరపడ్డారు. ఒకప్పుడు హైమండార్ఫ్ మళ్ళా అదిలాబాదు చూడటానికి వచ్చినప్పుడు కంచన్‌పల్లి రాజా ఆత్రం భగవంతరావుని కలవాలని ఉంది అని చెప్పినప్పుడు, పక్కనే ఉన్న ఒక ప్రభుత్వోద్యోగి జీపు పంపించి ఆయన్ని తీసుకువస్తానని చెప్పాడట. ఆ మాట వినగానే హైమండార్ఫ్‌కి కోపం, దుఃఖం రెండూ కలిగేయట. 'ఎంత మాట! గోండు రాజుని జీపు పంపించి తీసుకువస్తారా? ఏం మాట్లాడుతున్నారు మీరు? రాజావారిని మనం కదా వెళ్ళి కలవాలి' అన్నాడట. ఈ ఉదంతం ఫణికుమార్ గారి గోదావరి గాథల్లో చదివినప్పణ్ణుంచీ ఆ రాజాని నేను కూడా స్వయంగా వెళ్ళి చూడాలని అనుకున్నాను. ఒకరోజు మా ప్రాజెక్టు ఆఫీసరు నన్ను కంచన్‌పల్లి తీసుకువెళ్ళారు. చిన్నపాటి గడ్డికుటీరం ఎదుట, ఒక నులకమంచం మీద కూచుని మమ్మల్ని సాదరంగా ఆహ్వానించిన ఆ గోండు రాజుని చూసాను. అటువంటి దృశ్యాలు కదా తెరమీదకు ఎక్కవలసింది!

భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజనదేశం. చైనాతో సహా మరే దేశంలోనూ ఇంతమంది ఆదివాసులు లేరు. ఇప్పటి లెక్కలు ఇంకా తియ్యలేదుగాని నా దృష్టిలో దాదాపు పధ్నాలుగు కోట్లమంది ఉంటారు. 645 తెగలున్నాయి. ఆరేడువందల మౌఖికభాషలు ఉన్నాయి. జనసంఖ్యరీత్యా చూసినా, విస్తృతిని బట్టి చూసినా, గోండులు భారతదేశంలోని అతి పెద్ద గిరిజన తెగల్లో రెండవస్థానంలో ఉంటారు. సంతాలు తెగది నాలుగవ స్థానం. కాని ఇప్పుడు సంతాలు సాహిత్యానికి లభించిన జాతీయస్థాయి గుర్తింపు మనకి అచ్చెరువు కలిగిస్తుంది. 2013 నుంచీ సివిలు సర్వీసు పరీక్షల్లో సంతాలు సాహిత్యం కూడా ఒక ఆప్షనలు పేపరు. 2005 నుంచీ సాహిత్యఅకాడెమీ ఇచ్చే పురస్కారాల్లో సంతాలు సాహిత్యానికి కూడా అవార్డులు లభిస్తున్నాయి. ఒక సంతాలు భాషావేత్తకి 'భాషా సమ్మాన్' అవార్డు కూడా లభించింది. అంతేకాదు, ఇతర భాషలనుంచి సంతాలీలోకి చేసే అనువాదాలకు కూడా పురస్కారాలు లభిస్తున్నాయి. ఇటీవల లభించిన పురస్కారం కాళిదాసు మేఘసందేశానికి సంతాలీ అనువాదానికి!

మరి గోండీ స్థానం ఏమిటి? గోండీ రచయితలెవరు? గోండీ నుంచి తెలుగు, ఇంగ్లిషు, హిందీలోకి, ఇతరభాషలనుంచి గోండీలోకి ఏమైనా పుస్తకాలు అనువాద-మయ్యాయా?

గోండీనుంచి ఇంగ్లిషులోకి అనువాదమైన చివరి పుస్తకం, బహుశా మొదటి పుస్తకం కూడానేమో– Songs of the Forest పేరిట వెరీయర్ ఎల్విను 1935 లో వెలువరించిన అనువాదం. అప్పణ్ణుంచి ఇప్పటిదాకా మరొక పుస్తకం రాలేదంటే, ఆ భాషకి ప్రభుత్వాలు, ప్రజలూ కూడా ఎటువంటి గుర్తింపునిస్తున్నారో వేరే చెప్పనక్కర్లేదు.

రెండు పదాలున్నాయి: భాష, యాస. భాష అంటే మర్యాదస్తులు మాట్లాడుకునేదీ, గౌరవప్రదమైందీ, యాస అంటే నిరక్షరాస్యులు మాట్లాడుకునేదీ అనే అపోహ ప్రజల్లో ఉంది. ఇంగ్లిషులో ఈ రెండింటినీ language అనీ, dialect అనీ అనుకోవచ్చు. తెలుగులో డయలెక్టుని మాండలికం అని కూడా అంటూంటారు. అంతేకాదు, సాధారణంగా డయలెక్టులకి లిపి ఉండదు, లేదా 'ప్రామాణిక భాష' ఏ లిపిని వాడుకుంటుందో అదే లిపిని డయలెక్టులు కూడా వాడుకుంటూ ఉంటాయి.

కాని గత శతాబ్దంలో భాష గురించిన మన అభిప్రాయాలు చాలావరకూ మారాయి. ప్రతి ఒక్క భాషా కూడా ఒక యాసనేననీ, ప్రతి ఒక్క యాసా కూడా ఒక భాషనేననీ మనం గ్రహించగలుగున్నాం. ఉదాహరణకి గ్లోబలు భాషగా వ్యాప్తి చెందిన ఇంగ్లీషు ఆంగ్లో–సాక్సను మాండలికమే. భారతదేశంలో అత్యధికసంఖ్యాకులు మాట్లాడుతున్నారని భావిస్తున్న హిందీ, ఖడీబోలీ, అవధీ, దక్కనీ, భోజ్ పురీ, రాజస్తానీ, మైథిలీ వంటి వివిధ మాండలికాల సమాహారమే.

అయినా కూడా కొన్ని మాండలికాల్లో ఒక మాండలికంతోనే ఒక భాషని ప్రధానంగా మనం ఎందుకు గుర్తుపడుతున్నాం? ఒక భాషావేత్త language కీ dialect కీ మధ్య ఉన్న తేడా గురించి చెప్తూ, a language is a dialect backed by an army అన్నాడు. పద్ధెనిమిది, పందొమ్మిది శతాబ్దాల్లో ఇంగ్లాండు తన నౌకాబలంతోనూ, ఫిరంగులతోనూ, మందుగుండుతోనూ ప్రపంచాన్ని ఒక కాలనీగా మార్చబట్టే నేడు ఇంగ్లిషు గ్లోబలు భాషగా మారడానికి అవకాశం దొరికిందనే విషయం కాదనలేం.

కాని నేనేమంటానంటే, ప్రత్యేకించి ఒక మాండలికమే భాషగా గుర్తింపుపొందడానికి ప్రధానకారణం కవులూ, రచయితలూను. ఆ భాషావేత్త చెప్పిన మాటని నేనిలా సవరిస్తున్నాను: a language is a dialect backed by poets and writers.

తెలుగు విషయమే తీసుకోండి. అది మధ్యద్రావిడ భాష. దానితో పాటు గోండీ, కోయ, కొలామీ, పర్జీ, కొండ, కువి లాంటి గిరిజన భాషలు కూడా మధ్యద్రావిడ కుటుంబానికి చెందినవే. పదిహేనువందల సంవత్సరాల కిందట, ఈ భాషలన్నీ దాదాపుగా

ఒకే స్థాయిలో ఉండేవి. కాని మొదట్లో శాసనభాషగా వాడుకలోకి వచ్చిన తెలుగును గత వెయ్యేళ్ళుగా తెలుగుకవులు, రచయితలు గొప్ప సాహిత్యభాషగా మార్చేసారు. సాహిత్య ప్రమాణాల దృష్ట్యా నేడు తెలుగు ప్రపంచంలోని మొదటి పది లేదా ఇరవై భాషల్లో ఒకటిగా ఉందని చెప్పవచ్చు. కాని గిరిజనభాషలు మాత్రం పది పదిహేను శతాబ్దాల కింద ఎక్కడున్నాయో, ఇప్పటికీ అక్కడే ఉండిపోయాయి.

ఈ పరిస్థితి అత్యవసరంగా మారాలి. ముందొక భాష సాహిత్యభాషగా మారితే, నెమ్మదిగా అది బోధనామాధ్యమంగా కూడా మారుతుంది. పాలనాభాషగా మారుతుంది. అప్పుడు ఆ భాషలో పత్రికలు, టెలివిజను ఛానెళ్ళు, సినిమాలు, సోషలు మీడియా కూడా వస్తాయి. దాదాపు 130 లక్షలమంది మాట్లాడే గోండీలో సాహిత్యం విరివిగా రావాలి. సాహిత్యసమ్మేళనాలు జరగాలి. చర్చలు జరగాలి. అప్పుడు కదా, ఆ భాష మాట్లాడేవాళ్ల ఆత్మగౌరవం నిలబడేది!

చాలా పెద్ద ప్రయత్నం చెయ్యాలి. సుదీర్ఘమైన ప్రయాణం మొదలుపెట్టాలి. మోహన్ చేపట్టిన ప్రయత్నం అందులో మొదటి అడుగు. ఆ సదస్సు ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి నాతో 'మీ మాటలు నన్ను ఇన్‌స్పైర్ చేసాయి, మేము గోండీ సాహిత్యసమ్మేళనం చెయ్యాలనుకుంటున్నాం' అన్నాడు.

సమావేశం ముగిసి బయటకు రాగానే ఇద్దరు యువకులు నా దగ్గరకి వచ్చారు. 'మేము జంగుభాయి యూట్యూబు ఛానెలు నడుపుతున్నాం. మీరు ఇప్పుడు మాట్లాడిన మాటల్లోంచి మా ఛానలు కోసం రెండు మూడు మాటలు చెప్పండి' అన్నారు. మైకు నా ముందు పెట్టి ఆ యువకుడు తన ప్రేక్షకుల్ని ఉద్దేశించి గోండీలో మాట్లాడటం మొదలు పెట్టాడు.

నేను ఆశిస్తున్న భవిష్యత్తు అప్పుడే నా కళ్ళముందు ప్రత్యక్షమైందనిపించింది.

6-11-2022

అనువాదం ఒక కెరీర్ కూడా

హైదరాబాదులో సిటీ గవర్నమెంటు కాలేజికి వెళ్ళడం నిన్న రెండో సారి. ఆ కళాశాలలో పెద్దలు సూరపురాజు రాధాకృష్ణమూర్తిగారు పాఠాలు చెప్పారనీ, ఇప్పుడు వాళ్ళమ్మాయి రమగారు బోధిస్తున్నారనీ మాత్రమే తెలుసు ఇప్పటిదాకా. కాని నిన్న వెళ్ళినప్పుడు ఆ కాలేజి శతవసంతాలు పూర్తి చేసుకుందనీ, ఈరోజు తెలంగాణా రాష్ట్రంలో విద్యార్థులు ప్రవేశాలు కోరుకోవడంలో మొదటిస్థానంలో ఉందనీ, దాదాపు నాలుగువేల మంది విద్యార్థులు, తెలంగాణా రాష్ట్రం నలుమూలలనుంచీ అత్యుత్తమ ప్రతిభావంతులు అక్కడ చదువుతున్నారనీ తెలిసింది. ఒకప్పుడు హైదరాబాదు రాష్ట్రంలో అక్కడ చదువుకున్నవాళ్ళల్లో కొందరు గవర్నర్లుగా, కేంద్రమంత్రులుగా, ముఖ్యమంత్రులుగా కూడా పనిచేసారనీ, మక్ధూమ్ మొహియుద్దీను లాంటి కవి అక్కడ ఇంగ్లిషు బోధించాడనీ తెలిసింది. ఇప్పుడు దాదాపు నూటనలభై మంది లెక్చరర్లతో ఆర్ట్సు, కామర్సు కోర్సులు నడుపుతున్న ఆ కళాశాలలో నిన్న అడుగుపెట్టినప్పుడు ఆ సిబ్బందిలో, ఆ విద్యార్థుల్లో కనిపించిన అంకిత–భావం, ఉత్సాహం నన్ను ముగ్ధుణ్ణి చేసాయి.

ప్రసిద్ధ కవి కె.శ్రీకాంత్ అక్కడ ఇంగ్లిషు బోధిస్తున్నాడు. ఈ మధ్య ఒకరోజు ఆయన తమ కళాశాలా, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖా కలిసి అనువాదం మీద రెండు రోజుల ఓరియెంటేషను నడుపుతున్నామనీ, నన్ను కూడా రమ్మని ఆహ్వానించాడు. ముఖ్యంగా 'కంటెంట్ రైటింగ్ అండ్ ట్రాన్స్లేషన్' అనే ఒక కోర్సు ఒకటి తాము కొత్తగా ప్రారంభించామనీ, ఔత్సాహిక అనువాదకుల్ని ప్రోత్సహించడంతో పాటు, కంటెంటు రైటింగునీ, అనువాదాన్నీ ఒక కెరీరుగా కూడా పెంపొందించుకోవచ్చు అని విద్యార్థులకు చెప్పడం తమ ఉద్దేశ్యమనీ చెప్పాడు. తమ కళాశాల విద్యార్థులే కాక, సిటీలో ఉన్న ఇతర కళాశాలలనుంచి కూడా విద్యార్థులు, లెక్చరర్లూ పాలుపంచుకోబోతున్నారని చెప్పాడు.

అది వాళ్లకే కాదు, నాక్కూడా మంచి అవకాశం అని భావించి తప్పకుండా వస్తానని చెప్పాను. వెళ్ళాను కూడా.

నిన్నటి కార్యక్రమంలో ప్రారంభ సమావేశం తర్వాత మూడు సెషన్లు నడిచాయి. మొదటి సెషనులో సాహిత్యరచనల్ని అనువదించడంలో ఎదురయ్యే సమస్యలు, నేను వెతుక్కున్న పరిష్కారాలు అనే అంశం మీద నేను మాట్లాడేను. సామాజికశాస్త్ర రచనల్ని అనువదించడంలో ఎదురయ్యే సమ్యస్యలు, పరిష్కారాల మీద ఎన్.వేణుగోపాల్ మాట్లాడేడు. భోజన విరామం తర్వాత అనువాద ప్రక్రియలోని మౌలికమైన అంశాల గురించి డా. ఆదిత్య మరింత లోతైన ప్రసంగం చేసాడు.

నా ప్రసంగంలో మొదట, అసలు అంత మంది విద్యార్థులు ఆర్ట్సు, కామర్సు కోర్సులు చదవుతూ కనబడటం పట్ల, నా సంతోషాన్ని వ్యక్తం చేయకుండా ఉండలేక పోయాను. నేను పదవతరగతిలో రాష్ట్రస్థాయి రాంకు తెచ్చుకున్నందుకు, నాకు నాగార్జున సాగరు కాలేజిలో ఎం.పి.సి లేదా బి.పి.సిలో ఎంట్రన్సుతో పనిలేకుండానే సీటు ఇస్తానన్నారనీ, కాని నేను సి.యి.సి ఎంపిక చేసుకున్నాననీ, ఆ తర్వాత బి.ఏ చదివాననీ చెప్పాను. నేను ఇంజనీరింగు, మెడిసిను చదివి ఉంటే కూడా ఈ ప్రపంచానికి ఏదో ఒకరూపంలో సేవలు అందించగలిగి ఉండేవాణ్ణి గాని, బి.ఏ చదివినందువల్ల ప్రజలతో దగ్గరగా పనిచేసే ఉద్యోగావకాశాలు లభించాయనీ, గిరిజన విద్యారంగంలోనూ, పాఠశాలవిద్యలోనూ నాదైన కాంట్రిబ్యూషను సమాజానికి ఇవ్వగలిగే భాగ్యం లభించిందనీ చెప్పాను. అంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు బి.ఎ, బి.కాం లాంటి కోర్సులు తీసుకోవడం నాకు సంతోషాన్ని కలిగిస్తోందనీ, ఈ రాష్ట్రం, ఈ దేశం, ఈ ప్రపంచం వారినుంచి భవిష్యత్తులో ఎంతో లబ్ధి పొందగలవని ఆశ కలుగుతోందని చెప్పాను.

ఆర్ట్సు చదవాలనుకోవడం ఒక మంచినిర్ణయం కాగా, సృజనాత్మక రంగం పట్ల ఇష్టం చూపించడం మరొక మంచి నిర్ణయం అని చెప్పాను. చదువులో పైకి రావాలన్నా, సృజనలో పైకి రావాలన్నా కూడా ప్రతిభ, పరిజ్ఞానం, ప్రాక్టీసు-మూడూ తప్పనిసరి అని చెప్పాను. కాని వాటిలో ప్రతిభ పాళ్ళు చాలా తక్కువ, పదిశాతం మించి ఉండదనీ, పరిజ్ఞానం ముప్పై నుంచి నలభై శాతం పాత్రపోషిస్తే, అభ్యాసం లేదా ప్రాక్టీసుకి దాదాపు అరవై శాతం ప్రాముఖ్యత ఉందని చెప్పాను. ఒకవేళ జన్మతః సిద్ధించిన ప్రతిభ లేకపోయినా అధ్యయనం, అభ్యాసం వల్ల కూడా చదువులోనూ, సృజనలోనూ అత్యున్నతమైన ఫలితాలు రాబట్టవచ్చుననీ, అవి రెండూ లేకుండా కేవలం ప్రతిభావంతులైనమాత్రాన వారు సాధించ-గలిగేది ఏమీ ఉండదని కూడా చెప్పాను.

సాహిత్యం, సంగీతం లాంటి కళల్లో రాణించాలంటే ఒకప్పుడు పూర్వజన్మ సుకృతం లేదా కుటుంబనేపథ్యం, సరూపమనస్కుల సాంగత్యం ఉండాలని చెప్పేవారనీ, కాని ఇవేవీ లేకపోయినా కూడా అచంచలమైన పట్టుదల, నిర్విరామ కృషి ఉంటే మనుషులు కళలోనూ, జీవితంలోనూ కూడా అద్భుతాలు సాధించగలరని చెప్పాను. గాంధీ, కలాం వంటి వారి జీవితాల్లోంచి ఉదాహరణలిచ్చాను. ఆ ఇద్దరు మహనీయులూ కూడా జన్మతః ప్రతిభావంతులని చెప్పలేమనీ, అకడమికుగా యావరేజువిద్యార్థులనీ, కానీ, తమని తాము నిరంతరం సానబెట్టుకోవడంద్వారా మాత్రమే మలగని దీపాలుగా వెలిగారనీ కూడా చెప్పాను.

అనువాదం ప్రధానంగా ప్రాక్టీసుతో పట్టుబడే విద్య అనీ, రెండు భాషల్లోనూ చాలా మామూలు పరిజ్ఞానం ఉన్నా కూడా నిరంతర అభ్యాసం వల్ల చాలా తొందరలోనే అనువాదకులుగా రాణించడం కష్టమేమీ కాదని చెప్పాను. తెలుగులాంటి సుసంపన్నమైన సాహిత్యభాషకి మనం పుట్టుకతోనే వారసులయ్యామనీ, ఇటువంటి సుసంపన్న వారసత్వం గురించి ప్రపంచానికి మనం చెప్పుకోకపోతే మరెవరు చెప్పుకుంటారని అడిగాను. కేవలం చారిత్రిక, సాంస్కృతిక ఘనత చాటుకోవడం కోసం మాత్రమే అనువాదాలు చెయ్యాలని చెప్పడం లేదనీ, ఈ సమాచారయుగంలో ప్రపంచం ఒక గ్లోబలు కుగ్రామంగా మారినప్పుడు తక్కిన ప్రపంచం గురించి మనం మరింత తెలుసుకోడానికీ, మన సోదరులకు చెప్పడానికీ అనువాదాలు అత్యంత అవసరం అని చెప్పాను. అనువాదాలే లేకపోతే కేవలం మన పరిసరాలనుంచో, పాఠశాలలనుంచో లభించే పరిజ్ఞానం నుంచో మనం మన జీవితం మీద అధికారం సంపాదించుకోవడం అంత సులభసాధ్యం కాదని కూడా చెప్పాను.

సముద్రాన్ని గుట్టలు పోసినట్టు మనచుట్టూ పోగవుతున్న సాహిత్య, సాహిత్యేతర వాఙ్మయాన్ని తెలుగుచేయడానికి ఒకరో, ఇద్దరో, పదిమందో అనువాదకులు చాలరనీ, పదివేలమంది సైన్యం కావలసి ఉంటుందనీ కూడా చెప్పాను.

ఒక టెక్స్టును అనువదించడంలో నాలుగైదు దశలు ఉంటాయని ఒక్కొక్కదశ గురించీ వివరంగా చెప్పాను. మొదటిదశలో మనం ఏ రచనని అనువదించాలి అనుకుంటున్నామో దాన్ని నేరుగా, స్వేచ్ఛగా, తోచింది తోచినట్టుగా తెలుగులోకి (లేదా ఇంగ్లిషులోకి) అనువదించడం. అప్పుడు ఆ అనువాదాన్ని తీసుకుని మూలరచనతో పోల్చి కఠిన పదాలకు సమానార్థకాలు సరిగానే పడ్డాయో లేదో చూసుకోవడం. ఒక పదానికి సమానమైన అర్థాన్నిచ్చే అనేక పదాలు స్ఫురిస్తున్నప్పుడు, ఆ పదం బరువు ఎంత ఉందో చూసుకోవడం, ఆ పదం తక్కిన వాక్యంతో పొసగుతుందో లేదో చూసుకోవడం ముఖ్యమని చెప్పాను.

కఠిన పదాలకి సమానమైన పదాలు లభించాక, అప్పుడు ఆ అనువాదంలోని వ్యాకరణాంశాలు, నిర్మాణాంశాల్ని సరిచూసుకోవాలి. ఇంగ్లిషునుంచి తెలుగు చేసినప్పుడు పదజాలాన్ని అనువదించడమే అనువాదం కాదనీ, ఇంగ్లిషు వాక్యనిర్మాణం తెలుగు వాక్యనిర్మాణంగా మారడం చాలా ముఖ్యం అని చెప్పాను. ప్రతి భాషకీ ఒక కాకువు ఉంటుందనీ (దాన్ని వేణుగోపాల్ పలుకుబడి అన్నాడు) దాన్ని పట్టుకోవడం ముఖ్యమనీ చెప్పాను.

ఆ చేసిన అనువాదాన్ని ఎవరికి వారు తమలో తాము చదువుకోవాలనీ, అప్పుడు ఆ వాక్యాలు ఎబ్బెట్టుగా లేకుండా తమ సొంత భాషలోనే మాట్లాడుకున్నట్టుగా ఉన్నాయో లేదో చూసుకోవడం మూడవ దశ. అందుకనే అనువాదం చేత్తో చేసేపని కాదు, చెవితో పని చేసే పని అని కూడా చెప్పాను. ఇక చివరగా, ఆ వాక్యాల్లో లేదా ఆ పదజాలంలో ఔనచిత్యాలు ఏవైనా కనిపిస్తే వాటిని పరిహరించడం నాలుగవ దశ.

ప్రతిరోజూ 45 నిమిషాల పాటు ఇటువంటి అభ్యాసం చెయ్యగలిగితే 90 రోజుల తర్వాత నేరుగా ఏదైనా పుస్తకం, ఒక గాంధీనో, ఒక టాగోరునో అనువదించడం మొదలు పెట్టవచ్చునని కూడా చెప్పాను.

నా తర్వాత మాట్లాడిన వక్తలు కూడా అనువాద ప్రక్రియ గురించి ఎన్నో మౌలికమైన ఆలోచనలు పంచుకున్నారు. మామూలుగా మనం అనువాదం మూలవిధేయంగా ఉండాలని చెప్తుంటాం. నిన్న ఎన్. వేణుగోపాల్ కూడా ఆ మాట చెప్తూ, అనువాదాలు లక్ష్య విధేయంగా కూడా ఉండాలని అన్నాడు. ఇది కొత్త భావన. నిజానికి లక్ష్యవిధేయమే కాకపోతే అనువాదాల అవసరమే లేదు.

అలాగే ఆదిత్య తన ప్రసంగంలో అనువాదం అంటే ఒక రచనను తొందరతొందరగా పైపైన చదువుకుంటూ పోవడం కాదనీ, నెమ్మదిగానూ, లోతుగానూ, క్షుణ్ణంగానూ చదివితే తప్ప అనువాదం సాధ్యపడదనీ చెప్పాడు. అంటే deep reading అన్నమాట. అందుకనే అనువాదం మరొకరికోసం చేసే పని కన్నా ముందు ఏ పాఠకుడికి ఆ పాఠకుడు తన అవగాహనకోసం, తన పఠనానుభవం తనకి మరింత స్ఫూర్తిదాయకంగా ఉండటంకోసం చేసే పని అని కూడా చెప్పాడు.

సిటీ కాలేజీ ప్రిన్సిపాలు డా. బాల భాస్కర్, ఇంగ్లిషు డిపార్ట్‌మెంటు హెడ్ రమేష్ బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ మల్లికార్జున్, గొప్ప వక్త డా.కోయి కోటేశ్వర రావు, తెలుగు హెడ్ డా. నీరజ, కవి కృష్ణచంద్ర కీర్తి, హిస్టరీ లెక్చరరు డా.దూసి శ్రీనివాసు,

సంస్కృత విద్వాంసురాలు డా.రమానీలకంఠం వంటి వారిని కలుసుకోవడం నిన్న మాకు లభించిన అదనపు బహుమానం. సిటీ కాలేజి లెక్చరర్లే కాక నూజివీడునుండి మెదక్ దాకా కూడా మరెన్నో కళాశాలలనుంచి వచ్చిన లెక్చరర్లు కూడా కలిసారు. వారందరిలోనూ అనువాద ప్రక్రియ పట్ల గొప్ప ఉత్సాహం కనిపించడం గొప్ప సంతోషాన్నిచ్చింది.

2-3-2023

బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవం

నిప్పులు కురిపిస్తున్న ఒక మే మధ్యాహ్నం చిప్పరిగె సతీష్ అనే ఒక కన్నడ సాహిత్యవేత్త మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు. ఆయనతో పాటు తెలుగు, కన్నడ భాషల పట్ల సమాన అభినివేశం కలిగిన అజయ్ కూడా ఉన్నాడు. వారు రాగానే సతీష్‌గారు తనని తాను పరిచయం చేసుకుంటూ తాము 'బుక్ బ్రహ్మ' పేరిట ఒక సాహిత్య సంస్థ నడుపుతున్నామనీ, ఈ ఆగస్టులో దక్షిణభారత సాహిత్యాలకు సంబంధించిన ఒక ఉమ్మడి సదస్సుని ఒక పండగలాగా జరపాలని ఆలోచిస్తున్నామనీ, దానికి నన్ను కూడా రమ్మనీ ఆహ్వానించేరు.

ఆ ఆహ్వానం వినగానే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అందుకు కారణాలు లేకపోలేదు. 2013 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో నిర్వహించింది. నా ఆత్మీయ మిత్రుడు కవితాప్రసాద్ సాంస్కృతికశాఖ సంచాలకుడిగా ఆ మహాసభలు తానే స్వయంగా దగ్గరుండి జరిపించాడు. అప్పట్లో మేము కలుసుకోని రోజంటూ ఉండేదికాదు, మాట్లాడుకోని పూట కూడా ఉండేది కాదు. కాని ఆయన ఆ సభలకు నన్ను రమ్మని కనీసం మాట మాత్రంగా కూడా అడగలేదు. నన్ను వక్తగాగాని, సమన్వయకర్తగాగానీ ఏ ఒక్క సదస్సులోనూ పాల్గోమని పిలవలేదు. ఆ సందర్భంగా సాంస్కృతికశాఖ ఎన్నో పుస్తకాలు ప్రచురించింది. అటువంటి పుస్తకం ఏదైనా నాతో రాయించే ఆలోచన కూడా ఆయనకి కలగలేదు. నన్నెందుకు ఆహ్వానించడంలేదని కూడా నేనాయన్ని అడగలేదు. బహుశా ఆ సభల్లో పాల్గొనడానికి అవసరమైన అర్హత ఏదో నాకు లేదేమో అని ఊరుకున్నాను.

2017 లో తెలంగాణా ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించింది. అప్పట్లో నేను హైదరాబాదులోనే ఉన్నాను. ఆ సభలకు కూడా నాకు ఎటువంటి ఆహ్వానం లభించలేదు. నా జీవితంలో సగభాగం పైనే నేను తెలంగాణాలో జీవిస్తూ వచ్చినప్పటికీ,

నా ఉద్యోగ జీవితంలోకూడా సగానికి పైగా కాలం తెలంగాణాలోనే సేవలు అందించి-నప్పటికీ, నేను తెలంగాణాలో పుట్టి ఉండనందువల్ల నాకు ఆహ్వానం దొరకలేదేమో అనుకున్నాను. కాని ఆ సభల్లో సాహిత్య అకాదెమీ పురస్కారాలు పొందినవారికి ప్రత్యేక ఆహ్వానాలు వెళ్ళాయని విన్నాను. నాకు కూడా ఒక అకాదెమీ పురస్కారం వచ్చినందువల్ల ఆ కాటగిరీలో నైనా నాకు ఆహ్వానం వస్తుందేమో అనుకున్నాను. కానీ నాకు మాత్రం ఆహ్వానం దొరకలేదు.

గత పదేళ్ళలో నా సొంత రాష్ట్రంలోనూ, నేనుంటున్న రాష్ట్రంలోనూ జరిగిన ఇంత పెద్ద సభల్లో నాకు ఆహ్వానం దొరకనప్పుడు, పక్క రాష్ట్రం నుంచి, అది కూడా దక్షిణభారత భాషల ఉమ్మడి సదస్సునుంచి నాకు ఆహ్వానం లభించడమేమిటి? ఆ సతీష్ అన్నాయన నేను ఎవరో తెలిసే మా ఇంటికి వచ్చాడా? పొరపాటు చిరునామాకు రాలేదు కదా అనుకున్నాను. ‘అయ్యా, తెలుగుసాహిత్యంలో మహామహులు చాలామంది ఉండగా నన్నే ఎందుకు పిలుస్తున్నారు? నా గురించి తెలుసుకునే వచ్చారా’ అనడిగాను ఆయన్ని.

ఆయన చిరునవ్వారు. ‘సార్, మేము దక్షిణభారత భాషల్లో ఎవరు ఏం చేస్తున్నారో తెలుసుకోకుండానే ఒక ఉమ్మడి సదస్సు గురించి ఆలోచిస్తామని అనుకుంటున్నారా?’ అనడిగారు.

నేను ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను. తెలుగు సాహిత్యంలో సంగం సాహిత్యం గురించి మొదటిసారి సవివరంగా రాసిన వాణ్ణి. తమిళ నాయన్మార్లు, ఆళ్వార్లు సంచరించిన తావులు తిరిగి వాళ్ళ కవిత్వాల గురించి ‘పాటలు పుట్టిన తావులు’ అనే పుస్తకమే వెలువరించినవాణ్ణి. భారతియారు గురించీ, యు.వి. స్వామినాథ అయ్యరు గురించి చిన్నపాటి ప్రస్తావన వచ్చినా కూడా నిలువెల్లా పులకించిపోయే మనిషిని. ఈ మధ్యనే బసవన్న వచనాలనుంచి మూడువందల వచనాలు తెలుగు చేసినవాణ్ణి. ఎజుత్తచ్చన్‌ని స్మరిస్తూ ప్రతి ఏటా జరిపే తుంచెన్ పండక్కి కిందటేడాదే తెలుగుభాష ప్రతినిధిగా హాజరయినవాణ్ణి. ఇవన్నీ, ఇంకా తమిళ, కన్నడ, మలయాళ భాషల గురించి నేను రాసిన వ్యాసాలూ, మాట్లాడిన మాటలూ మరెన్నో గుర్తొచ్చాయి. కాని అవన్నీ తెలుగులో కదా ఉన్నవి, ఈ కన్నడ సాహిత్యకారుడికి వాటిగురించి ఎలా తెలిసి ఉంటుంది?

కాని తర్వాత తెలిసింది, ఆ సదస్సు నిర్వహణ ఏర్పాట్ల గురించి మాట్లాడుకుంటూ ఉన్నప్పుడు తెలుగు నుంచి ఎవరిని ఆహ్వానించాలా అన్న ఆలోచన జరిగినప్పుడు, నా పేరు ప్రతిపాదనకి వచ్చినప్పుడు, ఒక తమిళసాహిత్యవేత్త కూడా ఆ ప్రతిపాదనని

బలపరిచాడట. మూడేళ్ళ కిందట నేను విష్ణుపురం సాహిత్య సమావేశానికి కోయంబత్తూరు వెళ్ళినప్పుడు ఆ తమిళ సాహిత్యవేత్త నా ప్రసంగం విన్నాడట. 'ఆయన మాట్లాడగా విన్నాను. ఆయనకి తెలుగు భాష గురించీ, సాహిత్యం గురించీ చక్కని అవగాహన ఉంది, ఆయన్ని తప్పకుండా పిలవండి' అన్నాడట.

కాబట్టి ఆ తమిళ సాహిత్యవేత్త ఎవరో ఆయనా, సతీష్ చిప్పరిగె కూడా నా కులాన్నో, మతాన్నో, ప్రాంతాన్నో చూసి కాక, తెలుగు భాషతోనూ, తక్కిన దక్షిణాది భాషలతోనూ నాకున్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకునే పిలుస్తున్నారని నాకు అర్థమయింది.

కాని నేనున్న పరిస్థితుల్లో మూడురోజుల పాటు బెంగలూరు వెళ్ళి ఆ సభల్లో పాల్గోలేనేమో అని అనుకున్నాను. ఆ మాటే చెప్పాను. నాకు రావాలనే ఉందిగాని, రాగలనని నిశ్చయంగా చెప్పలేను అని. అక్కడితో వాళ్ళొచ్చిన పని అయిపోయింది. వాళ్ళు వెళ్ళిపోతే బాగుణ్ణనుకున్నాను, ఎందుకంటే వారు వచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడుగంటలు దాటింది. మాది అయిదో ఫ్లోరు కావడంతో మా హాలు ఒక కొలిమిలాగా ఉంది. భరించలేని ఆ వేడిలో, ఆ ఉక్కలో ఆ ఇద్దరు సాహిత్యకారుల్నీ ఎక్కువసేపు కూచోబెట్టడం సముచితం కాదనుకున్నాను.

కాని సతీష్‌గారు కదల్లేదు. ఆయన నాతో యక్షగానం గురించీ, బసవన్న గురించీ, చాళుక్యుల శాసనాల గురించీ, శివరామ కారంత గురించీ, ఒకటా, రెండా ఎన్నో విశేషాలు మాట్లాడుతూ ఉన్నారు. నా 'ఎల్లలోకము ఒక్క ఇల్లై' పుస్తకం గురించి అజయ్ ప్రస్తావించాడు. అందులో నేను పరిచయం చేసిన కవుల గురించీ, కవిత్వాల గురించీ ఆయన నన్ను మరింత విశదంగా అడుగుతూ ఉన్నారు. అంతసేపు కూచున్నా ఆయన కనీసం టీ కూడా తాగలేదు. పైనుంచి ఎండ ధారలాగా కిందకి దిగుతున్న సెగ ఆయన్ని ఏమీ తాకలేదు. ఏమైతేనేం, మా సంభాషణ ఎక్కడో ఒకచోట ఆగేక, ఆయన లేచి నిల్చుని, 'ఇంతసేపు మీతో మాట్లాడేక, మా సదస్సుకి మీరొస్తేనే న్యాయం జరుగుతుందని మళ్ళీ అనిపించింది, ఎలాగైనా వీలుచూసుకుని రండి' అని మళ్ళా ఆహ్వానం అందించేరు.

ఈ లోపు ఆగస్టు రానే వచ్చిందికానీ నేను వెళ్ళాలో వద్దో తేల్చుకోలేకపోయాను. ఒకవేళ బెంగలూరు వెళ్ళినా ఒకరోజు కంటే ఎక్కువ ఉండే అవకాశం లేదు. ఒక్కరోజు కోసం, అది కూడా పదినిమిషాల ప్రసంగంకోసం అంతదూరం వెళ్ళాలా అని ఆలోచిస్తూనే ఉన్నాను. నా బదులు మరొక సాహిత్యవేత్తనెవరినైనా ఆ సదస్సులో పాల్గొనేటట్టు చూడరాదా అని అజయ్‌ని రెండుమూడు సార్లు అడిగాను. కానీ అతను ఒప్పుకోలేదు. ఆ సదస్సు

సమన్వయం చేస్తున్న ప్రతిభానందకుమార్ మీతో మాట్లాడతానన్నారు అని చెప్పాడు. ఒకరోజు నేనే ప్రతిభగారికి ఫోన్ చేసాను. కాని ఆమె 'మీ గురించి నేను విన్నాను, మీ ప్రసంగంకోసం ఎదురుచూస్తున్నాను. మీకు నచ్చిన ఫార్మాటులో, నచ్చిన అంశం మీద మాట్లాడండి, మీకు కాలపరిమితి తప్ప మరే నియమనిబంధనలూ పెట్టబోవడం లేదు నేను' అన్నారు.

ఇక వెళ్ళక తప్పదని అర్థమయింది. నా సెషను పదో తారీకు పొద్దున్న పదింటికి. కాబట్టి ముందు రోజు సాయంకాలానికి బెంగలూరు చేరుకున్నాను. అజయ్‌కి ఫోను చేస్తే 'మీరు ఇక్కడికే వచ్చెయ్యండి, జయమోహన్ మీ గురించి అడుగుతున్నారు' అన్నాడు. కాని నేను ఆ రాత్రికి బెంగలూరులో మా అక్క దగ్గరికి వెళ్ళాను. ఆ మర్నాడు పొద్దున్న అవినేని భాస్కర్ వచ్చి నన్నూ, మా అక్కనీ బుక్ బ్రహ్మ వేదిక దగ్గరకి తీసుకువెళ్ళాడు.

నేను వెళ్లగానే చేసిన మొదటిపని ప్రతిభానందకుమార్‌ని కలవడం. ఎందుకంటే ఆమె మా సెషనుకి సమన్వయ కర్త. ఆమె ఎ.కె.రామానుజన్ శిష్యురాలు అని తెలిశాక ఆమె పట్ల మరింత గౌరవం కలిగింది. 'నాకు కాలపరిమితి ఉందన్నారు కాబట్టి ఎక్కడన్నా టైము ఎక్కువ తీసుకుంటానేమో అన్న సంకోచంతో నేను మాట్లాడాలనుకున్నది ప్రసంగ పాఠం తీసుకొచ్చేను' అని చూపించేను.

మా సెషను పదింటికి. అందులో నాతో పాటు ప్రసిద్ధ కన్నడవిమర్శకుడు నాగభూషణస్వామి, మళయాళ రచయిత పాల్ జకారియా, తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ ఉన్నారు. సదస్సు ప్రారంభానికి అరగంట ముందు సమన్వయకర్త మా నలుగుర్నీ ప్రత్యేకంగా సమావేశపరిచి తాను మా గోష్ఠిని ఏ విధంగా నిర్వహించబోతున్నారో వివరించారు.

తాను ఒక్కొక్కరికీ ఎంత సమయం ఇవ్వగలరో, ఏ వరసక్రమంలో పిలుస్తారో చెప్పారు. ప్రతి ఒక్క వక్త గురించీ ప్రత్యేకంగా పరిచయం చెయ్యడానికి సమయం సరిపోదు కాబట్టి, వక్త పేరూ, ఆయన ఏ భాషకి ప్రాతినిధ్యం వహిస్తాడో అది మాత్రమే చెప్పి ఊరుకుంటానని కూడా చెప్పారు. 45 నిమిషాల సమయానికి మించి మాకు ఒక్క నిమిషం కూడా అదనంగా దొరకదని చెప్పారు.

నేను ఎన్నో సాహిత్యసమావేశాలకు, గోష్ఠులకి, టివి చర్చలకు, రేడియో ఇంటర్వ్యూ-లకు, యూనివెర్సిటీ సెమినార్లకూ హాజరయ్యాను. కాని ఎక్కడా ఇలా 45 నిమిషాల గోష్ఠికి ముందు 30 నిమిషాల ప్రిపరేటరీ సదస్సు నిర్వహించడం చూడలేదు. బుక్ బ్రహ్మ

నుంచి నేర్చుకోవలసిన మొదటి పాఠం ఇది అని అనుకున్నాను.

ఆ సెషను మొదలయ్యాక చూసాను, మా ఎదురుగా ఒక పెద్ద డిజిటలు క్లాక్ అమర్చారు. అక్కడ మా కాలవ్యవధి నిమిషాలు, సెకండ్లలో డిస్-ప్లే అవుతూ ఉంది. మా గోష్ఠి ముగియడానికి అయిదు నిమిషాలు ఉందనగా ఒక బెల్లు మోగింది. ఎప్పుడో నా చిన్నతనంలో వక్తృత్వపోటీల్లో పాల్గొన్నప్పుడు అలా ఉండేది. మూడు నిమిషాల పాటు ప్రసంగించ వలసి ఉంటే, రెండు నిమిషాలు కాగానే ఒక వార్నింగు బెల్లు మోగేది. ఆ సెషను కూడా అంతే. నలభై అయిదో నిమిషం పూర్తికాగానే మా తర్వాతి సెషనువాళ్ళు ఆ వేదిక మీదకు వచ్చేసారు. బుక్ బ్రహ్మ నుంచి ఎవరేనా నేర్చుకోవలసిన అమూల్య పాఠం ఇది.

అంటే మొదటి గంటన్నరలోనే నేను రెండు పాఠాలు నేర్చుకున్నాను. అవి ఒకరు చెప్పిన పాఠాలు కావు, ఆచరణ ద్వారా చేసి చూపించిన పాఠాలు.

మా సదస్సు ముందు ఒకరినొకరు పరిచయం చేసుకున్నప్పుడు కన్నడవక్త నాగభూషణ స్వామి 'మీకు చీనాకవిత్వం ఇష్టమని విన్నాను. నేను కూడా కొంత కవిత్వం అనువదించాను' అని అన్నారు. చూద్దును కదా! అవి పందొమ్మిది హాన్ కవితలు! నా ఆశ్చర్యానికి హద్దు లేదు! ఇంతవరకూ పందొమ్మిది హాన్ కవితల గురించి మొత్తం భారతదేశంలో నాకొక్కడికే తెలుసు అనుకునేవాణ్ణి. కాని ఇదుగో, నా ముందు ఒక కన్నడ రచయిత, ఆ పందొమ్మిది కవితల్నీ అనువదించి పుస్తకంగా కూడా వెలువరించాడు! ఆయన తన మొబైలు తెరిచి ఆ పుస్తకం పి.డి.ఎఫ్ నాకు చూపించాడు. అందులో ప్రతి కవితకీ తానొక చీనాచిత్రలేఖనాన్ని కూడా జతపరిచింది చూపించాడు. నేను కూడా నా మొబైలు తెరిచి, పందొమ్మిది హాన్ కవితల్లో రెండు కవితల్ని అనువదించి వాటికొక పరిచయాన్ని కూడా రాసిన, నా పోస్టు చూపించాను. నాగభూషణస్వామి నా తెలుగు పోస్టును రెండుమూడు పేరాలు తెలుగు లిపిలో చదివి అంగీకారంగా తల పంకించాడు. నాకు చెప్పలేనంత సంతోషం కలిగింది.

ఇది మూడవ పాఠం. అంటే ఇలాంటి సమావేశాలకు ఎందుకు వెళ్ళాలంటే, నువ్వు మాత్రమే సాహిత్యకారుడివి కావనీ, నీది మాత్రమే విశిష్ట సాహిత్యకృషి కాదనీ, నువ్వు నాలుగడుగులు నడిచినందుకు గర్విస్తుంటే, నీకన్నా పదడుగులు ముందు నడిచినవాడొకడు అక్కడ ఉంటాడనీ నీకు తెలుస్తుంది. నీకు వినయం కలుగుతుంది. రేపొద్దున్న మళ్ళా కృషి కొనసాగించడానికి నీకొక కొండగుర్తు దొరుకుతుంది. అంతేకాదు, నువ్వు కూడా ఆ రంగంలో ఎంతో కొంత కృషి చేసి ఉంటే, అప్పుడు ఆ మనిషిని చూసి నీకు న్యూనత

కలగదు, పైపెచ్చు, గొప్ప స్ఫూర్తి కలుగుతుంది. నువ్వు అతనితో మాట్లాడటానికి ఒక యోగ్యత సంపాదించుకున్నావని కూడా తెలుస్తుంది.

నా సెషను పూర్తయిపోయాక నేను అక్కడున్న పుస్తకాల స్టాళ్ళు, సాహిత్య అకాదెమీ స్టాలు చూసి బయటకి వస్తుంటే జయమోహన్ ఎదురుపడ్డాడు. ఆయన నన్ను చూడాలను కుంటున్నాడని అజయ్ చెప్పిన విషయం మర్చిపోయాను. కానీ జయమోహన్ మర్చిపోలేదు. ఆయనకి మా అక్కనీ, అక్కడున్న మరొక నలుగురైదుగురు తెలుగు మిత్రుల్నీ పరిచయం చేసాను. అక్కడే దాదాపు ఇరవై నిమిషాల పాటు మా మధ్య చిన్నపాటి గోష్ఠి జరిగింది.

His visit to Coimbatore was an eye-opener for us అని అన్నారాయన నా గురించి మా అక్కతో. 'ఆయన మాట్లాడకముందు తెలుగు సాహిత్యం గురించి మాకు అంతగా తెలియదు. కాని ఆయన తెలుగు సాహిత్యం గురించి మాకు చెప్పింది విన్నప్పణ్ణుంచీ మేము తెలుగు సాహిత్యం కూడా చదవడం మొదలుపెట్టాం' అని కూడా అన్నారాయన. ఇది నాలుగవ పాఠం. అంటే ఒక రచయిత లేదా వక్త నిన్ను ముగ్ధుణ్ణి చేసాడని నీకు అనిపించినప్పుడు, అతని ద్వారా ఎంతో కొంత తెలుసుకున్నావని నీకు అనిపిస్తున్నప్పుడు, దాని unconditional గా చెప్పగలగడం. రహస్యంగాకాదు, ప్రైవేటు డిస్కషన్లలో కాదు, నలుగురి ఎదుటా చెప్పగలగడం. 'అలా చెప్పినందువల్ల జయమోహన్ నా కళ్ళల్లో మరింత ఎత్తుకి ఎదిగాడు' అంది మా అక్క. ఆ రోజు జయమోహన్ మాటలు విన్న వాళ్లు ఎవరేనా ఆ మాటే అంటారు.

అక్కడ ఆ షామియానా కింద నిలబడే జయమోహన్ ఆ ఇరవై నిమిషాల పాటు ఎన్నో విషయాలు మాట్లాడేరు. భారతీయ నవల గురించి, బెంగాలీ నవల గురించి, ఆశాపూర్ణా దేవి గురించి, తారాశంకర్ బందోపాధ్యాయ 'గణదేవత', 'ఆరోగ్యనికేతనము'ల గురించి, గోపీనాథ్ మొహంతి గురించి, రావి శాస్త్రి గురించి- ఆయన మాట్లాడిన, పేర్కొన్న రచనల్లో నేను బహుశా ఒక మూడవ వంతు మాత్రమే చదివి ఉంటాను. కాని ఆ మూడోవంతేనా ఆయన మాట్లాడుతున్నది అర్థం చేసుకోగలిగేను కదా అని సంతోషించేను.

ఇక ఉందాం అని సెలవుతీసుకోబోతుంటే జయమోహన్ 'మీరే రూంలో ఉన్నారో చెప్పండి, నేను వచ్చి కలుస్తాను, మీతో చాలా మాట్లాడాలి' అని అన్నాడు. నేను రూంలో ఉండటంలేదనీ, సాయంకాలం మళ్ళా తిరిగి వెళ్ళిపోతున్నాననీ చెప్తే, 'అలా అయితే కోయంబత్తూరులో కలుద్దాం, మళ్ళా మీతో ఒక సంభాషణ ప్లాన్ చేస్తాను' అని

అన్నారాయన. ఇది అయిదవ పాఠం. ఆ సదస్సుల్లో ఆయన ప్రత్యేక ఆకర్షణగా ఉన్నారని ప్రతి ఒక్కరికీ అనిపించింది. ఆయనలో ఆ ప్రత్యేక ఆకర్షణ ఆయన రచనలవల్లనో లేదా సినిమాల వచ్చిందో కాదు. అది ఆయనలో ఉన్న జిజ్ఞాస. నా యవ్వనకాలంలో నేనిట్లా ఉండేవాణ్ణి. ఒక కవినో, రచయితనో కనబడితే అతడు గొప్పవాడా, తక్కువవాడా అని చూసేవాణ్ణి కాదు. అతడితో ఇంకొంతసేపు కూచుని మాట్లాడాలని వువ్విళ్లూరేవాణ్ణి. జయమోహనూ, నేనూ సమవయస్కులమే గాని, నాలోని ఆ యువకుడు అదృశ్యమై పోయాడు, జయమోహన్‌లో ఇంకా పదిలంగా ఉన్నాడు.

సాధారణంగా ఇటువంటి విస్తృత సాహిత్య సమావేశాలకు మనం హాజరయ్యినప్పుడు మనం మన పరిమిత ప్రపంచం నుంచి ఒక్కసారిగా బయటకు వెళ్తాం కాబట్టి మన కంఫర్టు జోను నుంచి బయటపడుతున్నట్టు మనకి తెలుస్తుంటుంది. కాబట్టి మనకి వెంటనే కలిగే భావాల్లో న్యూనత తప్పనిసరిగా ఉంటుంది. వాళ్ళే అధికులేమో మనం అంత యోగ్యులం కామేమో అనిపిస్తుంది. కానీ కొంత సేపు ఓపిక పట్టగలిగితే, మనలోని జిజ్ఞాసని కాపాడుకోగలిగితే, అక్కడ చాలామంది మనకి పరిచయమవుతారు. కొత్త లోకాల్ని పరిచయం చేస్తారు. నువ్వు కాక మరొకరు కనబడ్డప్పుడు వారితో నిన్ను పోల్చుకోవడం మానవసహజమే అయినప్పటికీ, అలా పోల్చుకోకుండా ఉండలేకపోయినప్పటికీ, నెమ్మదిగా నీకు నీలోని శ్రేష్ఠగుణాలు కూడా కనిపించడం మొదలుపెడతాయి. ఒక కొత్త వెలుగులో నిన్ను నువ్వు చూసుకోగలుగుతావు. అలా కొన్ని సమావేశాలకు నువ్వు హాజరవుతూ ఉంటే నీకు మొదట్లో కలిగే న్యూనత నెమ్మదిగా అదృశ్యమై దానిస్థానంలో ఒక చొరవ, ఉత్సాహం, గొప్ప exposure సాధ్యమవుతాయి. నాలుగు దక్షిణాది భాషల రచయితల మధ్య ఇటువంటి ఒక సాన్నిహిత్యం నెలకొనాలన్నదే బుక్ బ్రహ్మ ఆశయం.

ఇంతకీ బుక్ బ్రహ్మలో నేను గడిపింది దాదాపు నాలుగైదు గంటలకన్నా ఎక్కువలేదు. కాని ఆ కొద్ది సమయంలోనే కనీసం అయిదు విలువైన పాఠాలు నేర్చుకున్నాను. మరి మూడు రోజులూ అక్కడ గడిపిన మిత్రులు మరెన్ని విలువైన పాఠాలు నేర్చుకుని ఉంటారో! ఎవరేనా పంచుకుంటే వినాలని ఉంది.

4-9-2024

భూమన్‌తో ఒక సాయంకాలం

భూమన్ గత కొంతకాలంగా తిరుపతి పరిసరప్రాంతాల్లో శేషాచలం కొండకోనల్లో చేస్తూ వచ్చిన ట్రెక్కింగు అనుభవాల్ని 'శేషాచల కొండకోనల్లో 'అని పుస్తక రూపంగా వెలువరించారు. శ్రీనివాసన్ (ట్రెక్ శీను) సంకలనం చేసి, లే ఔట్, డిజైను చేసిన ఈ పుస్తకం పర్యాటకులకి, టెక్కీలకి, ప్రకృతిప్రేమికులకి ఊహించని ఒక కానుక. అందుకని ఆ సందర్భాన్ని పురస్కరించుకుని నిన్న సాయంకాలం హైదరాబాదు జింఖానాలో శివ రాచర్ల, వివేక్ లంకమల, స్వర్ణ కిలారి ఒక ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు.

భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి, వారి శ్రీమతి కుసుమకుమారిగార్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆ సమావేశంలో నగరంలోని ఎందరో కవులు, రచయితలు, పాత్రికేయులు, పర్యాటకులు పాల్గొన్నారు. దాదాపుగా ప్రతి ఒక్కరూ భూమన్‌తో తమ సాన్నిహిత్యం గురించీ, బహుముఖీనమైన ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడేరు. ఎంతో ఆత్మీయంగా గడిచిన నిన్నటి సాయంకాలం నగరంలో సాధారణంగా జరిగే సాహిత్యసాయంకాలాల కన్నా ఎంతో విభిన్నంగానూ, ఉత్సాహపూరితంగానూ గడిచింది.

భూమన్‌గారితో నా పరిచయం మరీ ఇటీవలిది. కిందటేడాది మేనెలలో నేను తిరుపతి వెళ్ళినప్పుడు ఆయన ఒక రోజు శ్వేత కార్యాలయ సిబ్బందికి నాతో ఒక మోటివేషను సెషను నిర్వహించడం, ఒక సాయంకాలం తిరుపతిలోని రచయితలతో ఒక ఆత్మీయసమావేశం ఏర్పాటు చేయడం గురించి నేనప్పుడే మీతో పంచుకున్నాను. ఆ రోజు ఆయన నా పట్ల చూపిన ఆదరం, ఆత్మీయత, ఎటువంటి భేషజాల్లేని కలివిడితనం నన్ను ఆయన పట్ల వినమ్రుణ్ణి చేసాయి.

కాని నిన్న చాలామంది మిత్రులు తమ అనుభవాలు చెప్తున్నప్పుడు ఆయన వ్యక్తిత్వం మరింత విశిష్టమైందనీ, దాదాపుగా గత యాభై ఏళ్ళుగా ఆయన తిరుపతిలో, రాయల

సీమలో, రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎందరినో ప్రభావితుణ్ణి చేస్తూనే ఉన్నారని అర్థమయింది. హక్కుల ఉద్యమాల కార్యకర్తగా, విప్లవ సాహిత్యోద్యమ ప్రారంభకుల్లో ఒకరిగా, వనరుల్లో రాయలసీమకు రావలసిన వాటాకోసం పాదయాత్రలు చేసినవాడిగా, ప్రజల కోసం పదే పదే రాజ్యయంత్రాంగంతో తలపడ్డవాడిగా ఆయన జీవితం ఇప్పటికే సుసంపన్నమైందని గ్రహించాను.

ఇప్పుడు డెబ్భై అయిదేళ్ళ వయసులో ఇలా ప్రకృతి ప్రేమికుడిగా తన అనుక్షణ జీవితానుభవాల్ని నలుగురితో పంచుకోవడం ద్వారా ఆయన మరొక మారు విస్తృతప్రజానీకాన్ని స్పందింపచేయగలుగుతున్నారని అర్థమయింది.

నిన్న ఆయన గురించి తమ అనుభవాల్ని పంచుకున్న మిత్రుల ప్రసంగాలన్నీ ఒక ఎత్తూ, ఆయన శ్రీమతి కుసుమకుమారిగారు చేసిన ప్రసంగం ఒకటీ ఒక ఎత్తూ. శ్రీకృష్ణ-దేవరాయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలరుగా పనిచేసిన కుసుమకుమారిగారి గురించి నేను వినడమైతే విన్నానుగాని, ఆమె ప్రసంగం వినడం ఇదే మొదటిసారి.

స్పష్టమైన వాచకం, విస్పష్టమైన వ్యక్తీకరణల వల్ల మాత్రమే కాదు, అన్నిటికన్నా ముందు, ఎంతో విలువైన తమ జీవితానుభవాల గురించీ, సాహిత్యం పట్లా, సమాజాన్ని మార్చాలన్న తమ తపనవల్ల తాము చేసిన ప్రయాణం గురించీ ఆమె చెప్పిన ప్రతి ఒక్క మాటా ఎంతో సూటిగా హృదయంలోకీ సొరవేసుకుపోయేదిగా ఉంది. లెనిను, మావో, గోర్కీ, రాహుల్ సాంకృత్యాయనుల నుండి ఇప్పుడు తరిగొండ వెంగమాంబదాకా వారు స్ఫూర్తి పొందడానికి దేశాల సరిహద్దులేకాదు, సిద్ధాతాల సరిహద్దులు కూడా అడ్డు రాలేదనిపించింది.

'శేషాచలం కొండకోనల్లో' పుస్తకం నాకు రెండుమూడు రోజులకిందటనే వివేక్ పంపించాడు. ఆ పుస్తకంలో అన్నిటికన్నా ముందు ఆ కొండలు, ఆ కోనలు, ఆ జలపాతాలు, ఆ అడవులు, ఆ గుట్టలు, ఆ దారులు నన్ను కట్టిపడేసాయి. ఎంతో భాగ్యవంతులైతే తప్ప అంత సౌందర్యసన్నిధానానికి చేరువగా గడపలేరనిపించింది.

ఆ ప్రాంతాల్లో నడుస్తున్నప్పుడు భూమన్‌గారు కేవలం ఆ భూగోళాన్ని మాత్రమే వర్ణించరు. తన కన్నా ముందు ఏ కవులు, ఏ గాయకులు ఆ దారిన నడిచారో వాళ్ళ జాడలు వెతికి పట్టుకుంటూ ఉంటారు. కాబట్టే ఆ పుటల్లో అన్నమయ్య, తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు, సారంగపాణి, తరిగొండవెంగమాంబ మొదలుకుని ఎందరో కవి గాయకులు కనిపిస్తున్నారు.

ఈ పుస్తకం గాని, ఈ మధ్యనే వివేక్ వెలువరించిన 'లంకమల దారుల్లో' గాని లేదా స్వర్ణ కిలారి సంకలనం చేసి తీసుకొచ్చిన 'ఇంతియానం' గాని కొన్ని విషయాల్ని మనకి చాలా దృఢంగా చెప్తున్నాయి.

వాటిల్లో మొదటిది, మనలో ప్రతి ఒక్కరిలోనూ ఒక పర్యాటకుడు ఇంకా సజీవంగానే ఉన్నాడనీ, మనం మన పసితనంలో కొత్తస్థలాలు చూసేటప్పుడు అన్నిటికన్నా ముందు ఏ wonder ని అనుభూతి చెందామో, అలా విస్మయం చెందగల శక్తికి మనమింకా దూరంగా జరగలేదనీ ఆ పుస్తకాలు చెప్తున్నాయి. రెండోది, పర్యటనలంటే మనమెక్కడికో హిమాలయాలకో, స్విజ్జర్లాండుకో పోనక్కరలేదనీ, చూసే చూపుండాలేగాని, మన చుట్టుపక్కల మనం నిర్లక్ష్యంగా దాటుకుంటూపోయే వాగులూ, వంకలే మనకొక మంత్రమయ భూగోళాన్ని చూపించగలవని. అలా వీలైనన్ని సార్లు మన చుట్టుపక్కలకి మనం వస్తూ పోతూండటం మొదలయ్యాక, నెమ్మదిగా మన దృష్టి ఆ కొండకోనలతోపాటు అక్కడి మనుషుల్నీ, వాళ్ళ సుఖదుఃఖాల్నీ కూడా పరికించడం మొదలుపెడుతుందని.

నిన్న తన ప్రసంగంలో కందుకూరి రమేష్‌బాబు దీన్ని 'పరిసరాల విజ్ఞానం' అన్నాడు. ఎంత చక్కటి మాట! మనం స్కూల్లో పిల్లలకి భాష, గణితం తర్వాత నేర్పేది పరిసరాల విజ్ఞానమేగాని, మన పాఠ్యపుస్తకాలూ, మన ఉపాధ్యాయులూ ఆ పరిసరాలంటే అవెక్కడో మనముండే చోటుకి 'అవతల' దూరంగా ఉండేవన్నట్టుగా చెప్పడం మొదలుపెడతారు. అక్కడే వస్తుంది సమస్య.

ఇక ఈ కొత్తతరం పర్యాటకులు మనకి చెప్తున్న మూడో అంశం ట్రెక్కింగు ఒంటరిగా చేసేదికాదనీ, ఒక బృందంగా చేపట్టవలసిందనీ. నిజానికి మన తీర్థయాత్రల్లో కూడా ఈ బృందానుభవం అంతర్లీనంగా ఉంది. నలుగురు కలిసి నడవడంలో అత్యంత ప్రాచీన మానవానుభవస్ఫురణలేవో ఉన్నాయనుకుంటాను. భూమన్‌గారి ట్రెక్కింగు అనుభవాల్లో ఒంటరిగా చేపట్టినవి దాదాపుగా అరుదనే చెప్పాలి.

అయితే ఆ ఫొటోలూ, ఆ కథనాలూ చూసిన తరువాత, ఆ పర్యటనలు పదిమందీ కలిసి చేస్తున్నవని తెలిసాక, నా వరకూ నాకు వారందరికీ ఒక మాట చెప్పాలనిపిస్తోంది. అదేమంటే, వాళ్ళట్లా కలిసి తిరిగినప్పుడు, ఆ నడకలూ, ఆ యాత్రలూ వారిలోని సృజన సామర్థ్యాల్ని మరింత వెలికితీసేవిగా ఉండాలని. ఆ ట్రెక్కింగుతో పాటుగా ఆరుబయట బొమ్మలు వేసుకోవడం మొదలుపెట్టొచ్చు, కవితలు కూర్చడం నేర్చుకోవచ్చు. పాటలు పాడటం సాధన చేయవచ్చు. అంతిమంగా, అలా ప్రకృతిలోకి నడిచివెళ్ళి వచ్చిన ప్రతిసారీ

తమకు తెలీకుండానే తాము మూటగట్టితెచ్చుకుంటున్న మానసిక ప్రశాంతిని తమ ఇంటిముందో, తమ వీధిలోనో మొక్కలుగా నాటవచ్చు.

మన సమాజ చరిత్రలో ఇదొక కొత్త అధ్యాయం. మనుషుల్ని కలపటానికి సినిమాలూ, రాజకీయాలూ, క్రీడలూ ఇవ్వగల స్ఫూర్తికన్నా ఈ కొత్త వ్యాపకం మరింత ఆరోగ్యవంతమైన ఉత్తేజాన్ని అందిస్తుందని నమ్ముదాం. అందుకు భూమన్‌గారే ఒక ఉదాహరణ అన్నదే నిన్న అక్కడ కూడుకున్న మిత్రులంతా ముక్తకంఠంతో చెప్పింది.

3-3-2025

రెండు మూడు మాటలు

ప్రతి ఒక్కరినీ, ప్రతి ఒక్క పలకరింపులోనూ 'విత్ లవ్–జె' అని రాసే ఆ మనిషి ప్రేమ–శూన్యలోకంలో జీవించిగలిగినంతకాలం జీవించి, ఇక జీవించలేక వెళ్ళిపోయారు. తనని తాను బలవంతంగా నెట్టుకుని మరీ ఈ వేదిక మీంచి పక్కకు తప్పుకున్నారు.

ఆమె గురించి ఇప్పుడేమీ రాసే అధికారంగాని,మాట్లాడే అర్హత గాని మనెవ్వరికీ లేదు. ఇప్పుడామెని ప్రశంసించినా, విమర్శించినా అంతకన్నా అర్థరహితం మరొకటి లేదు. ఆమె జీవించి ఉండగా, మన స్నేహహస్తం ఎలానూ అందించలేకపోయాం, కనీసం, ఆమె జీవితానికి తీర్పరులమయ్యే అపరాధం నుంచేనా మనల్ని మనం కాపాడుకుందాం.

కానీ, ఈ క్షణాన, నాకొక రెండు మూడు మాటలు చెప్పాలని ఉంది. వెళ్ళిపోయిన ఆమె గురించి కాదు. బతికి ఉన్న వాళ్ళ గురించి.

అన్నిటికన్నా, మొదటిది, కాలం మనముందు పెట్టిన కమ్యూనికేషను సౌకర్యాల వల్ల మనం ఇంతకు ముందెన్నడూ లేనంతగా connect అయ్యామనుకుంటున్నాం గాని, నిజానికి, మనం మునుపెన్నడూ లేనంతగా disconnect అయ్యాం. మన మధ్య రంగులు రంగులుగా, పలకరింపులుగా, గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్లుగా, విజువల్‌స్ట్రిప్పులుగా అల్లుకుంటున్న connectivity అంతా నిజానికి మన ఇంటర్నెట్టు కనెక్షను మాత్రమే. ఏ కారణం చేతనేనా మన ఫోను పని చేయకపోయినా, మన ఇంటర్నెట్టు పనిచేయకపోయినా మనం ఈ ప్రపంచంలో ఎంత ఒంటరివాళ్ళమో మనకి ఒక్కసారిగా అనుభవంలోకి వస్తుంది. సాంకేతికత మీద ఆధారపడ్డ మానవసంబంధాల కన్నా బోలు సంబంధాలు మరేవీ ఉండవు. సినిమాహాల్లో తెరమీద దేవదాసు దుఃఖాన్ని చూసి, మనం కూడా విలపించి, ఇంటికి రాగానే మర్చిపోయినట్టే, మన సోషలు మీడియా అరచేతి తెరమీద మనుషుల సుఖదుఃఖాలకి కూడా ఆ క్షణం స్పందిస్తున్నాం, మరుక్షణం మర్చిపోతున్నాం.

పూర్వకాలం, అంటే మరీ పూర్వం కాదు, ముప్పై, నలభై ఏళ్ళకింద మనుషుల ప్రపంచం చాలా చిన్నది. అందులో వాళ్ళ దగ్గర బంధువులూ, బీరకాయ పీచు దూరపు చుట్టరికాలతో పాటు, ఇరుగు, పొరుగు, సహోద్యోగులు– రోజూ తమ కళ్ళ ఎదట ఉండేవాళ్ళూ, తాము కలవకుండా తప్పించుకోలేనివాళ్ళూ ఉండేవారు. కష్టమో, నష్టమో మనం వాళ్ళతోటే కలిసి జీవించడానికి అలవాటు పడి ఉండేవాళ్ళం. కాని, ఇప్పుడు ప్రపంచం విస్తరించింది. మనకి ప్రపంచమంతా స్నేహహస్తం చాచే అవకాశం వచ్చింది. కాని, ఈ స్నేహాలు, ఈ పలకరింపులు మన జీవితంలోని ఉల్లాసకర క్షణాలకు మాత్రమే పరిమితం. మన జీవితాల్లోని ఘనతను చాటుకోవడానికి మాత్రమే పరిమితం. ఈ అసంఖ్యాక పరిచయాల్లో, ఒక్కరేనా, మన ఇంటర్నెట్టు కనెక్షనుతో సంబంధం లేకుండా, మన ఇంటికొచ్చి మనల్ని పలకరించడానికి సిద్ధంగా ఉన్నారా?

రెండవది, అన్నిటికన్నా ముఖ్యమైంది, జీవితాన్ని వెలిగించేది కవులూ, రచయితలూ, ప్రేమికులూ, భావుకులూ మాత్రమే కాదు. నిజానికి వాళ్ళంతా నిండుగా పూసిన ఒక పూలచెట్టు మీద ఇంతలో వాలి, ఇంతలోనే ఎగిరిపోయే పక్షుల్లాంటివాళ్ళు. ఆ చెట్టుకి వాళ్ళు నీళ్ళు పొయ్యరు, కంచె కట్టరు, కాపలా కాయరు. మన దైనందిన జీవితంలో మన రోజువారీ అవసరాలు తీర్చే మనుష్య సమాజం, మనం పట్టించుకోని సమాజం, ఒకటి మన చుట్టూతానే ఉంటుంది. తెల్లవారగానే మన ఇంటితలుపు తట్టే పనిపిల్ల, సూర్యుడింకా ఉదయించకుండానే ఇంటిముంగట పాలపేకట్టు పెట్టివెళ్ళే కుర్రవాడు, అకారణంగానో, అనవసరంగానో మన ఇంటితలుపు తట్టి ఊరికే బాతాఖానీ సాగించే పొరుగింటి మనుషులు, మనం ఒకరోజు ఆఫీసుకి వెళ్ళకపోతే ఇంటికి ఫోను చేసి మరీ కుశలప్రశ్నలతో విసిగించే మన సహోద్యోగి– ఇటువంటి సామాన్యమైన మనుషులు, మన ప్రేమకీ, భావుకతకీ ఎంత మాత్రం నోచుకోని వాళ్ళు, వీళ్ళే మన జీవితవృక్షాన్ని బతికించే జీవజలాలు. వీళ్ళ జీవితాలు నిస్సారాలనీ, వీళ్ళ ఆరాటాలు మరీ ప్రాపంచికంగా ఉన్నాయనీ మనం వీళ్ళని పలకరించడానికి ఒక్కక్షణం కూడా ఆగం. కాని, అటువంటి మనుషులు ఎంత విలువైనవారో మనకి తెలిసి వచ్చేది ఇటువంటి క్షణాల్లోనే.

ఈ సందర్భంగా నాకో సంగతి జ్ఞాపకం వస్తోంది. నేను చూసిన గొప్ప వేదాంతుల్లో ఒకరైన ఆర్.ఎస్.సుదర్శనం గారిని నేనొక సారి మదనపల్లిలో కలిసాను. ఆయన ఆరునెలల పాటు అమెరికాలో ఉండి అప్పుడే వచ్చారు. అమెరికా జీవితం గురించి చాలాసేపు చెప్పుకొచ్చి, ఒక మాటన్నారు, 'అక్కడికి వెళ్ళకముందు ఇక్కడ నన్నెవరేనా ఊరికే పలకరిస్తే డిస్టర్బన్సు అనిపించేది. కాని, అక్కడికి వెళ్ళివచ్చాక, మొన్న ఒక రోజు సాయంకాలం

వీథి చివర పాన్ డబ్బా అంగడిమనిషి 'మాష్టారూ, బావున్నారా' అనడిగితే నాకు ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది. అలా ఊరికే మనల్ని పలకరించే మనుషులు ఎంత విలువైన మనుషులో ఇప్పుడు నాకు అర్థమవుతోంది' అన్నారాయన. మన జీవితం ఇట్లాంటి సాధారణమైన మనుషులతోటే నిండి ఉంది. వీళ్ళు మన చుట్టూ ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిది. వీళ్ళతో మనం ఎంత ఎక్కువ connect అయితే అంత మంచిది.

అన్నా కరెనినా సినిమాని సమీక్షిస్తూ ఒక విమర్శకుడిట్లా ప్రశ్నించాడు: 'మనం అన్నాను ఆమె ప్రగాఢమోహోద్రేకానికి ప్రశంసించాలా లేకపోతే ఆమె మూర్ఖత్వానికి నిందించాలా? ఆమెను ఆరాధించాలా లేక విస్మరించాలా?.. టాల్‌స్టాయి నవలలో పాత్రలు సంఘర్షిస్తాయి, సందేహిస్తాయి. ఆలోచిస్తాయి, అవలోకిస్తాయి. ఆలోచిస్తాయి, వాదిస్తాయి. దుఃఖపడతాయి, క్షమిస్తాయి. కాని ఆ నవల అన్నిట్నీ మించి, ఆరాధనకీ, అభిశంసనకీ సంబంధించిన ప్రశ్నలన్నిటినీ దాటి, 'ఇలా చేసి ఉంటే ఎలా ఉండేదో', 'అలా ఉండి ఉంటే ఎలా ఉండేదో' అనే ఊహాగానాలన్నిటినీ పక్కకు నెట్టి, ఒకటే మాట చెప్తుంది: జీవితం ఉన్నదున్నట్టుగా ఉంటుంది. ఏ మాత్రం ఎక్కువ కాదు, ఏ మాత్రం తక్కువ కాదు. నీకే సంతోషం లభించిందో అదే నీది, నీ సంతోషమే నీ ధన్యత' అని.

నేను చెప్పాలనుకున్న మూడవ మాట ఇదే. జీవితంలో what is, is. చుట్టూ ఉన్న పరిస్థితుల్ని మనం మార్చగలిగితే మంచిదే. కాని మార్చలేకపోతే, అది మన వైఫల్యం కాదు. నీ ప్రేమికుడు నిన్ను ప్రేమించవలసినంతగా ప్రేమించకపోతే, నీ ఉద్యమ సహచరి నువ్వు తలపెట్టినంతగా త్యాగానికి సిద్ధపడకపోతే, నీ కింది ఉద్యోగి నువ్వు ఆశించినంతగా పనిచెయ్యకపోతే, నీ పై ఉద్యోగి నువ్వెంత పని చేసినా గుర్తించకపోతుంటే– అది నీ తప్పు కాదు. అప్పుడు నువ్వు చెయ్యవలసిందల్లా, నీ గది తలుపు తెరుచుకుని బయటకి వచ్చి ఇంటి ముందు వీథిలో ఆటలాడుకుంటున్న పిల్లల్ని చూడటం, చూస్తూ నిన్ను బాధిస్తున్న ప్రపంచాన్ని కొంతసేపు నీ మనోవీథిలోంచి పక్కకు నెట్టేయడం.

25-8-2019

పూర్ణజీవి

గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డిగారు మొన్న సాయంకాలం తన స్వగ్రామం జోళదరాశిలో ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారని తెలిసింది. గత ఏడాదిగా ఆయన్ని చూడలేక పోయాననీ, ఒక్కసారేనా కలిసి ఉండి ఉంటే బాగుండేది కదా అని అనిపిస్తూనే ఉంది. ప్రతి ఏడాదీ ఆయన ఆగస్టు ఏడవ తేదీన జరిపే కృష్ణరాయ పట్టాభిషేక దినోత్సవానికైనా నేను హైదరాబాదు రాగలనా అని అడిగారుగానీ, వెళ్ళలేకపోయాను. ఇక మరి ఆ మనిషి కనిపించరనీ, ప్రేమతో, అభిమానంతో కంపించే ఆ సాహిత్యహృదయస్పందనాన్ని మరింక వినలేననీ తలచుకుంటే కష్టంగా ఉంది. బహుశా నా ఊపిరి కూడా కొంత ఆయనతో వెళ్ళిపోయింది.

చంద్రశేఖరరెడ్డిగారిని మొదటిసారి కలిసింది ఇరవయ్యేళ్ళ కిందట. బెంగలూరు విశ్వవిద్యాలయంలో ఒక ప్రసంగానికి వెళ్ళినప్పుడు పఠాభి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయన్ని మొదటిసారి చూసాను. కాని, ఆయనతో అనుబంధం హఠాత్తుగా కుదురుకున్నది మాత్రం 2009 లో.

శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేకం జరిగి ఆ ఏడాదికి ఐదువందల ఏళ్ళయిన సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పట్టుబట్టి ఆ ఉత్సవాలు జరిపించారు. అందులో భాగంగా తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆముక్తమాల్యద మీద మాట్లాడమని నా మిత్రుడు కవితాప్రసాదునీ, నన్నూ అనుమాండ్ల భూమయ్య ఆహ్వానించారు.

ఆ రోజు మేము సెక్రటేరియటులో ఏదో ఆఫీసు పని మీద చాలాసేపు ఉండిపోవలసి వచ్చింది. ఎంతమాత్రం సాహిత్య సుగంధం సోకని ఆ ఎండవేళ అలసటగా ఆ విశ్వ విద్యాలయంలో, శ్రీకృష్ణదేవరాయల గురించి తలుచుకునే మనఃస్థితి ఎంతమాత్రం

కుదరకుండానే, నేనేదో మాట్లాడేను. అప్పటికి కొన్నాళ్ళుగా నా మనసులో ఉన్న ఊహలు. ఆముక్తమాల్యదలో దాసరి కథ రాయలవారి ఆత్మకథనాత్మక నివేదన అని నాకొక ఊహ. అందులో రాక్షసుణ్ణి ఆయన వర్ణించిన తీరు యుద్ధరాక్షసిని వర్ణించినట్టుగానే అనిపిస్తుందనీ, తాను ప్రాణప్రదంగా భావిస్తున్న విష్ణుకీర్తన, అంటే తన కావ్యరచన, పూర్తి కాకుండానే ఆ యుద్ధరాక్షసి తననెక్కడ కబళిస్తుందోనన్న వ్యగ్రత ఆయన అనుభవించాడనీ, అదంతా ఆ కథలో కనిపిస్తుందనీ అన్నాను.

ఆ రోజు శ్రోతల్లో నా ఎదట కూచున్న చంద్రశేఖర రెడ్డిగారు ఆ మాటలు వింటూనే నాకు జీవితకాల స్నేహితులుగా మారిపోయేరు. అది మొదలు, ఎప్పుడు ఏ మాత్రం సమయం చిక్కినా ఆయన నన్ను కలుసుకోవాలనీ, ఏదో ఒక అంశం మీద నా మాటలు వింటూ వుండాలనీ పరితపించిపోయేవారు.

అటువంటి సహృదయ మిత్రుడు ఒక మనిషికి ఒక జీవితకాలంలో ఒకరు కూడా దొరకడం అరుదు. కాని చంద్రశేఖరరెడ్డిగారి పాండిత్యం, విద్వత్తు, సాహిత్యకృషి, అధ్యయనాలతో పోలిస్తే నేనాయన ముందు ఎంత అల్పుణ్ణో నాకు స్పష్టంగా తెలుసు. అయినా ఆ ప్రేమ,ఆ సహృదయత, ఆ అభిమానధనం చూపించే ప్రలోభాన్ని నిలవరించు–కోవటం కష్టం.

చంద్రశేఖరరెడ్డిగారు స్వయంగా కవి, విమర్శకులు, అనువాదకులు. ముఖ్యంగా తెలుగు కన్నడ సాహిత్యాల మధ్య ఆయనొక సేతువు. కన్నడ వీరశైవకవుల వచనాల్ని 'వచనములు' పేరిట కర్ణాటక ప్రభుత్వం పూర్తిగా అనువదింపచేసిన ప్రాజెక్టుకి ఆయనే సూత్రధారి. అందులో చాలా వచనాలకు ఆయన అనువాదకులు కూడా.

అవి కాక, సర్వజ్ఞుడి వచనాల్ని కూడా ఆయన తెలుగు చేసి ఆ పుస్తకాన్ని పరిచయం చేసే బాధ్యత కూడా నాకే అప్పగించారు. బహుశా, శ్రీకృష్ణదేవరాయల తర్వాత తెలుగు, కన్నడ కవిత్వాల్ని రెండు బాహువుల్తోనూ పొదువుకున్న రసజ్ఞులు ఆయనే అనిపిస్తుంది నాకు.

మియాపూరులో వాళ్ళింటి ముంగిట శ్రీకృష్ణదేవరాయల నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడమే కాక, తన ఇంట్లో ఒక చిన్న గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేసారు. ప్రతి ఏడాదీ ఆగష్టు ఏడవ తేదీన కృష్ణరాయల పేరిట ఒక సాహిత్యగోష్ఠి ఏర్పాటు చేసేవారు. అట్లాంటి సదస్సుల్లో నేను హాజరయిన చివరి సదస్సులో ఆముక్తమాల్యదలో వర్షఋతు వర్ణన గురించి నాతో ప్రత్యేకంగా ప్రసంగం ఏర్పాటు చేసారు. ఆ రోజు

ఎనిమిది భాషలకు చెందిన కవులకు సత్కారం చేసారు. దిగ్దంతుల్లాంటి కవి పండితులున్న ఆ సభలో నన్ను ముఖ్యవక్తగా పిలవడం ఆయనకి నా పట్ల ప్రేమ వల్లనే అన్నది నేను మర్చిపోలేను.

మరొకసారి తెలుగు విశ్వవిద్యాలయం వారు శ్రీకృష్ణదేవరాయల మీద మూడురోజుల సదస్సు నిర్వహిస్తున్నారని తెలిసి, అందులో మీకు ఆహ్వానం వచ్చిందా అనడిగారు. లేదన్నాను. వెంటనే ఆయన పోయి ఆ నిర్వాహకులతో ఏం మాట్లాడేరో తెలీదుగాని, ఏదో ఒక అంశం మీద మాట్లాడమని నాకు కూడా ఆహ్వానం వచ్చింది.

దేని మీద మాట్లాడాలని అడిగాను. 'మీరు నన్ను ఎన్నిసార్లు అడిగినా ఆ దాసరి కథ గురించే చెప్పమంటాను' అన్నారాయన చిరునవ్వుతో. 'అది కాదు, మరొకటేమన్నా సూచించండి' అన్నాను. 'ఇంతదాకా ఎవరూ మాట్లాడని అంశం మీద మాట్లాడండి' అన్నారు. ఆ ఆహ్వాన కరపత్రం చూసాను. శ్రీకృష్ణదేవరాయల రాజనీతి గురించి ఎవరూ మాట్లాడుతున్నట్టు కనబడలేదు. 'ఆముక్తమాల్యదలో రాజనీతి, విశిష్టాద్వైత ప్రభావం' అనే అంశం గురించి మాట్లాడేను. ఆ ప్రసంగం గురించి ఆ రోజు ఆ సభలో ఉన్న వారెవరూ మాట్లాడలేదు గాని, చంద్రశేఖరెడ్డిగారు మాత్రం మరొకసారి నిలువెల్లా పరవశించిపోతూ కనబడ్డారు.

ప్రేమ మనిషిని అంధుణ్ణి చేస్తుంది అనే మాట నిజం. ఆయనకి నా పట్ల ఉన్న ప్రేమ వల్ల ప్రతి ఒక్కదాని మీదా నేను మాట్లాడాలని కోరుకునేవారు. మరొకసారి కువెంపు శతజయంతి వేడుకల్లో కువెంపు భావకవిత్వం మీద నాతో మాట్లాడించడం అటువంటిదే.

జోళదరాశి దొడ్డనగౌడగారి పైన తాను రాసిన 'బసవడు–శరణుడు' పుస్తకానికి నాతో ముందు మాట రాయించడం అర్థం చేసుకోగలను. కాని తన గురువుగారు కవిభూషణ కప్పగల్లు సంజీవమూర్తిరావు గారు రాసిన 'భగవద్గీతా సారం' పుస్తకానికి నేను ముందు మాట రాయాలని ఆయన కనీసం రెండేళ్ళపాటు వేచి ఉండటం మాత్రం నేను ఊహించలేనిది.

భగవద్గీత అనుష్ఠించవలసిందే తప్ప, ప్రసంగించవలసింది కాదని మా మాష్టారు చెప్పారనీ, నేను గీతకి ముందు మాట రాసే యోగ్యత లేనివాణ్ణనీ, నన్ను వదిలిపెట్టమని ఆయన్ని ఎన్నోసార్లు వేడుకున్నాను.

ఎన్నో సార్లు ఆయన ఫోను చేసినా ఫోను ఎత్తకుండా ఉండిపోయాను. ఒకటి రెండు సార్లు విసుక్కున్నాను కూడా. కాని ఆయన పట్టువిడవలేదు. తన గురువుగారి

పుస్తకంలో నా పేరు ఉండాలన్నది తన కోరిక అనీ, దాన్ని ఎట్లాగేనా తీర్చమనీ అడుగుతూ, చివరికి అనుకున్నది సాధించేరు.

చంద్రశేఖర రెడ్డిగారిది బళ్ళారి జిల్లాలో జోళదరాశి గ్రామం. పదహారణాల తెలుగు గ్రామం. కాని రాష్ట్రవిభజనలో ఆ ప్రజల మనోగతానికి భిన్నంగా ఆ గ్రామం పరాయి భాషా రాష్ట్రంలో కలిసిపోవలసి వచ్చింది. చంద్రశేఖరరెడ్డిగారి తండ్రి నారాయణరెడ్డిగారు పూర్తి తెలుగు భాషాభిమాని, భాషోద్యమకారుడు. అందుకని తన తండ్రిని స్మరిస్తూ ప్రతి ఏటా ఆయన తన స్వగ్రామంలో తెలుగు, కన్నడ, మరాఠీ భాషావేత్తలకు సత్కారం చేస్తూ వచ్చేరు.

అందులో భాగంగా ఒక ఏడాది నాకు కూడా ఆ సత్కారాన్ని అందచేసారు. ఆ రోజు నాతో పాటు కుం.వీరభద్రప్పగారు, బొల్లి లక్ష్మీనారాయణ గారూ కూడా ఉన్నారు. సాహిత్య అకాదెమీ పురస్కార సమ్మానితులూ, కన్నడ, మరాఠీ సాహిత్యాల్లో సుప్రసిద్ధులూ అయిన వారి పక్కన నిలబడటానికి కూడా నాకు అర్హతలేదు. అయినా చంద్రశేఖరరెడ్డి గారి ప్రేమాభిమానాలు అటువంటివి.

ఆ పర్యటనలో భాగంగా ఆయన జోళదరాశిలో దొడ్డనగౌడగారి ఇంటికి తీసుకువెళ్ళి చూపించారు. హంపీ తీసుకువెళ్ళి ఆ వైభవాన్ని దగ్గరుండి స్మరణ చేయించారు. శ్రీకృష్ణ-దేవరాయల వంశానికి చెందిన వారసులు అనెగొంది వాస్తవ్యులు ఇప్పటి శ్రీకృష్ణదేవరాయల వారిని కూడా పరిచయం చేసారు.

చూడండి, చంద్రశేఖరరెడ్డిగారిని తలుచుకుంటూ ఉంటే, శ్రీకృష్ణదేవరాయలు అనే పేరు ఎన్ని సార్లు పలుకుతూ ఉన్నానో. రాయలవారు చంద్రశేఖరరెడ్డిగారి జీవితంతో అంతగా పెనవేసుకుపోయారు.

చంద్రశేఖరరెడ్డిగారి మిత్రబృందం ఒక సజ్జన గోష్ఠి. ఆయనవల్ల నాకు వేదవతిగారు, కోడూరి పుల్లారెడ్డి, కోడూరి ప్రభాకర రెడ్డి వంటి రసజ్ఞులు పరిచయమయ్యారు. వారి వారి ఇళ్ళల్లో జరిగిన వివిధ సాహిత్య గోష్ఠులకి కూడా నన్ను వెంటబెట్టుకుని వెళ్ళి నాతో ప్రసంగాలు చేయించడంలో ఆయనకి గొప్ప సంతోషం.

చివరి రోజుల్లో పార్కిన్‌సను ఆయన్ని నిలవనివ్వని అశాంతికి గురి చేస్తూ ఉంటే, తొందరలో వెళ్ళిపోవాలని ఉంది అన్నారొక సారి. ఆ మాట నాకు చాలా కష్టంగా తోచింది. సాహిత్యాన్ని ప్రేమించి, ప్రాణప్రదంగా జీవించే ఇట్లాంటి మనుషులకి నివాస-యోగ్యం కాకపోతే ఈ ప్రపంచానికి అర్థం ఏమిటి?

మొన్న తన స్వగ్రామంలో తన ఇంట్లో జరిగిన ఒక పెళ్ళిసందట్లో ఆయన ఎంతో సంతోషంతో కలయదిరిగారనీ, సాయంకాలం, తన కుమారుడు దగ్గరుండి స్నానం చేయించాక, కొద్దిసేపు విశ్రాంతిగా పడుకున్నారనీ, ఆ చిన్న కునుకులోనే అనాయాసంగా ఈ లోకాన్ని వదిలిపెట్టారనీ విన్నాను.

జోళదరాశి చంద్రశేఖరరెడ్డిగారు పూర్ణజీవి, ధన్యులు.

2-1-2021

అత్తలూరి నరసింహారావు

'ఆయన చాలా స్ట్రాంగ్ లైక్స్ అండ్ డిస్ లైక్స్ ఉండే మనిషి. ముందే చెప్తున్నాను. కాబట్టి ఆయన నీతో ఎలా ఉన్నా ఏమీ అనుకోకు' అన్నారు భమిడిపాటి జగన్నాథరావుగారు.

అత్తలూరి నరసింహారావు గురించి.

ఆయన 'నాట్యసుధ' అనే ఒక సంచిక ఏదో వెలువరిస్తున్నప్పుడు దానికి వ్యాసాలు రాసేవాళ్ళ పేర్లు సూచించమని అడిగినప్పుడు జగన్నాథ రావుగారు నా పేరూ, మా అక్క పేరూ చెప్పారు. వెంటనే అత్తలూరి నుంచి ఒక ఉత్తరం వ్యాసం కావాలని. 1985 లోనో, 86 లోనో. గుర్తులేదు. 84 లో నేను విజయనగరంజిల్లాలో పాచిపెంటలో కళింగాంధ్ర సాహిత్యం గురించి ఒక ప్రసంగం చేసాను. ఆ ప్రసంగాన్నే ఒక వ్యాసంగా రాసి పంపించాను. నాతో ఆ ప్రసంగం చేయించింది గణపతిరాజు అచ్యుతరామరాజు గారు. అందుకని ఆ వ్యాసాన్ని ఆయనకు కానుకగా ఇస్తున్నట్టుగా రాసాను.

'వ్యాసం బాగుంది కానీ, ఆ అంకితమే బావులేదు' అని అన్నారట అత్తలూరి జగన్నాథ రావుగారితో. కాబట్టి మేము అత్తలూరిని మొదటిసారి కలుసుకోబోతున్నప్పుడు, ఆయన ఏమైనా నిష్కర్షగా మాట్లాడితే ఏమీ అనుకోకు అని ముందే హెచ్చరించారు జగన్నాథ రావుగారు.

దాదాపు నలభయ్యేళ్ళు కావొస్తోంది. మేము విశాఖపట్టణంలో రైలు దిగినప్పుడు మమ్మల్ని రిసీవు చేసుకోవడానికి స్టేషనుకి వచ్చిన అత్తలూరిని మొదటిసారి కలుసుకుని. కాని ఇన్నేళ్ళ పరిచయంలోనూ, స్నేహంలోనూ ఆయన నా మనసుని నొప్పించే మాట ఒక్కటి కూడా ఆడకపోగా తనకన్నా వయసులో చిన్నవాణ్ణి అయినప్పటికీ, ఎంతో గౌరవంగా, హుందాగా, స్నేహంగా ప్రవర్తిస్తూనే వచ్చారు.

85 నుంచి 95 దాకా అత్తలూరివారితో సన్నిహితంగా మెలిగే చాలా అవకాశాలు లభించాయి. ఒకటి రెండు రోజులు వారింట్లో అతిథిగా కూడా ఉన్నాను. నేను పార్వతీపురంలో పనిచేస్తున్నప్పుడు ఆ పరిచయం స్నేహంగా కూడా బలపడింది. ఆ రోజుల్లోనే నాతో ఆంధ్రా యూనివెర్సిటీలో ఒక సాహిత్యప్రసంగం ఏర్పాటు చేసారు. ఎన్నడూ యూనివెర్సిటీలో చదువుకోలేకపోయిన నాకు అలా యూనివెర్సిటీ హాల్లో ఆ విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించడం ఎంతో గొప్పగా అనిపించింది. అలానే శిఖామణి 'మువ్వలచేతికర్ర' ఆవిష్కరణ సభలో ప్రసంగించే అవకాశం కూడా. నేనెప్పటికీ మర్చిపోలేనివి.

ఆ రోజుల్లో అత్తలూరికీ, అజంతాకీ, అత్తలూరికీ, త్రిపురకీ మధ్య ఉన్న స్నేహం లెజెండరీ. నిజానికి అది స్నేహం కూడా కాదు. తానెంతో ఇష్టపడే ఆ ఇద్దరు రచయితలకీ ఆయన చేసింది సపర్య, శుశ్రూష. అజంతా అంటే అత్తలూరికి ఎంత ఇష్టమంటే, తన కూతురికి అజంతా అని పేరుపెట్టుకునేటంత. త్రిపుర గారి కథల్ని సంకలనం చేసి మొదటి కథాసంపుటం వెలువరించింది కూడా అత్తలూరినే. త్రిపుర పట్ల ఎంత ఇష్టం ఉండేదంటే, ఎప్పుడన్నా త్రిపుర తనని తెలిసీ తెలియకుండా మాటలతోనో, ప్రవర్తనతోనో గాయపరుస్తున్నా కూడా పట్టించుకునే వారు కారు.

ఆ స్నేహం గాఢాతిగాఢంగా ఉన్నరోజుల్లో ఆయనా, త్రిపురా ఒక సారి పార్వతీపురం వచ్చారు. నేనక్కడ జిల్లా గిరిజనసంక్షేమాధికారిగా పనిచేసేవాణ్ణి. వాళ్ళని కలుసుకోడానికి భూషణంగారు వచ్చారు. సవర గూడలు, సవర జీవితాలు చూడాలని త్రిపుర అడిగితే ఆ రోజు గుమ్మలక్ష్మీపురం, ధర్మలక్ష్మీపురం, నీలకంఠాపురం దాకాతీసుకువెళ్ళాను. మధ్యలో సవరకోటపాడులో ఉండే హార్టికల్చరు ఫారంకి కూడా తీసుకువెళ్ళాను.

అక్కడ అత్తలూరికి ఒక జామమొక్క బహూకరించాము. ఆ విషయమే మర్చిపోయాను గాని, నాలుగైదేళ్ళ తరువాత అత్తలూరిని కలవడానికి విశాఖపట్టణం వెళ్ళినప్పుడు వాళ్ళింట్లో ఏపుగా పెరిగిన ఒక జామచెట్టుని చూపిస్తూ, ఇది మీరు ఇచ్చిన కానుక అన్నారాయన నాతో. మనుషులకే కాదు, వాళ్ళతో తన అనుభవాల జ్ఞాపికలకు కూడా అత్తలూరి ఇచ్చే గౌరవం అది!

నేను పార్వతీపురంలో ఉండగానే ఒకసారి పద్మినిగారి వీణకచేరి ఏర్పాటు చేసాము. పార్వతీపురం సంగీతప్రధానమైన కేంద్రం కాదుగాని, ఆ రోజు ఆ సభకి జనం చాలా బాగా వచ్చారు. అప్పుడు అక్కడ మాకు ప్రాజెక్టుఆఫీసరుగా పనిచేసిన ఎల్.వి.సుబ్రహ్మణ్యం

గారినీ, వారి శ్రీమతినీ ముఖ్యఅతిథులుగా ఆహ్వానించేం. పద్మినిగారు ఎంతో సున్నిత మనస్కురాలు. ఒక పువ్వు రేకల్ని తాకుతున్నంత మృదువుగా ఆమె వీణావాదనం చేసినట్టుగా ఒక దృశ్యం ఇప్పటికీ నా మనసులో నిలిచిపోయింది.

ఆ తర్వాత మళ్ళా కొన్నేళ్ళకు నాకు పాడేరు బదిలీ అయినప్పుడు, ఆ బదిలీలో నన్నూరించిన ఒకటి రెండు అంశాల్లో అత్తలూరి, త్రిపురలకు దగ్గరగా ఉంటానన్న ఊహ. కాని ఈ సారి ఎందుకనో అత్తలూరితో మళ్ళా అంత సన్నిహితంగా గడిపే అవకాశాలేమంత దొరకలేదు. అందుకు ప్రధానమైన కారణం పాడేరులో నా పని ఒత్తిడి.

కాని ఒకసారి వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు, పద్మినిగారు బాలసాహిత్యం గురించి మాట్లాడుతూ, 'పేపరు పాపాయి' అనే పుస్తకం ఇచ్చారు నాకు. ఆ పుస్తకం తనకి ప్రాణసమానం అని చెప్తూ చదవగానే తిరిగి ఇచ్చెయ్యమన్నారు. కాని నేను ఆ పుస్తకం తిరిగి ఇవ్వకుండానే పాడేరు నుంచి వచ్చేసాను. ఆ తర్వాత నా ఉద్యోగజీవితం దాదాపుగా హైదరాబాదులోనే గడిచినందువల్ల ఆ పుస్తకం చాలాకాలం పాటు నా దగ్గరే ఉండిపోయింది. కానీ ఇళ్ళు మారుతున్న ప్రతిసారీ, పుస్తకాలు సర్దుకునేటప్పుడు, ఆ పుస్తకాన్ని మాత్రం ఒక సజీవమైన హృదయాన్ని భద్రపరుచుకోవలసివచ్చినట్టుగా దాచేవాణ్ణి.

దాదాపు ఇరవయ్యేళ్ళ తరువాత, ఒక రోజు పద్మినిగారికి ఫోను చేసి వారి ఇంటి అడ్రస్సు అడిగి ఆ పుస్తకం వాళ్ళకి కొరియరు చేసాను, ఆ పుస్తకం చూసి పద్మినిగారు ఎంత సర్ప్రైజు అయిఉంటారా అని ఊహిస్తూ. నేననుకున్నట్టే ఆమె వెంటనే ఫోను చేసారు. మామూలుగా ఎరువిచ్చిన పుస్తకాల విషయంలోలానే ఆ పుస్తకం కూడా ఎవరికో ఎరువిచ్చినట్టు గుర్తుందిగానీ, ఎవరికి ఎరువిచ్చానో గుర్తులేదనీ, ఇన్నాళ్ళకు ఆ పుస్తకం మళ్ళా తనని చేరినందుకు తనకెంతో సంతోషంగా ఉందనీ చెప్పారు. అప్పుడు సరదాగా 'మరి తక్కిన పుస్తకాలు కూడా తొందరలో పంపించెయ్యండి' అన్నారు.

ఆమె పుస్తకాలు మరేమీ నా దగ్గర లేవుగానీ, ఎప్పుడేనా మళ్ళా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నా పుస్తకాలు వాళ్ళ చేతుల్లో పెట్టాలనుకున్నానుగానీ, ఆమె ఈ లోకం నుంచే వెళ్ళిపోయారు.

కొన్నేళ్ళ కిందట 'మోరీతో మంగళవారాలు' పుస్తకం గురించి ఎవరో చెప్తే సంపాదించి చదివాను. అత్తలూరి దంపతుల అనువాదం. ఒక ఉపనిషత్తులాగా అనిపించింది ఆ పుస్తకం. ఆ మాట ఆయన్ను కలిసి చెప్పాలనుకున్నాను. అలానే 'నాకూ ఓ కల ఉంది' పుస్తకం కూడా. ఆ పుస్తకం చదివాక ఆనంద్ వెళ్ళకుండా ఉండలేకపోయాను కూడా. కాని ఈ పుస్తకాల గురించి అత్తలూరితో ముచ్చటించడం కుదరనే లేదు.

సంస్కారవంతులు అని ఎవరి గురించైనా చెప్పాలనుకుంటే అందరికన్నా ముందు నాకు అత్తలూరి దంపతులు గుర్తొస్తారు. వాళ్ళు సాహిత్యాన్ని, సంగీతాన్ని, స్నేహాల్ని ప్రేమించారు. మనుషుల్ని ఇష్టపడ్డారు, గౌరవించారు. హృదయానికి దగ్గరగా హత్తుకున్నారు. అటువంటి ప్రేమాస్పదుల్ని జీవితంలో ఒక్కసారి కలుసుకున్నా కూడా వాళ్ళు ఎన్నటికీ మనతోనే ఉండిపోయినట్టుగా అనిపిస్తుంది.

16-9-2021

ఒక జీవనది

బాలసాహిత్య ఉద్యమకారుడు, పిల్లలప్రేమికుడు రెడ్డి రాఘవయ్యగారు ఈ లోకాన్ని వదిలివెళ్ళిపోయారని తెలిసినప్పుడు చాలా వెలితిగా అనిపించింది. ఆయన జీవించి ఉండగా తెలుగు జాతి ఆయనకు తీర్చుకోవలసిన ఋణం తీర్చుకోలేదనే అనిపించింది. అలాగని ఆయనకు గుర్తింపు రాలేదని, పురస్కారాలు రాలేదని అనలేను. కాని ఆయన తెలుగుసాహిత్య ప్రపంచానికి, తెలుగుసమాజానికి తెలియవలసినంతగా తెలియలేదు. కేవలం తమ రాజకీయాలు, తమ ముఠాలు, తమ పురస్కారాలు మాత్రమే ప్రధానంగా ఉండే 'ప్రధానస్రవంతి' తెలుగు సాహిత్యం ఆయన కోసం నిజంగా ఒక్క రోజు కూడా చెవి ఒగ్గింది లేదు.

నేననుకుంటాను, ఈ లోపం అసలు మన సాహిత్యదృక్పథంలోనే ఉంది. 1950 కి పూర్వం ప్రధానస్రవంతి తెలుగు రచయితలు, కవులు, ఉద్యమకారులు బాలసాహిత్య కారులు కూడా. వీరేశలింగం పిల్లలకోసం పాఠ్యపుస్తకాలు రాసాడు. గురజాడ పిల్లల పాటలు రాసాడు. గిడుగు సవరపిల్లలకోసం కథలూ, పాటలూ సంకలనం చేసాడు. చలం బిడ్డలశిక్షణ మీద ఏకంగా ఒక పుస్తకమే రాసాడు. చింతాదీక్షితులు పిల్లలకోసం రాసిన పాటలు, కథలు ఆయన్ని ఇప్పటికీ తెలుగు బాలసాహిత్యంలో అగ్రేసరుడిగా నిల్పెడుతున్నాయి. విశ్వనాథ, కృష్ణశాస్త్రి, బాపిరాజు బాలసాహిత్యంలో చెప్పుకోదగ్గ కృషి చేసారు. ఆ తర్వాతి తరంలో జాషువా, కొ.కు, కరుణశ్రీ, దాశరథి, బైరాగి. అంతే, ఆ తర్వాత మరొక్క కవి, రచయిత నాకు కనబడటం లేదు.

1980 తర్వాత ప్రధానస్రవంతి సాహిత్యమూ, బాలసాహిత్యమూ వేరు వేరు శాఖలుగా చీలిపోయాయి. ఉదాహరణకి గత నలభయ్యేళ్ళల్లో సాహిత్య అకాదెమీ పురస్కారం ఏ రచయితకి గాని, ఏ పుస్తకానికిగాని బాలసాహిత్యానికి వచ్చిందా? బహుశా ఈ లోటుని

గమనించి సాహిత్య అకాదెమీ బాలసాహిత్యం కోసం వేరే పురస్కారాన్ని ఏర్పాటు చేయడంతో ఇక ప్రధానస్రవంతి రచయితలకీ, కవులకీ, ఆ బరువు తప్పిపోయింది. నాకు తెలిసి, బహుశా, గౌరునాయుడు, నామిని, చంద్రలత వంటి ఏ ఒకరిద్దరో తప్ప, నవల, నాటకం, కథ వంటి ప్రక్రియల్లో విశేష కృషి చేసిన ఏ సమకాలిక రచయిత కూడా బాలసాహిత్యంలో ప్రయత్నిస్తున్న దృష్టాంతం లేదు. (నేను పొరపడితే చెప్పండి. ఏ రచయిత అయినా తాను పిల్లలకోసం కూడా రాస్తున్నానని చెప్తే ఆ వార్త నేను సంతోషంగా స్వీకరిస్తాను. నా సమాచారాన్ని అప్ డేట్ చేసుకుంటాను.)

2009 లో ఒక రోజు. నేను సంక్షేమభవన్లో పని చేసుకుంటుండగా రాఘవయ్య గారు మా ఆఫీసుకి వచ్చారు, నన్ను వెతుక్కుంటూ. అప్పటికి నేను ఆయన పేరైతే విన్నాను గాని, చూడటం అదే ప్రథమం. పూర్వకాలపు ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయుడి లాగా, ఒక రైతులాగా నిరాడంబరంగా కనిపించిన ఆ మనిషిని చూస్తూనే నా దగ్గర బంధువు ఎవరో నన్ను వెతుక్కుంటూ వచ్చినట్టనిపించింది.

ఆ రోజు ఆయన బాలసాహిత్యం గురించి నాకెంతో చెప్పారు. 'బాల సాహిత్య నిర్మాతలు' అని తాను రాసిన పుస్తకం నా చేతుల్లో పెట్టారు. తెలుగులో తొలి తెలుగు బాల గేయం గిడుగు సీతాపతి రాసిన 'చిలుకమ్మ పెండ్లి' (1902) అనే పాట అని చెప్తూ, 2002 నాటికి బాలగేయాలు శతవత్సరాలు పూర్తిచేసుకున్నాయనీ, ఆ నూరేళ్ళ కాలంలో ప్రసిద్ధి చెందిన బాలగేయాల్ని తాను ఒక సంకలనంగా తీసుకురావాలనుకుంటున్నాననీ, దానికి నన్ను ముందుమాట రాయమనీ అడిగారు. అది నేను అపూర్వమైన గౌరవంగా భావించేను. తన పుస్తకం మీద మాట్లాడమని డా. నారాయణ రెడ్డి అడిగినప్పటికన్నా, తన పుస్తకానికి ముందుమాట రాయమని ఇస్మాయిల్ అడిగినప్పటికన్నా అది నాకు ఎక్కువ సంతోషాన్ని కలిగించింది. ఆయన ఇచ్చిన సమాచారంతో, స్ఫూర్తితో నేను ఆ ముందుమాట చాలా విపులంగా రాసాను. (చూ. 'సాహిత్యమంటే ఏమిటి' (2011), పే. 126-132.)

రెండేళ్ళ కిందట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్ వాడీలని ప్రి-ప్రైమరీ పాఠశాలలుగా మారుస్తూ వారికి ప్రిప్రైమరీ-1, ప్రి ప్రైమరీ-2 కోసం పాఠ్యపుస్తకాలు రూపొందించగలమా అన్నప్పుడు దేశంలోనే అత్యుత్తమ పుస్తకాలు రూపొందించాలనుకున్నాం. అప్పటికింకా భారతప్రభుత్వం ప్రి-ప్రైమరీ కోసం కరికులం ఫ్రేమ్‌వర్కు ఇంకా విడుదల చెయ్యలేదు. కాని మేం రాష్ట్రంలోనూ, దేశంలోనూ అత్యుత్తమ విద్యావేత్తలతో చర్చించి ముందొక ఫ్రేమ్‌వర్కు రూపొందించాం. మేం పుస్తకాలు రూపొందించడం పూర్తయ్యేటప్పటికి

భారతప్రభుత్వం తన ఫ్రేమ్ వర్కు విడుదల చేసింది. అది దాదాపుగా మేము రూపొందించు-కున్న ప్రణాళిక ప్రకారమే ఉండటం మాకెంతో సంతోషాన్నిచ్చింది. అయితే ఆ సందర్భంగా, పిల్లలకి, తెలుగులోనూ, ఇంగ్లిషులోనూ నర్సరీ రైమ్సుని పొందుపరచడం కోసం చాలా వెతికాం. ఇంగ్లిషు మీడియం కాన్వెంటుల్లో వాడుతున్న వివిధ పుస్తకాలు (దాదాపు ముప్పై రకాల పుస్తకాలు వాడుతున్నారు, ఒక చిన్న వీధి కాన్వెంటునుండి ఢిల్లీ పబ్లిక్ స్కూలుదాకా) తెప్పించుకుని చూసాం. ఆ పుస్తకాలు చూసినప్పుడు నాకు చెప్పలేనంత నిరుత్సాహం కలిగింది. ఎందుకంటే ఏ ఒక్క నర్సరీ రైము పుస్తకంలోనూ పిల్లల పట్ల ప్రేమగాని, శ్రద్ధగాని కనిపించలేదు. చేతికి ఏది దొరికితే అది ఆ పుస్తకంలో చేర్చి దాన్నే పిల్లలకు నేర్పుతున్నారు.

అదే తెలుగు విషయానికి వస్తే, తెలుగు బాలగేయాల్లో ఉన్న వైవిధ్యం, భాషా సౌందర్యం, రంగుల ప్రపంచం ఎంతో అద్వితీయంగానూ, ఇంగ్లిషు ఇప్పట్లో అందుకోలే-నంత ఎత్తుల్లోనూ కనిపించాయి. (నిజానికి తాను బాలగేయాలు రాయడానికి స్ఫూర్తి విక్టోరియాయుగం నాటి 'బాయ్స్ ఓన్ యాన్యువల్' అనే పుస్తకం అని సీతాపతిగారు చెప్పుకున్నారు. కాని ఇంగ్లిషు నర్సరీ రైములు విక్టోరియా యుగంలోనే ఆగిపోయాయి). తెలుగు బాలగేయాలు ఎంతో సుసంపన్నంగా కనిపించినప్పటికీ, అవన్నీ కూడా దాదాపుగా 1960 కి పూర్వానివే. ఆ తర్వాత కూడా రాశిలో ఎంతో బాలసాహిత్యం వచ్చినప్పటికీ, అదంతా ఏదో ఒకదాన్ని- సైన్సునో, మరొకటో-ప్రచారం చెయ్యడానికి రాసిందే తప్ప, సాహిత్యాన్ని సాహిత్యంగా రాసింది చాలా తక్కువ.

ఇటువంటి నిర్జలభూమిలో రాఘవయ్యగారు ఒక ఒయాసిస్సు మాత్రమే కాదు, ఒక జీవనదిగా ప్రవహిస్తూ వచ్చారు. తాను రాసారు, రాసినవాళ్ళని నలుగురికీ తెలిసేలా పైకెత్తి చూపారు. తమకోసం మాత్రమే తాము రాసుకుంటూ, తమ రచనలు మాత్రమే తాము చదువుకుంటూ, ఎంతసేపూ తమగురించి మాత్రమే మాట్లాడుకుంటూ ఉండే 'ప్రధానస్రవంతి' తెలుగు సాహిత్యాన్ని (అందులో నేను కూడా ఉన్నాను) సిగ్గుపడేలా చేసారు.

పిల్లలున్నంతకాలం రాఘవయ్యగారు ఉంటారు. సదా బాలకుడిగా ఉంటారు.

25-7-2022

ఋషీశ్వరుడు

ఈ రోజు ఆ పార్థివదేహానికి సమర్పించడానికి అక్కడెవరో నా చేతుల్లో ఒక చిన్న చితుకు పెట్టారు. గురువు దగ్గరికి వెళ్ళినప్పుడు కనీసం ఒక సమిధనేనా తీసుకుని వెళ్ళాలని పూర్వులు చెప్పారు. ఆయన జీవించిఉండగా నేను ఆయనకు ఏమీ చెయ్యలేకపోయాను. కాని మాకొక జన్మాంతరబంధం ఉండిందని మాత్రం ఈ రోజు నాకు అగ్నిసన్నిధిలో అర్థమయింది. నాకేకాదు, గంగారెడ్డి, ఆదిత్య, తుమ్మూరి రామ్మోహనరావు, కంటాల విశ్వనాథంలకి కూడా.

ఆయన పుట్టినప్పుడు నేను లేను. పెరిగినప్పుడు, చదువుకున్నప్పుడు నేను సహచరుణ్ణి కాను, ఉద్యోగజీవితంలో సహోద్యోగినీ కాను. ఆయన ఎనభై ఏళ్ళ జీవితం జీవించాక, ఆరేళ్ళ కిందట, ఒకరోజు ఆయన్నుంచి ఫేస్ బుక్ మెసెంజరు కాల్. ఆశ్చర్యపోయాన్నేను. అప్పటికి నేను ఆయన పేరు విన్నాను. ఆ మాటే చెప్తే, ఆ రోజే అంటే 12-7-2016 న ఇలా మెసేజి పంపించారు.

> It is unlikely that you had heard of me before we became friends on the Facebook. I read a few of your writings, and know you have an ear for music, an eye for art, and a taste for quality literature. Your afterword to Narala Ramareddi's translation of Gathas is quite impressive. I would like to send you two of my books if you would share your postal address. I assure you they are not great works. I am riding two horses. So, I'm neither here nor there. And that is exactly where I want to be.

ఆరేళ్ళు. కాని ఈ ఆరేళ్ళ కాలంలో సూరపరాజు రాధాకృష్ణమూర్తిగారు అంటే ఏమిటో తెలుగు విద్వత్‌లోకం క్షుణ్ణంగా గ్రహించింది. ప్రాక్పశ్చిమాలని తన రెండు

బాహువుల్లోనూ పొదువుకున్న ఆ మహనీయుడికి అమెరికానుంచి ఆస్ట్రేలియా దాకా పాఠకమిత్రులు ఏర్పడ్డారు. ఒకదాని వెనగ్గా ఒకటి, ఆయన, ఈ ఆరేళ్ళల్లో ఇరవై పుస్తకాలకు పైగా వెలువరించారు. ఆయన అంతకు పూర్వం రాసినవి 'అగ్నిమీళే' కవితల సంపుటి, పి.రామకృష్ణారెడ్డి కథల పైన విమర్శ, భగవద్గీత భాష్యానికి అనువాదం, ఉపనిషత్తుల మీద రెండు పుస్తకాలు, Krishna Calling పేరిట రాసిన పుస్తకం.

ఈ ఆరేళ్ళలో ఆయన షేక్స్పియరు, డాంటే, బోదిలేరు, హాప్కిన్సు, కాఫ్కా, ఇలియటుల మీద సమగ్ర పరిశీలనలతో పాటు, డాస్టవిస్కీ, నీషే, హిడెగ్గర్, సార్త్ర్, కాఫ్కా, కామూ వంటి అస్తిత్వవాద రచయితలపైన ఒక సమగ్ర పరిశీలనతో పాటు మాండూక్య ఉపనిషత్తు పైన, అద్వైతవేదాంతం పైన రెండు పుస్తకాలు కూడా వెలువరించారు. గంగారెడ్డి అడిగాడని సంత్ జ్ఞానేశ్వర్ 'అమృతానుభవం' తెలుగు చేసారు. ఇవి కాక తెలుగు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపైన రాసిన వ్యాసాల 'సాహితీసేతువు' కూడా. ఇంకా మరికొన్ని పుస్తకాలు ఉండిఉండవచ్చు.

ఇవి కాక, ఇక్కడ ఫేస్ బుక్కులో మిత్రులు రాసినవాటి మీద ఆయన ఎంతోబాధ్యతగా ఎప్పటికప్పుడు పెడుతూ వచ్చిన కామెంట్లు వాటికవే గొప్ప సాహిత్యం. ఆయన నాకు ఇరవయ్యేళ్ళ కిందటనే ఎందుకు పరిచయం కాలేదా అనుకుంటూ ఉంటాను. తెలుగు సాహిత్యం ఆయన నుంచి ఎంత పొందిందో, అంతకన్నా ఎక్కువ పొందకుండానే ఉండి పోయింది.

ఏడెనిమిదేళ్ళ కిందటిదాకా ఆయనకి కంప్యూటరు అంటే తెలియదు. ఇంజనీరింగు చదువుతున్న తన మనమడిని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్నెట్టుతో పరిచయం కాగానే ఆయనలో ఒక నవయువకుడు మేల్కొన్నాడు. ఫేస్ బుక్ ఆయన్ను విశ్వపౌరుణ్ణి చేసింది.

ఆయన ఈ మధ్య కాలంలో రాసిన పుస్తకాలన్నీ చిన్న టేబుల్ మేట్ మీద ఐపాడ్ పెట్టుకుని తనే స్వయంగా రాసిన పుస్తకాలంటే నమ్మగలమా? ఆ పుస్తకాల ప్రచురణకు ప్రీ-ప్రెస్సు కాపీలు ఆయనే స్వయంగా తయారు చేసుకుని పంపేవారంటే, ఆయన్ని ఎలా ప్రస్తుతించాలో తెలియకుండా ఉంది. వందలాదిపేజీల ఆ టైప్డ్ మెటిరియల్లో ఒక్క టైపో కూడా కనిపించదంటే ఏమనిచెప్పాలి?

రాధాకృష్ణమూర్తిగారికీ నాకూ ఈ ఆరేళ్ళుగా నడిచింది స్నేహంకాదు. అంతకన్నా పెద్ద పదం ఏదో ఉంది, కాని నాకు తెలియడం లేదు. ఆయన నా మనసుకి సన్నిహితంగా, నేను ఆయన మనసుకు సన్నిహితంగా గడిపేం.

ఆయనకీ నాకూ మధ్య మెసెంజరులో నడిచిన సంభాషణలు పదేపదే చూసుకుంటున్నాను. 25-7-2018 న ఇలా రాసారు:

> I was not sure I would post my article on 'King Lear' yesterday. My wife was very unwell, and we were all anxious about whether she would need to be hospitalized. By god's grace, she is better today. I don't think it needs to be stated that if I hadn't met you on FB, I wouldn't have written for the last couple of years what I have written, especially in English literature. I am happy to say that. When I write, I have you in my mind. And that may be the reason I do the best I can, and also why it usually goes above the normal FB level. I know my article today, like the others I have done till now, is not perfect. For eg. I should have referred to the Book of Job. And so many other things. But I am glad that it has been worth the effort. Once again, I express my happiness that someone with a taste like yours is there on FB. Thank you.

2016 లో ఆయన పరిచయమైనప్పుడే నా ఉద్యోగ జీవితం విజయవాడ తరలిపోతూ ఉంది. అందుకని మిత్రులం ఒక లంచ్ కోసం కలుద్దామనుకున్నప్పుడు రాధాకృష్ణ–మూర్తిగారిని కూడా ఆహ్వానించేం. రామంతపూరు వెళ్ళి ఆయన్ని దగ్గరుండి సోమయ్య గారింటికి తీసుకువెళ్ళాను. అక్కణ్ణుంచి హొటలుకి వెళ్ళాం. ఆ రోజు నాగరాజు రామస్వామిగారు కూడా వచ్చారు. అదొక మరవలేని కలయిక.

మరొకసారి అంటే 2017 అక్టోబరులో రాధాకృష్ణమూర్తిగారే మాకు నారాయణ గూడ తాజ్‌మహల్ హొటల్లో విందు ఏర్పాటు చేసారు. మరొక రోజు వాళ్ళింట్లోనే 'అనుభవామృతం' ఆవిష్కరణ జరిగింది. ఆ రోజు కన్నెగంటి రామారావు, పద్మ కూడా ఉన్నారు.

ఇక 2019 సెప్టెంబరులో ఆయన రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ పెద్ద ఎత్తున జరుపుకున్నాం. ఆ రోజు బెంగలూరునుంచి వాసు వచ్చాడు. మరికొందరు మిత్రులు పిన్నంశెట్టి కిషన్ వంటివారు కూడా కలిసారు. ఆయన షేక్స్పియరుపైన రాసిన 'షేక్స్పియర్ సాహిత్యలోకం' పుస్తకాన్ని ఆ రోజు నాకు అంకితం ఇవ్వడం నేను ఊహించలేనిది. బహుశా ఈ జీవితానికి అంతకన్నా మించిన భాగ్యం నాకు మరొకటి ఉంటుందనుకోను.

పోయిన ఏడాది నేను నా ఉద్యోగంలోనూ, ఉద్యోగానికి సంబంధించిన గొడవల్లోనూ తలమునకలుగా ఉండటం ఆయన్ని కలతపెట్టినట్టుంది. 17-11-2021 న ఆయన నాకిలా మెసేజి పెట్టారు:

> Veerabhadrudu garu, namaste. I very much want to see you. But I know you are away, and also busy with your official duties. But my association with you is a special phase in my life. I wouldn't have written 16 books in two years without your appreciation. You shall remain a lasting part of my literary life. I thank you for all your appreciation and encouragement. If it is possible, we shall meet once. I would be very happy. Moorthy.

ఆయన వంటి ఒక పండితుడు, గురువు, రసజ్ఞుడు,అన్నిటికన్నా ముఖ్యం, అటువంటి సద్వివేకి, నా జీవితంలో నాకు పరిచయం కావడం, కనీసం కొన్నేళ్ళైనా మా మధ్య ఒక సాహిత్యసంతోషం పరిఢవిల్లడం నా అదృష్టంగా భావిస్తున్నాను. కాని ఆయనలో వీటన్నిటినీ మించిన మరొక మహామానవుడు ఉన్నాడు. చాలా రోజులుగా ఆయన్ను అప్పుడప్పుడు వెళ్ళిచూస్తూ, కలుసుకుంటూ, ఆయన మీద రెండు గంటల వీడియో ఇంటర్వ్యూ రికార్డు చేసిపెట్టిన గంగారెడ్డి పొద్దున్న అంటున్నాడు: 'అటువంటి సహృదయుణ్ణి నేను నా జీవితంలో చూడలేదు' అని.

అవును, ఆయన సహృదయుడు. వేదాంతం ఆయన్ను మరింత రసప్లావితం చేసిందే తప్ప నిర్లిప్తుడిగా మార్చలేదు. 'మా నాన్నలో బయటి వాళ్ళకి తెలియని కోణం మాకు మాత్రమే తెలుసు. ఆయన మూడేళ్ళ పసిపాప' అంటున్నారు పొద్దున్న వాళ్ళ పెద్దమ్మాయి పద్మజ.

అద్వైతం ఒక ఆలోచనాధోరణి మాత్రమే అనీ, దాన్ని అనుష్ఠించడం కష్టమనీ ప్రపంచం అనుకునే రోజుల్లో రమణ మహర్షి వంటి అద్వైతి ఈ లోకానికి సాక్షాత్కరించాడు. నాకు తెలిసి నా జీవితంలో నేను సన్నిహితంగా చూసిన నిజమైన అద్వైతి అంటూ ఉంటే అది రాధాకృష్ణమూర్తిగారే.

చివరిదాకా ఆయన్ని వెన్నంటి ఉన్న ఆ పసిపాపల దరహాసమే దానికి సాక్షి. ఆయన ఎలా సాధించాడు దాన్ని? తెలియదు. కాని, మధ్యాహ్నం ఇంటికి వచ్చాక, ఆయన్ని తలుచుకుంటూ ఈశోపనిషత్తు చదువుకున్నాను. వైదికఋషి ఇలా అంటున్నాడు:

అన్యదేవాహుర్విద్యయా అన్యదాహురవిద్యయా
ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్తద్విచచక్షిరే

(విద్యను అనుసరించినవారికి ఒక ఫలితమూ, అవిద్యను అనుసరించినవారికి మరో ఫలితమూ లభిస్తాయని మేము పెద్దలు చెప్పగా విన్నాము.)

విద్యాం చావిద్యాం చ య స్తద్వేదో భయగ్ం సహ
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృతమశ్నుతే.

(అయితే ఎవరైతే విద్యనూ, అవిద్యనూ రెండింటినీ కలిపి తెలుసుకుంటారో, వారు అవిద్యతో మృత్యువును తరిస్తారు, విద్యతో అమృతత్వం పొందుతారు.)

ఈ ఉపనిషద్వాక్యాలకి రాధాకృష్ణమూర్తిగారికన్నా మించిన నిరూపణ నాకు మరొకటి తెలియదు.

15-9-2022

ఏ దివిలో విరిసిన పారిజాతమో

ఆమెను నేను ఎన్నడూ కలుసుకోలేదు, చూడలేదు, కనీసం ఫోనులో కూడా మాట్లాడు-కోలేదు. కానీ నా జీవితంలో నా హృదయానికి ఎంతో సమీపంగా వచ్చిన అత్యంత ఆత్మీయుల్లో ఆమె కూడా ఒకరిని మాత్రం గుర్తుపట్టగలిగాను. ఎప్పుడో ఒకప్పుడు విశాఖపట్నం వెళ్ళినప్పుడు, ఈసారో, మరోసారో ఆమెని చూడాలనీ, ఆమె చేస్తున్న పనుల గురించి మరింత వివరంగా అడిగి తెలుసుకోవాలనీ, ఆమె నుంచి మరింత స్ఫూర్తి పొందాలనీ, ఆమెకి నేను ఏదైనా నాలుగు ధైర్య వచనాలు చెప్పగలిగితే మనసారా చెప్పాలనీ అనుకుంటూ ఉండగానే ఇంతలోనే ఆమె చెప్పాపెట్టకుండా ఈ లోకం వదిలి వెళ్ళిపోయారు.

ఒకసారి తన వాల్ మీద ఆమె ఫోటో పెట్టినప్పుడు ఆమె కన్నుల్లో అనంతాంబరపు కాంతి లోకాలు కనిపిస్తున్నాయని రాశాను. ఆ కళ్ళు, ఎంతో నిర్మలమైన ఆ కళ్ళు, చివరి దాకా జీవితంతో పోరాడుతూనే ఉన్నప్పటికీ, ఒక్క క్షణం కూడా ఈ లోకం మీద విసుగు చూపించని కళ్ళు, సదా అమృతం కురిపిస్తూనే ఉన్నవి ఆ కళ్ళు.

నిజానికి ఈ ప్రపంచం సాయిపద్మలాంటి వాళ్ళకి చెందవలసిన ప్రపంచం. చిరకాలం ఆమెలాంటి వాళ్ళు జీవించవలసిన ప్రపంచం. అంత పోరాట స్ఫూర్తి, అంత ప్రేమైక హృదయం కలిగిన మనుషులు మరొక నాలుగు రోజులు మన మధ్య మసిలితే మనం మరింత సార్థకంగా, మరింత సంతోషంగా జీవించగలమని నమ్మకం కలుగుతుంది. కానీ అదేమిటో నాకు ఇప్పటికీ అర్థం కాదు– ఈ ప్రపంచం నుంచి ఆమెలాంటి వాళ్లే అంత తొందరగా ఎందుకు వెళ్ళిపోతారో?

సాయిపద్మా! మిమ్మల్ని కలుసుకోలేకపోయాను. ఆ లోటు తీరేది కాదు. కానీ మీరు నాకు పరిచయమయ్యారు అన్న భాగ్యం అంతకన్నా ఎంతో గొప్పది. మనుషులు ఒకరికొకరు

స్ఫూర్తిదాయకంగా ఉండడానికి రోజులు తరబడి కలిసి కబుర్లు చెప్పుకోవాల్సిన అవసరం లేదనీ, ఎవరి జీవితపోరాటాలు వారు కొనసాగిస్తూనే మధ్యలో ఒక్కసారి తలెత్తి చూసినప్పుడు పరస్పరం పంచుకునే ఆ సాంత్వనకన్నా మించిన గొప్ప స్నేహం మరొకటి ఉండబోదని మన పరిచయం నాకు నిరూపించింది.

పద్మా! మొన్ననే కదా మీరు నా పుట్టిన రోజుకి శుభాకాంక్షలు చెప్పారు. నా ప్రతి పుట్టినరోజుకీ మీరు ఏదో ఒక మాట, నన్ను బతికించే మాట, నా పట్ల నా నమ్మకాన్ని బలపరిచే మాట చెప్తూనే వచ్చారు. కానీ నేనే! నేను మీకేమివ్వగలిగాను? ఇప్పుడు ఇంకేమివ్వగలుగుతాను?

మీరు ఏ దివిలో విరిసిన పారిజాతమో! మీలాంటివాళ్ళు ఎక్కడుంటే అక్కడ ఆ తావుని స్వర్గంగా మార్చగల వాళ్ళు. ఇప్పుడింక నేరుగా స్వర్గాన్నే మీ తావుగా మార్చుకున్నారు.

15-4-2024

మనసు చాలా బ్లాంక్‌గా ఉంది

వెనక్కి తిరిగి చూసుకుంటే స్వేచ్ఛ నుంచి నాకు 2020 లో పుట్టినరోజు శుభాకాంక్షలు అందినట్టు ఉంది. అంటే మా స్నేహం మొదలై అయిదేళ్ళయిందన్నమాట. కాని నేను ఆమెని మొదటిసారి చూసింది మూడేళ్ళ కిందట. 'దేశదేశాల కవిత్వం' ఆవిష్కరణ సభలో. గాలినాసరరెడ్డి, అనిల్ బత్తుల సంకలనం చేసిన ఆ పుస్తకంలో స్వేచ్ఛతో కూడా ఒక కవిత అనువాదం చేయించారు. ఒ.ఎన్.వి.కురుప్ కవితకు ఆమె చేసిన అనువాదం గురించి నా ప్రసంగంలో ప్రస్తావించాను. ఆ మీటింగు అయిపోగానే ఆమె వచ్చి నన్ను పలకరించారు. తన కవిత్వసంపుటి పంపిస్తానని చెప్పారు. కాని ఆ విషయం ఆమె, నేను ఇద్దరం మర్చిపోయాం.

తిరిగి మళ్ళా ఏడాది పోయాక మేము మళ్ళా కలుసుకున్నాం. కుప్పిలి పద్మ 'దేశదిమ్మరి తేనెచినుకులు' ఆవిష్కరణ శర్మ, శాంత దంపతుల ఆతిథ్యంలో, వారి ఇంట్లో జరిగింది. ఆ రోజు భూమ్యాకాశాల్ని చుట్టబెట్టిన వాన. ఆ వర్షంలోనే ఆ చిన్నిగోష్ఠికి వచ్చిన మిత్రుల్లో స్వేచ్ఛ కూడా ఉన్నారు. ఆమె ఆ రోజు నాదగ్గరే ఎక్కువసేపు కూచున్నారు. మేము ఆ రోజు చాలానే మాట్లాడుకున్నాం. ఆమె కళ్ళల్లో, ఆ సౌమ్యసన్నిధిలో చిన్నపిల్లల్లో మాత్రమే కనవచ్చే ఒక ముగ్ధత్వం. ఒక immaculate innocence. ఆమెతో ఒకే ఒక్కసారి మాట్లాడినా కూడా ఆ పసిపాపల దరహాసం నీ వెంటవస్తూనే ఉంటుంది. ఇక సెలవు తీసుకుని వచ్చేసేముందు ఆమె 'ఒక పున్నమిరాత్రి మా ఇంటిడాబా మీద కూచుని కబుర్లు చెప్పుకోవాలి మనం' అని అన్నారు, అక్కడున్న తక్కిన మిత్రుల్ని కూడా కలుపుకుంటూ.

ఆ పున్నమి రాలేదుగానీ, మళ్ళీ ఏడాది గడిచేక, కిందటేడాది సెప్టెంబరులో ఒక రాత్రి ఆమె నుంచి ఒక మేసేజి. తెలంగాణాలో ఎక్కడో ఒక హాస్టల్లో పిల్లలకి సరిగ్గా

అన్నం పెట్టడం లేదనీ, అదేమిటని అడిగితే ఆ హాస్టలు ఉద్యోగులు ఆ పిల్లల్ని తిడుతున్నారనీ. అది ఆమె ట్విట్టరులో పెట్టిన ఒక పోస్టు. పిల్లలు ధర్నా చేసినా కూడా అధికారులు స్పందించలేదని కూడా రాసారామె. అది ఒక సంక్షేమశాఖకి చెందిన ఒక గురుకుల పాఠశాల. ఆ సొసైటీ సెక్రటరీ నంబరు పంపిస్తే నేను వారితో మాట్లాడతానని మెసేజి పెట్టాను. ఆమె నేరుగా ఆ శాఖకి చెందిన ప్రభుత్వకార్యదర్శి నంబరే నాకు పంపించారు. ఆ కార్యదర్శి నాకు తెలిసినాయనే. గతంలో మేము కలిసి పనిచేసాం కూడా. వెంటనే ఆ వార్త ఆయనకి పంపించాను. ఆయన తగిన చర్య తీసుకుంటానని జవాబిచ్చారు. ఆ జవాబు ఆ రాత్రే స్వేచ్ఛకి పంపించాను.

మళ్ళా ఏడాది గడిచింది. కానీ ఇప్పుడు విన్న వార్త ఇది. విన్నప్పటినుంచీ నా మనసు చాలా బ్లాంక్‌గా ఉంది.

అన్నట్టు కిందటేడాది ఆగస్టులో ఆమె సారంగ పత్రికలో అచ్చయిన తన కవిత లింకు నాకు పంపించారు. ఆ కవిత చూడండి:

బిడ్డలందరినీ భద్రంగా బతకనిస్తారా..??

అప్పుడొకసారి నిర్భయ
ఇప్పుడు కోల్ కతా ట్రైనీ డాక్టర్
మధ్యలో
మనం పట్టించుకోని శోకాలెన్నో
వినిపించుకోని ఆక్రందనలెన్నో–

అయినా
శరీరాలు రక్తాలు కారేదాకా,
ప్రాణముండగానే మాంసపు ముద్దలయ్యే దాకా,
హింసకు ప్రాణం పోయేదాకా–

భద్రతనో..రక్షణనో.. బాధ్యతనో..
గొంతెత్తి అడగలేకే కదా
ఏం జరిగినా జరగనట్టే.

ఏదో అయిపోయిందిలే అన్నట్టే
ఏం చేయగలం అనుకున్నట్టే

ఇంకో ఇంటి ఆడబిడ్డ చచ్చినా
నా ఇంటిదాకా రాలేదనో..
చావింటికి..నీ ఇంటికి..
వందలు వేల అబద్ధపు గోడలు కట్టుకొనో..

నిన్నా ఇయాల రోడ్లమీదికొస్తున్న
నా దేశ ప్రజలారా..!

చదువు కోసమో..ఉద్యోగం కోసమో
బడి కోసమో..బడలిక కోసమో
బయటికొచ్చిన ఆడబిడ్డని
ఒక్క వంకర చూపు కూడా చూడొద్దని
మనస్సాక్షికి చెప్పుకొని..
మీ చుట్టూ ఉన్న బతుకులక్కూడా
భద్రత ఉన్నదని
ధైర్యంగా చెప్పలేకపోయినరా ?

పరాయి బిడ్డ పానం పోకముందే
ఈ భయాన్ని..ధైర్యంగా మార్చకపోయినరా ?
రక్షణ అంటే అడగటమో, అడుక్కోవడమో, పోరాడటమో కాదని..
ఆత్మ గౌరవమని ఎలుగెత్తి చాటలేకపోయినరా ?

ఇప్పటికైనా న్యాయం కోసం ఒక్కటైనందుకు
నీ ఇల్లే కాదు..ఏ ఇల్లూ.. చావిల్లు కానీయమని
మీ మనసుకైనా మాటిచ్చుకుంటారా..?
బిడ్డలందరినీ భద్రంగా బతకనిస్తారా..??

ఇప్పుడు ఈ కవిత మళ్ళా చూసేక నా మనసుకి మరీ అగమ్యంగా ఉంది. ఈ కవిత రాసినామే, ఇలా మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోయినామే ఒక్కరేనా?

అప్పుడు రేవతీదేవి, మొన్న జగద్ధాత్రి, ఇప్పుడు స్వేచ్ఛ– నా మనసుకేమీ స్ఫురించడం లేదు. ఏమీ తోచడం లేదు కూడా. కానీ పదే పదే ఒక మాట మాత్రం అనిపిస్తోంది.

ఆత్మహత్య పిరికితనమో, లేదా అత్యంత సాహసమో చెప్పలేనుగానీ, జీవించడానికి మాత్రం కొంత పిరికితనం, కొంత సాహసం– రెండూ కావాలి. సాహసం మరీ ఎక్కువైనప్పుడో, మనం మరీ పిరిగ్గా మారుతున్నప్పుడో, ఆ imbalance సరిదిద్దడానికి నీకంటూ నువ్వు నమ్మిన ఒక దేవుడుండాలి. కాని ఇప్పుడు దేవుడి నుంచి దూరంగా వచ్చేసిన ఈ కాలంలో కనీసం ఒక ధ్యేయమేనా ఉండాలి. ఆ రెండూ లేనప్పుడు, కనీసం మనుషులేనా ఉండాలి. ఉన్నారు కదా అనవచ్చు మీరూ, నేనూ కూడా. కానీ నిజంగా ఉన్నామా?

28-6-2025

వికసిత వ్యక్తిత్వం

పట్టాభిరామ్‌గారితో నాది పాతికేళ్ళకి పైబడ్డ పరిచయం, స్నేహం కూడా. హిప్నొటిస్టుగా మొదలైన ఆయన ప్రయాణంలో ఒక వ్యక్తిత్వవికాసవాదిగా, వ్యక్తిత్వవికాస రచయితగా ఎదగడం, తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రభావశీలశక్తిగా మారడం నా కళ్ళారా చూసాను. ఆయనతో కలిసి చాలా సమావేశాల్లో పాల్గొన్నాను. కలిసి కొన్ని ప్రయాణాలు కూడా చేసేను. ఆ సందర్భంగా ఆయన్ని దగ్గరగా కూడా చూసాను. బయటి ప్రపంచానికి ఆయన ఏ విలువల గురించి చెప్తూ వచ్చేడో, వాటిని తన వ్యక్తిగత జీవితంలో కూడా పాటిస్తుండటం గమనించాను. అందువల్ల ఆయన పట్ల నాకు గౌరవం కలుగుతూ వచ్చింది.

మనిషిగా ఆయన చాలా సరళస్వభావి. అపారమైన వినయం ఆయన సొత్తు. ఆ వినయంతోటే ఆయన ఎందరికో ఆప్తుడు కాగలిగాడు. ఆత్మీయుడిగా మారగలిగేడు. తెలుగు రాష్ట్రాల్లో చాలామంది తమకోసం, తమ కుటుంబసభ్యుల కోసం ఆయన దగ్గరకి కౌన్సిలింగుకి వెళ్తుండటం నాకు తెలుసు. ఆ కౌన్సిలింగులో ఆయన ఏ శాస్త్రీయ సూత్రాల్ని ఉపయోగిస్తూ వచ్చేరో నాకు తెలియదుగానీ, సౌమ్యమైన వదనం, కల్మషంలేని పలకరింపు, తనదగ్గరికి వచ్చిన మనిషి హృదయంలోకి చొరబడగల ఆత్మీయతల వల్ల ఆయన చెప్పే సలహాలు మనుషులు తమ సమస్యల్ని అధిగమించడానికి సాయపడేవి.

ఆయనతో కలిసి మాట్లాడిన సభలూ, చేసిన ప్రయాణాలూ, కలుసుకున్న వ్యక్తులూ, నవ్వుకుంటూనో, గాఢమైన ఆలోచనకు పూనుకుంటూనో మేము గడిపిన క్షణాలు చాలానే ఉన్నా, ఈ క్షణాన, రెండు మూడు అనుభవాలు మీతో పంచుకోదగ్గవిగా గుర్తొస్తున్నాయి.

మొదటిది, మేము 2002 లో అప్పటి భారత రాష్ట్రపతి డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం ను కలుసుకున్న సందర్భం. అప్పటికి ఎమెస్కో సంస్థ కోసం నేను డా. కలాం 'వింగ్స్

ఆఫ్ ఫైర్' ను 'ఒక విజేత ఆత్మకథ' గా , 'ఇగ్నైటెడ్ మైండ్స్' ను' 'నా దేశయువజనులారా' గా అనువదించి ఉన్నాను. ఎమెస్కో అధినేత విజయకుమార్‌కి ఆ అనువాదాలు స్వయంగా కలాంకి అందించాలనే కోరిక కలిగింది. కానీ భారతరాష్ట్రపతి అపాయింట్‌మెంటు దొరకడం సాధ్యమా? ఆయనకు మాకు టైమిస్తాడా లాంటి అనుమానాలు మాకున్నాయి. కాని భారతదేశపు పూర్వప్రధాని పి.వి.నరసింహారావుగారు మాకు ఆ సమావేశాన్ని సుగమం చేసారు. మేము కలాంని కలవడానికి వెళ్ళడం నిశ్చయం కాగానే విజయకుమార్ డా. పట్టాభిరాం కూడా మా బృందంలో ఉండాలని అనుకున్నాడు. మేము డా.కలాంని కలవడం, ఆయన మాతో తన డ్రాయింగురూములో దాదాపు గంటసేపు మాట్లాడటం– ఈ విశేషాలు నేను గతంలో పంచుకున్నాను.

అయితే ఆ సందర్భంగా పట్టాభిరాం డా.కలాం మనసునెలా చూరగొన్నాడో ఆ చిన్న విశేషం మాత్రం ఇప్పుడు చెప్పి తీరాలి. మా సమావేశం దాదాపుగా అయిపో–వస్తున్నదనగా, పట్టాభిరాం తన కోటులోంచి ఒక హాండ్‌కర్చీఫ్ లాంటి పొడవైన తెల్లని క్లాతు బయటికి తీసారు. 'ఇది చూడండి సార్' అన్నాడు కలాంతో. డా.కలాంకీ, మాకూ కూడా ఆయన అంత ఆ గుడ్డ ఎందుకు చూపిస్తున్నాడో అర్థం కాలేదు. అప్పుడు పట్టాభిరాం కలాంతో 'సార్, నేను మీ రచనలు చదవకముందు, నా మనసుకూడా ఇలా మామూలుగా ఉండేది, కానీ మీ పుస్తకాలు, ముఖ్యంగా మీ ఆత్మకథ చదివాక, చూడండి, ఇలా అయిపోయింది' అంటూ ఆ గుడ్డను రెండుసార్లు గాల్లోకి ఎత్తి ఊపారు. మా కళ్ళముందే తెల్లటి ఆ గుడ్డ కాస్తా రంగురంగుల పతాకగా మారిపోయింది. ఆ ఇంద్రజాలం చూస్తూనే డా.కలాం తాను భారతరాష్ట్రపతినన్న విషయం మర్చిపోయి చిన్నపిల్లవాడిలా చప్పట్లు కొట్టారు.

ఆ తరువాత మేము తిరిగి హైదరాబాదు వస్తూండగానూ, వచ్చేక కూడా చాలసార్లు ఆ సంఘటనని పదేపదే తలుచుకోలేకుండా ఉండలేకపోయాను. దాదాపు ఒక నిమిషం వ్యవధిలో ఆ రోజు డా.పట్టాభిరాం చేసి చూపించింది వట్టి ఇంద్రజాలమేనా? కాదు. అందులో వ్యక్తిత్వవికాసం రహస్యం ఉంది. చూడండి. ఆ రోజు డా.కలాం ని కలిసినవాళ్ళల్లో విజయకుమార్ పబ్లిషరు. ఆయన చేసిన కృషి తెలుస్తూనే ఉంది. నేను అనువాదకుణ్ణి. నా కృషి కూడా కనిపిస్తూనే ఉంది. కాని పట్టాభిరాం ఎవరు? కేవలం మా మిత్రుడు మాత్రమేనా? డా.కలాం ముందు తన గురించిన విపులపరిచయం చెప్పుకోడానికి పట్టాభిరాంకి సమయమూ లేదు, అది సందర్భమూ కాదు. కాని తన గురించి డా.కలాంకి ఎంతో కొంత తెలియాలి. ఎలా తెలియాలంటే, తన పేరు ఎప్పుడు వినిపించినా, కలాం

కి తాను వెంటనే స్పష్టంగా కళ్ళముందు కనిపించాలి. అంటే ఏమిటి? నువ్వొక ఇంటర్వ్యూకి వెళ్ళావనుకో, నీకు ఒక్క నిమిషం మాత్రమే టైము దొరికిందనుకో, కాని ఆ బోర్డుని నువ్వు నూటికి నూరుశాతం ముగ్ధుల్ని చెయ్యాలని అనుకున్నావనుకో. అదెలా సాధ్యమో పట్టాభిరాం ఆ రోజు మాకొక ఉదాహరణ చూపించారు.

2001 లో అనుకుంటాను, మేము డా.విద్యాసాగర్ రాసిన 'మనిషొకడే విడిగా మనలేడు' పుస్తక ఆవిష్కరణకి విశాఖపట్టణం వెళ్ళాం. అప్పట్లో డా.విద్యాసాగర్ గిరిజన కార్పొరేషన్ మేనేజింగు డైరక్టరుగా పనిచేస్తున్నారు. ఆ రోజు ఆ పుస్తకం సిరివెన్నెల సీతారామశాస్త్రి ఆవిష్కరించేడు. సమావేశం అయినతరువాత మేమంతా గెస్ట్ హవుజులో డిన్నరు చేస్తూ ఉన్నాం. చాల ఉల్లాసకరమైన సమయం. డా.పట్టాభిరాంకి సీతారామశాస్త్రితో ఆ రోజే పరిచయం. సీతారామశాస్త్రి తాను చిన్నప్పణ్ణించీ వింటున్న పట్టాభిరాంని అవాళ కలుసుకున్న సంతోషంలో ఉన్నాడు. సాధారణంగా అటువంటి తొలిసమావేశాల్లో ఒకరిపట్ల ఒకరు ఆరాధనని మాత్రమే ప్రకటించుకోడానికి ఉత్సాహపడే వేళలవి. కాని మాటల మధ్యలో పట్టాభిరాం సీతారామశాస్త్రితో 'గురువుగారూ, మీ పాటల్లో ఒక పాట పట్ల మాత్రం నాకు కంప్లైంటు ఉంది' అని అన్నారు. అందరూ గతుక్కుమన్నారు. కాని ఆసక్తిగా కూడా చూసారు. సీతారామశాస్త్రికూడా తింటున్నవాడు ఒకక్షణం ఆగి ఆయన ఏం చెప్పబోతాడా అన్నట్టు చూస్తున్నాడు. కాని పట్టాభిరాం ఇవేవీ పట్టించుకోలేదు. ఆయన తన మాటలు కొనసాగిస్తూ 'మీరు బోటనీ క్లాసు ఉంది, మేటనీ ఆట ఉంది, దేనికో ఓటు వెయ్యరా, హిస్టరీ లెక్చరుంది, మిస్టరీ పిక్చరుంది' అంటూ ఒక పాట రాసారు కదా. ఆ పాట యువతమీద దుష్ప్రభావం చూపించదా? మీలాంటి సజ్జనుడు రాయవలసిన పాట కాదు కదా అది' అని అన్నారు. అంతా నిశ్శబ్దమైపోయారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అప్పుడెవరో ప్రయత్నపూర్వకంగా ఆ వాతావరణాన్ని తేలికపర్చడానికి సంభాషణ మరోవేపు మళ్ళించారు. కొంతసేపటికి అంతా ఆ సంభాషణ మర్చిపోయేరు.

కాని నేను మర్చిపోలేదు. ఆ సంఘటనలో పట్టాభిరాంలో రెండు గుణాలు నన్ను ఆకర్షించాయి. మొదటిది, అతనికి యువతరం మీద రచయితలు చూపించగల ప్రభావం మీద అంత నమ్మకం ఉండటం. రెండోది, వినడానికి చాలా అమాయికంగా కనిపించే ఆ నమ్మకంతో, ఆయన ఎటువంటి భేషజం లేకుండా, తమ తొలిసమావేశంలోనే ఆ కవిని నేరుగా అడగ్గలగడం. నిజానికి సీతారామశాస్త్రి కూడా అటువంటి మనిషే. వారు రాసిన కవిత్వం తనకి అర్థంకాలేదనిపించినప్పుడు ఎంతో సుప్రసిద్ధ కవుల్ని కూడా ఆయన నిలదీసి అడగడం నాకు తెలుసు.

రఘుకుమార్ అనే ఆయన ఒంగోలులో సర్వశిక్షా అభియాన్ జిల్లా అధికారిగా పనిచేస్తున్నప్పుడు గిజుభాయి పుట్టినరోజు వేడుక నిర్వహిస్తూ డా.పట్టాభిరాంనీ, నన్నూ కూడా ఆహ్వానించేడు. మేము కలిసి రైల్లో ప్రయాణించేం. ఆ రోజు ఆ మీటింగు ఏదో పెద్ద ఆడిటోరియంలో పెట్టారు. ఆ మొత్తం హాలంతా యువతీయువకులతో కిక్కిరిసి పోయింది. ఉపాధ్యాయులు కాకుండా అంతమందికి గిజుభాయి గురించి ఎలా తెలుసునా అని అనుకున్నాను. కాని పట్టాభిరాం ప్రసంగం మొదలయ్యాక అర్థమయింది, ఆ వచ్చిన వాళ్ళంతా పట్టాభిరాంని వినడానికి వచ్చినవాళ్ళని!

నేను గిరిజనసంక్షేమ శాఖ హెడ్డాఫీసులో పనిచేస్తున్న రోజుల్లో మా ఆఫీసు వాళ్ళకి పట్టాభిరాం నా మిత్రుడని తెలిసింది. ఆయన్ని పిలిచి ఒక మోటివేషను సెషను ఏర్పాటు చెయ్యమని అడిగారు. కాని పారితోషికం మాత్రం ఆయనకు తగ్గట్టుగా ఇచ్చుకోలేమని కూడా చెప్పారు. నేను అదే మాట ఆయన్ని అడిగితే సంతోషంగా వచ్చి సెషను జయప్రదంగా నిర్వహించడమే కాక ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకోలేదు!

హిప్నాటిస్టుగా ఆయన చేసిన సాధన వల్ల ఆ కంఠస్వరానికి ఒక సమ్మోహనశీలత్వం సిద్ధించిందేమో అని అనుకున్నాను మొదట్లో. కాని ఆయన్ని దగ్గరనుంచి చూసిన తరువాత, తాను ఏ విలువల గురించి మాట్లాడుతున్నాడో ఆ విలువల్ని నమ్ముతున్నందువల్ల, ఆ మాటలకి ఆ ప్రభావశీలత సిద్ధించిందని గ్రహించాను. దీపం వెలుగుతున్నప్పుడే మరొక దీపాన్ని వెలిగించగలుగుతుంది. తనది వికసితవ్యక్తిత్వం కాబట్టే ఆయన వ్యక్తిత్వవికాసం గురించి మాట్లాడేరని గ్రహించాను.

పట్టాభిరాం రాసిన పుస్తకాల ఆవిష్కరణ సభల్లో ఒకటి రెండు మీటింగుల్లో నేను పాల్గొన్నాను. మాట్లాడినట్టు కూడా గుర్తు. రెండేళ్ళ కిందట ఎమెస్కో ప్రచురించిన నా కథల సంపుటి ఆవిష్కరణ సమావేశానికి ఆయన కూడా వచ్చారు. అదే ఆయన్ని చివరి సారి చూడటం అని ఇప్పుడు తెలిసింది.

వేన్.డబ్ల్యు.డయ్యర్ సమకాలిక ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసవాదుల్లో అగ్రగణ్యుడు. ఆయన ఒకచోట ఇలా రాసుకున్నాడు. Change the way you look at things, and the things you look at change. తన జీవితకాలం పాటు బి.వి.పట్టాభిరాం ఈ సూత్రానికి ఉదాహరణగా జీవించారని చెప్పవచ్చు.

2-7-2025

వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ బంభరనాదం

సాహిత్యప్రయాణాలూ సాహిత్యసంతోషమూ

సంసారవిషవృక్షానికి రెండే అమృతఫలాలు, ఒకటి కావ్యామృతరసాన్ని ఆస్వాదించడం, రెండోది భావుకులైన సజ్జనుల సాంగత్యం అంటుంది ఒక ప్రాచీనసుభాషితం. అటువంటి సాహిత్య సంతోషాన్నీ, సాహిత్య ప్రయాణాన్నీ, సాహిత్యోత్సవాన్నీ, వాటిని అనుభవంలోకి తెచ్చే సాహిత్య బాంధవ్యాల్నీ స్మరిస్తూ వాడ్రేవు చినవీరభద్రుడు రాసిన 38 వ్యాసాల సంపుటం ఇది. 'సహృదయునికి ప్రేమలేఖ' (2001), 'సాహిత్యమంటే ఏమిటి' (2009), 'సాహిత్యసంస్కారం' (2017), 'దశార్ణదేశపు హంసలు' (2019), 'తీరని దాహం' (2025), 'కథలసముద్రం' (2025) తరువాత వాడ్రేవు చినవీరభద్రుడు అందిస్తున్న మరొక సాహిత్యపుష్పగుచ్ఛమిది.